

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పిల్లలపై 'నెస్లే' వివక్ష!

యూరప్‌లో యాడెడ్ సుగర్స్ లేకుండా పిల్లల ఆహారం

దక్షిణాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో అమ్మే ఉత్పత్తుల్లో మాత్రం కృత్రిమ తీపి పదార్థాల జోడింపు

భారత్‌లో అమ్మే సెరిలాక్‌లో సర్వింగ్‌కు 2.7గ్రా. చక్కెర

స్విట్జర్లాండ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ తాజా నివేదిక

ఐదేళ్లుగా యాడెడ్ సుగర్స్‌ను 30 శాతం తగ్గించామన్న నెస్లే ఇండియా 2

శుక్రవారం | 19-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 3 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 8.05 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మఖ ఉ. 10.57 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 7.59-9.47; దుర్ముహూర్తం: ఉ. 9.29-9.19, మ. 12.39-1.29; అమృతఘడియలు: ఉ. 8.15-10.03; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఓటెలా అడుగుతావు జగన్?



"మద్యపాన నిషేధం విషయంలో గతంలో చెప్పిన మాటకు అనుగుణంగా మద్యం అమ్మకాలు క్రమంగా తగ్గిస్తూ వెళ్తాం. ఆదాయం తగ్గించుకుంటూ వెళ్తాం. 2024 ఎన్నికల్లో ఓట్లు అడిగే సమయానికి కచ్చితంగా మద్యాన్ని ఫైవ్ స్టార్ హోటళ్లకు మాత్రమే పరిమితం చేస్తా. అలా చేసిన తర్వాతే ఓట్లు అడుగుతా. మేనిఫెస్టోలో కూడా ఇదే చెప్పాను. మేనిఫెస్టో నాకు ఖురాన్, బైబిల్, భగవద్గీత లాంటిది"

-సీఎం అయిన కొత్తలో ఢిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జగన్

మరి మద్యనిషేధం అమలు చేశారా? ఫైవ్ స్టార్ హోటళ్లకు మద్యం పరిమితం చేస్తానన్న జగన్, తన ఫైవ్ ఇయర్స్ పాలనలో ఆ పని ఎలాగూ చేయలేకపోయారు. కనీసం బెల్టు షాపులను కూడా తొలగించలేకపోయారు. మరి ఓటు ఎలా అడుగుతారు సీఎం సార్?

గులకరాయితో గాయం చేయడం నేరమే! కానీ...

ఐదేళ్లలో మీరు చేసిన ఘోరాలెన్ని?

తగిలిన గాయాలెన్ని?

పోయిన ప్రాణాలెన్ని?

గులకరాయి గాయంపై వాపోతున్న జగన్ ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతారా?



సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

పైశాచికానందం

ఐదేళ్లలో చేసిన గాయాలెన్ని.. తీసిన ప్రాణాలెన్ని?

సిస్టర్స్ స్ట్రోక్!

సొంత జిల్లాలోనే సీఎంకు ఎదురుగాలి



మంగళగిరిలో లోకేశ్ నామినేషన్ దాఖలు సందర్భంగా నిర్వహించిన ర్యాలీ

తొలిరోజే నామినేషన్ల జోరు

అసెంబ్లీకి 190 మంది అభ్యర్థులు 236 నామినేషన్లు దాఖలు 3

లోక్‌సభకు 39 మంది అభ్యర్థులు 43 నామినేషన్లు దాఖలు

భీమిలిలో గంటా.. కోవూరులో ప్రశాంతి, నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలు నామినేషన్లు

తొలి అంకం నేడే

దేశవ్యాప్తంగా 102 సీట్లలో పోలింగ్

సిక్కిం, అరుణాచల్‌లోని 92 అసెంబ్లీ స్థానాలకూ

ఏడు దశల్లో ఈ విడతలోనే అత్యధిక సీట్లు 2

బరిలో 1,625 మంది.. మహిళలు 134 మంది

1.87 లక్షల పోలింగ్ కేంద్రాలు, 18 లక్షల సిబ్బంది

బాధ్యతగా ఓటు వేయాలి: సీఈసీ రాజీవ్‌కుమార్

సీఎస్, డీజీపీ ఔట్!?





మరో ఆరుగురు ఐఏఎస్, ఐపీఎస్‌లూ...

రంగం సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్

నేడో, రేపో బదిలీ ఉత్తర్వులు జారీ!?

జగన్ సేవలో సీఎస్ జవహర్ రెడ్డి

షెడ్యూలు తర్వాతా మారని తీరు

ఈసీ ఆదేశాలు బేఖాతరు

పేరుకే డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

జిల్లా ఎస్పీలపై ఆయనకు పట్టు నిల్

ప్రధాని సభలో భద్రతా వైఫల్యం

ఎన్నికలను సమర్థంగా నిర్వహించలేరనే అభిప్రాయం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సేవలో తరిస్తున్న మరికొందరు ఉన్నతాధికారులపై వేటుకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని ఆ పదవుల నుంచి పక్కకు తప్పించడం ఖాయమని తెలుస్తోంది. వీరితోపాటు అరడజను మంది ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఈసీ కన్నెర్ర చేసిందని..

మిగతా 12వ పేజీలో...

సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లపై

ఫిర్యాదులు 12

వారి నుంచి వివరణ తీసుకున్నాం

ఈసీ ఆదేశాల కోసం చూస్తున్నాం

ఎన్నికలపై కమిషన్ ప్రత్యేక దృష్టి

సీఈవో ముఖేశ్ కుమార్ మీనా

వెంకట్రామిరెడ్డిపై ఎట్టకేలకు వేటు

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి సస్పెన్షన్.. జీవో జారీ

అనుమతి లేకుండా అమరావతి దాటి వెళ్లొద్దని ఆదేశం 3

మరి ఆయన అసోసియేషన్ సభ్యత్వం రద్దు సంగతేంటి?



కోడ్ దాటిన అజేయ కల్లం

ప్రభుత్వ సలహాదారుగా ఉండి ఓ సమావేశంలో జగన్‌పై పొగడ్తలు

గత టీడీపీ ప్రభుత్వంపై విమర్శలు



30 వరకు వివేకా హత్య ఊసెత్తవద్దు

షర్మిల, సునీత, బాబు, లోకేశ్‌కు కడప జిల్లా కోర్టు ఆదేశం

పురందేశ్వరి, పవన్, రవికీ

పార్టీల అభ్యర్థులు, శ్రేణులనూ నియంత్రించాలని మధ్యంతర ఉత్తర్వులు 12

శిల్పాశెట్టి దంపతుల

ఆస్తుల అటాచ్

బిట్‌కాయిన్స్ మోసం కేసులో ఈడీ చర్యలు 2

అటాచ్ అయిన ఆస్తుల విలువ రూ.98 కోట్లు



ఉండి నుంచే రఘురామ పోటీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా మంతెన

నలుగురు అసెంబ్లీ అభ్యర్థుల మార్పు



మాడుగులలో మాజీ మంత్రి బండారు.. మడకశిరకు ఎంఎస్ రాజు

తంబళ్లపల్లె రేసులో సరళారెడ్డి.. శంకర్ యాదవ్, కొండా నరేంద్ర కూడా

దెందులూరుపై కొనసాగుతున్న సస్పెన్స్.. అనపర్తి కావాలంటే ఈ సీటు తమకు ఇవ్వాలంటున్న బీజేపీ నాయకత్వం.. చింతమనేనికే తమ్ముళ్ల మద్దతు

ఏలూరు ఎంపీ అభ్యర్థిదీ అదే మాట.. రేపో మాపో స్పష్టత వచ్చే అవకాశం

కమలాపురం, వెంకటగిరిల్లో మళ్లీ తండ్రులకే చాన్సు? 12

పార్టీ అభ్యర్థులకు ఎల్లుండి బీ-ఫాంలు.. రేపు నెల్లూరు జిల్లాలో బాబు ప్రజాగళం

రాష్ట్రంలో 4 చోట్ల మోదీ సభలు



అనకాపల్లి, రాజమండ్రి, రాజంపేటల్లో ఖరారు

నాలుగో దానిపై ఇంకా రాని స్పష్టత 12

నా కాళ్లు పట్టుకుని డీసీసీ అధ్యక్షుడయ్యావ్!

మంత్రి పెద్దిరెడ్డిపై మాజీ సీఎం నల్లారి కిరణ్ వ్యాఖ్యలు

అధికార మదంతో ఉన్నారని ఆగ్రహం 3

చంద్రబాబు అభివృద్ధి కూటమిని ఎన్నుకోవాలని పిలుపు



అన్నమయ్య జిల్లా పీలేరులో మాట్లాడుతున్న బీజేపీ రాజంపేట అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి



మారేడుమిల్లిలో షెకావత్!

అడవిలో చెట్లు నరికించి దర్జాగా విక్రయం

ఆరు నెలల్లోనే 450 భారీ వృక్షాల కూల్చివేత

ఆ కలప విలువ సుమారు రూ. 91 లక్షలు

శేషాచలంలో పనిచేస్తుండగా స్మగ్లర్ల టచ్‌లోకి

ఏడాది క్రితం మారేడుమిల్లికి.. దందా తీవ్రతరం

ఐఎఫ్ఎస్ అధికారి అక్రమాలు వెలుగులోకి

సెలవు పెట్టి వెళ్లిపోయిన అటవీ అధికారి

ఇద్దరు ఐఏఎస్‌లకూ బురద అంటించిన వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'పుష్ప' సినిమాలో అటవీ అధికారి 'షెకావత్' గుర్తున్నాడు కదా! అయితే, ఈయన మారేడుమిల్లి అడవులను గుల్ల చేస్తున్న 'షెకావత్'! దట్టమైన అడవిలోని భారీ టేకు చెట్లను నరికించేసి విక్రయిస్తున్నాడు. ఆర్నెళ్లలోనే వందల సంఖ్యలో భారీ వృక్షాలను నేలకూల్చి కలపను స్మగ్లింగ్ చేయించాడు. గతంలో శేషాచలం ప్రాంతంలో స్మగ్లర్లతో చేతులు కలిపి అధికార పార్టీ నేతల అండదండలతో రెండు చేతులా భారీగా సంపాదించాడు. ఇప్పుడు మారేడుమిల్లి అటవీ ప్రాంతాన్ని ఖాళీ చేసేపనిలో పడ్డాడు. రాష్ట్ర అటవీ శాఖలో సంచలనం సృష్టిస్తున్న ఈ తతంగంపై అటవీశాఖ విచారణకు ఆదేశించగా ఆ అడవి దొంగ ఎవరో కాదు ఇంటి దొంగేనని బయట పడింది. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై అందుబాటులో ఉన్నంత సమాచారాన్ని సేకరించి వివరణ కోసం సంబంధిత అధికారిని పిలవగా, సెలవుపై వెళ్లిపోయారు. ఈ వ్యవహారం అరణ్య భవన్‌లో పెద్ద చర్చకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం మన్యం నుంచి

మిగతా 11వ పేజీలో...

బటన్ నొక్కుడంతా జగన్మాయ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్ లేరు



శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో బహిరంగ సభలో మాట్లాడుతున్న షర్మిల

జగన్ పాలనలో ఇసుక, మద్యం, మైనింగ్, భూ దందాలే

డీఎస్సీ అంటూ నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం

ఏటా జాబ్ కేలెండర్ విడుదల చేస్తామన్న హామీకి నీళ్లు

నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారు 12

హోదా, పోలవరం సాధించలేనోడు 3 రాజధానులు కడతాడా?

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా, పోలవరం పూర్తి సాధ్యం: షర్మిల

'గులకరాయి' కేసులో నిందితుడికి రిమాండ్

కోర్టులో సతీశ్ పుట్టిన తేదీ విషయంలో వివాదం

ఆధార్ కార్డు ప్రకారం ఘటన నాటికి మైనర్..

ఆస్పత్రి రికార్డులను పరిగణించాలన్న సర్కార్

పోలీసుల అదుపులోని మైనర్లను విడిపించండి

న్యాయాధికారికి డిఫెన్స్ న్యాయవాదుల వినతి..

అడ్వకేట్ కమిషనర్‌ను నియమించిన కోర్టు

విజయవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): 'గులకరాయి' కేసులో అదుపులోకి తీసుకున్న సతీశ్ అనే యువకుడిని పోలీసులు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి సి.రమణారెడ్డి ఇరువైపుల వాదనలు విన్న తర్వాత.. అజిత్‌సింగ్ నగర్ వడ్డెర కాలనీకి చెందిన వేముల సతీశ్‌కుమార్ 14 రోజులపాటు రిమాండ్ విధించారు. అనంతరం సతీశ్‌ను విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. సతీశ్ జనంలో ఉండి సీఎం జగన్‌పైకి రాయి విసిరినట్టు పోలీసులు తమ రిమాండ్ రిపోర్టులో

మిగతా 3వ పేజీలో...



మీ కోసం మీ ఓటు హక్కును వినియోగించుకోండి: సీఈసీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ఓటర్లు తమ విలువైన ఓటు హక్కును బాధ్యతతో వినియోగించుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ప్రజల కోసమేనని గురువారం ఓ వీడియో సందేశంలో ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ కోసం, తమ పిల్లల కోసం, తమ ఊరు కోసం, తమ దేశం కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఒక్క ఓటు ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

తొలి అంకం నేడే

21 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 ఎంపీ సీట్లలో పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరంలో తొలి అంకానికి తెరలేవనుంది. మొత్తం ఏడు దశల పోలింగ్‌కు గాను శుక్రవారం మొదటి విడత జరుగనుంది. 21 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 ఎంపీ స్థానాలకు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఓటింగ్ నిర్వహించనున్నారు. సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ శాసనసభలకు కూడా ఈ దశలోనే పోలింగ్ జరుగనుంది. రెండు రాష్ట్రాల్లో 92 సీట్లున్నాయి. 543 లోక్‌సభ స్థానాలకు ఏడు దశల్లో ఎన్నికలు చేపడుతుండగా.. అత్యధికంగా తొలి దశలోనే సీట్లున్నాయి. వీటిలో 73 జనరల్, 18 ఎస్సీ, 11 ఎస్టీ రిజర్వుడు స్థానాలు. పోలింగ్ సజావుగా సాగేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అందరికీ ఓటరు స్లిప్పులను అధికారులు ఇప్పటికే పంపిణీ చేశారు. ఓటరు ఐడీ లేకపోతే 12 ఇతర గుర్తింపు కార్డులలో దేనినైనా చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఈసీ తెలిపింది. 85 ఏళ్లకు పైబడిన 14.14 లక్షల మంది వృద్ధులు, 13.89 లక్షలమంది దివ్యాంగులు ఇంటి దగ్గరే ఓటు వేయనున్నారు. పోలింగ్ స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకూ తగిన ఏర్పాట్లు చేసినట్లు ఈసీ పేర్కొంది. కాగా, 1.87 లక్షల పోలింగ్ స్టేషన్లను ఈసీ ఏర్పాటు చేసింది. ఐదు వేల స్టేషన్లలో భద్రతా సిబ్బంది సహా మొత్తం మహిళలే విధులు నిర్వర్తించనున్నారు. వెయ్యి కంటే ఎక్కువ స్టేషన్లల్లో దివ్యాంగులు ఈ బాధ్యతలు చూడనున్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో సూక్ష్మ పరిశీలకులను నియమించారు. 50శాతానికి పైగా స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. పోలింగ్, భద్రతా సిబ్బంది తరలింపునకు 41 హెలికాప్టర్లు, 84 ప్రత్యేక రైళ్లు, దాదాపు లక్ష వాహనాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. పరిశీలకులుగా 361 మందిని పంపించింది. వీరిలో 127 మంది సాధారణ, 67 మంది పోలీసు, 167 మంది వ్యయ పరిశీలకులు ఉన్నారు. ప్రత్యేక పరిశీలకులను సైతం నియమించింది. 4,627 ఫ్లయింగ్ స్క్వాడ్, 5,208 స్టాటిటిక్స్ సర్వేలైన్స్, 2,028 వీడియో సర్వేలైన్స్ బృందాలు, 1,255 వీడియో వ్యూయింగ్ టీంలను ఏర్పాటు చేసింది. మద్యం, మాదక ద్రవ్యాలు, నగదు, ఉచితాలను తరలించకుండా అడ్డుకునేందుకు 1,374 అంతర్రాష్ట్ర, 162 అంతర్జాతీయ చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచింది. వాయు, సముద్ర మార్గాల్లోనూ నిఘా ఏర్పాట్లు చేసింది.



అసోంలోని డిబ్రూగఢ్‌కు ఎన్నికల విధుల కోసం వెళ్తున్న పోలీసు సిబ్బంది

తొలి దశ స్వరూపం ఇలా

బరిలో ఉన్న అభ్యర్థులు: 1,625 (1,491 మంది పురుషులు, 134 మంది మహిళలు)
ఓటు వేయనున్న ప్రజలు: 16.63 కోట్లు (పురుషులు 8.4 కోట్లు, మహిళలు 8.23 కోట్లు)
తొలిసారి ఓటు వేయనున్నవారు: 35.67 లక్షలు
20-29 ఏళ్ల మధ్య వయసు వారు: 3.51 కోట్లు
విధులు నిర్వర్తించనున్న సిబ్బంది: 18 లక్షలు
మొత్తం మహిళా సిబ్బంది ఉన్న కేంద్రాలు: 5,000

నక్సల్స్.. అమరవీరులు

» కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనాటే వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రినాటే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన 29 మంది నక్సలైట్లను ఆమె అమరవీరులుగా సంబోధించడంపై దుమారం చెలరేగింది. ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నలకు ఆమె పైవిధంగా స్పందించారు. ఈ అంశంపై 'మీ పార్టీ రాజకీయాలు చేస్తోందా?' అని జర్నలిస్టు అడగగా, ఈ అంశంపై తమ పార్టీ రాజకీయాలు చేయాలనుకోవడం లేదని జవాబిచ్చిన ఆమె.. ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మృతులకు, గాయపడిన భద్రతా సిబ్బందికి ఆమె సానుభూతి ప్రకటించారు. ఆమె వ్యాఖ్యలు సిగ్గుచేటు అంటూ బీజేపీ ఖండించింది.

కొన్ని మీడియా సంస్థలు నన్ను దూషిస్తున్నాయి: రాహుల్

కన్నూర్, ఏప్రిల్ 18: బీజేపీ విధానాలను, సిద్ధాంతాలను విమర్శిస్తున్నందుకు కొన్ని మీడియా సంస్థలు తనపై దుమ్మెత్తిపోస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్రంలోని పాలక వ్యవస్థను ప్రశ్నిస్తున్నందుకే తన ప్రతిష్ఠను దిగజారుస్తున్నాయని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కేరళలోని కన్నూర్‌లో ఓ భారీ ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ దేశంలో అశాంతిని వ్యాప్తి చేస్తోందని, లక్షలాది మందికి హాని చేస్తోందని ఆరోపించారు. బీజేపీ ఎక్కడికి వెళ్లినా అక్కడ ప్రజలను విభజిస్తుందని, సమస్యలు సృష్టిస్తుందని, ప్రజలు వారిలో వారే కొట్టుకునేలా చేస్తుందని ఆయన దుయ్యబట్టారు.

'ఆమ్' ఆద్మీ..!

» బెయిల్ కోసం కేజ్రీవాల్ మామిడి పండ్లు, మిఠాయిలు తింటున్నారు
» ఢిల్లీ సీఎంపై కోర్టులో ఈడీ ఆరోపణలు
» ఇన్సులిన్ ఇవ్వడం లేదు.. ఆయనను చంపే కుట్ర: ఆతిషి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్.. బెయిల్ పొందేందుకు ఉద్దేశపూర్వకంగా మామిడి పండ్లు, మిఠాయిలు తింటున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. ఆయనకు మధుమేహం ఉండడంతో మామిడి, అరటి పండ్లు, మిఠాయిలు తింటూ చక్కెర స్థాయిలను పెంచుకుని తద్వారా అనారోగ్యాన్ని సాకుగా చూపి బెయిల్ పొందేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపింది. టైప్2 మధుమేహ రోగి అయినందున తన వ్యక్తిగత వైద్యుడిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంప్రదించేందుకు అనుమతించాలని కేజ్రీవాల్.. రౌజ్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. గురువారం ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కేజ్రీవాల్ అభ్యర్థనను ఈడీ వ్యతిరేకించింది. మధుమేహ రోగులు తినకూడని ఆహారాన్ని కేజ్రీవాల్ తింటున్నారని, ఆయన తెప్పించుకుంటున్న ఆహారంలో మామిడి పండ్లు, మిఠాయిలు ఉంటాయని.. చక్కెర వేసిన టీని తాగుతారని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బెయిల్ కోసం అప్పీల్‌కు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆయన తీసుకుంటున్నవన్నీ వైద్యుడు సూచించినవేనని కేజ్రీవాల్ తరపు న్యాయవాది వివేక్ జైన్ తెలిపారు. ఇంటి భోజనాన్ని నిలిపివేసేందుకు ఈడీ సాకులు చెబుతోందని ఆరోపించారు. కేజ్రీవాల్ భోజనంతోపాటు ఆయన ఆహార పట్టికపై పూర్తి నివేదిక శుక్రవారంలోపు ఇవ్వాలని తిహాడ్ జైలు అధికారులను ఆదేశించిన కోర్టు విచారణను ఇదేరోజుకు వాయిదా వేసింది. కాగా సీఎం కేజ్రీవాల్‌ను చంపేందుకు కుట్ర జరుగుతోందని ఆప్ మంత్రి అతిషి ఆరోపించారు. పలుమార్లు అభ్యర్థించినప్పటికీ ఇన్సులిన్‌ను ఇవ్వలేదన్నారు. కేజ్రీవాల్‌కు తీవ్రమైన మధుమేహం ఉందని అందరికీ తెలుసని, ఆయన చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడానికి రోజూ 54 యూనిట్ల ఇన్సులిన్ తీసుకుంటారని చెప్పారు. కానీ ఈడీ ద్వారా బీజేపీ కేజ్రీవాల్ ఆరోగ్యాన్ని పాడుచేయాలనుకుంటోందని ఆరోపించారు.

జైలు అధికారుల నుంచి నివేదిక కోరిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్

తిహాడ్ జైల్లో కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ అందించడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో వాస్తవాల నివేదికను 24 గంటల్లోగా సమర్పించాలని జైళ్ల డైరెక్టర్ జనరల్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గురువారం ఆదేశించారు. సీఎం ఆరోగ్యం విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని లెఫ్టినెంట్ గవర్నర్ హామీ ఇస్తున్నట్టు రాజ్ నివాస్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

శిల్పాశెట్టి దంపతుల ఆస్తుల అటాచ్

» బిట్‌కాయిన్స్ మోసం కేసులో ఈడీ చర్యలు


న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: బిట్‌కాయిన్స్ పేరుతో జరిగిన మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బాలీవుడ్ నటి శిల్పాశెట్టి దంపతులకు చెందిన రూ.97.79 కోట్ల విలువైన ఆస్తులను గురువారం అటాచ్ చేశారు. అటాచ్ అయిన స్థిర, చరాస్తుల్లో ముంబైలోని జుహూలో శిల్పాశెట్టి పేరిట ఉన్న ఓ ఫ్లాట్, పుణెలోని ఓ బంగ్లా, శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రా పేరిట ఉన్న ఈక్విటీ షేర్లు ఉన్నాయి. 2017లో ముంబైకి చెందిన 'వేరియబుల్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ బిట్‌కాయిన్స్ స్కామ్‌ను ప్రారంభించింది. బిట్‌కాయిన్లలో పెట్టుబడి పెడితే.. నెలకు 10% లాభాలుంటాయని ఆశ చూపింది. మల్టీలెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం- చైన్ స్కీమ్) పద్ధతిలో ముంబై, ఢిల్లీల్లో ఏజెంట్లను నియమించుకుని, రూ.6,600 కోట్లను వసూలు చేసింది. గత ఏడాది ఈ కేసులో ఆ సంస్థకు చెందిన పలువురు వ్యక్తులను ఈడీ అరెస్టు చేసింది. ప్రధాన నిందితులు అజయ్ భరద్వాజ్, మహేందర్ భరద్వాజ్ పరారీలో ఉండగా.. వారికి చెందిన రూ.69 కోట్ల ఆస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది. ఈ కేసులో రాజ్‌కుంద్రా 285 బిట్‌కాయిన్లను కలిగి ఉన్నారని.. వాటి విలువ రూ.150 కోట్లుగా ఉంటుందని ఈడీ తెలిపింది. అయితే.. తమకు కోర్టులో న్యాయం జరుగుతుందని రాజ్‌కుంద్రా మీడియాకు చెప్పారు.

ఇరాన్ నుంచి ఇంటికి కేరళ యువతి

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఏప్రిల్ 18: హోర్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ స్వాధీనం చేసుకున్న నౌక సిబ్బందిలో ఒకరైన భారతీయ నావికురాలికి విముక్తి లభించింది. గత శనివారం (ఏప్రిల్ 13న) హోర్ముజ్ జలసంధి మీదుగా వస్తున్న ఇజ్రాయెల్ కంటైనర్ నౌక (ఎంఎస్‌సీ ఏరీస్)ను ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సీజ్ చేసి, దాన్ని ఇరాన్ జలాల్లోకి తరలించారు. ఈ నౌకలో మొత్తం 17మంది భారతీయులు ఉండగా వారిలో కేరళలోని త్రిసూర్‌కు చెందిన డెక్ క్యాడెట్ ఆన్ టెస్సా జోసఫ్ గురువారం సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. నౌకలో మిగిలిన 16మంది సిబ్బందితో సంప్రదింపులు జరుపుతున్నామని, వారంతా ఆరోగ్యంగానే ఉన్నారని ఎంఈఏ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా, ఇజ్రాయెల్‌పై దాడి చేసినందుకు ప్రతీకార చర్యగా ఇరాన్‌పై అమెరికా, బ్రిటన్ దేశాలు కొత్తగా మరి కొన్ని ఆంక్షలు పెట్టాయి. ప్రస్తుతం దాడిలో ఉపయోగించిన డ్రోన్లకు ఇంజిన్లు తయారు చేసిన ఇరాన్‌కు చెందిన రెండు సంస్థలు, 16 మంది వ్యక్తులపై ఆంక్షలు పెట్టినట్టు అమెరికా ట్రెజరీ ఆఫీసు తెలిపింది.

ఎన్నికలపై విశ్వసనీయత ఉండాలి

» ప్రజలకు ఎటువంటి సందేహం ఉండొద్దు
» ప్రస్తుతం ఓ అగాధం నెలకొని ఉంది
» దానిని పూరించే బాధ్యత ఈసీదే: సుప్రీంకోర్టు
» వందశాతం వీవీప్యాట్ల లెక్కింపుపై తీర్పు రిజర్వు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత ఉండాలని, ప్రజలకు సందేహం లేకుండా చూడాలని సుప్రీంకోర్టు గురువారం ఎన్నికల సంఘానికి (ఈసీకి) సూచించింది. ఈసీ చెబుతున్నదానికీ, ప్రజలకు ఇచ్చిన సమాచారానికీ మధ్య అగాధం ఉన్నదని, అదే విశ్వసనీయతను శంకించేలా చేస్తోందని తెలిపింది. ఈ అగాధాన్ని పూరించాలని హితవు పలికింది. ఓట్ల లెక్కింపు సమయంలో.. ఈవీఎంలలో నమోదైన ఓట్లతోపాటు వీవీప్యాట్ స్లిప్పులను కూడా పూర్తిగా లెక్కించాలని దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు గురువారం కొనసాగించింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. ఈ పిటిషన్లను అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థతోపాటు ఇతరులు దాఖలు చేశారు. ఈవీఎంలలో నమోదైన ప్రతి ఓటును వీవీప్యాట్ స్లిప్పుతో సరిపోల్చి చూడాలని ఏడీఆర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. పిటిషనుదారుల్లో ఒకరైన న్యాయవాది నిజాం పాషా వాదిస్తూ.. ఈవీఎంలో ఓటు వేసిన తర్వాత వచ్చే వీవీప్యాట్ స్లిప్పును ఓటరు స్వయంగా తీసుకొని, అక్కడ బ్యాలెట్ బాక్సులో వేసేలా అవకాశం కల్పించాలని, అప్పుడు ఓటింగ్ ప్రక్రియపై ఎటువంటి అనుమానం ఉండదని తెలిపారు. ఫలితాల రోజున వీవీప్యాట్ స్లిప్పులన్నింటినీ లెక్కించాలన్నారు. ఈవీఎంలు, పేపర్‌స్లిప్‌లకు సంబంధించి సుప్రీంకోర్టు ఈసీని పలు ప్రశ్నలు వేసింది. వీటికి ఈసీ సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితీశ్‌కుమార్‌వ్యాస్, ఈసీ తరపు న్యాయవాది మణిందర్‌సింగ్ సమాధానాలు ఇచ్చారు.

టార్గెట్ 100!

» లోక్‌సభలో బలం మూడంకెలకు చేరాలి
» మళ్లీ విపక్షంలో కూర్చున్నా సరే..!!
» కాంగ్రెస్ నాయకత్వం సంకల్పం?



లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు పరాజయం పాలైన కాంగ్రెస్.. ఈసారి ఎలాగైనా పుంజుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. అందుకే విపక్షాలతో జట్టుకట్టి 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేసుకుని.. వీలైనన్ని ఎక్కువ పార్టీలతో, ఎక్కువ రాష్ట్రాల్లో పొత్తు పెట్టుకుంది. అయితే శక్తిమంతమైన బీజేపీని ఎదుర్కొని అధికారంలోకి రాగల బలం సాధించడం కష్టసాధ్యమని దానికీ తెలుసు. అందుకే 100 సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిపక్షంలో కూర్చున్నా.. బలం మూడంకెలకు చేరితే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ద్విగుణీకృతమవుతుందని.. 2029 ఎన్నికలనాటికి పూర్తిగా పుంజుకోవడానికి, బీజేపీని ఓడించడానికి దోహదపడుతుందని ఏఐసీసీ పెద్దలు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు తాను 100 సీట్లు.. మిత్రపక్షాలు 130-140 స్థానాలు సాధించగలిగితే బీజేపీ బలం గణనీయంగా తగ్గిపోతుందని.. అత్తెసరు మెజారిటీతోనే గద్దెనెక్కుతుందని.. అప్పుడు పార్లమెంటులో గట్టిగా నిలదీయడానికి అవకాశం ఉంటుందని భావిస్తోంది. అయితే కాంగ్రెస్ దక్షిణ భారతంలో.. అందునా కర్ణాటక(28), తెలంగాణ(17)ల్లో మాత్రమే అధిక సీట్లు సాధించడానికి అవకాశం ఉంది. గత ఎన్నికల్లో కర్ణాటకలో ఒక్క సీటు, తెలంగాణలో 3 స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడీ రెండు రాష్ట్రాల్లో ఆ పార్టీయే అధికారంలో ఉంది. ఈసారి తెలంగాణలో 8-10, కర్ణాటకలో 13-15 స్థానాలను టార్గెట్ చేసింది. కేరళ, తమిళనాడుల్లో పెరిగే అవకాశమే లేదు. ఎందుకంటే గత ఎన్నికల్లో కేరళలో మిత్రపక్షాలతో కలిసి 20కి గరిష్ఠంగా 19 చోట్ల గెలిచింది. తమిళనాడులో కూడా డీఎంకే తనకు కేటాయించిన 9 స్థానాల్లో 8 గెలుచుకుంది. ఈసారి కూడా అంతే. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కటీ రాకపోవచ్చని సర్వేలు చెబుతున్నాయి. ఇక హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. అందుకే ఆ పార్టీ ఈసారి మరీ ఎక్కువ సీట్లను ఆశించడం లేదు. యూపీ (80), మధ్యప్రదేశ్(29), ఛత్తీస్‌గఢ్ (11), రాజస్థాన్(25), హరియాణా(10), హిమాచల్ ప్రదేశ్ (4), ఉత్తరాఖండ్ (5), ఢిల్లీ (7)లో కనీసం 15-20 సీట్లయినా దక్కించుకోవాలని, పంజాబ్(13)లో ఇప్పుడున్న 8 స్థానాలు నిలుపుకోవాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తనకు బలమున్న కొన్ని స్థానాలపైనే శక్తియుక్తులన్నీ కేంద్రీకరిస్తోంది. యూపీలో సమాజ్‌వాదీతో జట్టుకట్టి 17 చోట్ల పోటీచేస్తోంది. గత ఎన్నికల్లో రాయ్‌బరేలీలో మాత్రమే.. అది కూడా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఒక్కరే విజయం సాధించారు. కంచుకోట అమేఠీలో రాహుల్‌గాంధీ ఓడిపోయారు. ఈ దఫా సోనియా పోటీచేయడం లేదు. అమేఠీలో పోటీపై రాహుల్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మహారాష్ట్ర (48)లో గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటే వచ్చింది. ఈసారి ఉద్ధవ్ శివసేన, శరద్ పవార్ ఎన్సీపీతో జట్టుకట్టి 17 స్థానాల్లో పోటీచేస్తోంది. కనీసం పదైనా వస్తాయని ఆశిస్తోంది. గుజరాత్(25)లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో చేతులు కలపడం వల్ల 5 స్థానాల వరకు గెలుస్తామని అంచనా వేస్తోంది. ఢిల్లీలోనూ ఈ రెండు పార్టీలు కలిసి పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. ఈశాన్య భారతం, ఒడిసాలో కాంగ్రెస్‌కు పెద్దగా ఆశల్లేవు. పశ్చిమ బెంగాల్(42)లో ఇప్పుడున్న రెండు సీట్లకు మించి రాకపోవచ్చని ఏఐసీసీ వర్గాలే భావిస్తున్నాయి. బిహార్(40)లో గత ఎన్నికల్లో ఆర్జేడీతో పొత్తుతో కాంగ్రెస్ ఒక్క స్థానంలోనే గెలిచింది. ఈ రెండూ ఈసారి లెఫ్ట్ పార్టీలతో జట్టుకట్టి బరిలోకి దిగుతున్నాయి. ఇక్కడ కాంగ్రెస్‌కు 3-5 సీట్లు రావచ్చని సర్వేలు చెబుతున్నాయి.

- సెంట్రల్ డెస్క్

తమిళనాట పోటాపోటీ

39 నియోజకవర్గాలు.. 3 కూటములు.. 950 మంది అభ్యర్థులు.. 6.23 కోట్ల ఓటర్లు

» డీఎంకే, బీజేపీ నేతృత్వ కూటముల మధ్యే హోరాహోరీ?
» దక్షిణాది రాష్ట్రంపై దృష్టి కేంద్రీకరించిన కాషాయపార్టీ

(చెన్నై-ఆంధ్రజ్యోతి)

ఇండియా కూటమి

పార్టీ	స్థానాలు
డీఎంకే	22
కాంగ్రెస్	9
సీపీఐ	2
సీపీఎం	2
డీపీఐ	2
ఐయూఎంఎల్	1
ఎండీఎంకే	1

ఎన్డీయే కూటమి

పార్టీ	స్థానాలు
బీజేపీ	23
పీఎంకే	10
టీఎంసీ	3
ఏఎంఎంకే	2
పన్నీర్‌సెల్వం	1

అన్నాడీఎంకే కూటమి

అన్నాడీఎంకే	34
డీఎండీకే	5

తమిళనాడులోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు శుక్రవారం ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది. రాష్ట్రంలో 6.23 కోట్ల మంది ఓటర్లుండగా, వారి కోసం 68,321 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. 77 మంది మహిళా అభ్యర్థులు, 873 మంది పురుష అభ్యర్థులు కలిపి మొత్తం 950 మంది బరిలో నిలిచారు. ఇందులో డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి, అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమి, బీజేపీ నేతృత్వంలోని 'ఎన్డీయే' కూటమి మధ్య త్రిముఖ పోటీ కనిపిస్తున్నప్పటికీ, అన్నాడీఎంకే బాగా బలహీనపడటంతో డీఎంకే, బీజేపీ నేతృత్వంలోని కూటముల మధ్యే హోరాహోరీ నెలకొనే అవకాశం ఉంది. ఎన్డీయే కూటమి తరపున ప్రధాని మోదీ గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో 9 సార్లు పర్యటించి ప్రచారం చేయడం గమనార్హం. పలువురు కేంద్రమంత్రులు కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలూ తమకు కలిసి వస్తాయని బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. ఇక ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే కూటమి తరపున మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, డీఎండీకే వ్యవస్థాపకుడు, దివంగత నటుడు విజయకాంత్ సతీమణి ప్రేమలత తదితరులు ప్రచారం చేశారు. కాగా, బీఎస్పీ, నామ్ తమిళర్ కట్చి పార్టీలు ఈ ఎన్నికల్లో ఏ కూటమిలోనూ చేరకుండా విడివిడిగానే 39 స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి.







బీజేపీ నుంచి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను కోయంబత్తూరు నియోజకవర్గంలో, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను చెన్నై-దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ బరిలోకి దింపింది. అలాగే, కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్‌ను నీలగిరిలో, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్‌ను కన్నియాకుమారిలో, ప్రముఖ సీనియర్ నటి రాధికను విరుదునగర్‌లో, ప్రముఖ పారిశ్రామికవేత్త వినోజ్ పి.సెల్వంను చెన్నై-సెంట్రల్ నుంచి బీజేపీ బరిలోకి దింపింది. మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం(రామనాథపురం), దివంగత సీఎం జయలలిత నెచ్చెలి శశికళ సమీప బంధువు టీటీవీ దినకరన్, ఎస్ఆర్ఎం సంస్థల అధినేత టీఆర్ పారివేందర్ కూడా ఎన్డీయే తరపున పోటీ చేస్తుండడం గమనార్హం.

డీఎంకే నుంచి హేమాహేమీలు..

ఇండియా కూటమిలో డీఎంకే తరపున కనిమొళి తూత్తుకుడి నియోజకవర్గం నుంచి, స్టాలిన్ మేనల్లుడు దయానిధి మారన్ చెన్నై-సెంట్రల్ నుంచి, కేంద్ర మాజీ మంత్రులు టీఆర్ బాలు శ్రీపెరుంబుదూర్ నుంచి, ఎ.రాజా నీలగిరి నుంచి ఎస్.జగద్రక్షకన్ అరక్కోణం నుంచి బరిలో దిగారు.

కాంగ్రెస్ తరపున

ఇండియా కూటమిలోనే కాంగ్రెస్ తరపున కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం శివగంగ నియోజకవర్గం నుంచి, తెలుగువారైన సీనియర్ నేత కె.గోపీనాథ్ కృష్ణగిరి నుంచి, సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ విరుదునగర్ నుంచి, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు ఎం.కృష్ణస్వామి తనయుడు ఎంకే విష్ణు ప్రసాద్ కడలూరు నుంచి పోటీ చేస్తున్నారు. ఇదే కూటమిలో ఎండీఎంకే అధినేత వైగో కుమారుడు దురై వైగో తిరుచ్చి నుంచి బరిలో నిలిచారు. ఇక అన్నాడీఎంకే కూటమిలో సీనియర్ నేతలు, మాజీ ఎంపీలు బరిలో ఉన్నప్పటికీ చరిష్మా ఉన్న నేతలు అంతంతమాత్రంగానే కనిపిస్తున్నారు. ఈ కూటమిలో దివంగత నటుడు విజయకాంత్ స్థాపించిన డీఎండీకే తరపున ఆయన తనయుడు విజయ ప్రభాకరన్ విరుదునగర్ నుంచి పోటీ చేస్తున్నారు. కాగా, తమిళనాడుల డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమిదే పైచేయి అని పలు ముందస్తు సర్వేలు తేల్చాయి.

యూపీ నుంచి లోక్‌సభ బరిలో తెలంగాణ ఆడపడుచు

» బీఎస్పీ తరపున జోన్‌పూర్ ఎంపీ అభ్యర్థిగా శ్రీకళారెడ్డి
» జడ్పీ చైర్‌పర్సన్‌గా అనుభవం.. తండ్రి మాజీ ఎమ్మెల్యే
» విజయం సాధిస్తా.. 'ఆంధ్రజ్యోతి'తో శ్రీకళారెడ్డి



నడిగూడెం, ఏప్రిల్ 18: తెలంగాణకు చెందిన ఆడపడుచు ఉత్తర్‌ప్రదేశ్ (యూపీ) నుంచి లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి నిలిచింది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన కీసర శ్రీకళారెడ్డి, యూపీ రాష్ట్రంలోని జోన్‌పూర్ లోక్‌సభ నియోజవర్గం నుంచి బీఎస్పీ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. భర్త ధనుంజయ్ సింగ్ 2009లో ఎంపీ. అంతకుముందు ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. 2019లో బీఎస్పీ తరపున శ్యామ్‌సింగ్ యాదవ్ ఎంపీగా గెలిచారు. తాజా ఎన్నికల్లో శ్యామ్‌సింగ్‌ను కాదని బీఎస్పీ అధినేత్రి మాయావతి, శ్రీకళారెడ్డికి అవకాశమిచ్చారు. 2021లో జోన్‌పూర్ నుంచి శ్రీకళారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకళారెడ్డి తండ్రి కీసర జితేందర్‌రెడ్డి 1968లో హుజూర్‌నగర్ తాలుకా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. నల్లగొండ సహకార బ్యాంక్ చైర్మన్‌గానూ పనిచేశారు. తల్లి లలితమ్మ సర్పంచ్‌గా రత్నవరం గ్రామానికి సేవలందించారు. రాజకీయంతో పాటు సామాజిక సేవకు శ్రీకళారెడ్డి కుటుంబం పేరొందింది. గ్రామంలో రూ.2కోట్లతో నిర్మించిన ఆలయానికి భూమితో పాటు సుమారు రూ.కోటి వరకు ఆర్థికసాయాన్ని అందజేశారు. శ్రీకళారెడ్డి సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డి చెన్నైలో నిప్పో బ్యాటరీ కంపెనీ అధినేతగా ఉండటంతో ఆమె ఇంటర్ వరకు అక్కడే చదివారు. హైదరాబాద్‌లో బీకాం చేశారు. అమెరికాలో ఇంటీరియర్ డిజైనింగ్, ఆర్కిటెక్చర్ కోర్సులు చేశారు. పలు రాష్ట్రాల్లో వ్యాపారాలు చేశారు. 2017లో ధనుంజయ్ సింగ్‌ను వివాహం చేసుకున్నారు. ఇది ఆయనకు మూడో వివాహం. కాగా జోన్‌పూర్ నుంచి తాను ఎంపీగా గెలుస్తానని శ్రీకళారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో లక్షన్నర ఓటర్ల బలగం తమకు ఉందని తెలిపారు. జోన్‌పూర్ పరిధిలో 20లక్షల మంది ఓటర్లు ఉండగా భర్త ధనుంజయ్ సింగ్‌కు లక్షన్నర ఓటర్ల బలగం ఉందని చెప్పారు. ధనుంజయ్ సింగ్‌పై రాజకీయ కక్షతో కేసులు పెట్టి జైలుకు పంపారని, ప్రజాసేవ చేస్తూ ఇలాంటివి ఎదుర్కోవడం తమ కుటుంబానికి కొత్తేమీ కాదని పేర్కొన్నారు. సిటింగ్‌ను కాదని బీఎస్పీ అధినేత్రి మాయావతి టికెట్ ఇవ్వడానికి భర్త ధనుంజయ్‌సింగ్ బలం, బలగమే కారణమని చెప్పారు. ఆయన సహకారంతో జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిచిన తాను జోన్‌పూర్ స్థానం నుంచి ఎంపీగానూ విజయం సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

'నెస్లే'కి పిల్లలందరూ ఒకటి కాదు!

» యూరప్ దేశాల్లో యాడెడ్ సుగర్స్ లేకుండా పిల్లల ఆహారం
» భారత్‌లో అమ్మే సెరిలాక్‌లో సర్వింగ్‌కు 2.7 గ్రాముల చక్కెర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: పసిపిల్లల ఆహార ఉత్పత్తులు అనగానే గుర్తొచ్చే కంపెనీ.. నెస్లే. కానీ ఆ సంస్థ దృష్టిలో పిల్లలందరూ ఒకటి కాదు! యూరప్ దేశాల పిల్లల విషయంలో ఒకలా.. దక్షిణాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల పిల్లల విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. తన ఉత్పత్తుల తయారీలో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోంది. నెస్లే.. యూరప్ దేశాల్లో అమ్మే ఉత్పత్తుల్లో ఎలాంటి యాడెడ్ సుగర్స్ (కృత్రిమంగా తీపిని పెంచే ఉత్పత్తులు)ను జోడించట్లేదు. పేద, మధ్యతరగతి దేశాల పిల్లలకు అమ్మే ఉత్పత్తుల్లో మాత్రం వాటిని జోడిస్తోంది. ప్రాసెస్డ్ ఆహారపదార్థాలు, శీతలపానీయాల్లో యాడెడ్ సుగర్స్ వాడతారు. ఇవి ఎక్కువుండే ఉత్పత్తులను వాడే పిల్లలు వాటికి ఎక్కువగా అలవాటుపడే ప్రమాదం ఉంది. పిల్లలకు నచ్చడంతో తల్లిదండ్రులు వాటినే కొనడంవల్ల ఆ ఉత్పత్తికి మార్కెట్ పెరుగుతుంది. నెస్లే కంపెనీ పుట్టినిల్లయిన స్విట్జర్లాండ్‌కు చెందిన పబ్లిక్ ఐ అనే స్వచ్ఛంద సంస్థ ఈ గుట్టును రట్టు చేసింది. ఇంటర్నేషనల్ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్‌తో కలిసి పబ్లిక్ ఐ ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా పసిపిల్లల ఆహార ఉత్పత్తుల మార్కెట్ విలువ దాదాపు రూ.5.8 లక్షల కోట్లని అంచనా. అందులో దాదాపు 20% మార్కెట్ నెస్లేదే. ఆ సంస్థ పలు దేశాల్లో దాదాపు 150 ఆహార ఉత్పత్తులు విక్రయిస్తుంది. సెరిలాక్, నిడో వంటివి వాటిలో ముఖ్యమైనవి. పబ్లిక్ ఐ నివేదిక ప్రకారం.. 6 నెలల పిల్లలకు పెట్టే సెరిలాక్‌ను యూకే, జర్మనీలో ఎలాంటి అదనపు చక్కెరలూ లేకుండా నెస్లే విక్రయిస్తోంది. ఇండియాలో అమ్మే అదే సెరిలాక్‌లో ఒక సర్వింగ్‌కు 2.7 గ్రాముల చక్కెర, థాయ్‌లాండ్‌లో 6గ్రాముల చక్కెర (ఒక సర్వింగ్‌కు)ను జోడిస్తోంది. భారత్‌లో విక్రయించే 15 సెరిలాక్ ఉత్పత్తుల్లో సగటున2.7 గ్రాముల చక్కెర ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. దీన్ని ప్యాకేజింగ్‌పైనే నెస్లే ముద్రిస్తోంది. ఫిలిప్పీన్స్‌లో నెస్లే విక్రయించే ఉత్పత్తుల్లో ఎనిమిదింటి నమూనాలను పరీక్షించగా.. ఐదు నమూనాల్లో ఒక సర్వింగ్‌కు 7.3గ్రాముల చక్కెర ఉన్నట్టు వెల్లడైంది. ఈ నివేదికపై భారత్‌లోని నెస్లే అధికార ప్రతినిధిని ప్రశ్నించగా.. గత ఐదేళ్లగా తాము తమ ఉత్పత్తుల్లో పంచదార స్థాయిలను దాదాపు 30%తగ్గించామని, ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నెస్లే ఉత్పత్తుల్లో చక్కెర స్థాయిలు భారత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా అని అడగ్గా.. నిబంధనలు పాటిస్తున్నట్టు చెప్పారు. కాగా రెండేళ్లలోపు పిల్లలకు యాడెడ్ సుగర్స్ ఉన్న ఉత్పత్తులు పెట్టకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలున్నాయి. భారతదేశంలో నిబంధనల ప్రకారం యాడెడ్ షుగర్స్‌కు గరిష్ఠ పరిమితి లేదు. పసిపిల్లల ఆహార ఉత్పత్తుల్లో కార్న్‌సిరప్, మాల్ట్, సుక్రోజ్, ఫ్రక్టోజ్ (ఆ ఉత్పత్తిలోని మొత్తం పిండి పదార్థాల్లో 20%లోపు) ఉండొచ్చు.





గర్భిణికి శస్త్ర చికిత్స చేసి బిడ్డను అప్పగిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి

ప్రచారంలోనే ప్రాణం పోశారు!

- గర్భిణికి శస్త్రచికిత్స చేసిన కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- తల్లీబిడ్డ సురక్షితం.. కృతజ్ఞతలు తెలిపిన బంధువులు

కురిచేడు, ఏప్రిల్ 18: దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా ఉన్నారు. ఓ నిండుగర్భిణి పురిటినొప్పులతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వెంటనే సిజేరియన్ చేసి తల్లీబిడ్డలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు!. వివరాలివీ.. ప్రకాశం జిల్లా దర్శి మండలం అబ్బాయపాలెం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే గర్భిణి పురిటి నొప్పులతో బాధపడుతుండగా, దర్శిలోని ఎస్ఎస్ఆర్ నర్సింగ్‌హోంకు గురువారం తరలించారు. అక్కడ మహిళా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గర్భిణి కుటుంబ సభ్యులు అక్కడే ప్రచారంలో ఉన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి సమస్యను వివరించారు. ఆమె వెంటనే స్పందించి హుటాహుటిన వైద్యశాలకు చేరుకుని శస్త్రచికిత్స చేశారు. బిడ్డను క్షేమంగా బయటకు తీసి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటనపై గర్భిణి కుటుంబ సభ్యులు స్పందిస్తూ.. దేవతలా వచ్చి తమను ఆదుకున్నారంటూ డాక్టర్ లక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ప్రచారం కన్నా ప్రాణం ముఖ్యమన్నారు. ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నా శస్త్రచికిత్స విజయవంతం చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడగలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. దర్శిలో మెరుగైన వైద్యం లేక ఎంతోమంది ఇబ్బందిపడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. తన సొంత నిధులతో ఇక్కడే మల్టీ స్పెషాలిటీ వైద్యశాల నిర్మించి సేవలు అందిస్తానన్నారు.





రూ.5కోట్ల బంగారం, వెండి స్వాధీనం

గోపవరం: ఎన్నికల నగారా మోగిన తర్వాత వందల కోట్ల విలువైన నగదు, నగలు అధికారులు స్వాధీనం చేసుకుంటూనే ఉన్నారు. తాజాగా వైఎస్సార్ కడప జిల్లా గోపవరంలోని పీపీ కుంట చెక్‌పోస్టు వద్ద రూ.5 కోట్ల విలువైన నగలు పట్టుబడ్డాయి. నెల్లూరు నుంచి ప్రొద్దుటూరు, కడపకు తరలిస్తున్న 7.63 కిలోల బంగారు నగలు, 11.73 కిలోల వెండి ఆభరణాలను పోలీసులు గుర్తించారు. ఇవి ఒక ప్రైవేట్ ఆభరణ సంస్థకు చెందినవైనప్పటికీ ఎన్నికల నిబంధనలు అమలులో ఉండగా పరిమితికి మించి తరలిస్తుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాలు విద్య, వైద్యం
అందిస్తేచాలు

- పాలకులుగా రాక్షసులు వస్తున్నారు..
- ఎన్నికల్లో మంచి వారిని ఎన్నుకోవాలి
- విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీనారాయణ

అనంతపురం రూరల్, ఏప్రిల్ 18: ప్రభుత్వాలు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం గొట్కూరు సమీపంలో గురువారం నిర్వహించిన 'ది వెరిడియన్ ఎకోల్ స్కూల్' వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోందని, దానిని అందిపుచ్చుకుని విద్యాపరంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. మార్పును స్వాగతించాలన్నారు. ఈ తరం పిల్లలు చాలా తెలివైన వారని, తల్లిదండ్రులకంటే వారే ముందుంటున్నారని చెప్పారు. తెలుగు, ఇంగ్లీష్ మాత్రమే భాషలు కాదని.. ప్రపంచంలోని ఇతర భాషల్లో కొన్నింటినైనా నేర్చుకోవాలని సూచించారు. మాతృభాషలో పట్టు సాధించే విద్యార్థులకు మిగిలిన భాషలు నేర్చుకోవడం కష్టమేమీ కాదన్నారు. మంచి పుస్తకాలు చదివించాలని, తల్లిదండ్రులు తమ కలలను పిల్లలపై రుద్దడం సరికాదని హితవుపలికారు. పిల్లలకు ఆసక్తి ఉన్న రంగంలో వారిని ప్రోత్సహించాలని సూచించారు. మార్కులు, ర్యాంకులు ముఖ్యం కాదని, మంచి విద్యావంతులుగా ఎదగడంతోపాటు, సమాజానికి తోడ్పాటునందించేవిధంగా ఎదగనివ్వాలన్నారు. ఇక, ప్రస్తుతం ఎన్నికల వచ్చాయని, ఎన్నికల్లో మనకు ఎవరి ద్వారా మేలు జరుగుతుందో గుర్తించాలని సూచించారు. రాక్షసులు పాలకులుగా వస్తున్నారని, ఎవరు మంచి వారో చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తు కోసం మంచి సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీకృష్ణ, పాఠశాల చైర్మన్ మాసినేని రామయ్య, కరస్పాండెంట్ లక్ష్మీదేవి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిపై
ఎట్టకేలకు వేటు

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి సస్పెన్షన్

- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- అనుమతి లేకుండా అమరావతి దాటి వెళ్లొద్దని ఆయనకు ఆదేశం
- గుంటూరు, విజయవాడ కూడా..
- సస్పెన్షన్ జాప్యానికి శతవిధాలుగా సీఎస్ జవహర్‌రెడ్డి యత్నాలు
- వెంకట్రామిరెడ్డి వివరణ ఆధారంగా సస్పెన్షన్ ఉపసంహరణకు ఎత్తు
- కానీ 'ఆంధ్రజ్యోతి' కథనంతో సీన్ రివర్స్
- మరి ఆయన అసోసియేషన్ సభ్యత్వం రద్దు చేయరా?



అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా వైసీపీకి అనుకూల ప్రచారం చేసిన ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, సీఎం జగన్‌కు వీరవిధేయుడు, పరమభక్తుడైన కె.వెంకట్రామిరెడ్డిని ప్రభుత్వం ఎట్టకేలకు సస్పెండ్ చేసింది. మార్చి 31వ తేదీన కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరులో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకుడు చంద్రయ్యతో కలిసి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం జీవో జారీచేసింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగై ఉండి, ఉద్యోగ సంఘం నాయకుడై ఉండి.. ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడినందుకు ఏపీ కాండక్ట్ రూల్స్-1964 ప్రకారం కూడా ఈ సస్పెన్షన్ వర్తిస్తుందని అందులో పేర్కొన్నారు. వెంకట్రామిరెడ్డి పంచాయతీరాజ్ శాఖలో సెక్షన్ ఆఫీసర్. ప్రస్తుతం ఇన్‌చార్జి అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులో ఉన్నారు. మార్చి 31న ఆర్టీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన చేసిన ప్రచారాలపై టీడీపీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై చంద్రయ్యను, మరో 11 మందిని ఆర్టీసీ యాజమాన్యం ఈ నెల 4వ తేదీన సస్పెండ్ చేసింది. కానీ వీళ్లందరికీ నాయకుడిలా వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి వ్యవహారంలో మాత్రం ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఆయన్ను సస్పెండ్ చేయాలని ఎన్నికల సంఘం ఈ నెల 8వ తేదీన ఆదేశించింది. సాధారణ పరిపాలనా విభాగాని(జీఏడీ)కి సమాచారం పంపింది. అయితే ఆ సస్పెన్షన్ ఫైలు నాటి నుంచి 13వ తేదీ వరకు జీఏడీలోని వివిధ స్థాయుల అధికారుల మధ్యే చక్కర్లు కొట్టింది. 14వ తేదీన ఎట్టకేలకు సీఎస్ జవహర్‌రెడ్డికి చేరింది. ఆ ఫైలును ఆయన మంగళవారం (16వ తేదీ) వరకు పక్కన పడేశారు. దీంతో జగన్‌కు పరమభక్తుడైన వెంకట్రామిరెడ్డిని సీఎస్ కాపాడుతున్నారంటూ 'జగన్ సేవలో జవహర్' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో 17వ తేదీన సీఎస్ వద్ద నుంచి ఆ ఫైలు కదిలింది. గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సస్పెన్షన్ కాలంలో వెంకట్రామిరెడ్డి ప్రభుత్వ అనుమతి లేకుండా అమరావతి, గుంటూరు, విజయవాడ దాటి వెళ్లకూడదని జీవోలో స్పష్టం చేశారు.

వివరణ సాకుతో..

వెంకట్రామిరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడకుండా ఉండేందుకు సీఎస్ జవహర్‌రెడ్డి అన్ని విధాలుగా ప్రయత్నాలు చేశారు. తనకేమీ తెలియదని, తాను కేవలం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకే కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరుకు వెళ్లానని వెంకట్రామిరెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనాకు 16వ తేదీన వినతి పత్రం ఇచ్చారు. తనతో పాటు ఆర్టీసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు కూడా సమస్యలపైనే మాట్లాడారని, రాజకీయ ప్రచారం చేయలేదన్నారు. ఇప్పటి వరకు సస్పెండ్ చేసిన 11 మందిపైనా సస్పెన్షన్ ఎత్తేయాలని కోరారు. ఈ వివరణ ఆధారంగా సస్పెన్షన్ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని సీఎస్ ఎత్తు వేశారు. కానీ ఆ మరుసటి రోజు 'ఆంధ్రజ్యోతి'లో దీనిపై కథనం ప్రచురితం కావడంతో సీన్ రివర్స్ అయింది. జగన్‌కు వీరవిధేయుడిని సస్పెండ్ చేయక తప్పని పరిస్థితి సీఎస్‌కు ఏర్పడింది. అలాగే ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడినందుకు రోసా నిబంధనల ప్రకారం అసోసియేషన్‌లో వెంకట్రామిరెడ్డి సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణ విషయంలో ప్రభుత్వం ఇలాగే వ్యవహరించింది. వెంకట్రామిరెడ్డి విషయంలో మాత్రం మెతక వైఖరే అవలంబిస్తోంది.

కోడ్ దాటిన అజేయ కల్లం

- ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా ఉండి జగన్‌పై పొగడ్తలు
- వలంటీర్ వ్యవస్థకు అనుకూలంగా వ్యాఖ్యలు
- గత టీడీపీ ప్రభుత్వంపై విమర్శలు

భీమవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ముఖ్య సలహాదారు, మాజీ సీఎస్ అజేయ కల్లం ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో గురువారం 'ఓపెన్ మైండ్ ఫర్ బెటర్ సొసైటీ' సంస్థ విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయవాదులతో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్..నాడు-నేడు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగన్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తన ఉద్యోగ కాలంలో సంక్షేమం, అభివృద్ధి చేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌దేనని పొగిడారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. గత ప్రభుత్వం 30 శాతం మందికి మేలు జరిగేలా పనిచేసిందంటూ టీడీపీపై విమర్శలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా ఉండి అధికార పార్టీకి అనుకూలంగా మాట్లాడడం ద్వారా ఆయన కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు.

అచ్చెన్న ముందస్తు బెయిల్ పిటిషన్
విచారణ 8కి వాయిదా

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు మళ్లించారనే ఆరోపణలతో సీఐడీ 2021 డిసెంబరులో నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ ఏపీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానంద స్పందిస్తూ... ఈ వ్యవహారంలో అదనపు దస్త్రాలు కోర్టు ముందు ఉంచేందుకు రెండు వారాలు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ టీ మల్లికార్జునరావు విచారణను మే 8కి వాయిదా వేశారు.

దస్తగిరి వినతిపై స్పందనకు సమయం ఇవ్వండి

- హైకోర్టును కోరిన కేంద్ర ఎన్నికల సంఘం.. విచారణ 23కి వాయిదా

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారంలో తనను హంతకుడిగా చిత్రీకరిస్తూ ఎలాంటి కథనాలు ప్రసారం చేయకుండా టీవీ చానెళ్లను నియంత్రించాలంటూ హత్య కేసు నిందితుడు దస్తగిరి హైకోర్టులో వేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ... రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పిటిషనర్ పోటీ చేస్తున్నారన్నారు. కొన్ని వార్తా చానెళ్లు పిటిషనర్‌ను హంతకుడిగా పేర్కొంటూ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వార్తా కథనాలు ప్రసారం చేస్తున్నాయన్నారు. ఎన్నికల సంఘానికి ఏప్రిల్ 8న వినతిపత్రం అందజేశామని, ఎన్నికలు పూర్తి అయ్యేవరకు వివేకా హత్య విషయంలో పిటిషనర్‌పై ఎలాంటి కథనాలు ప్రసారం చేయకుండా నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ స్పందిస్తూ... పిటిషనర్ సమర్పించిన వినతిపై ఏమి చర్యలు తీసుకున్నామనే వివరాలు అందజేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ బీ కృష్ణ మోహన్ విచారణను ఈ నెల 23కి వాయిదా వేశారు.

శిరోముండనం కేసులో న్యాయం నామమాత్రమే

- రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేయాలి : మానవ హక్కుల వేదిక

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వెంకటాయపాలెం శిరోముండనం కేసులో విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పులో న్యాయం నామమాత్రంగానే ఉందని మానవ హక్కుల వేదిక పేర్కొంది. నిందితులు నేరం చేశారని చట్టపరంగా నిర్ధారించడంలో నిష్పక్షపాతంగా వ్యవహరించిన న్యాయస్థానం శిక్షా కాలాన్ని ఖరారు చేయడంలో ఉదార వైఖరిని ఎంచుకుందని, ఇలా వ్యవహరించడానికి సహేతుకమైన కారణాలు ఏమీ లేవని ఆక్షేపించింది. శిక్షా కాలాన్ని పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేయాలని డిమాండ్ చేసింది. లేని పక్షంలో బాధితులు ప్రైవేట్ అప్పీల్ చేసుకోవడానికి తమ వేదిక పూర్తిస్థాయిలో సహకరిస్తుందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉపాధ్యక్షుడు జి.శివనాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జి.రోహిత్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీ మోసాలపై బస్సు యాత్ర చేస్తాం

- అనుమతివ్వాలని సీఈవోకు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక లేఖ

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ సర్కార్ రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించేందుకు నిర్వహించే బస్సు యాత్రకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను వేదిక ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు.

నేటి నుంచి వీఐటీఈఈఈ-2024

- 125 కేంద్రాల్లో నిర్వహణ.. ఆరు విదేశాల్లోనూ పరీక్షా కేంద్రాలు

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటిగా పేరొందిన వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లో బీటెక్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే 'వీఐటీ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్' (వీఐటీఈఈఈ)ను దేశ వ్యాప్తంగా 125 కేంద్రాల్లో నిర్వహించనుంది. వీఐటీ గ్రూపు విద్యా సంస్థలైన వీఐటీ వేలూరు, వీఐటీ చెన్నై, వీఐటీ-అమరావతి, ఆంధ్రప్రదేశ్, వీఐటీ భోపాల్ క్యాంపస్‌లలో బీటెక్ కోర్సుల్లో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించనుంది. ఈ పరీక్షను ఈ నెల 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్టును 125 కేంద్రాలతో పాటు దుబాయ్, మస్కట్, ఖతార్, కువైత్, సింగపూర్, కౌలాలంపూర్‌లో నిర్వహించనున్నారు. 'వీఐటీఈఈఈ-2024' పేరుతో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హాజరుకావచ్చు. ఈ పరీక్షా ఫలితాలను మే నెల మూడో తేదీన "www.vit.ac.in' అనే వెబ్‌సైట్‌లో వెల్లడిస్తారు. ఈ ప్రవేశ పరీక్షలో ఒకటి నుంచి పది వరకు ర్యాంకు వచ్చిన వారికి జీవీ స్కూల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద వంద శాతం ట్యూషన్ ఫీజు రాయితీ, 11 నుంచి 50 ర్యాంకర్లకు 75 శాతం, 51 నుంచి 100 ర్యాంకర్లకు 50 శాతం, 101 నుంచి 500 ర్యాంకర్లకు 25 శాతం ట్యూషన్ ఫీజు రాయితీ ఇస్తారు. సింగిల్ పేరెంట్ లేదా తమిళనాడు, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాలకు చెంది టాపర్లుగా నిలిచిన వారికి వంద శాతం ఫీజు రాయితీతో పాటు హాస్టల్, మెస్ ఫీజుల్లో సపోర్టు ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్ స్కీమ్ కింద అవకాశం కల్పిస్తారని వీఐటీ ఓ ప్రకటనలో పేర్కొంది.

సీజేను కలిసిన బార్ కౌన్సిల్ ప్రతినిధులు



జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో ద్వారకానాథ్‌రెడ్డి, కృష్ణమోహన్

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్‌కు ఇటీవల చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన ఎస్.ద్వారకానాథ్‌రెడ్డి, ఎస్.కృష్ణమోహన్ గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను సీజే దృష్టికి తీసుకొచ్చారు. బార్ కౌన్సిల్ ప్రతినిధులుగా ఎన్నికైనందుకు వారిని సీజే అభినందించారు.

'గులకరాయి' కేసులో నిందితుడికి రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. పోలీసుల కథనం ప్రకారం.."సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసు కమిషనర్ కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 'సీఎం బస్సు యాత్ర ఈనెల 13వ తేదీన విజయవాడలోని వారధి నుంచి కేసరపల్లి వరకు నిర్వహించాలని షెడ్యూల్ ఇచ్చారు. శిఖామణి సెంటర్, చుట్టుగుంట, ఫుడ్ జంక్షన్, డాబాకొట్లు సెంటర్ మీదుగా కృష్ణా హోటల్ సెంటర్, పైపుల రోడ్డు, కండ్రిక మార్గాల్లో యాత్రను నిర్వహించారు. బస్సు యాత్ర సెంట్రల్ నియోజకవర్గంలోకి ప్రవేశించగానే జగన్, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీ రుహుల్లాతోపాటు ఇతర నాయకులు బస్సు పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. రాత్రి 8.30 గంటల సమయంలో బస్సు యాత్ర అజిత్‌సింగ్ నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్దకు చేరుకుంది. ప్రజల్లో జగన్‌కు ఉన్న ఆదరణను చూడలేక ఒక వ్యక్తి ఆయనపై దాడి చేశాడు. పదునైన అంచులు ఉన్న రాయితో జగన్ తలపై కొట్టాడు. ఈ రాయి జగన్‌కు తగలడంతోపాటు నాకు తగిలి, ఎడమ కంటి భాగం వద్ద రక్తపు గాయమైంది. నేను జగన్‌కు పక్కనే నిలబడి ఉన్నాను. ఈ రాయి దాడితో జగన్‌కు నుదుటిపై ఎడమ వైపున రక్తపు గాయమైంది. వైద్య సిబ్బంది జగన్‌కు, నాకు ప్రాథమిక వైద్యం చేశారు. వైద్యం తర్వాత బస్సు యాత్ర మొదలైంది. ఆ తర్వాత మేం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాం. వైద్యులు మా ఇద్దరికీ వైద్యం చేశారు. ముందస్తు ప్రణాళికతోనే ఈ దాడి చేశారు. ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని ఆయనను హత్య చేయాలన్న ఉద్దేశంతో దాడి చేశారు' అని వెలంపల్లి శ్రీనివాసరావు తన ఫిర్యాదులో తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలం చేరుకుని మధ్యవర్తుల సమక్షంలో రఫ్ స్కెచ్ రూపొందించాం. వివిధ కోణాల్లో ఫొటోలను సేకరించాం. 12 మంది వాంగ్మూలాలను నమోదు చేశాం. ప్రధాన నిందితుడు సతీశ్‌కుమార్ సీఎం బస్సునకు సమీపంగా తిరిగినట్టు సాక్షులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా నార్త్ జోన్ ఏసీపీ సీసీ కెమెరా ఫుటేజీలు, ఫొటోగ్రాఫ్‌లు, సీఎం భద్రతా విభాగం నుంచి వీడియోగ్రాఫ్, యాత్రకు హాజరైన వారు చిత్రీకరించిన వీడియోలను సేకరించారు. సెల్‌టవర్ డంప్ ఎనాలసిస్ చేశాం. సీడీఆర్‌లను పరిశీలించాం. వాటి ప్రకారం సతీశ్‌కుమార్ నేరం చేసినట్టు తేలింది. ఏ2 వేముల దుర్గారావుతో కలిసి సతీశ్‌కుమార్... జగన్‌ను అంతమొందించాలని దాడి చేశాడు. విచారణలో సతీశ్ నేరం అంగీకరించాడు. 'దుర్గారావు ఆదేశాలతో సిమెంట్ కాంక్రీట్ రాయిని జేబులో పెట్టుకుని వివేకానంద స్కూల్ వద్దకు 13వ తేదీ రాత్రి 8.04 గంటలకు వెళ్లాను. అక్కడ వివేకానంద స్కూల్ వైపున జనం మధ్య నిలబడి రాయి విసిరా'నని సతీశ్ అంగీకరించాడు. జగన్‌కు సున్నితమైన ప్రదేశంలో తగలాల్సిన ఆ రాయి అయన నుదుటిపై తగిలింది' అని అతడు తెలిపాడు" అని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. కాగా, గులకరాయి కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఐదుగురు నిందితులూ మైనర్లు అనీ, వారు ఎక్కడ ఉన్నారో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని న్యాయవాది అబ్దుల్ సలీం దాఖలుచేసిన సెర్చ్ వారంట్ పిటిషన్‌ను న్యాయాధికారి స్వీకరించారు. దీనిపై అడ్వకేట్ కమిషనర్‌ను నియమించారు.

తేదీపై తకరారు...

సతీశ్‌కుమార్‌ను న్యాయాధికారి ప్రశ్నించారు. పోలీసులు కొట్టారా అని ఆరా తీశారు. ఆ తర్వాత పుట్టిన తేదీ చెప్పాలని అడిగారు. ఆధార్‌కార్డు ప్రకారం.. 2006 ఏప్రిల్ 14 అని అతడు తెలిపాడు. ఘటన జరిగిన ఏప్రిల్ 13వ తేదీ నాటికి సతీశ్‌కుమార్ మైనర్ అని డిఫెన్స్ న్యాయవాదులు కె.రాజశేఖర్, అబ్దుల్ సలీం వాదించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీనికి అభ్యంతరం చెప్పారు. సెయింట్ ఆన్స్ ఆసుపత్రి ఇచ్చిన ధ్రువీకరణపత్రం, మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన ధ్రువీకరణపత్రాన్ని న్యాయాధికారికి అందజేశారు. వాటిలో 2005 ఏప్రిల్ 14 అని ఉంది. తాను మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు న్యాయాధికారి వెల్లడించారు. నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించారు.

రాయి కాదు... దండ గాయం....

గులకరాయి కేసులో ఐపీసీ 307 సెక్షన్ వర్తించదని డిఫెన్స్ న్యాయవాదులు వాదించారు. నిందితుడు సతీశ్‌కుమార్ ఒక ఆకతాయి అని చెప్పారు. జగన్‌ను హత్య చేసే స్థాయి ఈ యువకుడికి ఉందా అని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు రోడ్‌షోలు చేసినప్పుడు ఎంతోమంది అభిమానులు, నేతలు పూలదండలు వేస్తారన్నారు. అదేవిధంగా జగన్‌కు పూలదండ వేసినప్పుడు అది గీసుకుని గాయమైందని వాదించారు. ఒకవేళ రాయి విసిరితే దెబ్బ తగిలిన చోట వాపు కనిపిస్తుందన్నారు. కానీ, అలాంటిదేమీ కనిపించలేదని వాదించారు.

నా కాళ్లు పట్టుకుని డీసీసీ అధ్యక్షుడయ్యావ్!



- మంత్రి పెద్దిరెడ్డిపై మాజీ సీఎం కిరణ్ సంచలన వ్యాఖ్యలు
- అధికార మదంతో ఉన్నారని ఆగ్రహం

పీలేరు, ఏప్రిల్ 18: "నువ్వు డీసీసీ అధ్యక్షుడయ్యేందుకు రెండుసార్లు నా కాళ్లు పట్టుకున్నావ్! మరిచిపోయావా? నువ్వు నా కాళ్లు పట్టుకున్నావని నేను కాణిపాకంలోగానీ, తరిగొండలోగానీ ప్రమాణం చేయడానికి నేను సిద్ధం. పట్టుకోలేదని నువ్వు ప్రమాణానికి సిద్ధమా?" అని వైసీపీ నాయకుడు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున అన్నమయ్య జిల్లా పీలేరు నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి పదవి కోసం నేను కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కాళ్లు పట్టుకున్నానని మంత్రి పెద్దిరెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నారు. పదవుల కోసం ఆత్మగౌరవం, ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టే మనస్తత్వం నాది కాదు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి పదవిని తృణప్రాయంగా వదులుకున్నా. ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీసీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో అప్పటి వాయల్పాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న నేను ఓ రోజు తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో బసచేశా. ఆ రోజు రాత్రి 11 గంటల సమయంలో అక్కడకు వచ్చిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. డీసీసీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తూ నా కాళ్లు పట్టుకున్నారు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపు ఆయన ఆ మరుసటి ఉదయం 6 గంటలకల్లా అతిథి గృహానికి మళ్లీ వచ్చారు. 'రాత్రి మద్యం మత్తులో కాళ్లు పట్టుకున్నానని అనుకుంటావేమో కిరణ్, అందుకని మళ్లీ వచ్చా. నీ కాళ్లు పట్టుకుంటా నాకు మద్దతు ఇవ్వు' అంటూ పెద్దిరెడ్డి మరోసారి కాళ్లు పట్టుకున్నారు. ఈ ఘటనను బహిర్గతం చేయడం సంస్కారం కాదని ఇంతకాలం ఓపిక పట్టా. ఎవరి నైజం ఏమిటో ప్రజలకు తెలియజేసేందుకు ఇష్టం లేకపోయినా చెబుతున్నా. అధికార మదంతో ఆయన పదేపదే నాపై విమర్శలు చేస్తుంటే తట్టుకోలేక బహిర్గతం చేశా" అని అన్నారు.

తొలిరోజే నామినేషన్ల జోరు



భీమిలి అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేస్తున్న గంటా శ్రీనివాసరావు

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లకు నోటిఫికేషన్ విడుదలైన తొలిరోజు గురువారమే ఈ ప్రకియ జోరందుకుంది. మొత్తం 25 పార్లమెంటు పార్లమెంటు స్థానాలకుగాను 20 స్థానాల్లో తొలిరోజు 39 మంది అభ్యర్థులు 43 నామినేషన్లు దాఖలు చేశారు. 175 అసెంబ్లీ స్థానాలకుగాను 101 స్థానాలకు 190 మంది అభ్యర్థులు 236 నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా గుంటూరు పార్లమెంట్ స్థానానికి ఐదుగురు, ఒంగోలుకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. విశాఖపట్నం, కర్నూలుకు ముగ్గురు చొప్పున, విజయనగరం, విజయవాడ, నరసరావుపేట, బాపట్ల, నంద్యాల, అనంతపురం, కడప, రాజంపేట లోక్‌సభ స్థానాలకు ఇద్దరేసి చొప్పున నామినేషన్లు వేశారు. అనకాపల్లి, కాకినాడ, నరసాపురం, ఏలూరు, హిందూపురం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి లోక్‌సభ స్థానాలకు ఒక్కొక్కరు నామినేషన్ వేశారు. టీడీపీ తరఫున నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి లావు శ్రీకృష్ణదేవరాయలు, లావు మేఘన, ఒంగోలుకు మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట గీతాలత, కర్నూలులో బి. నాగరాజు, కె. జయసుధ, కడపలో చదిపిరాళ్ల భూపేశ్ సుబ్బరామిరెడ్డి, చిత్తూరులో దగ్గుమళ్ల ప్రసాదరావు నామినేషన్లు వేశారు. వైసీపీ తరఫున హిందూపురం పార్లమెంట్ స్థానానికి జె.శాంత, రాజంపేటలో పీవీ మిథున్‌రెడ్డి, కాంగ్రెస్ తరఫున అనకాపల్లిలో షేక్ సఫీవుల్లా, నరసాపురంలో సత్తి సూర్యనారాయణరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. విశాఖ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, పిరమిడ్ పార్టీ నుంచి పి.సత్యవతి, ఇండిపెండెంట్‌గా వడ్డి హరిగణేష్ ఒక్కొక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కొందరు ఇతర పార్టీల తరఫున, మరికొందరు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేసినట్లు సీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి.

అసెంబ్లీ స్థానాలకు..

రాష్ట్రంలోని అసెంబ్లీ స్థానాలకు తొలిరోజే 190 మంది అభ్యర్థులు 236 నామినేషన్లు దాఖలు చేశారు. విశాఖజిల్లా భీమిలి నుంచి టీడీపీ తరఫున గంటా శ్రీనివాసరావు, ఆయన కుమారుడు గంటా రవితేజ రెండేసి సెట్లు దాఖలు చేశారు. నెల్లూరు జిల్లాలో కావలి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రెండు సెట్లు, వైసీపీ అభ్యర్థి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రెండు సెట్లు, ఆయన కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డి మరో రెండు సెట్ల నామినేషన్లు వేశారు. నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తరఫున మాజీ మేయర్ భానుశ్రీ నామినేషన్ వేశారు. బాపట్లలో వైసీపీ తరఫున ఎమ్మెల్యే కోన రఘుపతితో పాటు ఆయన సతీమణి రమాదేవి నామినేషన్‌లు దాఖలు చేశారు. ఎచ్చెర్లలో బీజేపీ తరఫున నడుకుదిటి ఈశ్వరరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నేతల ఈశ్వరరావు, నడుపూరు ఈశ్వరరావు నామినేషన్ వేశారు. వీరి ముగ్గురు పేర్లు ఒకేలా ఉండడం గమనార్హం. ఎలమంచిలిలో జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్లు వేశారు. ఉరవకొండలో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ తరఫున ఆయన సతీమణి స్నేహలత, శిగనమలలో టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి కుటుంబ సభ్యులు, పుట్టపర్తిలో టీడీపీ తరఫున పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, పల్లె వెంకటక్రిష్ణకిశోర్‌రెడ్డి, ధర్మవరంలో వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. నరసరావుపేటలో కూటమి అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు నామినేషన్ వేశారు. రాజమండ్రి సిటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్, గోపాలపురంలో మద్దిపాటి వెంకటరాజు, గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు, యార్లగడ్డ జ్ఞానేశ్వరి, పామర్రులో వర్ల కుమార్‌రాజా, జగ్గయ్యపేటలో శ్రీరామ్ రాజగోపాల్, శ్రీరామ్ శ్రీదేవి, మాచర్లలో జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలంలో బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బుడ్డా శైలజ, ఎమ్మిగనూరులో బి. జయనాగేశ్వర్‌రెడ్డి, బైరెడ్డి నిత్యాదేవి టీడీపీ తరఫున నామినేషన్లు వేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి వై.సుజనాచౌదరి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. వీరితోపాటు పలు చిన్నా చితకా పార్టీలకు చెందిన నాయకులు, ఇండిపెండెంట్లు కూడా నామినేషన్లు వేశారు.

ఎన్నికలు ఎందుకు... అన్నీ నువ్వే తీసుకో!

- జగన్ 175కి 175 వ్యాఖ్యలపై సినీ నటుడు పృథ్వీ సెటైర్
- ముద్రగడ కాపు జాతికే కళంకమని వ్యాఖ్య



పిఠాపురం, ఏప్రిల్ 18: 'సీఎం జగన్ 175కి 175 సీట్లు మావే అంటున్నాడు. మొత్తం అన్నీ నీవే తీసుకో... ఇక ఎన్నికలు ఎందుకు' అంటూ సినీ నటుడు, జనసేన స్టార్ క్యాంపైనర్ పృథ్వీరాజ్ సెటైర్లు వేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఆయన గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం కుమారపురంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ ఎవరినైనా వాడుకుని వదిలేస్తాడని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. అది వైసీపీ నైజమని విమర్శించారు. రెడ్డి కులస్తులకే వైసీపీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కాపు జాతికే కళంకమని మండిపడ్డారు. ముద్రగడ, హరిరామజోగయ్య లాంటి వృద్ధ నాయకులు తాము పెద్ద నాయకులమని తిరుగుతుంటారని, వారివల్ల ప్రయోజనం శూన్యమని చెప్పారు. జగన్ సేవకుడిగా రెడ్డి కులానికి ముద్రగడ ఊడిగం చేస్తున్నాడని మండిపడ్డారు. 'ముద్రగడ ఏం కాపు నాయకుడు. నీకు సత్తా ఉంటే జగన్‌ను అడిగి 30 సీట్లు తీసుకురా. అందులో నీవు నెగ్గు. అప్పుడు నేను ఊడిగం చేస్తా. అంతేకానీ పవన్‌పై ఇష్టమొచ్చిన వ్యాఖ్యలు చేయొద్దు' అని ఆయన హితవు పలికారు. మొలతాడు, మగాడు లాంటి పదాలు వాడటం మానుకోవాలని సూచించారు. ముద్రగడ పెద్ద దరిద్రమన్నారు. చిరంజీవి వంటి మహానటుడినే జగన్ అవమానించాడని గుర్తుచేశారు. జగన్ లాంటివాడు స్ట్రీట్‌కు ఒకడుంటాడని, కానీ పవన్ లాంటివాడు స్టేట్‌కు ఒక్కడే ఉంటాడని చెప్పారు. పవన్ అసెంబ్లీలో అడుగు పెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. జనసేన పోటీచేస్తున్న 21 సీట్లలో 19చోట్ల భారీ మెజారిటీతో విజయం సాధించబోతోందని, మరో రెండుచోట్ల విజయావకాశాలు 50-50గా ఉన్నాయని తెలిపారు. బూతులు మాట్లాడే కొడాలి నాని, పేర్ని నాని, రోజా నోళ్లను ఫినాయిల్‌తో కడిగినా కంపుపోదని చెప్పారు. ఎక్కడ ఏది జరిగినా చంద్రబాబు కుట్ర అనడం వైసీపీకి అలవాటుగా మారిందని పృథ్వీరాజ్ మండిపడ్డారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం ఆపండి...!

వార్ రుక్వాదీ పాపా, ఔర్ ఫిర్ హమారీ బస్ నికాలీ పాపా..! అని ఓ విద్యార్థిని ఎంతో ఉద్వేగంతో తన తల్లిదండ్రులకు చెబుతున్న ఓ వీడియో అడ్వర్టయిజ్‌మెంట్ భారతీయ జనతాపార్టీ ఇటీవల విడుదల చేయడం, సామాజిక మాధ్యమాల్లో అది విస్తృతంగా ప్రచారం కావడం తెలిసినవే. ప్రధానమంత్రి అధికారిక యూట్యూబ్ చానెల్‌లోనూ అది కనిపిస్తుంది. 'నేను చెప్పలేదూ...మోదీ ఎట్లాగయినా మమ్మల్ని ఇంటికి చేరుస్తాడని, యుద్ధం ఆపేశారు నాన్నా, ఆ తరువాత మమ్మల్ని తీసుకొని బస్సు బయలుదేరింది' అంటూ ఆ అమ్మాయి చెబుతూంటే తల్లిదండ్రులు ఆనందబాష్పాలు రాల్చుతూంటారు. ఈ అడ్వర్టయిజ్‌మెంట్‌లో స్థలకాలాదులకు సంబంధించిన ప్రస్తావనలు, మోదీ నిలువరించిన ఆ యుద్ధం ఏమిటన్న వివరాలు ఉండవు. కానీ, ఆ సంభాషణ, విమానాశ్రయ దృశ్యాలను బట్టి అది ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన ప్రస్తావన అని తెలుస్తూనే ఉంటుంది.

ఉక్రెయిన్ మీద రష్యా యుద్ధం ప్రకటించిన తరువాత, బీజేపీతో ముడిపడి సామాజిక మాధ్యమాల్లో ఒక అంశం విస్తృతంగా ప్రచారమైంది. భారతదేశానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులను స్వదేశానికి చేర్చడం కోసం నరేంద్రమోదీ ఈ యుద్ధాన్ని కొంతకాలం నిలిపివేశారట. భారతీయవిద్యార్థులను స్వదేశానికి చేర్చుతున్నప్పుడు బీజేపీ నాయకులు చేసిన హడావుడి అటుంచితే, మనపిల్లలకోసం మోదీ ఏకంగా యుద్ధాన్ని ఆపారని అప్పట్లో కొందరు వ్యాఖ్యానించారు కూడా. వీటిని విదేశాంగశాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చీ దృష్టికి తీసుకువెళ్ళినప్పుడు ఈ తరహా వ్యాఖ్యలన్నీ నిరాధారమైనవీ, పూర్తి అసత్యాలని అని ఖండించారు. ఆ యుద్ధపరిస్థితుల మధ్య కాస్తంత క్షేమకరమైన మార్గం ఏమిటన్నది మేం తెలుసుకొని చెప్పాం, చాలామంది ఆ మార్గాన్ని వినియోగించుకొని బయటపడ్డారు అని అన్నారాయన. దీనిని ఆధారంగా చేసుకొని ఎవరో బాంబులు వేయకుండా ఆపారని, లేదా అందుకు ప్రయత్నించారని చెప్పుకోవడం సరికాదు అన్నారాయన. కానీ, విదేశాంగశాఖ ప్రతినిధి ఇలా కాదు పొమ్మన్నంతమాత్రాన ఎందుకు ఊరుకోవాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు కూడా అనిపించింది. 22వేలమంది పిల్లలను క్షేమంగా ఇళ్ళకు చేర్చడానికి నరేంద్రమోదీ రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపారని గత ఏడాది ఫిబ్రవరిలో కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఆయన వ్యాఖ్యానించారు. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో బీజేపీ మళ్ళీ ఈ అంశాన్ని బాగానే వాడుకుంటోంది.


రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మూడేళ్ళుగా సాగుతోంది. ఈ సుదీర్ఘకాలంలో దానిని ముగించడానికి మోదీ ఎంత కృషిచేశారో, ఎన్ని ప్రయత్నాలు చేశారో తెలియదు కానీ, యుద్ధం ఆరంభమైన తొలినాళ్ళలో మోదీ జోక్యం చేసుకోవాలని చాలామంది విదేశీ నాయకులు కోరారు కూడా. ఇప్పుడు యుద్ధాన్ని ఆపేందుకు స్విట్జర్లాండ్ ఆధ్వర్యంలో ఒక అంతర్జాతీయస్థాయి ప్రయత్నం మొదలైంది. జూన్ 15–16 తేదీల్లో జరిగే ఈ సమావేశంలో అత్యధికదేశాలు పాలుపంచుకుంటాయని అంటున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు మూడునెలలక్రితం చేసిన అభ్యర్థనకు ఇటీవల సానుకూలంగా స్పందించిన స్విట్జర్లాండ్ తదనుగుణంగా ప్రయత్నాలు ఆరంభించింది. దేశాధినేతలంతా పాల్గొనే ఈ సమావేశం అతిత్వరలోనే యుద్ధాన్ని ముగించేందుకు తోడ్పడుతుందని అంచనా. జూన్‌లోగా స్విట్జర్లాండ్ అన్ని దేశాలతోనూ చర్చోపచర్చలు జరిపి, ఇచ్చిపుచ్చుకోవడాలను తేల్చి, యుద్ధం ముగింపునకు వాతావరణాన్ని సానుకూల పరుస్తుందట. యుద్ధంలో తనది పైచేయిగా ఉన్న వర్తమాన స్థితిలో, అంతర్జాతీయంగా తనమీద ఒత్తిడితెచ్చి, ఉక్రెయిన్‌కు మేలు చేయడానికే ఈ సమావేశాన్ని ఏర్పాటుచేశారంటూ రష్యా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. అందులో పాల్గొనేది లేదని అంటోంది. చైనా కూడా రష్యా పక్షాన నిలబడింది. ఇంకా రెండునెలల సమయం ఉన్నందున ఇంతలోగా పరిస్థితులన్నీ చక్కబడతాయని పశ్చిమదేశాల తరఫున ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్న స్విట్జర్లాండ్ బలంగా నమ్ముతోంది. ఉక్రెయిన్ దౌత్యప్రతినిధులు ప్రపంచదేశాలన్నీ తిరుగుతూ ఈ సమావేశానికి మద్దతు కూడగడుతున్నారు. అందులో భాగంగానే, గత నెలల ఉక్రెయిన్ విదేశాంగమంత్రి మనదేశంలో పర్యటించి, సమావేశాల్లో పాల్గొనాల్సిందిగా అభ్యర్థించారు. కొద్దిరోజుల్లో ముగుస్తుందని అనుకున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఏళ్ళుతరబడి సాగుతూ, ప్రపంచ ఆర్థికాన్ని పెద్దదెబ్బకొట్టింది. ఎవరివాదనలు ఏమైనప్పటికీ, యుద్ధభూమినుంచి కాలువెనక్కుతీసుకొనేందుకు అన్ని పక్షాలకు అందివచ్చిన అవకాశం ఇది. ఇప్పటికైనా, యుద్ధాన్ని ముగించడంలో మన వంతు ప్రయత్నం చేస్తే మంచిది.

రాజనీతిజ్ఞుడు, నిత్యశ్రామికుడు

రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం శ్రమిస్తున్న నిత్యకృషీవలుడు చంద్రబాబు. ఏడు పదుల వయసులో కూడా తుఫాన్లు, భూకంపాలు, విపత్తులు సంభవించినప్పుడు ఆయనే ముందుంటారు. ఐదు పదులు దాటని నాయకులు ప్యాలెస్ నుంచి బయటకు రాకుండానే ఇంట్లోనే సెట్టింగులతో పండుగలు, పబ్బాలు, ప్రారంభోత్సవాలు అన్నీ పూర్తి చేస్తున్నారు. ఎవరు ముసలివారు.. ఎవరు యువకులు? తన తండ్రి వయసున్న చంద్రబాబును పదేపదే ముసలివాడు అని ఎద్దేవా చేస్తున్న వారికి ఇంతకంటే ఏం సమాధానం కావాలి? భిన్నమైన పాలన అందిస్తూ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు చంద్రబాబు. నవ్యాంధ్రను అభివృద్ధి చేయడంలో తనకు ఎదురైన అనేక సవాళ్లు, సమస్యలు అధిగమిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను శిథిలం నుంచి శిఖరం వైపు నడిపించారు.

రాజకీయ నాయకుడు వచ్చే ఎన్నికల గురించి ఆలోచిస్తే, రాజనీతిజ్ఞుడు రాబోయే తరాల గురించి ఆలోచిస్తారనే సూక్తి ఉంది. అలాంటి రాజనీతిజ్ఞత చంద్రబాబులో కనిపిస్తుంది. కఠోర శ్రమ, క్రమశిక్షణ, విలువలతో కూడిన నియమబద్ధమైన జీవనశైలి ఆయనది. సరికొత్త విధానాలతో నవ్య చరిత్రకు నాంది పలికి, దేశ రాజకీయాలలో గుర్తింపు పొందారు. ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో చంద్రబాబు ఎన్నో జయాపజయాలు.. మరెన్నో ఆటుపోట్లు చవిచూశారు. అయినా చెక్కుచెదరని గుండె నిబ్బరం, మనోధైర్యం, నిరాశచెందని తత్వం, అలసట ఎరుగని ధీరత్వం ఆయనది.

రేపు చేయాల్సిన పనిని ఈ రోజే పూర్తిచేయాలనుకునే నిరంతర శ్రామికుడు, రాజకీయ రంగంలో అరుదైన లక్షణాలు కలిగిన వ్యక్తిగా చంద్రబాబును మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి కొనియాడారు. అభ్యుదయ సమాజం కోసం ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రపంచ రూపురేఖల్ని మార్చగలిగిన కొద్దిమంది వ్యక్తుల్ని వరల్డ్ ఎకానమీ ఫోరం గుర్తించింది. వరల్డ్ డ్రీమ్ కేబినెట్‌కు 14 మందిని ఎంపిక చేసింది. అందులో చంద్రబాబుకు స్థానం లభించడం తెలుగువారికి దక్కిన అరుదైన గౌరవం.



రాజకీయ నాయకుడు వచ్చే ఎన్నికల గురించి ఆలోచిస్తే, రాజనీతిజ్ఞుడు రాబోయే తరాల గురించి ఆలోచిస్తారు. అలాంటి రాజనీతిజ్ఞత చంద్రబాబులో కనిపిస్తుంది. కఠోర శ్రమ, క్రమశిక్షణ, విలువలతో కూడిన నియమబద్ధమైన జీవనశైలి ఆయనది. సరికొత్త విధానాలతో నవ్య చరిత్రకు నాంది పలికి, దేశ రాజకీయాలలో గుర్తింపు పొందారు.

చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో 1950, ఏప్రిల్ 20న చంద్రబాబు జన్మించారు. చిన్న వయస్సులోనే మంత్రిగా బాధ్యతలు చేపట్టి, నూతన కార్యక్రమాలకు నాంది పలికారు. 1995 సెప్టెంబర్ 1న ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టారు. జన్మభూమి, శ్రమదానం, ప్రజల వద్దకు పాలన తదితర కార్యక్రమాలతో నిరంతరం ప్రజల్లోనే ఉన్నారు. ముఖ్యమంత్రి అంటే ప్రజలతోనే.. ప్రజల్లోనే ఉంటారనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా దేశ ప్రధానులను, రాష్ట్రపతులను నిర్ణయించడంలో కీలక భూమిక పోషించారు.

ఆంధ్రప్రదేశ్‌ను ఆధునీకరించి గ్లోబల్ ఎకానమీకి అనుసంధానం చేసిన ప్రధాన చోదకుడిగా చంద్రబాబును న్యూయార్క్ టైమ్స్ అభివర్ణించింది. ఐటీ రంగాన్ని ఉమ్మడి రాష్ట్రానికి తీసుకువచ్చి హైటెక్ సిటీ నిర్మించి, సైబరాబాద్ నగర నిర్మాణానికి రూపకల్పన చేశారు. సాంకేతిక విద్యారంగంలో ఆయన తెచ్చిన విప్లవాత్మకమైన మార్పులు ఎందరో రైతుబిడ్డలను మట్టిలో మాణిక్యాలుగా మార్చాయి. నవ్యాంధ్ర అభివృద్ధికి బాటలు పడతాయని 2014 ఎన్నికలలో చంద్రబాబుకు ప్రజలు పట్టం కట్టారు. ఒకవైపు తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, మరోవైపు రాజధాని లేదు, జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు ఉన్నా మొక్కవోని దీక్షతో బస్సులో నుంచే పాలన సాగించారు. భూసమీకరణ ద్వారా 33 వేల ఎకరాలు సేకరించి రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేశారు. పోలవరాన్ని 72 శాతం నిర్మించారు. పట్టిసీమ ద్వారా వేల కోట్ల విలువైన పంటలను కాపాడారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా ఉపశమనం, పరిశ్రమల స్థాపన, ఫైబర్‌గ్రిడ్, అన్న క్యాంటీన్లు వంటి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.

సమైక్య రాష్ట్రాన్ని తొమ్మిదేళ్ల పరిపాలించి, నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారు. నవ్యాంధ్ర ఐదేళ్ల పాలనలో ఎక్కడా ఆందోళనలు, ఉద్యమాలు, హింసాత్మక సంఘటనలు, అక్రమ కేసులు, అరెస్టులు, అణచివేతలు, ధర్నాలు, సమ్మెలు లేవు. వాతలు, కోతలు, ఆర్థిక ఇబ్బందులు అంతకంటే లేవు. కాంట్రాక్టర్లకు బిల్లులు, ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందేవి. సంపద సృష్టించడం చేతగాక వైసీపీ ప్రభుత్వం ఉన్న ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టింది. ప్రతిపక్షాలపై అనేక రూపాల్లో దాడులు చేస్తున్నది. వీటిని తట్టుకుంటూ చంద్రబాబు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. మండుటెండలను లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం, ఆవశ్యకతను ప్రస్తుత పరిస్థితులు తెలియజేస్తున్నాయి. 75వ వసంతంలోకి అడుగుపెడుతున్న చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చూడాలని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

■ మన్నవ సుబ్బారావు

(ఏప్రిల్ 20: చంద్రబాబు పుట్టినరోజు)

మోదీ గ్యారంటీ : 'ఒకే దేశం, ఒకే నాయకుడు'

మొత్తం ఓటర్లు 96 కోట్ల మందికి పైమాటే; 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలలో 543 నియోజకవర్గాలు, వీటిలో 10 లక్షలకు పైగా పోలింగ్ బూత్‌లు... ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ రూపురేఖలివి. అయినా ఈ బృహత్ ప్రజాస్వామ్య సమాజంలో సార్వత్రక ఎన్నికల పోరాటం కేవలం ఒకే ఒక్క పేరుపై జరుగుతోంది: నరేంద్ర దామోదర్ దాస్ మోదీ. 2024 సార్వత్రక ఎన్నికలు అంతిమ అధ్యక్ష-తరహా ఎన్నికల పోరు. అధికార భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికల సమరాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపంలో చేస్తోంది! తనవైన సొంత ఎన్నికల వ్యూహాలు ఉన్న కేరళ, ప్రాంతీయ నాయకుల మధ్య పాత తరహా పోరు జరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌ను మినహాయిస్తే ప్రతి ఇతర రాష్ట్రంలోను ఒకే ఒక్క అభ్యర్థి ఉన్నాడు. ఈ సార్వత్రక ఎన్నికలను అతడు తన నాయకత్వంపై ఒక రెఫరెండమ్ (ప్రజాభిప్రాయ సేకరణ)గా మార్చి వేశాడు. ఆ ఒకే ఒక్క అభ్యర్థి నరేంద్ర మోదీ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

బీజేపీ మానిఫెస్టో సైతం ఒక వ్యక్తికి ఎనలేని ప్రాధాన్యమిచ్చింది. ఆ ఎన్నికల ప్రణాళిక ఇచ్చిన ప్రతి హామీలోనూ 'మోదీకీ గ్యారంటీ' అనే ఊతపదం (భాషా భూషణం) కనిపిస్తుంది. అంతేనా? మానిఫెస్టో ప్రతి పేజీని నరేంద్ర మోదీ బొమ్మలు ఆవరించుకుని ఉన్నాయి. 'ఒకే దేశం, ఒకే నాయకుడు' పేరిట జరుగుతున్న అవధులు లేని వ్యక్తి పూజలో పార్టీ వ్యక్తిత్వం అంతర్గతమైపోయింది. 1970 దశకంలో కాంగ్రెస్ అధ్యక్షుడు దేవ్‌కాంత్ బారువా 'ఇండియాయే ఇందిర, ఇందిరే ఇండియా' అని ఇందిరా గాంధీని అపఖ్యాతికరంగా ప్రస్తుతించిన అనంతరం ఒక సార్వత్రక ఎన్నికల సమరం పూర్తిగా ఒక వ్యక్తి కేంద్రంగా జరగడం ఇదే మొదటిసారి. నరేంద్ర మోదీని మొట్ట మొదట ప్రధానమంత్రి పదవికి తీసుకువచ్చిన 2014 సార్వత్రక ఎన్నికల సమరం 'అచ్చే దిన్' (మంచి రోజు) హామీతో మార్పుకు ఓటుగా (ఓట్ ఫర్ చేంజ్) జరిగింది; 2019 సార్వత్రక పోరు కూడా నాయకత్వం గురించే అయినా పుల్వామా ఉగ్రదాడి, బాలాకోట్ ప్రతీకార దాడుల ఫలితంగా జాతీయవాద భావోద్వేగ పూరిత వాతావరణంలో జరిగింది. మరి ఇప్పుడైనా అంటే 2024 సార్వత్రక ఎన్నికలు అయినా ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం, ఆదాయ అసమానతలు మొదలైన ప్రజాసమస్యలు కేంద్రంగా జరుగుతున్నాయా అంటే లేదనే చెప్పి తీరాలి. ఆ అంశాల ప్రాతిపదికన జరుగుతున్నాయని కనీసం ఎవరూ చెప్పడమే లేదు. గత పదేళ్ల మోదీ సర్కార్ సాఫల్య వైఫల్యాలపై అర్థవంతమైన చర్చ సైతం జరగడం లేదు. బీజేపీ ఓటర్లను మినహాయిస్తే హిందూత్వకు సైతం ఎలాంటి ప్రాధాన్యం లభించడం లేదు.

తీవ్ర స్థాయిలో ఊదరగొడుతున్న 'వికసిత్-భారత్' కథనాన్ని సైతం, ఒకే ఒక్క నాయకుడు మాత్రమే భారత్‌ను ఉజ్వల భవిష్యత్‌లోకి తీసుకువెళ్లగలడన్న మౌలిక విశ్వాసం చుట్టూ నిర్మించారు. 2036లో ఒలింపిక్ క్రీడోత్సవాలను భారత్‌లోనే నిర్వహించనున్నామనే హామీని సైతం నరేంద్ర మోదీయే శాశ్వతంగా ప్రధానమంత్రిగా ఉంటారనే భరోసా ఆధారంగా ఇవ్వడం జరిగింది. 2022 నాటికి 'నవభారత్' నిర్మాణ స్వప్న సాకార గడువును చాలా నేర్పుగా 2047కు, దాని అనంతర కాలానికి మార్చి వేశారు. ప్రధానమంత్రి 'అమృత్ కాల్' దార్శనికతలో దాన్ని ఒక భాగంగా చేర్చారు.



18వ సార్వత్రక ఎన్నికల్లో మోదీ పేరిట, అవును మోదీ పేరిట మాత్రమే ప్రభుత్వ అనుకూల తిరుగులేని ప్రజా తీర్పుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. స్వల్పకాలికంగా ఇది బీజేపీకి గొప్ప లబ్ధి సమకూర్చే వ్యూహమనడంలో సందేహం లేదు. అయితే దీర్ఘకాలంలో అదొక అనివార్య ప్రశ్నను హఠాత్తుగా మన ముందుకు తెస్తుంది : 'మోదీ తరువాత, ఎవరు?'

నిజానికి 'గ్యారంటీ' అన్న భావన బీజేపీ సొంతం కానే కాదు. ఆ పదాన్ని తొలుత సృష్టించింది ఆమ్ ఆద్మీ పార్టీ. 2020లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వం ప్రాతిపదికగా చేస్తూ ఆ పదాన్ని ఆప్ వాడింది. ఆ తరువాత హిమాచల్, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో తమ హామీల గురించి నొక్కి చెప్పేందుకు కాంగ్రెస్ ఆ పదాన్ని బాగా ఉపయోగించుకున్నది. ఇప్పుడు అదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యుఎస్‌పి (యూనిక్ సెల్లింగ్ ప్రపోజిషన్)గా ఉన్నది. ఓటర్లు సాధారణంగా స్థానిక నాయకుల మాటలను నమ్మరని, నరేంద్ర మోదీ లాంటి జాతీయ స్థాయి నాయకులనే విశ్వసిస్తారనే అవగాహనే 'గ్యారంటీ'కి ప్రధాన ఆధారం (వాస్తవ లబ్ధి దక్కకపోయినా ఎక్కువగా ఆశాభావమే 'గ్యారంటీ'కి ప్రాతిపదికగా ఉన్నప్పటికీ మోదీ లాంటి నేతలను ప్రజలు తప్పక విశ్వసిస్తారు మరి).



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

కర్ణాటకే ఇందుకొక మంచి ఉదాహరణ. కోటీశ్వరులు, పార్టీ ఫిరాయింపుదారులు, రాజకీయ కుటుంబాల వారసులతో రాష్ట్ర బీజేపీ నిండిపోయి ఉంది. 'భిన్నమైన పార్టీ'గా పేరుపొందిన బీజేపీ ఇప్పుడు కర్ణాటకలో నరేంద్ర మోదీ కేంద్రిత ఎన్నికల ప్రచార యంత్రాంగం ఆధారంగా ఎట్టి పరిస్థితులలోనూ, ఏ విధంగానైనా సరే గెలిచి తీరేందుకు శతథా ప్రయత్నిస్తోంది. సిట్టింగ్ ఎంపీలలో సగం మందికి పైగా (వీరందరూ సీనియర్, విధేయ కార్యకర్తలు) మళ్లీ పార్టీ టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించిన బీజేపీ, దేవెగౌడ నాయకత్వంలోని జనతాదళ్ (ఎస్)తో పొత్తు పెట్టుకున్నది. ఏడాది క్రితం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో దేవెగౌడ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీ పోరాడింది. జనతాదళ్ (ఎస్) తండ్రి–తనయుడి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మాత్రమేనని తూర్పార పట్టింది. అధికారంలో ఉన్నప్పుడు పాలనా వ్యవస్థను పూర్తిగా అవినీతిమయం చేసిందని కూడా తీవ్రంగా ఆరోపించింది.

దక్షిణ బెంగళూరులో యువ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ఒక ఆదివారం ఉదయం 'రన్ ఫర్ నమో' ఈవెంట్‌ను నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారికి ప్రధాన మంత్రి ముఖచిత్రం ఉన్న టీషర్ట్‌లు, మాస్క్‌లు పంపిణీ చేశారు జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అనే నినాదాల మధ్య 'మోదీ మోదీ' అనే మంత్రఘోష ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. కర్ణాటకలో బీజేపీ తప్పక గెలిచే లోక్‌సభ నియోజకవర్గాలలో దక్షిణ బెంగళూరు ఒకటి. అయినప్పటికీ దక్షిణ బెంగళూరులోనే కాకుండా రాష్ట్రంలోను, దేశ వ్యాప్తంగాను ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలోను బ్రాండ్ మోదీ పేరిటే ఈ సార్వత్రక ఎన్నికలలో పోరాడుతున్నామని యువ ఎంపీ తేజస్వీ సూర్య అంగీకరించారు.

ఒక విధంగా బీజేపీ శ్రేణుల మోదీ స్థిరీభావనం (మోదీ ఫిక్సేషన్) అర్థం చేసుకోదగిందే. ప్రధానమంత్రికి లభిస్తున్న తిరుగులేని ప్రజాదరణ మీ విజయానికి తప్పక తోడ్పడే అవకాశమున్నప్పుడు అందుకు మీరు ఎందుకు గర్వపడకూడదు? ఆశిస్తున్న విజయోన్నతికి ఆ అవకాశాన్ని ఎందుకు ఉపయోగించుకోకూడదు? ఇప్పుడు బీజేపీ సరిగ్గా చేస్తుంది అదేనని చెప్పవచ్చు. ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ పార్టీ 1971 అనంతరం ఆమెకు లభించిన 'విజయేందిర', 'దుర్గామాత' కీర్తిప్రతిష్ఠల ఆధారంగా తన వ్యూహాలను రూపొందించుకోలేదా? ప్రజల విశ్వాసాన్ని పరిపూర్ణంగా పొందిన తమ అపూర్వ అగ్రనేత కీర్తి ప్రతిష్ఠలను బీజేపీ ఎందుకు ఉయోగించకోకూడదు? అయితే ఎన్నికలలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అటువంటి వ్యూహాలను అనుసరించడం అర్థం చేసుకోదగిన విషయమే కానీ బహుళ-పార్టీ ప్రజాస్వామ్యంలో అది సదా ఆరోగ్యకరమైన పరిణామం కాదు, కాబోదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే అటువంటి వ్యూహాలను అనుసరించడం సమస్త ఇతర నాయకులు, రాజకీయ పక్షాలు అన్నిటినీ ఓటర్లు ఎన్నుకునేందుకు అసంగతమైన వారు, అనవసరమైనవిగా చేసేందుకు ప్రయత్నించడమే అవుతుంది.

మోదీ నాయకత్వ పోకడలను ఇప్పుడు మౌనంగా అంగీకరిస్తున్న సంఘ్ పరివార్ ఒకప్పుడు 'వ్యక్తి' (నాయకుడు) ప్రాముఖ్యత కంటే 'సంఘటన్' (సంస్థ) ప్రాధాన్యాన్ని తరచు నొక్కి చెప్తుండేది. 1999, 2004 సార్వత్రక ఎన్నికల సందర్భంలో 'భారత్ ఎదురుచూస్తున్న నాయకుడు'గా వాజపేయిని అభివర్ణిస్తూ బీజేపీ చేసిన ప్రచారోద్ధృతి పట్ల సంఘ్ పరివార్ ఎలా ఆగ్రహం వ్యక్తం చేసిందో గుర్తు చేసుకోండి. వాజపేయికి అలా ఎనలేని ప్రాధాన్యమివ్వడం సంఘ్ పెద్దలు ససేమిరా అంగీకరించలేదు. మరి అదే సంఘ్ పరివార్ ఇప్పుడు 'ఆయేగా తో మోదీ హి' ప్రచారార్భాటాలను నిరాక్షేపంగా సమ్మతిస్తోంది. మూడో సారి అధికారంలోకి వచ్చిన పక్షంలో నరేంద్ర మోదీ తప్పకుండా తమ సైద్ధాంతిక ఎజెండాలోని ప్రధాన అంశాలన్నిటినీ తప్పకుండా అమలుపరుస్తారనే భరోసా పూర్తిగా ఉండడం వల్లే సంఘ్ పెద్దలు మౌనం వహించారు. సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో ప్రధానమంత్రిగా ఉన్న వాజపేయి కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రతిబంధకాల నడుమ ప్రధాన మంత్రిగా, కూటమి అధినేతగా తన విధులను అతి జాగ్రత్తగా నిర్వర్తించవలసి వచ్చింది. మోదీకి అటువంటి ఇబ్బందులు లేవు. సొంత మెజారిటీతో అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ అధికరణ 370ని రద్దు చేసింది; అయోధ్యలో రామాలయాన్ని నిర్మించింది; ఉమ్మడి పౌర స్మృతిని అమలుపరుస్తామని ఇప్పుడు హామీ ఇస్తోంది.

లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థులు చాలా వరకు దేశానికి పెద్దగా తెలియని వ్యక్తులు, ఎలాంటి ప్రాముఖ్యం లేనివారు; ప్రధానమంత్రి ఫర్మానాలను కేంద్ర మంత్రులు తూ.చ తప్పకుండా అమలుపరుస్తున్నారు; అధికారంలో ఎవరుంటే వారికి పూర్తి విధేయతతో వ్యవహరిస్తారనే 'కీర్తి'ని బ్యూరోక్రాట్లు ఎటువంటి మినహాయింపు లేకుండా నిలబెట్టుకుంటున్నారు; ప్రతిపక్షాలు కన్నెర్ర జేస్తున్నాయి గానీ మోదీ వాటిని ఇప్పటికే లేవలేని విధంగా చితగ్గొట్టేశారు కదా; ఇక మీడియా అమిత వినయ విధేయతలతో ప్రధానమంత్రికి జేజేలు కొడుతోంది... ఈ పరిస్థితుల్లో జరుగుతున్న 18వ సార్వత్రక ఎన్నికల్లో మోదీ పేరిట, అవును మోదీ పేరిట మాత్రమే ప్రభుత్వ అనుకూల తిరుగులేని ప్రజాతీర్పుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇదొక తెలివైన వ్యూహం. స్వల్పకాలికంగా ఇది, బీలిపోయిన, ధైర్యం కోల్పోయిన, నిరుత్సాహంలో ఉన్న ప్రతి పక్షంతో పోటీపడుతున్న బీజేపీకి గొప్ప లబ్ధి సమకూర్చే వ్యూహం, సందేహం లేదు. అయితే దీర్ఘ కాలంలో అదొక అనివార్య ప్రశ్నను హఠాత్తుగా మన ముందుకు తెస్తుంది: 'మోదీ తరువాత, ఎవరు?'

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆపరేషన్ కగార్ వ్యతిరేక సదస్సు

అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ పనులు చేపట్టాలన్నా గ్రామసభ అనుమతి తప్పనిసరి. కానీ ప్రభుత్వాలు ఈ నిబంధనను పాటించడం లేదు. పైగా కార్పొరేట్ సంస్థలకు అక్కడి సహజ వనరులను అప్పగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాల్లో తీవ్రమైన ప్రతిఘటన నడుస్తున్నది. న్యాయమైన ప్రజా పోరాటాలను అర్థం చేసుకోవాల్సిన ప్రభుత్వాలు.. కార్పొరేట్ దోపిడీకి, రక్షణ కల్పించడానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగమే ఈ నెల 16న ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలు 29 మంది మావోయిస్టులను చంపేయడం. జనవరి 1 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ అనే కొత్త యుద్ధ వ్యూహాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా, హిందుత్వ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఐక్య వేదిక ఈ నెల 20న ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10.30 గంటల నుంచి సదస్సు నిర్వహిస్తోంది. ఇందులో వివిధ ప్రజాసంఘాల, పార్టీల నాయకులు, రచయితలు, ప్రజాస్వామికవాదులు ప్రసంగిస్తారు.

– ప్రజాసంఘాల ఐక్య వేదిక, ఒంగోలు

ఎలాంటి కాలమిది?

"వెల్లివిరిసిన విజ్ఞానం
బ్రహ్మజెముడులా అజ్ఞానం
భక్తివిశ్వాసాల పరమ పరిధవం..
అంధాంధ తమసాల అవ్యక్తనిశీథం...
నైరాశ్యపు చలిగుబుళ్లు ఈచుకున్న శశిరాస్యం"*

మరి ఇది ఒక 'వైభవోజ్వల మహాయుగమా?
'వల్లకాటికి' దారితీస్తున్న అధ్వానశకమా'?

అవినీతి పరుగుపందెంలో
ఒకరిని మించి ఒకరి ఎత్తుగడల పోటీ
గెలిచినా ఓడినా విన్నర్స్ రన్నర్స్‌గా
చివరికి లబ్ధిపొందడం ఖాయం!

ఎన్నికల రేసులో
నియమ నిబంధనలన్నీ
పాటించేవాడికే పరిమితం,
కుల మత ధన చక్రవ్యూహంలో
చక్రం తిప్పేవాడే విజేత

ధర్మాధర్మాల వ్యాఖ్యానాల
పరిహాస పర్వంలో
అన్యాయపురేఖలు గీస్తున్నవాళ్లు
వక్రీకరణ చరిత్రతో అబద్ధాలతో
భ్రమయుగంలోకి ఈడ్చుకెడుతున్నవాళ్లు

ఇంతకు ఎలాంటి కాలమిది?
ఎవరికి మేలైన కాలమిది?
ఆశ్రితపక్షపాతం కుటుంబాల పాలనలో
వారసత్వ రాజ్యతంత్రంగా
పౌరస్వేచ్ఛను కాలరాస్తున్న కాలాన
ఎక్కడికక్కడ మూలాల్ని వెతుకుతూ
హక్కుల కోసం రక్తమోడుతున్న కాలమిది!!

– నిఖిలేశ్వర్

*(తెన్నేటి సూరి అనువాద నవల 'రెండు మహానగరాలు' ప్రారంభ పంక్తులను గుర్తు చేస్తూ)

'ఇండియా'కు ఆరంభ అనుకూలతలు

పద్దెనిమిదవ సార్వత్రక ఎన్నికల ఆరంభ దశలో ప్రతిపక్ష ఇండియా కూటమికి అనేక అనుకూలతలు ఉన్నాయి. వాటి నుంచి అది ప్రయోజనం పొందనున్నది. దేశంలోని దాదాపు ఐదో వంతు నియోజకవర్గాలలో పోలింగ్ మొదటి దశలోనే జరగనుండడమే అందుకు కారణంగా చెప్పవచ్చు. తొలుతనే ఆధిక్యతను సమకూర్చుకునేందుకు వివిధ అనుకూలతలు 'ఇండియా'కు ఒక అవకాశాన్ని కల్పించనున్నాయి.

మూడు అంశాలు సంయుక్తంగా 'ఇండియా'కు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నాయి. తొలిదశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో ఎన్‌డీఏ, 'ఇండియా'లు 2019 సార్వత్రక ఎన్నికలలో ఇంచుమించు సమానస్థాయిలో సీట్లు సాధించుకున్నాయి. ప్రస్తుత రాజకీయ పొత్తుల ప్రాతిపదికన చూస్తే తొలిదశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో గత పర్యాయం ఎన్‌డీఏ, 'ఇండియా' చెరి 49 సీట్లను గెలుచుకున్నాయి. మిగతా ఆరు దశలలోను ఎన్‌డీఏకే స్పష్టమైన అనుకూలత ఉన్నది. అయితే తొలి దశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో ఉభయ కూటములకు విజయావకాశాలు సమస్థాయిలో ఉండడం గమనార్హమైన విశేషం.

2019 అనంతర పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తే ఈ సమతుల్యత 'ఇండియా'కు అనుకూలంగా మొగ్గుతుంది. ఇండియా కూటమి 55 స్థానాల్లో ఆధిక్యతలో ఉన్నదని, ఎన్‌డీఏ 42 స్థానాలలో మాత్రమే ముందంజలో ఉన్నదని విశదమవుతుంది. తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్ లలో 'ఇండియా' భాగస్వామ్య పక్షాలు కొంత మేరకు విజయావకాశాలను కోల్పోయినప్పటికీ అవి రాజస్థాన్‌లో తొమ్మిది, మధ్యప్రదేశ్‌లో రెండు లోక్‌సభ నియోజకవర్గాలలోను లబ్ధి పొందగలవని తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇది కేవలం గణాంక సంభావ్యత మాత్రమే కాదు, శుక్రవారం నాడు పోలింగ్ జరగనున్న కొన్ని ప్రాంతాలలో ఇండియా కూటమికి రాజకీయ అవకాశాలు మెరుగుపడనున్నాయి. జాట్, గుజ్జర్, మీనా తదితర వ్యవసాయక కులాల జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్న రాజస్థాన్ ఉత్తర, తూర్పు ప్రాంతాలు ఆ రాష్ట్రంలో రైతు ఉద్యమానికి గుండెకాయ వంటివి. ప్రస్తుత ఎన్నికలలో సీపీఎం, రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నది. ఈ పొత్తు వల్ల భారతీయ జనతా పార్టీకి నష్టం వాటిల్లే అవకాశం ఎంతైనా ఉన్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఈ తొలిదశ పోలింగ్ శాతం రెండో దశ పోలింగ్‌పై ప్రభావం చూపనున్నది.

ఉత్తరప్రదేశ్‌లో తొలిదశలో వాయవ్య ప్రాంతంలోని ఎనిమిది నియోజకవర్గాలలో పోలింగ్ జరగనున్నది. ఆ ప్రాంతంలో ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ కారణంగా సమాజ్‌వాది పార్టీ ఈ నియోజకవర్గాలలో మెరుగైన ఫలితాలను సాధించే అవకాశమున్నది. రైతుల ఉద్యమం కూడ ఈ ప్రాంత ప్రజలను బాగా ప్రభావితం చేసింది.

మహారాష్ట్రలో విదర్భ ప్రాంతం వలే మధ్యప్రదేశ్‌లో మహాకోశల్ ప్రాంతం ఇప్పటికీ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్నది. ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాలలో బీజేపీ జైత్రయాత్రను అడ్డుకునేందుకు విదర్భ, మహాకోశల్ ప్రాంతాలు 'ఇండియా' కూటమికి ముఖ్యంగా కాంగ్రెస్‌కు ఒక మంచి అవకాశాన్ని సమకూర్చనున్నాయి. ఎగువ అసోంలోని అన్ని నియోజకవర్గాలకు, ఉత్తర బెంగాల్‌లోని మూడు స్థానాలకు నేడు పోలింగ్ జరగనున్నది. ఈ నియోజకవర్గాలు అన్నిటినీ 2019లో బీజేపీ గెలుచుకున్నది. బీజేపీ వాటిని ఈసారి మళ్లీ గెలుచుకోలేక పోవచ్చు. అయితే అసోం, బెంగాల్ రాష్ట్రాలలో బీజేపీతో దీటుగా తలపడేందుకు ప్రతిపక్ష కూటమి ఈ స్థానాలను గెలుచుకోవలసి ఉన్నది. ఈశాన్య భారతంలోని పర్వత ప్రాంతాల రాష్ట్రాలు అన్నిటిలోను ఒకటి రెండు చోట్ల మినహా అన్ని నియోజకవర్గాలలోను నేడు పోలింగ్ జరగనున్నది. ఈ రాష్ట్రాల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రాబల్యాన్ని మణిపూర్ మహా విషాదం ప్రతికూలంగా ప్రభావితం చేసే అవకాశం లేదన్నది పరిశీలకుల అభిప్రాయంగా ఉన్నది.

బీజేపీ తన సిట్టింగ్ ఎంపీలలో సగం మందికి పైగా మళ్లీ టిక్కెట్లు ఇవ్వకపోవడం 'ఇండియా' కూటమికి మరొక విజయావకాశాన్ని సమకూర్చనున్నది. రాజస్థాన్‌లో తన 11 మంది ఎంపీలలో తొమ్మిది మందికి మళ్లీ టిక్కెట్లు ఇచ్చేందుకు బీజేపీ నిరాకరించింది. అధికార పార్టీ అభ్యర్థిత్వాన్ని పొందలేకపోయిన ఆ తొమ్మిదిమందీ నాయకత్వంపై తిరుగుబాటు చేశారు. 'ఇండియా' కూటమి తన 48 మంది ఎంపీలలో 28 మందిని మళ్లీ పోటీకి నిలబెట్టింది. తమిళనాడులో తన 38 మంది సిట్టింగ్ ఎంపీలలో 18 మందిని మార్చి వేసింది.

ఉత్తరాదిన ఇండియా కూటమికి 2019 అనంతర అసెంబ్లీ ఎన్నికలలో లభించిన ఆధిక్యతలు ప్రస్తుత సార్వత్రక ఎన్నికలలో విజయావకాశాలుగా మారనున్నాయి. దక్షిణాదిన 2019లో ఈ కూటమి తాను గెలుచుకున్న సీట్లను విజయవంతంగా రక్షించుకుంటున్నది. అంతేకాకుండా తొలి దశలోనే ఆ సంఖ్యా బలానికి అదనంగా 10 నుంచి 15 సీట్లను చేర్చుకునే అవకాశమున్నది.

క్లుప్తంగా చెప్పాలంటే ఉత్తరాదిన ఇండియా కూటమికి 2019 అనంతర అసెంబ్లీ ఎన్నికలలో లభించిన ఆధిక్యతలు ప్రస్తుత సార్వత్రక ఎన్నికలలో దానికి విజయావకాశాలుగా మారనున్నాయి. దక్షిణాదిన 2019లో ఈ కూటమి తాను గెలుచుకున్న సీట్లను విజయవంతంగా రక్షించుకుంటున్నది. అంతేకాకుండా తొలి దశలోనే ఆ సంఖ్యా బలానికి అదనంగా 10 నుంచి 15 సీట్లను చేర్చుకునే అవకాశమున్నది. అయితే రాజకీయ అవకాశాలు అంత తేలిగ్గా సమకూరుతాయా? అందునా మోదీ– అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ ప్రత్యర్థిగా ఉన్న పరిస్థితులలో అది మరీ కష్టం. ఇండియా కూటమి తొలిదశలోనూ చాలా సవాళ్లను అధిగమించవలసి ఉన్నది.

తమిళనాడులో తనకు ఉన్న స్థానాలు అన్నిటినీ నిలబెట్టుకోవడం 'ఇండియా'కు ప్రథమ, అత్యంత ముఖ్యమైన సవాల్. సిట్టింగ్ ఎంపీలలో కొంత మందికి టిక్కెట్ నిరాకరించడం, మరికొంతమంది నియోజకవర్గాలను మార్చడం ఆ సవాల్‌ను అంగీకరించడమేనని చెప్పవచ్చు. ప్రస్తుత దశలో ఇండియాకు ప్రధాన ప్రత్యర్థి ఎన్‌డీఏ కాకుండా బలహీనపడిన అన్నాడీఎంకే అవడం గమనార్హం. బీజేపీ ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఎన్‌డీఏకు ప్రజల మద్దతును సమీకరించలేకపోయింది. ఫలితంగా తమిళనాడులో ఎన్‌డీఏ ఇప్పటికే ఒక బలహీన కూటమిగా ఉన్నది. భాగస్వామ్య పక్షమైన పీఎంకేకు రాష్ట్రవ్యాప్తంగా చెప్పుకోదగిన శక్తి లేదు. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, దినకరన్ ఉన్నప్పటికీ ఎన్‌డీఏ ప్రాబల్యం పెరగలేదు. అయితే బీజేపీ ప్రచార ఉద్ధృతి మూలంగా ఎన్‌డీఏ ఓట్ల వాటా పెరిగే అవకాశమున్నది. అంతేకాకుండా దీర్ఘ కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రముఖ శక్తిగా ఎన్‌డీఏ ఆవిర్భవించవచ్చు. అన్నాడీఎంకే– బీజేపీ కూటమి విచ్ఛిన్నమవడం వల్లే తమిళనాడులో త్రిముఖ పోటీలు జరుగుతున్నాయి. డీఎంకే వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా బీజేపీ, దాని మిత్రపక్షాలు ఇండియా కూటమికి తోడ్పడవచ్చని భావిస్తున్నారు.



■ యోగేంద్ర యాదవ్

తమిళనాడుతో పాటు కాంగ్రెస్, బీజేపీల మధ్య ముఖాముఖి పోటీ జరగనున్న 45 నియోజకవర్గాలలో ఎన్‌డీఏకు తీవ్ర సవాళ్లు ఎదురుకానున్నాయి. వాటిలో 36 స్థానాలలో గత సార్వత్రక ఎన్నికలలో కూడా కాంగ్రెస్–బీజేపీ మధ్య ముఖాముఖి పోటీ జరిగింది. బీజేపీ 30 స్థానాలను గెలుచుకున్నది. ఈ తొలి దశలో ఇండియా మెరుగైన ఫలితాలను సాధించాలంటే రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అసోంలో అత్యధిక స్థానాలను గెలుచుకోవలసి ఉన్నది.

2019లో బొటాబొటి మెజారిటీతో గెలుచుకున్న సీట్లు అన్నిటినీ కూడా ఇండియా మళ్లీ గెలుచుకోవలసి ఉన్నది. అటువంటి సీట్లు ఇండియాకు ఏడు ఉండగా, ఎన్‌డీఏకు ఐదు ఉన్నాయి. ఈ విషయంలో ప్రతిపక్ష కూటమి పరిస్థితి మెరుగ్గా ఉన్నది. ఇండియా కూటమి కొన్ని అంతర్గత, బాహ్య సవాళ్లను కూడ అధిగమించవలసి ఉన్నది. 14 సీట్లలో ఇండియా భాగస్వామ్యపక్షాలు పరస్పరం పోటీ చేస్తున్నాయి! పశ్చిమ బెంగాల్‌లో 3, లక్షదీవులులోని ఏకైక నియోజకవర్గం, అసోంలో మూడు స్థానాలలో ఇండియా భాగస్వామ్య పక్షాలు పరస్పర ప్రత్యర్థులుగా ఉన్నాయి. సరే, ఇండియా వెలుపల ఉన్న కొన్ని చిన్న పార్టీలు సైతం ఈ ప్రతిపక్ష కూటమికి నష్టం చేసే అవకాశమున్నది. తొలిదశ పోలింగ్ జరగనున్న 86 నియోజకవర్గాలలో బీఎస్‌పీ పోటీ చేస్తోంది. ఈ పార్టీ ఓట్ల వాటా ప్రతి ఎన్నికలలోనూ తగ్గుతూ వస్తోంది అయినా యూపీ, ఉత్తరాఖండ్‌లలో ఇండియా విజయావకాశాలను ఈ పార్టీ దెబ్బ తీసే ప్రమాదమున్నది. ప్రకాశ్ అంబేడ్కర్ నాయకత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడి 2019లో వలే బలంగా లేకపోవచ్చు గానీ విదర్భ ప్రాంతంలో ఇండియా కూటమి ఓట్లను ఈ పార్టీ కొల్లగొట్టే అవకాశమున్నది. రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు జయంత్ సింగ్ బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని ఆయన మద్దతుదారులైన జాట్‌లు, ముస్లిం ఓటర్లు హర్షించడం లేదు. అయినప్పటికీ ఆయన రాజకీయం ఇండియా కూటమి ప్రభావాన్ని తగ్గించే అవకాశమున్నది.

ఎన్నికల ప్రచారంలో గతంలో వలే ఆనందోత్సాహాలు కన్పించడం లేదు. ఎన్నికల ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉన్నది. పోలింగ్‌లో పాల్గొనే ఓటర్ల శాతం తక్కువగా ఉండవచ్చనేందుకు ఇది సూచనా? తొలిదశ పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలలో 2019లో 69.9 శాతం పోలింగ్ జరిగింది. జాతీయ సగటు కంటే రెండు పాయింట్లు అధికం. ముఖ్యంగా తమిళనాడు వెలుపల రాష్ట్రాలలో సగటు కంటే తక్కువ పోలింగ్ శాతం ఒక విస్తృత పోలింగ్ రీతిని సూచించవచ్చు. ఎన్నికల తొలి దశలో పోలింగ్ శాతాలు 18వ సార్వత్రక ఎన్నికలలో ప్రజల మనస్థితిని తెలియజేసే తొలి సూచన అవుతాయి.



(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ABN ఆంధ్రజ్యోతి
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




భగభగ



నగరంలో గురువారం ఎండ పట్టపగలే చుక్కలు చూపించింది. నడినెత్తిన సూర్యుడు నాట్యం చేయడంతో చాలాచోట్ల జనం ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ మంటెక్కించడంతో అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులు అవస్థలు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ ఇలా బోసిపోయి కనిపించింది.

పేరు పట్టదా..?





ఎన్నికలు దగ్గర పడుతున్నా ఇంకా చాలాచోట్ల ఎలక్షన్ కోడ్ అమలవుతున్న దాఖలాలు కనిపించట్లేదు. విజయవాడ నగర నడిబొడ్డులో నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనంలో సీఎం వైఎస్ జగన్ పేరు పెద్దపెద్ద అక్షరాలతో స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. సాధారణంగా ఇలాంటి పేర్లు కనిపించకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ, ఆ పరిస్థితి లేదు. నిత్యం పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే సందర్శనీయ ప్రాంతాల్లో ఇలా కోడ్ ఉల్లంఘించడం ఏమిటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

నామినేషన్ల సందడి మొదలైంది. గురువారం అలా నోటిఫికేషన్ విడుదలైందో.. ఇలా నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు పోటీ పడ్డారు. మొదటి రోజు, పైగా మంచిరోజు కావడంతో అభ్యర్థులు అట్టహాసంగా తరలివచ్చారు. దీంతో నగరంలోని కలెక్టరేట్ వద్ద సందడి వాతావరణం కనిపించింది. ఇక ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 13 నామినేషన్లు, కృష్ణా జిల్లావ్యాప్తంగా 5 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులు భారీ ర్యాలీలతో అట్టహాసంగా తరలిరావడంతో అంతటా ఎన్నికల సందడి కనిపించింది.

- విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సుజనా చౌదరి, (ఇన్‌సెట్‌లో) చిట్టినగర్‌లో ర్యాలీ



తొలిరోజే కోలాహలం

నోటిఫికేషన్ విడుదల.. వెనువెంటనే నామినేషన్లు

- ఎన్టీఆర్ జిల్లాలో 13, కృష్ణాజిల్లాలో 5 నామినేషన్లు
- నగరంలోని కలెక్టరేట్ సమీపంలో ర్యాలీల సందడి
- కృష్ణాజిల్లాలో ఆరు ప్రాంతాల్లో నామినేషన్ల స్వీకరణ
- మంచి ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు
- ఈ నెల 25వ తేదీ వరకు గడువు

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 13 నామినేషన్లు పడ్డాయి. వీటిలో రెండు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోవి కాగా, 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందినవి. మొత్తంగా టీడీపీ తరపున రెండు నామినేషన్లు, వైసీపీ తరఫున ఒక నామినేషన్ దాఖలయ్యాయి. నామినేషన్ల ఘట్టం ప్రారంభానికి ముందు జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల పబ్లిక్ నోటీసును విడుదల చేశారు. ఎక్కడికక్కడ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసును విడుదల చేశారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. సాయంత్రం 3 గంటల వరకు స్వీకరించారు. అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసే అవకాశాన్ని కల్పించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ సంఖ్యలో ర్యాలీగా రాగా, రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే నిలుపుదల చేయించారు. అభ్యర్థి సహా కేవలం ఐదుగురినే కార్యాలయంలోకి అనుమతించారు.

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో..

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గురువారం రెండు నామినేషన్లు పడ్డాయి. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) తరఫున విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన గుజ్జుల లలిత (61) నామినేషన్ వేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్రం, జనగామ జిల్లాకు చెందిన తరిగొప్పుల మండలం, సోలిపురం గ్రామానికి చెందిన చేవిటి అర్జున్ (33) విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో..

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి యలమంచిలి సుజనా చౌదరి నామినేషన్ దాఖలు చేశారు. జగ్గయ్యపేటలో టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (59) తరఫున మున్సిపల్ మాజీ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, అలాగే, శ్రీరాం రాజగోపాల్ సతీమణి శ్రీదేవి (50) కూడా నామినేషన్ వేశారు. ఎస్సీ రిజర్వుడ్ తిరువూరులో వైసీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు నామినేషన్ వేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి దుగ్గిశెట్టి సుభాషిణి (43), మైలవరం నియోజకవర్గం నుంచి వల్లభనేని నాగ పవన్‌కుమార్ (34), నందిగామ నియోజకవర్గం నుంచి కొత్తపల్లి సుందరరావు (45) స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. నందిగామ నియోజకవర్గంలో తెలుగు రాజ్యాధికార సమితి తరఫున బి.శ్రీనివాసరావు (37) నామినేషన్ సమర్పించారు. బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ నుంచి కె.ప్రభుదాస్ (54) నామినేషన్ వేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ అంబేడ్కర్ చింతమల నామినేషన్ వేశారు. తెలుగు రాజ్యాధికార పార్టీ తరఫున జి.రాంబాబు (30) నామినేషన్ దాఖలు చేశారు.

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయాల్లో గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల నుంచి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అవనిగడ్డ, పామర్రు, పెడన, గన్నవరం తహసీల్దార్ కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు జిల్లాలోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 26న పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చారు. మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లను కలెక్టర్ చాంబరులో కలెక్టర్ స్వీకరిస్తారు. కాగా, మంచి ముహూర్తం చూసుకుని అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. శుక్ర, శని, సోమవారం నాడు అధికసంఖ్యలో నామినేషన్లు పడే అవకాశాలున్నాయి.

ఐదు నామినేషన్లు

నామినేషన్ల స్వీకరణ తొలిరోజు జిల్లాలోని గన్నవరం, పామర్రు, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, ఆయన భార్య యార్లగడ్డ జ్ఞానేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. పామర్రు నియోజకవర్గం (ఎస్సీ) టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా నామినేషన్ వేశారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా వక్కలగడ్డ పావని నామినేషన్ వేశారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గుడివాడ, పెడన, అవనిగడ్డ, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా గురువారం నామినేషన్లేమీ పడలేదని పేర్కొన్నారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



గోడౌన్ నుంచి భారీగా వస్తున్న పొగ

భారీ అగ్ని ప్రమాదం

దగ్ధమైన మెడికల్ గోడౌన్, వస్త్ర దుకాణం

* రూ.5 కోట్ల వరకూ ఆస్తినష్టం

వన్‌టౌన్, ఏప్రిల్ 18 : బందరురోడ్డుకు అనుసంధానంగా, ఠాగూర్ లైబ్రరీకి ఎదురుగా ఉన్న మెడికల్ గోడౌన్, వస్త్ర దుకాణంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా పై అంతస్తులో మంటలు చెలరేగాయి. దీంతో మెడికల్ గోడౌన్, వస్త్ర దుకాణం పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక దళం మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. దాదాపు ఐదు ఫైరింజన్లు మంటలను అదుపులోకి తెచ్చాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. సుమారు రూ.5 కోట్ల ఆస్తినష్టం జరిగిందని చెబుతున్నారు.
కాగా, వ్యాపారవేత్త తొండెపు హనుమంతరావుకు చెందిన ఈ భవనంలో మందుల గోడౌన్, వస్త్ర దుకాణాలు నడుస్తున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నలుగురు మైనర్లకు విముక్తి

సీఎంపై రాయి దాడి ఘటనలో ప్రధాన నిందితుడికి రిమాండ్

- పోలీసుల అదుపులోనే దుర్గారావు

విజయవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్‌పై అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద జరిగిన రాయి దాడి కేసులో పోలీసుల అదుపులో ఉన్న నలుగురు మైనర్లు ఎట్టకేలకు ఇళ్లకు చేరారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కుమార్‌తో పాటు నలుగురు మైనర్లను కొద్దిరోజుల క్రితం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రధాన నిందితుడ్ని గురువారం మధ్యాహ్నం నుంచి కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల అదుపులో ఉన్న మైనర్లపై న్యాయవాది అబ్దుల్ సలీం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో సెర్చ్ వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. ప్రధాన నిందితుడు సతీష్‌కుమార్‌ను రిమాండ్ పంపాక అతడితో పాటు అదుపులోకి తీసుకున్న మిగిలిన నలుగురు మైనర్లను ఇళ్లకు పంపారు. దీంతో వారి తల్లిదండ్రుల కళ్లలో ఆనందబాష్పాలు కనిపించాయి. మరో నిందితుడు వేముల దుర్గారావు ఇంకా పోలీసుల అదుపులోనే ఉన్నాడు. అతడిని ఏ2గా కేసులో చేర్చినట్టు సమాచారం.

తొలి అడుగు





సింహాద్రి చంద్రశేఖర్




షేక్ ఆసిఫ్



ఉప్పాల రాము



పేర్ని కిట్టూ



ఎస్.తిరుపతిరావు



కేశినేని చిన్ని



వెనిగండ్ల రాము



కె.శ్రీనివాసరావు



వర్ల కుమార్‌రాజా



సుజనా చౌదరి

ఈసారి ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి 10 కొత్త ముఖాలు

టీడీపీ నుంచి 4.. వైసీపీ నుంచి 5.. బీజేపీ నుంచి ఒకరు

ఈసారి బరిలో ఉన్న పదిమంది వారసులు

ఎన్నికల సమరంలో విజయం సాధించి ప్రజాప్రతినిధుల సభలో అడుగుపెట్టడమంటే అంత ఆషామాషీ కాదు. సమస్యలపై పోరాడాలి.. ప్రజల మనసు గెలవాలి.. కోట్లు ఖర్చుపెట్టాలి.. ఇంత చేసినా ఓటరు కరుణిస్తాడో లేదో అనుమానమే. ఎంపీ అనో, ఎమ్మెల్యే అనో పిలిపించుకునేందుకు ప్రస్తుత ఎన్నికల్లో తొలిసారిగా బరిలో నిలుస్తున్న అభ్యర్థులు తమ శక్తియుక్తుల్ని ఒడ్డి పోరాడుతున్నారు. గెలుపు జెండా ఎగరేయాలని తహతహలాడుతున్నారు. అందుకు మన జిల్లాలేం మినహాయింపు కాదు. ఈ ఎన్నికల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి కొత్తవారు పై అంటున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని 2 పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రధాన పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున, వైసీపీ తరఫున పోటీ చేస్తున్న వారిలో 10 మందికి ఇవే తొలి ఎన్నికలు. 2019 ఎన్నికల కంటే తొలి సారి పోటీచేసే వారి సంఖ్య ఈ ఎన్నికల్లో తక్కువగా ఉంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ తరఫున ఎనిమిది మంది కొత్తవారికి అవకాశం కల్పించగా, జనసేన ఏకంగా 10 మంది అవకాశం ఇచ్చింది. 2019 ఎన్నికల్లో జనసేన విడిగా పోటీ చేయడంతో ఎక్కువ మంది కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పించింది. ఈ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తున్న 10 మంది అభ్యర్థుల్లో వైసీపీకి చెందినవారు ఐదుగురు ఉన్నారు. టీడీపీ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ఒకరు ఉన్నారు.

కొత్తవారు వీరే..

- వైసీపీ నుంచి తొలిసారి ఎన్నికల బరిలో ఉన్నవారిలో మచిలీపట్నం పార్లమెంట్ నుంచి సింహాద్రి చంద్రశేఖర్‌తో పాటు విజయవాడ పశ్చిమ నుంచి షేక్ ఆసిఫ్, మైలవరం నుంచి సర్నాల తిరుపతిరావు, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన నుంచి ఉప్పాల రాము ఉన్నారు.
- టీడీపీ నుంచి తొలిసారి పోటీ చేస్తున్న వారిలో విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న కేశినేని చిన్నితో పాటు తిరువూరు నుంచి కొలికపూడి శ్రీనివాసరావు, పామర్రు నుంచి వర్లకుమార్ రాజా, గుడివాడ నుంచి వెనిగండ్ల రాము ఉన్నారు. ఇక బీజేపీ నుంచి సీనియర్ నాయకుడు సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ నుంచి పోటీలో ఉన్నారు.

2019లో ఇలా..

గత ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసిన వారిలో వైసీపీ నుంచి బొప్పన భవకుమార్ (విజయవాడ తూర్పు), యార్లగడ్డ వెంకట్రావు (గన్నవరం), కైలే అనీల్ (పామర్రు), దూలం నాగేశ్వరరావు (కైకలూరు) ఉన్నారు. వీరితో పాటు విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త పొట్లూరి వీర ప్రసాద్ (పీవీపీ)కి అవే తొలి ఎన్నికలు. టీడీపీ నుంచి దేవినేని అవినాశ్ (గుడివాడ), షబానాఖాతూన్ (విజయవాడ పశ్చిమ), కాగిత కృష్ణప్రసాద్ (పెడన) ఉన్నారు. వీరిలో ఐదుగురు ఈసారి ఎన్నికల బరిలో కూడా ఉండగా, ముగ్గురు మాత్రం దూరంగా ఉన్నారు.

వారసులొచ్చారోచ్..

- ఈసారి ఎన్నికల్లో వారసుల జోరు ఎక్కువగా ఉంది. అటు టీడీపీ, ఇటు వైసీపీలోనూ వారసుల హవా కనిపిస్తోంది. మైలవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వసంత కృష్ణప్రసాద్ తండ్రి వసంత నాగేశ్వరరావు సీనియర్ నాయకుడు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో హోంమంత్రిగా చేశారు. నందిగామ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తంగిరాల సౌమ్య తండ్రి తంగిరాల ప్రభాకర్ రావు టీడీపీ ఎమ్మెల్యేగా చేశారు. పెడన నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాగిత కృష్ణ ప్రసాద్ తండ్రి కాగిత వెంకట్రావు టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఓ వెలుగు వెలిగారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా పనిచేశారు. మచిలీపట్నం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొల్లు రవీంద్ర మామ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఈయన మామ నడకుదిటి నరసింహారావు చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. పామర్రు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వర్ల కుమార్ రాజా సీనియర్ టీడీపీ నాయకుడు వర్ల రామయ్య తనయుడు. రామయ్య ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందలేకపోయారు. తన తనయుడి ద్వారా తన ఆశయాన్ని సాధించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అవనిగడ్డ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ తండ్రి మండలి వెంకట కృష్ణారావు వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. మండలి వెంకట కృష్ణారావు దివిసీమ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా చేశారు. ఈయన సేవలకు మెచ్చి దివిసీమ ప్రజలు ఈయన్ను దివిసీమ గాంధీగా పిలుచుకుంటారు.
- ఇక వైసీపీ అభ్యర్థుల్లో విజయవాడ తూర్పు నుంచి పోటీ చేస్తున్న దేవినేని అవినాష్ తండ్రి దేవినేని నెహ్రూ రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచి మొదలైంది. ఎమ్మెల్యేగా చేసిన నెహ్రూ రాజకీయ వారసత్వాన్ని అవినాష్ కొనసాగిస్తున్నారు. మచిలీపట్నం నుంచి పోటీ చేస్తున్న పేర్ని కిట్టు తండ్రి పేర్ని నాని మంత్రిగా చేశారు. కిట్టు తాత పేర్ని కృష్ణమూర్తి కూడా ఎమ్మెల్యేగా చేశారు. పెడన నుంచి పోటీ చేస్తున్న ఉప్పాల రాము తండ్రి ఉప్పాల రాంప్రసాద్ సీనియర్ రాజకీయ నాయకుడు. మచిలీపట్నం పార్లమెంట్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సింహాద్రి చంద్రశేఖర్ తండ్రి సింహాద్రి సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచే మొదలైంది. దేవుడి మంత్రిగా పేరొందిన సింహాద్రి సత్యనారాయణ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించే బాధ్యతను చంద్రశేఖర్ తీసుకున్నారు.



వెల్వడంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మళ్లీ వైసీపీకి అధికారం ఇస్తే..

కరువులో పోటీ తప్పదు

- ప్రస్తుతం రాష్ట్రానికి అప్పు ఇచ్చేవారు లేరు!
- వెల్వడం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మైలవరంరూరల్, ఏప్రిల్ 18 : అసెంబ్లీలో 151 మంది వైసీపీ ఎమ్మెల్యేలు రావణసంతలా మారి అమరావతి అభివృద్ధిని చెడగొట్టి, మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మైలవరం ఎమ్మెల్యే, ఎన్డీయే కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. వెల్వడంలోని టీడీపీనేత కోమటి సుధాకరరావు గృహంలో గురువారం సాయంత్రం కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, ప్రస్తుతం సాగర్‌నీరు తెలంగాణ రాష్ట్రాన్ని దాటి మనప్రాంతానికి వచ్చే పరిస్థితి లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చింతలపూడి ప్రాజెక్టుకి రూ.4100 కోట్లు చంద్రబాబు ఖర్చు చేస్తే వైసీపీ ప్రభుత్వం ఒక్కరూపాయి ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. పశువులకు నీరు లేని పరిస్థితి దాపురించిందన్నారు. గ్రామాలలో దాహం కేకలు పెరిగాయన్నారు. ఈ ఐదేళ్లలో దశాబ్దాల కాలంనాటి ఎన్నో కంపెనీలు మూతబడ్డాయన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే మనం పోటీ పడేది బిహార్‌తో, ఒడిసాలతోనేని జోస్యం చెప్పారు. జగన్‌రెడ్డి పేదల బలహీనతను అడ్డంపెట్టుకొని రాష్ట్రాన్ని దివాలా తీశారన్నారు. వైసీపీ అధికారంలోకి రాకముందు 2లక్షల కోట్లు ఉన్న అప్పు సంక్షేమ పథకాల పేరుతో 13లక్షల కోట్లకు చేర్చారని విమర్శించారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే అప్పు ఇచ్చేవారు ఎవరూ లేరన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులకు విలువ లేదని, వలంటీర్ తారకమంత్రం పరిస్థితి జగన్మోహనరెడ్డి తీసుకువచ్చారన్నారు. స్థానిక సమస్యలను ముఖ్యమంత్రికి చెప్పే పరిస్థితి లేదని చెప్పారు. ఐదేళ్లల్లో సీఎంను కలిసింది రెండు, మూడుసార్లు మాత్రమే అన్నారు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నారై కోమటి జయరాం, తాతా పోతురాజు, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.




ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సారథి

కూటమి గెలుపునకు కలిసిరండి..

- యాదవుల ఆత్మీయ సమావేశంలో సారథి

గుడివాడ, ఏప్రిల్ 18 : ఐదేళ్ల వైసీపీ పాలనలో యాదవులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, రాబోయే ఎన్నికల్లో బడుగు బలహీనవర్గాలు, ముఖ్యంగా యాదవ సంఘీయులు కూటమికి మద్దతుగా నిలవాలని మాజీ మంత్రి, నూజివీడు అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి కోరారు. గురువారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల ఆడిటోరియంలో నియోజకవర్గ యాదవ టీడీపీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ నెరుసు చింతయ్య అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా సారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి అవసరమని జగన్ గుర్తించలేదన్నారు. దీంతో ప్రజల ఆర్థిక ఎదుగుదల ఆగిపోయిందన్నారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో జగన్‌కు ఎవరూ సాటి రారన్నారు. యాదవుల ఆశీర్వాదంతోనే తాను ఈ స్థాయికి రాగలిగానన్నారు. గుడివాడలో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము దెబ్బకు నాని గుండెల్లో రైళ్లు పరిగెత్తాయన్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ, గుడివాడ ప్రజల కష్టాలు, బాధలు అందరూ చూస్తున్నారన్నారు. నాని కుట్రలకు బీసీలు బలయ్యారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మున్సిపాల్టీ భవనానికి మాజీ ఎమ్మెల్యే కఠారి సత్యనారాయణరావు పేరుపెడతానని హామీ యిచ్చారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోయ శివాజీని ఘనంగా సత్కరించారు. శేరిగొల్వేపల్లి వైసీపీ ఎంపీటీసీ అంగడాల శ్రీరామాంజనేయులు మరో 25 కుటుంబాలు సారథి, వెనిగండ్ల సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి బాలశౌరి, రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యాదవులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న తంగిరాల సౌమ్య

సౌమ్య సమక్షంలో టీడీపీలోకి వలంటీర్లు

నందిగామ, ఏప్రిల్ 18 : ప్రభుత్వ విధానాలతో నలిగిపోయిన నలుగురు వాలంటీర్లు టీడీపీలో చేరారు. నారా చంద్రబాబునాయుడు ఇటీవల వలంటీర్ల వ్యవస్థను పటిష్ట పరచడమే కాక, రూ.10వేలు పారితోషం ఇస్తానని చేసిన ప్రకటనకు ఆకర్షితులై చందర్లపాడు మండలం కోనాయపాలెంకు చెందిన నలుగురు వలంటీర్లు సౌమ్య సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన మార్కపూడి సుమశ్రీ, రాయల అనూరాధ, షేక్ నాగుల్‌బి, కలక విమల ఇటీవల తమ పదవులకు రాజీనామా చేశారు. చంద్రబాబు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమని, యువతకు చంద్రబాబు పాలనలో సముచిత గౌరవం దక్కుతుందని టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ ఉండాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని సూచించారు. వీరితో పాటు గ్రామానికి చెందిన మార్కపూడి జాన్‌కోటయ్య టీడీపీలో చేరారు. అనంతరం కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి రాగానే వలంటీర్లకు రూ.10వేలతో పాటు, పని భారం కూడా తగ్గిస్తారని చెప్పారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు గంగవరపు వెంకటనరసింహారావు సౌమ్యను కలిసి మద్దతు తెలిపారు. నందిగామలో తన భవనాన్ని వైసీపీ కార్యాలయానికి అద్దెకు ఇచ్చాను తప్ప తాను ఆ పార్టీ కాదని చెప్పారు. రాజకీయాలకు దూరంగా ఉన్నా చంద్రబాబు పాలన రావాలని బలంగా ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. సీనియర్ టీడీపీ నాయకుడు కోట వీరబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నేతలకు పార్టీ కండువా కప్పుతున్న వెనిగండ్ల

వైసీపీకి వరుస షాక్‌లు

- టీడీపీలో చేరిన వార్డు ఇన్‌చార్జ్, 100 మంది యువత

గుడివాడ, ఏప్రిల్ 18 : అధికార పార్టీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో వైసీపీ సీనియర్ నేతలు, 19వ వార్డు ఇన్‌చార్జ్ గణపతి సూర్యనారాయణ(సూర్యం) ఆధ్వర్యంలో 100మంది యువత టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో పార్టీలో చేరారు. తొలుత పట్టణంలో భారీర్యాలీగా సూర్యం, యువత ప్రజావేదికకు తరలివచ్చారు. గణపతి వెంకటరమణ, గణపతి శివ, కె.శివాజీ, కె.ప్రకాష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దింట్యాల రాంబాబు, గోకవరపు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఢిల్లీరావుకు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న అర్జున్ చేవేటి, గుజ్జుల లలిత, పామర్రులో ఎన్నికల అధికారి శ్రీదేవికి నామినేషన్ పత్రం అందిస్తున్న వర్లకుమార్‌రాజా, తాతయ్య తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, టీడీపీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న తాతయ్య సతీమణి శ్రీదేవి

నామినేషన్ల ప్రక్రియ షురూ..

కృష్ణలంక, ఏప్రిల్ 18 : సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఫారం-1 ఎన్నికల పబ్లిక్ నోటీస్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్.ఢిల్లీరావు గురువారం ఉదయం విడుదల చేశారు. అనంతరం ఢిల్లీరావు మాట్లాడుతూ, ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్లు స్వీకరించడం జరుగుతోందన్నారు. నామినేషన్ దాఖలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గురువారం ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25 వరకు కొనసాగుతుందని, ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించనున్నట్టు వెల్లడించారు. అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, రెండు నియోజకవర్గాల నుంచి నామినేషన్లను ఫైల్ చేయవచ్చన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో మూడు వాహనాలు మాత్రమే అనుమతించబడతాయని, అభ్యర్థి సహా ఐదుగురిని కార్యాలయంలోకి అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

తొలిరోజు 11 నామినేషన్లు

విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో రెండు..

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి తొలిరోజు ఎన్టీఆర్ జిల్లాలో గురువారం ఇద్దరు వ్యక్తులు రెండేసి సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. కలెక్టర్, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.ఢిల్లీరావుకు నామినేషన్లు సమర్పించారు. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ నుంచి విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన గుజ్జుల లలిత (61) నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థిగా తెలంగాణా రాష్ట్రం, జనగామ జిల్లా తరిగొప్పుల మండలం, సోలిపురం గ్రామానికి చెందిన అర్జున్ చేవేటి (33) నామినేషన్ దాఖలు చేశారు.



అందరి సహకారంతో శాసన సభకు.. : యార్లగడ్డ

గన్నవరం : నియోజకవర్గ ప్రజల సహకారంతో రానున్న ఎన్నికల్లో గెలిచి శాసనసభకు వెళతానన్న నమ్మకం తనకు ఉందని కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీన ప్రజలు నాయకులు, కార్యకర్తలతో కలిసి మళ్లీ నామినేషన్ వేస్తానని తెలిపారు. వైసీపీ శ్రేణులు కూడా తనను ఆదరించి ఓట్లు వేస్తారని బలంగా నమ్ముతున్నట్టు తెలిపారు. చంద్రబాబు నాయుడు కన్నీటికి, భువనమ్మ వేదనకు కారణమైన ఈ నియోజకవర్గంలో మహిళలు తనను ఆశీర్వదిస్తారని తెలిపారు. మహిళల ఆత్మ గౌరవం కాపాడాలన్నా, గన్నవరానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నా టీడీపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, పొట్లూరి బసవరావు, గూడపాటి తులసీమోహన్, బచ్చుల బోస్, ఆళ్ల గోపాలకృష్ణ, గూడవల్లి నర్సయ్య, కొల్లా ఆనంద్, గొడ్డళ్ల చిన రామారావు, గుండపనేని ఉమా వరప్రసాద్, కెహెచ్ కోటేశ్వరరావు, పరుచూరి నరేష్, తగరం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం నియోజకవర్గంలో మూడు..

గన్నవరం : గన్నవరంలో తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ పత్రాన్ని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మకు అందజేశారు. గురువారం ఉదయం 11.21 గంటల సమయంలో రెండుసెట్లను దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా యార్లగడ్డ సతీమణి జ్ఞానేశ్వరీ ఒక సెట్‌ను వేశారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఐదు..

జగ్గయ్య పేట : జగ్గయ్యపేటలో తొలిరోజు గురువారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి.

తొలుత టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తరఫున మాజీ మునిసిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, నియోజక వర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, టీడీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ యలమంచిలి రాఘవ, మాజీ వైస్‌చైర్మన్ నూకల కుమార్ రాజాలు అందజేశారు.

శ్రీరాం తాతయ్య సతీమణి శ్రీదేవి, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు సతీమణి సూర్యకాంతంలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ తరఫున కొదమల ప్రభుదాస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ పుష్పరాజ్ తదితరులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున చింతమల నవీన్ అంబేడ్కర్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరఫున గుడిసె రాంబాబులు నామినేషన్లు వేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.వెంకటేశ్వర్లు తెలిపారు.

పామర్రు నియోజకవర్గంలో ఒకటి..

పామర్రు : నామినేషన్ల తొలిరోజున గురువారం ఉదయం పామర్రు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థిగా వర్ల కుమార్‌రాజా తొలి నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బూసి శ్రీదేవికి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ బాధ్యుడు తాడిశెట్టినరేష్, టీడీపీ జిల్లా రైతుప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం పార్టీశ్రేణులు

సైనికుల్లా పనిచేయాలి

- కార్యకర్తల సమావేశంలో బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 18 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో బందరులో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమం విజయవంతమైందని, ఇదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఉమ్మడి మచిలీపట్నం పార్లమెంటు కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక హోటల్‌లో గురువారం రాత్రి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల అవగాహన సదస్సులో బాలశౌరి మాట్లాడారు. ప్రజాగళం కార్యక్రమ స్ఫూర్తితో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సందేశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ కూటమి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అసెంబ్లీ అభ్యర్థి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మంత్రులుగా పనిచేసిన పేర్ని నాని, కొడాలి నాని దాచుకో దోచుకో తరహాలో ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్, పేర్ని నాని విధానాలు నచ్చకే వల్లభనేని బాలశౌరి జనసేన పార్టీలోకి వచ్చారని, రొండి కృష్ణయాదవ్, నాలి మాధవ, షేక్ జలీల్ వంటి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీలో, జనసేనలో చేరుతున్నారన్నారు. నగరంలో 50 డివిజన్లు, గ్రామాల్లో క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జిలు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు బందరు ప్రజలకు ఇచ్చిన వరాలతో పోర్టును అభివృద్ధి చేసేందుకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. మైనారిటీలు, మత్స్యకారుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్సిడీపై రుణాలు అందిస్తామన్నారు. జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో కలిసి పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేద్దామన్నారు.



టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొల్లు రవీంద్ర

ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి : రవీంద్ర

బందరు అభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం క్లస్టర్ ఇన్‌చార్జి లంకే శేషగిరి ఆధ్వర్యంలో బందరు మండలం తపసిపూడి, మంగినపూడి, తాళ్లపాలెం గ్రామాల్లో నిర్వహించిన 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. తపసిపూడిలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనతో విసిగిపోయిన జిల్లా ప్రజలు టీడీపీ, జనసేనలో చేరుతున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

పాత ఎడ్లంకను నదీ కోత నుంచి రక్షిస్తా

- మండలి సమక్షంలో 100మంది జనసేన, టీడీపీలో చేరిక

అవనిగడ్డ, ఏప్రిల్ 18 : కృష్ణానది గమనంలో మార్పుల కారణంగా పెద్ద ఎత్తున కోతకు గురవుతున్న పాత ఎడ్లంక గ్రామాన్ని కోత నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటానని, వారధి నిర్మాణం చేపడతానని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గ్రామంలో 100 మందికిపైగా వైసీపీ నేతలు, యువత జనసేన, టీడీపీలో చేరారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా పాత ఎడ్లంక దీవి కోతకు గురవుతోందని, దీనికి ఇసుక, బుసక తవ్వకాలే కారణమన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీలేదన్నారు.

వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరిన యువత

మండల పరిధిలోని పాతఎడ్లంక గ్రామం వద్ద వైసీపీని వీడి తెలుగుదేశం, జనసేన పార్టీలో పలువురు యువకులు చేరారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, ఉపసర్పంచ్ నాగరాణి, ఇతర కార్యవర్గ సభ్యులు గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం, జనసేన పార్టీల్లో చేరారు.

తీర గ్రామాల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత

నియోజకవర్గ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల సమగ్రాభివృద్ధికి తొలి ప్రాధాన్యతనిస్తానని బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలో మత్స్యకార నేత చిలకలపూడి పాపారావు కార్యాలయంలో గురువారం ఆత్మీయ సమ్మేళనంలో బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. దివిసీమలోని అన్ని మత్స్యకార గ్రామాల్లో తుపాన్ షెల్టర్లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించామని, కరకట్టను పునర్నిర్మించామని, అయితే గడిచిన ఐదేళ్లలో దివి ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్న సముద్రపు కరకట్ట, ఏటి కరకట్టలు పూర్తిగా ధ్వంసమైపోయినా వైసీపీ ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

ఎమ్మెల్యే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టండి

జనసేన పార్టీకి ఓటు వేస్తే అగ్రకులాల దౌర్జన్యాలు పెరిగిపోతాయని గ్రామాల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేస్తున్న ప్రచారాన్ని ప్రతీ ఒక్కరూ తిప్పికొట్టాలని కోరారు. ఈనెల 22వ తేదీన నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నేతలు చిలకలపూడి పాపారావు, లకనం నాగాంజనేయులు, బొమ్మిడి గణేష్, అంద్రాజు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో వైసీపీ నేతల బలవంతపు రాజీనామాలు?

రాణిగారితోట, ఏప్రిల్ 18 : రాణిగారితోట 17వ డివిజన్‌కు చెందిన 40మంది వలంటీర్లను వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయించినట్టు తెలిసింది. డివిజన్ పరిధిలోని బావనయ్యనగర్‌లో గురువారం వలంటీర్లతో వైసీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు సమావేశం నిర్వహించి రాబోయే ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజీనామా చేసిన వలంటీర్లకు మంచి అవకాశాలు కల్పించడం జరుగుతుందని హితబోధ చేసినట్టు తెలిసింది.

రాజీనామా చేసిన వారికి ఆర్థికంగా చేయుత అందిస్తామని, రాజీనామా చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని చెప్పడంతో పాటు మంచి విందుతో వారిని బలవంతంగా ఒప్పించినట్టు సమాచారం. ముఖ్యమంత్రిపై జరిగిన దాడికి మనస్తాపం చెంది తాము రాజీనామా చెసినట్టుగా చెప్పాలని హితబోధ చేసి వారి చేత రాజీనామాలు చేయించినట్టు తెలిసింది.

అయితే ఎన్నికల నియమావళి ప్రకారం సమావేశాలు నిర్వహించరాదని తెలిసినా వైసీపీ నాయకులు ఏవిధంగా సమావేశం నిర్వహించారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సమావేశం నిర్వహించిన స్థల యజమాని కూడా ఇందుకు ఏవిధంగా అంగీకరించారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఇతర పార్టీల నాయకులు కోరుతున్నారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.10 లక్షల విరాళం

మోపిదేవి, ఏప్రిల్ 18 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పామర్రు మండలం జమిగొల్వేపల్లి గ్రామానికి చెందిన పొట్లూరి గోపాలం సుబ్బయ్య జ్ఞాపకార్థం కేతినేని రత్నాకరరావు - లక్ష్మీ శమతకమణి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. కుటుంబసమేతంగా గురువారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు విరాళం చెక్కును అందజేశారు.



అభయాంజనేయస్వామి ఆలయం వద్ద రాట ప్రతిష్ఠ

27 నుంచి హనుమజ్జయంతి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 18 : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి జూన్ వరకు నిర్వహించనున్న 23వ హనుమజ్జయంతి ఉత్సవాలకు సంబంధించి గురువారం ఆలయం వెనుక భాగంలో ఉత్సవ పందిరి ముహూర్తం రాటను ప్రతిష్ఠించారు. ఈవో కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శృంగారం వెంకట శేషాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొండేటి కనకదుర్గారావు తదితరులు పాల్గొన్నారు..

రూ.1.60లక్షల తెలంగాణ మద్యం స్వాధీనం

వత్సవాయి, ఏప్రిల్ 18 : అక్రమంగా తరలిస్తున్న రూ.1.60 లక్షల విలువైన తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్టు విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ సూపరింటెండెంట్ భార్గవ్ తెలిపారు. వత్సవాయికి చెందిన వల్లంకొండ రమణయ్యకు చెందిన వరి గడ్డివామిలో గ్రామానికి చెందిన రమణయ్యతో పాటు చీకటిమల్ల గోపి, ఎస్‌కె నాగుల్, వల్లంకొండ రమేష్‌లు తెలంగాణకు చెందిన మద్యం 1,190 సీసాలు అట్టపెట్టెల్లో పెట్టి గడ్డివామిలో డంప్ చేసినట్టు భార్గవ్ తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన సీసాలను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ చీకటి వ్యాపారం చేస్తున్నట్టు తెలుస్తోంది. మద్యం సీసాలను తెలంగాణ నుంచి వత్సవాయికి తరలించి వైసీపీ పెద్దల ఆదేశానుసారం దాచినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నిందితులు, మద్యంతో ఎస్ఈబీ అధికారులు


ఎస్ఈబీ దాడులు

తిరువూరు, ఏప్రిల్ 18 : విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో ఎస్ఈబి అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సీఐ పి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో చప్పిడి కృష్ణకుమారి నుంచి ఐదు లీటర్ల నాటుసారా, నెమలిలో యాదాల జయరాజ్ నుంచి 15 తెలంగాణ మద్యం బాటిళ్లు, ఎ.కొండూరు మండలం గొల్లమందలతండాలో బాణావత్ నుంచి 10 ఆంధ్ర మద్యం బాటిళ్లు, విస్సన్నపేట మండలం తాతకుంట్లలో సారాకేసులో పాత ముద్దాయి బాణావత్ అశోక్‌ను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించడం జరిగిందని సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎస్ఈబి ఎస్సై జి.రఘు, జగ్గారావు, బిఎంపీపీ ఎస్సై కెఎండి ఆరీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

జన కేతనం



బందరు బాద్‌షా ఎవరో!



మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంలో బాలశౌరి, చంద్రశేఖర్ మధ్య వార్

రాష్ట్రంలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యేక ఉంది. మచిలీపట్నం కేంద్రంగా నాయకులు స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపారు. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు ఆంధ్రపత్రికను స్థాపించి అప్పట్లో ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంవైపు మళ్లేలా చేశారు. జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య, పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన కీర్తిశేషులు నందమూరి తారకరామారావు, కమ్యూనిస్టు ఉద్దండుడు చంద్ర రాజేశ్వరరావు, నక్సల్‌బరీ ఉద్యమానికి ఊపిరి పోసిన కొండపల్లి సీతారామయ్య లాంటి ఎందరో మహామహులు నడయాడిన నేల మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, వైసీపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. ఈ పోరులో బందరు బాద్‌షాగా ఎవరిని ప్రజలు గెలిపిస్తారో చూద్దాం.

నియోజకవర్గ చరిత్ర ఇదీ..

మచిలీపట్నం పార్లమెంటు స్థానం 1952లో ఏర్పడింది. 1952లో సీపీఎం తరఫున సనకా బుచ్చికోటయ్య మచిలీపట్నం ఎంపీగా ఎన్నికయ్యారు. 1957లో మండలి వెంకటకృష్ణారావు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. 1962లో మండల స్వామినాయుడు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎంపీగా ఎన్నికయ్యారు. 1967లో యార్లగడ్డ అంకినీడుప్రసాద్ (చల్లపల్లి రాజా), 1971లో మేడూరి నాగేశ్వరరావు, 1977, 1980లలో మాగంటి అంకినీడు, 1984, 1989లో కావూరి సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీలుగా గెలుపొందారు. 1991లో కొలుసు పెదరెడ్డయ్య టీడీపీ తరఫున ఎంపీగా గెలుపొందారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో బలనిరూపణ సమయంలో ఆయన కాంగ్రెస్ పార్టీకి ఓటువేశారు. 1996లో కైకాల సత్యనారాయణ టీడీపీ తరఫున ఎంపీగా గెలుపొందారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున కావూరి సాంబశివరావు ఎన్నికయ్యారు. 1999లో అంబటి బ్రాహ్మణయ్య టీడీపీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. 2004లో బాడిగ రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీ పీ తరఫున కొనకళ్ల నారాయణరావు ఎంపీగా ఎన్నికయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరఫున వల్లభనేని బాలశౌరి ఎంపికయ్యారు. టీడీపీ ఆవిర్భవించిన 1983 తరువాత పదిసార్లు పార్లమెంటు స్థానానికి ఎన్నికలు జరగ్గా నాలుగుసార్లు టీడీపీ అభ్యర్థులు ఐదుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు, ఒకసారి వైసీపీ అభ్యర్థి ఇక్కడి నుంచి గెలుపొంది పార్లమెంటుకు వెళ్లారు.

- ఒకరు పారిశ్రామికవేత్త, మరొకరు డాక్టర్
- జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి
- వైసీపీ అభ్యర్థిగా తొలిసారి ఎన్నికల బరిలోకి సింహాద్రి చంద్రశేఖర్



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాల పునర్విభజన జరిగిన అనంతరం మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధి మొత్తం కృష్ణాజిల్లాగా పరిగణిస్తున్నారు. ఇక్కడ ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. ప్రస్తుతం వైసీపీ ఎంపీగా కొనసాగుతున్న వల్లభనేని బాలశౌరి ఆ పార్టీకి చెందిన అధిష్ఠానం, స్థానిక నాయకుల వైఖరితో విసిగిపోయి జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ తరఫున ఆయన ఎంపీగా పోటీలో ఉన్నారు. రెండు రోజుల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పెడన, మచిలీపట్నంలలో ప్రచారం చేశారు. దీంతో కూటమి నేతల్లో జోష్ కనిపిస్తోంది. సింహాద్రి సత్యనారాయణ కుమారుడు సింహాద్రి చంద్రశేఖర్ వైసీపీ తరఫున ఎంపీగా అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. హైదారాబాద్‌లో కేన్సర్ వైద్యుడిగా పేరొందిన ఆయన తొలిసారిగా ఎన్నికల గోదాలోకి దిగారు.

ప్రజా బలంతో బాలశౌరి



జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్న వల్లభనేని బాలశౌరి ప్రస్తుతం మచిలీపట్నం ఎంపీగా ఉన్నారు. ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయనే ధీమాతో ఆయన ఉన్నారు.

- మచిలీపట్నం పోర్టుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.4వేల కోట్ల రుణాన్ని ఇప్పించారు. ప్రస్తుతం పోర్టు పనులు జరుగుతున్నాయి.
- మచిలీపట్నం మెడికల్ కళాశాలను రూ.550 కోట్లతో నిర్మిస్తున్నారు. ఎంపీ హోదాలో కేంద్ర ప్రభుత్వం నుంచి మెడికల్ కళాశాలకు అనుమతులు తీసుకురావడం, నిధులు మంజూరు చేయించడంలో వల్లభనేని కృషి చేశారు. ప్రస్తుతం మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం తరగతులు జరుగుతున్నాయి.
- గుడివాడలో రెండు రైల్వే ఫ్లై ఓవర్‌ల నిర్మాణం కోసం రూ.326 కోట్ల నిధులను మంజూరు చేయించారు. వీటి పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి.
- అవనిగడ్డ నియోజకవర్గం ఎదురుమొండి దీవికి చేరుకునేందుకు రూ.150 కోట్లతో కృష్ణానదిపై వారధి నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేయించారు.
- గిలకలదిండి హార్బర్ పనులు రూ.330 కోట్లతో జరుగుతుండగా ఇందుకు కేంద్ర ప్రభుత్వం వాటా నిధులను మంజూరు చేయించడంలో ఎంపీ బాలశౌరి విశేష కృషి చేశారు.

సింహాద్రి తట్టుకునేనా?



హైదారాబాద్‌లో అంకాలజిస్ట్ (కేన్సర్ వైద్యుడు)గా పనిచేస్తున్న మచిలీపట్నం పార్లమెంటు నియోజవర్గ వైసీపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ జిల్లా వాసులకు చిరపరితులు. తొలుత అవనిగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన పేరును ప్రకటించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎంపీ అభ్యర్థిగా పేరును ప్రకటించి ఎన్నికల గోదాలోకి దింపారు. ఎంతో రాజకీయ అనుభవం ఉన్న ఎంపీ బాలశౌరినే రాజకీయంగా వైసీపీకి చెందిన శాసనసభ్యులు ఇబ్బందులపాలు చేశారు. రాజకీయ అనుభవంలేని సింహాద్రి చంద్రశేఖర్ వైసీపీ నాయకుల కుట్రలు, కుతంత్రాలకు ఎంతమేర తట్టుకుని నిలబడతారోననే చర్చ నడుస్తోంది.

నిరుద్యోగులకు దగా



ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని 2014 ఎన్నికల ప్రచారంలో జగన్ హామీ

- మేనిఫెస్టోలోనూ ప్రకటన
- గెలిచాక హామీలన్నీ హుళక్కి
- డీఎస్సీ లేక నిరుద్యోగుల ఆశలు ఆవిరి
- ఈ ఎన్నికల్లో బుద్ధి చెబుతామంటున్న నిరుద్యోగ యువత

ఓటరు మాట

'అధికారంలోకొచ్చాక ఏటా జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తా. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తా' అని గత ఎన్నికలకుముందు పాదయాత్రలో హామీలు గుప్పించిన వైఎస్ జగన్ అధికారంలోకొచ్చాక హామీలన్నిటినీ చాపచుట్టేశారు. జాబ్ క్యాలెండర్‌పై మేనిఫెస్టోలోనూ ప్రకటించి అటకెక్కించారు. బీఈడీ, సెకండరీ గ్రేడ్ టీచర్స్ ట్రైనింగ్‌లో ఉత్తీర్ణులై, కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొంది డీఎస్సీ కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఈ ఎన్నికల్లో ఓటుతో తామేంటో చూపుతామని హెచ్చరిస్తున్నారు. పీజీలు, బీఈడీ, ఎంఈడీలు చదివిన నిరుద్యోగులు చేతి వృత్తులకు పరిమితమవుతున్నారు. ఎంత చదువు చదువుకున్నా గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని చేపడదామనుకునే యువత జీవితాల్లో వైసీసీ ప్రభుత్వ పాలన వెలుగులు నింపలేకపోయిందని ఆరోపిస్తున్నారు. బతుకుదెరువు కోసం ఏదో ఒక పని చేసుకుంటున్న యువతను ఆంధ్రజ్యోతి పలుకరించగా తమ మనోగతాన్ని బయటపెట్టారు. - మచిలీపట్నం టౌన్

ఓట్లు వేయించుకుని మోసం చేశారు



ప్రభుత్వం ఖాళీ టీచర్ల పోస్టులు భర్తీ చేయడం లేదు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వ ఆడుకుంటోంది. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని, డీఎస్సీ ఇస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారు. గెలిచాక మోసం చేశారు. పాఠశాలల్లో టీచర్ల ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఎన్నికల ముందు హడావిడిగా డీఎస్సీ ప్రకటించారు. నోటిఫికేషన్‌లోని అక్రమాలపై కోర్టులో కేసులు వేశారు. నిరుద్యోగలకు డీఎస్సీ అందని ద్రాక్షపండులా మిగిలిపోయింది.

–కాగిత సాంబశివరావు, స్టేట్ కన్వీనర్, పీటీఎల్‌పి

ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉద్యోగ విరమణ వయస్సు పెంచారు



టీచర్ల పోస్టులు భర్తీ చేయకపోగా టీచర్లు, ఉద్యోగుల పదవీ విరమణ వయసు రెండేళ్లు పెంచేశారు. ఇలా నిరుద్యోగ యువత పొట్ట కొట్టారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో కొన్ని ఖాళీ పోస్టులు ఏర్పడకుండా చేశారు. వేలల్లో ఫీజులు చెల్లించి కోచింగ్‌లు తీసుకున్నా నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు అప్పులబారిన పడ్డారు. పీజీలు, ఎంఈడీ, బీయీడీ చదువుకున్న నిరుద్యోగ యువత వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం.

- కూరేటి జగన్, నిరుద్యోగి

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు ఇచ్చిన హామీ నెరవేరలేదు



పాదయాత్రలో జగన్‌మోహనరెడ్డి ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు ఉద్యోగాలిస్తామని చెప్పిన మాట నెరవేరలేదు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాటలు నెరవేరలేదు. ఉచిత హామీలిచ్చి ప్రైవేటు, టీచర్లు లెక్చరర్ల నుంచి ఓట్లు దండుకున్నారు. ఏ ఒక్క ప్రైవేటు టీచరు, లెక్చరర్‌కు మేలు చేయలేదు.

- బొక్కా అయ్యప్ప స్వామి, రాష్ట్ర కార్యదర్శి, ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్





వెయ్.. చిందెయ్..!

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి గురువారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నగరంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ర్యాలీ చేపట్టాయి. ప్రదర్శనలో డప్పు కళాకారుల విన్యాసాలకు అనుగుణంగా మహిళలు జెండాలు చేతపట్టి చిందేశారు.

పసుపు జెండా చేతపట్టి.. ఏడాదంతా జనంలోనే..

మునగచర్లలో అందరినీ ఆకట్టుకుంటున్న ఓ పెద్దాయన అభిమానం



కార్యకర్త నుంచి నాయకుల దాకా పార్టీ నుంచి ఏదో ఒకటి ఆశిస్తుంటారు. ఒక అడుగు ముందుకేసి ఏదో ఒకటి అడుగుతుంటారు. కానీ ఆయన ఏ పదవీ ఆశించలేదు. ఏ కాంట్రాక్టూ అడగలేదు. ఏ పనీ కోరలేదు. పార్టీయే కొండంత ఆస్తి అనుకున్నాడు. పసుపు జెండా కప్పుకోవడమే పెద్ద పదవి తీసుకోవడంగా భావించాడు. పెద్దల మెప్పుతో పనిలేదు. రాజకీయ లబ్ధి అక్కర్లేదు. ఆర్థిక ప్రయోజనం అసలే వద్దనుకున్నాడు. తన మెడలో తెలుగుదేశం కండువా ధరించి 365 రోజులూ బైక్‌పై మైకు పెట్టుకొని పార్టీ గీతాలు వినిపిస్తూ వీధుల్లో తిరుగుతుంటాడు. ఆయనే ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మునగచర్లకు చెందిన గంటా వెంకటప్పయ్య. ఈ పెద్దాయన తెలుగుదేశం పార్టీకి వీరాభిమాని. ఆయనకు అధినేతలతో పనిలేదు. ఎవరి మన్ననలూ అవసరం లేదు. తన పార్టీ ప్రజల్లో ఉండాలన్న సంకల్పమే ఆయన్ను నిరంతరం జనంలో ఉండేలా చేస్తోంది. నిత్యం ఏదో ఒక వీధిలో ఆయన బైక్‌పై తిరుగుతూ టీడీపీ పాటలు వినిపిస్తూ ఉన్నాడు.

'ఏ పదవీ ఆశించక.. ఆస్తులు కోల్పోయినా అండగ నిలిచారు.. మీ అందరి సహకారం.. మీ అభిమానం పార్టీకే మూల ధనం! తీర్చలేని రుణం!' అంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక ఫేమస్ పాటను బహుశా వెంకటప్పయ్య వంటి అంకితభావం ఉన్న వ్యక్తలను చూసే కవి అందించి ఉంటాడని ప్రజలు అంటున్నారు. వెనుక రెండు ఓట్లు లేక పోయినా తెల్లచొక్కాలు ధరించి నేతల వద్ద చక్కర్లు కొడుతూ పబ్బం గడుపుకొనే వ్యక్తులున్న ఈ రోజుల్లో ఇటువంటి వారిని చూసి స్ఫూర్తి పొందాలని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

- నందిగామ, ఆంధ్రజ్యోతి

నాటి పశ్చిమ కృష్ణా... నేటి ఎన్టీఆర్ జిల్లా

రాష్ట్ర పునర్విభజనలో భాగంగా నవ ఎన్టీఆర్ జిల్లా ఆవిర్భవించింది. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం ప్రాతిపదికన 'పశ్చిమ కృష్ణా'గా పిలవబడే ప్రాంతాన్ని కృష్ణాజిల్లాకు చెందిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పేరుతో ఎన్టీఆర్ జిల్లాగా ఏప్రిల్ 3, 2022వ తేదీన ఏర్పాటు చేశారు. విజయవాడ నగరం ఎన్టీఆర్ జిల్లా పరిపాలనా కేంద్రంగా.. పాత విజయవాడ రెవెన్యూ డివిజన్‌తో పాటు కొత్తగా నందిగామ, తిరువూరు రెవెన్యూ డివిజన్లతో నూతన జిల్లా ఏర్పడింది.

- విజయవాడ పార్లమెంట్ ప్రాతిపదికగా ఆవిర్భావం
- విభజనతో భౌగోళిక, రాజకీయ చిక్కుముళ్లెన్నో..
- 1952లో ఏర్పడిన పార్లమెంట్ నియోజకవర్గం
- ఇప్పటి వరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు..
- కొత్త జిల్లా ఏర్పడిన తరువాత తొలి ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ పార్లమెంట్ రాజకీయ ముఖచిత్రం ప్రాతిపదికనే నవ ఎన్టీఆర్ జిల్లా ముఖచిత్రం ఉంటుంది. నవ ఎన్టీఆర్ జిల్లా తూర్పున కృష్ణా, ఏలూరు జిల్లాలు, దక్షిణాన పల్నాడు, గుంటూరు జిల్లాలు, పశ్చిమాన తెలంగాణా రాష్ట్రానికి చెందిన సూర్యాపేట జిల్లా, ఉత్తరాన తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఖమ్మం జిల్లా భౌగోళిక సరిహద్దులు. ఎన్టీఆర్ జిల్లా.. పల్నాడు, గుంటూరు జిల్లాలను కృష్ణానది సరిహద్దుగా ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో పశ్చిమ కృష్ణాలో అంతర్భాగంగా ఉన్న నూజివీడు నియోజకవర్గం ప్రస్తుతం ఏలూరు జిల్లా పరిధిలోకి వెళ్లింది.

● నవ ఎన్టీఆర్ జిల్లాలో తొలి ఎన్నికలు

ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నపుడు విజయవాడ పార్లమెంట్




నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 1952 నుంచి 2019 వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం విజయవాడ పార్లమెంట్‌కు 18వ దఫా ఎన్నికలు జరుగుతున్నాయి. నవ ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడిన తర్వాత మొదటిసారి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా ఆవిర్భవించిన 2024 ఏప్రిల్ 4 నాటికి రెండేళ్లు పూర్తి చేసుకుంది. కొత్త జిల్లాగా ఏర్పడిన రెండేళ్లకు ఎన్టీఆర్ జిల్లాకు ఎన్నికలు రావటం గమనార్హం.

● విభజనతో నెలకొన్న చిక్కుముడులు

ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడిన తరుణంలో పలు చిక్కుముడులు కూడా నెలకొన్నాయి. ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలో గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలైన గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు ప్రస్తుతం కృష్ణాజిల్లాలో కొనసాగుతున్నాయి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం కృష్ణాజిల్లా గన్నవరంలో ఉంది. విమానాశ్రయం విజయవాడది. ఉండేది కృష్ణాజిల్లాలో. 68 కిలోమీటర్ల దూరంలో ఉన్న మచిలీపట్నం నుంచి వచ్చి ప్రొటోకాల్ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు ప్రజలు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న బందరుకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నియోజకవర్గాలు విడివడినప్పటికీ.. కృష్ణాజిల్లా పరిధిలోని గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ మండలానికి చెందిన 16 గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్నాయి. ఈ 16 గ్రామాల్లో 7 గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం నియోజకవర్గం పరిధిలోకి, 9 గ్రామాలు కృష్ణాజిల్లాలోని గన్నవరం నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. జడ్పీ కొలువు తీరిన తర్వాత కాలంలో ఎన్నికలు జరగటంతో ప్రస్తుతం ఉమ్మడి జడ్పీగానే కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 16 మండల పరిషత్తులు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ పరిధిలో ఉన్నాయి.

● మహిళా ఓటర్లే అధికం

ఎన్టీఆర్ జిల్లా ముఖచిత్రం



జిల్లా భౌగోళిక స్వరూపం : 3315 చదరపు కిలోమీటర్లు
పార్లమెంట్ నియోజకవర్గం : విజయవాడ
అసెంబ్లీ నియోజకవర్గాలు : తిరువూరు, మైలవరం, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్, నందిగామ, జగ్గయ్యపేట,
రెవెన్యూ డివిజన్లు : విజయవాడ, నందిగామ, తిరువూరు,
రెవెన్యూ మండలాలు : 20, **మండల పరిషత్‌లు :** 16, **మునిసిపాలిటీలు / నగర పంచాయతీలు :** 5, **కార్పొరేషన్లు :** 1,
రెవెన్యూ గ్రామాలు : 321,
నివాసితంకాని గ్రామాలు : 16,
గ్రామ పంచాయతీలు : 288, జనాభా (2011 సెన్సస్) : 22.18 లక్షలు
పురుషులు : 11.14 లక్షలు, **మహిళలు :** 11.04 లక్షలు
లింగ నిష్పత్తి : ప్రతి 1000 మంది మగవాళ్లకు 991 స్త్రీలు

తుది ఓటర్ల జాబితా ప్రకారంలో ఎన్టీఆర్ జిల్లాలో 16,74,995 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లు 8,57,361 మంది ఉంటే.. పురుష ఓటర్లు 8,17,484 మంది ఉన్నారు. థర్డ్‌జెండర్ ఓటర్లు 150 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 386 మంది ఉన్నారు.

ఘనంగా రథోత్సవం

వన్‌టౌన్, ఏప్రిల్ 18: శ్రీరామనవమి సందర్భంగా కొత్తపేటలోని నగరాల సీతారామ స్వామి ఆలయం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా రథోత్సవం సాగింది. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ముందుకు సాగుతుండగా రథోత్సవంలో సీత, రాముడు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను ఉంచి అర్చనలు చేశారు. ఆచారం మేరకు బలిహరణలు ఇచ్చి రథాన్ని న డిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.15

సుజనాచౌదరి నామినేషన్‌కు తరలిన టీడీపీ శ్రేణులు



విద్యాధరపురం, ఏప్రిల్ 18: పశ్చిమ నుంచి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి గురువారం నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన ర్యాలీలో టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. 40వ డివిజన్ నుంచి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో, విద్యాధరపురం ఆంధ్రాబ్యాంక్ సెంటర్ నుంచి వేమూరి మల్లిఖార్జునరావు, రమేష్‌ల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీకి తరలి వెళ్లారు.

విధ్వంసానికి వికాసానికి మధ్య సమరం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



13వ డివిజన్ ప్రచారంలో గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 18: అమరావతి ఏకైక రాజధానిగా కొనసాగేందుకు అందరూ సైకిల్ గుర్తుపై ఓటేసి ఘనమైన మెజారిటీ ఇచ్చి రాజధాని కలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 13వ డివిజన్ కృష్ణానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి గద్దె రామ్మోహన్ జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, బీజేపీ నాయకుడు పోత ంశెట్టి నాగేశ్వరరావుతో కలిసి గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాజధాని ఆవశ్యకతను, కూటమి ప్రభుత్వం వచ్చాక అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఏపీలో ఈసారి ఎన్నికలు విధ్వంసం- వికాసం మధ్యనే జరుగుతు న్నాయన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్, మోదీ ముందుకు సాగుతున్నా రన్నారు. అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ గద్దె రామ్మోహన్ గెలుపు ఖాయమైందని, మహిళలు హారతులు పట్టి ఆశీర్వదిస్తున్నారన్నారు. ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, రామాయణపు కోటి, శొంఠి నాగేశ్వరరావు, శ్రీనివాస్, సాయిలక్ష్మిలు పాల్గొన్నారు.

కొండ ప్రాంత వాసులతో అనురాధ ఆత్మీయ సమావేశం

మాచవరం: ఎన్డీయే కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఎమ్మెల్యేగా, ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని)లను గెలిపించాలని కోరుతూ 6వ డివిజన్ కొండ ప్రాంత వాసులతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గద్దె అనురాధ, బొప్పన భవకుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో గద్దె రామ్మోహన్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బొప్పన భవకుమార్ మాట్లాడుతూ గద్దె లాంటి మంచి వ్యక్తిని గెలిపించుకుంటే ఆ గెలుపు ప్రజలకు మేలు చేస్తుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న గద్దె అనురాధ

తూర్పులో అభివృద్ధిని చూసి గెలిపించండి

కృష్ణలంక: గద్దె రామ్మోహన్ ఎమ్మెల్యేగా గత పది సంవత్సరాలు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో గద్దె రామ్మోహన్‌కు, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాల్సిందిగా తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె రాజేష్ కోరారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్ కృష్ణలంక గుర్రాల రాఘవయ్య వీధిలో గురువారం గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గద్దె రామ్మోహన్ ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులతో పాటుగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల కరపత్రాలను అందచేసి వివరించారు. టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, గోరిపర్తి నామేశ్వరరావు, వల్లూరు మధు, కేశనం భావన్నారాయణ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గుణదల: మాచవరంలోని దాసాంజనేయస్వామి ఆలయం ఎదుటగల కార్మికనగర్ కొండ ప్రాంతంలో టీడీపీ యువ నాయకుడు గద్దె రాజేష్ గురువారం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ మేనిఫెస్టో కాపీలను అందజేశారు. ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని చిన్నినీ గెలిపించుకుంటే నగరం మరింతగా అభివృద్ధికి నోచుకుంటుందని తెలిపారు. దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణప్రసాద్, ఇ.కొండా, పాల రవి, దేవరపల్లి శ్రీహరి, వెల్లంకి సుధాకర్, పర్వతనేని రత్నశ్రీ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

భారతీనగర్: మూడవ డివిజన్ కరెన్సీనగర్ ఆంజనేయ స్వామి గుడిరోడ్డులో గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాడి బాబూరావు, యలమంచలి రాజేంద్రప్రసాద్, గుత్తికొండ మోహన్‌రావు, ఈశ్వర్ పేరేపి, నర్రా వెంకటేశ్వరారవు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పాత శివాలయంలో నేటి నుంచి కల్యాణపుష్పయాగ మహోత్సవం

వన్‌టౌన్, ఏప్రిల్ 18: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల (పాతశివాలయం) దేవస్థానంలో ఈ నెల 19 శుక్రవారం నుంచి 27 శనివారం వరకు భ్రమరాంబ అమ్మవారికి త్రికాల సహస్రనామార్చన, మల్లేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం జరుగుతాయని ఆలయ ఈవో కే.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 19న మహోత్సవాలు ప్రారంభమవుతాయని, 21న సాయంత్రం ఎదురకోల ఉత్సవం, 22న జగజ్యోతి ప్రతిష్ఠాపన, భ్రమరాంబ మల్లేశ్వరుల కల్యాణోత్సవం, 24న ఉదయం పూర్ణాహుతి, కొట్నాలు, వసంతోత్సవం, రాత్రి ధ్వజారోహణ, 25న ద్వదశ ప్రదిక్షణలు రాచకొండ సుమంత్‌శర్మ దంపతులచే, 26న రాచకొండ నాగరాజు శర్మ దంపతులచే పవళింపు సేవ, 27న స్వామి, అమ్మవార్లకు పవళింపు సేవ జరుగుతుంది.కాగా 19 నుంచి 22 వరకు ప్రతిరోజూ సాయంత్రం నిత్య ఔపాసన, బలిహరణ, తదితర కార్యక్రమాలు జరుగుతాయి.

21న ప్రస్థాన సాధనపై అవగాహనా సదస్సు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 18: స్ఫూర్తి కుటుంబం ఏపీ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 8 గంటల నుంచి 9.30 వరకు ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విశ్వస్ఫూర్తి గురువు మానవాళికి అందించిన ప్రస్థాన సాధన (ఉచిత ఆసన, ప్రాణాయామ, ధ్యానం) శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు రిజిస్ట్రేషన్ కోసం 77804 66509, 92464 84029 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బీసీల అభ్యున్నతికి అన్ని విధాల చర్యలు

బొండా ఉమామహేశ్వరరావు



ఎన్నికల ప్రచారంలో బొండా ఉమా

పాయకాపురం, ఏప్రిల్ 18: ముఖ్యమంత్రి వైఎస్. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో బీసీలు అర్థాకలితో పడుకునే పరిస్థితి తీసుకువచ్చాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. 64వ డివిజన్ కండ్రికలో టీడీపీ నేతలు గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ అధినేత చంద్రబాబునాయుడు బీసీల అభ్యున్నతికి అన్ని విధాల చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. పరుచూరి ప్రసాద్, సూరవరపు నాగరాజు, పలగాని శివ, వింజమూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

అజిత్‌సింగ్‌నగర్: రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాస్ అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో గురువారం బొండా ఉమాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొండా ఉమా చెన్నుపాటి శ్రీనుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం చెన్నుపాటి శ్రీను మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

వన్‌టౌన్, ఏప్రిల్ 18: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా దుర్గగుడి దత్తత ఆలయంగా ఉన్న సీతానగరంలోని వీరాంజనేయస్వామి సమేత కోదండరామస్వామి ఆలయంలోని కోదండ రాములవారి ఉత్సవమూర్తులకు గురువారం కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ నేత్రపర్వంగా జరిగిన తెప్పోత్సవం కార్యక్రమంలో దుర్గగుడి ఈవో రామారావు పాల్గొని హారతులు సమర్పించారు. ఈఈ రమాదేవి, ఏఈవో జంగం శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణమ్మకు హారతి సమర్పిస్తున్న ఈవో కేఎస్ రామారావు

ధర్మపథం వేదికపై రామపట్టాభిషేక నృత్యప్రదర్శన

శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా దుర్గగుడిలో ధర్మపథం వేదికపై గురువారం విజయవాడకు చెందిన కనకదుర్గా నృత్యమందిర్ యల్లజోస్యుల అనురాధ బృందంచే శ్రీరామ పట్టాభిషేక కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. రమణీయంగా హావభావయుక్తంగా, లయబద్ధంగా స్వరసమ్మోహనంగా సాగిన ఈ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. పుత్రకామేష్టియాగం, రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల జననం, విశ్వామిత్రుల ఆధ్వర్యంలో యాగరక్షణకు వెళ్లడం, సీత స్వయంవరం, అరణ్య వాసం, రామరావణ యుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం ఘట్టాల మధ్యలో జరిగిన పరిణామాల ఘట్టాలను సవివరంగా నృత్యరూపంలో అందించారు. ఈవో కేఎస్ రామారావు, నృత్యకారులను అభినం దించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



కోదండ రామస్వామివార్ల ఉత్సవమూర్తులు, ధర్మపథం వేదికపై శ్రీరామ పట్టాభిషేకం నృత్య ప్రదర్శన

ఒలింపియాడ్ పరీక్షల్లో నలంద విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాదల పద్మజ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 18: నేషనల్ లెవిల్ కాంపిటేటివ్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఇంగ్లీషు, మ్యాథ్స్ ఎకనామిక్స్ సబ్జెక్ట్‌లో ఆబ్జెక్టివ్ బబ్లింగ్ ద్వారా జరిగిన పోటీ పరీక్షలకు హాజరై సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులు సాధించిన నలంద విద్యానికేతన్ ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఎల్‌కేజీ, యుకేజీ విద్యార్థుల అభినందన కార్యక్రమం గురువారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ పాఠశాల కీర్తి ప్రతిష్ఠలను జాతీయ స్థాయికి తీసుకువెళుతున్న విద్యార్థులను అభినందించారు.

చెస్, బ్యాడ్మింటన్ విజేతలకు అభినందన

మాచవరం, ఏప్రిల్ 18: స్థానిక సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈనెల 13 నుంచి 15 వరకు జరిగిన ఆటల పోటీల్లో సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఏలూరు ఆశ్రమం కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో సిద్ధార్థ వైద్యకళాశాల విద్యార్థినులు చెస్, బ్యాడ్మింటన్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, అధ్యాపకులు గురువారం విద్యార్థినులను అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు

ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి వ్యక్తి మృతి

వన్‌టౌన్, ఏప్రిల్ 18: రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి పశ్చిమ బెంగాల్‌కు చెందిన బబ్లు (40) మృతి చెందాడు. కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల మేరకు సికింద్రాబాద్ నుంచి హౌరా రైలులో ప్రయాణిస్తున్నాడు. రాజీవ్‌గాంధీ పార్కు సమీపంలో అతడి మృత దేహాన్ని గుర్తించారు. రైలు నుంచి ప్రమాదవశాత్తు పడినట్లు గుర్తించారు. అతని వద్ద ఉన్న సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు తెలియచేశారు.



డివిజన్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బుద్దా వెంకన్న, చెన్నుపాటి శ్రీను

ఎన్డీఏ కూటమి విజయానికి కృషి

బుద్దా వెంకన్న

భవానీపురం, ఏప్రిల్ 18: జిల్లాలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయంలో టీడీపీ-బీజేపీ-జనసేన ఐక్యంగా ముందుకు సాగాలని ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న పిలుపునిచ్చారు. 44వ డివిజన్‌లో విద్యాధరపురంలో ఎన్డీయే కూటమి ఎన్నికల కార్యాలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, నాయకులు కోగంటి రామారావు, చెన్నుపాటి శ్రీను, వేమూరి మల్లిఖార్జునరావు, రమేష్, డివిజన్ కవిటీ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అంబారుపేట సత్యమ్మ జాతర

నందిగామ రూరల్, ఏప్రిల్ 18: అంబారుపేట సత్యమ్మవారి జాతర మహోత్సవాలకు ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. ఈ నెల 20 నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో పామర్తి సీతారామయ్య అన్నారు. 20న అమ్మవారికి పంచామృతాలతో స్నపన, ప్రత్యేక అలంకరణలు, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అఖండ దీప కలస్థాపన, మండపారాధన, 21న గ్రామ బోనాలు, ప్రభ బండ్ల ఊరేగింపు, 21న మూలమంత్ర హోమాలు, 23న విశేష అర్చనలు, రథోత్సవం, 24న మూలమంత్ర హోమాది క్రతువులు జరుగుతాయన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

నివేదన

శుక్రవారం • 19 ఏప్రిల్ 2024


హనుమంతుడిలోని శరణాగతి, సమర్పణ భావం అపూర్వమైనవి. మనం గురువుకు, భగవంతుడికి శరణాగతి కావడానికి దోహదపడే శక్తి ఆయన నుంచే ప్రాప్తిస్తుంది.



హనుమ... శరణాగతికి ప్రతిరూపం

సహజ యోగ

రామాయణంలోని 'సుందరకాం డ'లో హనుమంతుడి విశిష్టత గురించి వాల్మీకి మనోహరంగా వర్ణించాడు. సీతాన్వేషణ, లంకాదహనం, సీతాదేవి జాడను శ్రీరాముడికి తెలియజేయడం లాంటి ఘట్టాలు అందులో ఉన్నాయి. హనుమంతుడి శక్తి, సామర్థ్యాలను తులసీదాస్ తన 'హనుమాన్ చాలీసా'లో చాలా వివరంగా తెలియజేశాడు. 'శ్రీగురుచరణ...' అంటూ ముందుగా హనుమంతుణ్ణి గురురూపంలో కీర్తిస్తాం... ఎందుకంటే హనుమంతుడు తన భక్తులను ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నత స్థితికి తీసుకువెళతాడు.



'విద్యావాన గుణీ అతి చాతుర ... రామకాజ కరివేకో ఆతుర ప్రభు చరిత్ర సునీవేకో రసియా... రామలఖన సీతా మనబసియా'... అనే చరణంలో వర్ణించినట్టు హనుమంతుడు మిక్కిలి శక్తిమంతుడు, వివేకవంతుడు అయినప్పటికీ, ఆయన అనన్యమైన భక్తి, సమర్పణ భావం కలిగినవాడు. తన ప్రభువైన శ్రీరాముడి ఆదేశపాలన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తూ ఉంటాడు. శ్రీరాముడికి వ్యక్తిగత కార్యదర్శిలా సదా ఆయన వెంట ఉండడానికి ఒక వ్యక్తి అవసరం. ఆ కార్యం నిమిత్తమే హనుమంతుడి సృష్టి జరిగింది. హనుమంతుడు గరిమాది అష్ట సిద్ధులు కలిగినవాడు. అణిమా సిద్ధిని ఉపయోగించి... ఆయన అణువులో, పరమాణువులో సైతం ప్రవేశించగలడు. ఆయన శరీరంలోని ప్రతి కణం శక్తితో, భక్తితో నిండి ఉంటుంది. భక్తి, శక్తి వేరు కాదు. మన అంతర్గత సూక్ష్మ శరీరంలోని కుడి పార్శ్వం శక్తికి మూలమనీ, ఎడమ పార్శ్వం భక్తికి మూలమనీ చెబుతారు. గణేశుడు మనకు వివేకాన్ని ప్రసాదిస్తే... హనుమంతుడు శక్తిని ప్రసాదిస్తాడు. గణేశుడు, జ్ఞానం, చిన్నపిల్లవాడిలా అబోధిత తత్త్వం కలిగిన అవతారం. ఆయన వివేకం, విచక్షణా జ్ఞానం కలిగినవాడైతే... హనుమంతుడు సమతుల్యత, ప్రేమ తత్త్వం, ఆనందంతో నిండినవాడు. ఎవరైనా తమ భక్తులకు సమస్యలు సృష్టించినట్టయితే... వారిని రక్షించడానికి గణేశుడు, హనుమంతుడు సిద్ధంగా ఉంటారు. కానీ మనం వారి ప్రేమను, కటాక్షాన్ని పొందే అర్హతను కలిగి ఉండాలి.

హనుమంతుడు మనలోని అహంకారానికి, విపరీతమైన ఆలోచనలకు విరుగుడు మందు వేస్తాడు. లంకలో రావణుడు "నువ్వొక వానరానివి, నువ్వేమి చేయగలవు" అని పరిహసించినప్పుడు... రావణ సభలోను, అనంతరం లంకా నగరంలోనూ హనుమంతుడు బీభత్సం సృష్టించి, గుణపాఠం నేర్పిన సందర్భం దీనికి ఉదాహరణ. హనుమంతుడు ప్రేమమయుడు, కరుణామూర్తి. అయితే ఇతరులను బాధపెట్టే, హింసించే వారిని ఏమాత్రం ఉపేక్షించడు. ఆయన తన శక్తితో లంకాదహనం చేశాడే కానీ... ఎవరినీ దహించలేదు. అయితే రావణుడు భీతిల్లేలా చేశాడు. అంతటి వివేకం, సమతుల్యతా కలిగినవాడు ఆంజనేయుడు. తలచుకుంటే సీతాదేవిని ఆయన అవలీలగా రాముని చెంతకు చేర్చగలడు. కానీ సీతామాత ఆజ్ఞను శిరసావహించాడు. రామరావణ యుద్ధం జరిగి, రావణుణ్ణి రాముడు వధించాల్సి ఉంది... కాబట్టే ఈ విధంగా జరిగింది.



మనిషి సాధారణంగా తన భవిష్యత్తు గురించి ఎక్కువగా ప్రణాళికలు వేస్తూ ఉంటాడు. ఇది పింగళానాడి తాలూకు లక్షణం. మరికొందరు అతిగా, అది కూడా మన ఆధీనంలో లేని వాటి కోసం ప్రణాళికలు వేస్తూ ఉంటారు. ఇది మన కుడిపార్శ్వంలో అధిక వేడిమికి కారణం అవుతుంది. దానివల్ల పింగళానాడి సమతుల్యత కోల్పోయి, మనం అనారోగ్యం బారిన పడుతాం.. అటువంటి సమయాల్లోనే హనుమంతుణ్ణి ఆశ్రయించాలి.

హనుమంతుడిలోని శరణాగతి, సమర్పణభావం అపూర్వమైనవి. మనం గురువుకు, భగవంతుడికి శరణాగతి కావడానికి దోహదపడే శక్తి ఆయన నుంచే ప్రాప్తిస్తుంది. లంకలో సీతమ్మను హనుమంతుడు కలిసినప్పుడు... ఆమె గోళాలలాంటి బంగారు పూసలతో కూడిన ఒక కంఠాభరణాన్ని హనుమంతుడికి బహుమతిగా ఇస్తుంది. అప్పుడు అతను ఆ గోళాలన్నిటినీ ఒక్కొక్కటిగా తెరిచి చూస్తాడు. తన ఆరాధ్యదైవమైన రాముడు వాటిలో కనిపించలేదు. "నా శ్రీరామచంద్రుడు లేని ఈ గొలుసును నేనేం చేసుకోవాలి?" అని అంటాడు సీతమ్మతో. "రాముడు మరెక్కడో కాదు... నా హృదయంలోనే నెలవై ఉన్నాడ"ని తన హృదయ కవాటాలను తెరిచి చూపిస్తాడు. హనుమంతుడి నుంచి నేర్చుకోవలసింది... భక్తిని. ఆయన పట్ల మన భక్తి స్వచ్ఛమైనది, వాస్తవమైనదీ అయితే... మనల్ని తాకడానికి కూడా ఎవరూ సాహసించరు. కేవలం హనుమంతుణ్ణి పదేపదే స్మరిస్తూ, పూజించినంత మాత్రాన సరిపోదు. ఆ ప్రార్థన అనన్యమైన భక్తిశ్రద్ధలతో, హృదయపూర్వకంగా ఉండాలి. మనిషి సాధారణంగా తన భవిష్యత్తు గురించి ఎక్కువగా ప్రణాళికలు వేస్తూ ఉంటాడు. ఇది పింగళానాడి తాలూకు లక్షణం. మరికొందరు అతిగా, అది కూడా మన ఆధీనంలో లేని వాటి కోసం ప్రణాళికలు వేస్తూ ఉంటారు. ఇది మన కుడిపార్శ్వంలో అధిక వేడిమికి కారణం అవుతుంది. దానివల్ల పింగళానాడి సమతుల్యత కోల్పోయి, మనం అనారోగ్యం బారిన పడతాం.. అటువంటి సమయాల్లోనే హనుమంతుణ్ణి ఆశ్రయించాలి. మన పింగళానాడిని అధిష్టించి ఉన్న హనుమంతుణ్ణి జాగృతం చేసుకోవాలి. ఆయన లక్షణాలను మనలో స్థిరపరుచుకోవాలి. అప్పుడు ఆయన మన ప్రణాళికలను క్రమబద్ధీకరిస్తాడు, మనల్ని సమతుల్యతలో ఉంచుతాడు. సహజయోగ సాధన ద్వారా కుండలినీ జాగృతి జరిగి, మనం ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... మనలో హనుమంతుడి లక్షణాలు సహజసిద్ధంగా స్థిరపడతాయని సహజయోగప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాల్లో వివరించారు.

కాబట్టి హనుమాన్ చాలీసా ఆఖరి దోహాలో తులసీదాస్ వర్ణించినట్టు... "ఓ పవన తనయా... సర్వ సంకట హారీ... సర్వ మంగళ రూపా... వీర హనుమా... శ్రీ ఆంజనేయా... సీతారామ లక్ష్మణ సమేతుడవై నా హృదయ కమలంలో కొలువై ఉండు" అని ఆయనను శరణు వేడుదాం.

(23న హనుమద్విజయోత్సవం)

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్, తెలంగాణ



గీతాసారం

కర్మఫల త్యాగం

జీవితంలో ఎన్నో కష్టసుఖాలు, ఎత్తుపల్లాలు ఎదురవుతాయి. వాటిని మనం ఎలా తట్టుకోగలమనేదే ప్రధానం. మనం చేసే కర్మలు, ఇతరుల కర్మలు మనకు సంతోషాన్నో లేదా దుఃఖాన్నో ఇస్తాయనే భ్రమలో ఉంటాం. కాబట్టి దుర్భరమైన దశలో ఉన్నప్పుడు... నిరాశ చెందడం, కర్మలను త్యజించడం వైపు మొగ్గు చూపడం సహజం. అర్జునుడు కూడా అదే సందిగ్ధంలో ఉన్నాడు. 'యుద్ధంలో పోరాడడం' అనే తన కర్మను వదులుకోవాలని అనుకుంటున్నాడు.

"ఎవరైతే తమ క్రియల ద్వారా వచ్చే ఫలితాల మీద (కర్మ ఫలం మీద) ఆధారపడకుండా తన విద్యుక్త ధర్మాన్ని ఆచరిస్తారో వారే సన్యాసులు, యోగులు. వారు త్యజించేది కర్మఫలాన్ని తప్ప కర్మను కాదు" అని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. విద్యుక్త ధర్మం లేదా నిర్దేశిత ధర్మం అనే మాటను వివరిస్తున్న కొద్దీ గందరగోళం పెరుగుతుంది, ఎందుకంటే అది పూర్తిగా ప్రయోగాత్మకమైనది. ఈతను నేర్చుకోవాలనుకొనేవారు నీటిలోకి దూకాలి. అదే విధంగా విద్యుక్త ధర్మాన్ని లేదా విధిని గురించి అర్థం చేసుకోవాలంటే... ఇంద్రియాల సహాయం లేకుండా ఆనందంగా ఉండాలి.



విత్తనానికి పైన ఉండే పొర... లోపల ఉన్న అంకురాన్ని కాపాడుతుంది, తగిన పరిస్థితుల్లో అది మొలకెత్తడానికి దారి ఇస్తుంది. ఇది మనకు చాలా సహజంగా కనిపిస్తుంది కానీ... ఆ పొర దృక్పథం నుంచి చూసినప్పుడు ఇది గందరగోళంగా ఉంటుంది. ఎందుకంటే అంకురాన్ని మొదట అది కాపాడుతుంది, ఆ తరువాత విడిచిపెడుతుంది. అదే విధంగా గతం తాలూకు భారం, భవిష్యత్తుకు సంబంధించిన అంచనాలు లేకుండా... శక్తిమంతమైన ప్రస్తుత క్షణం మనకు ప్రసాదించిన కర్మను నిర్వహించడమే విద్యుక్త ధర్మం లేదా విధి. సన్యాసి కర్మఫలాన్ని త్యజిస్తాడు తప్ప కర్మను కాదని శ్రీకృష్ణుడు చెప్పాడు. 'పూర్తిగా కర్మను మానేస్తే బాధ ఉండదు, పాపం ఉండదు' అనే భావనలో ఉంటాం. 'కర్మ చెయ్యాలి, కర్మ ఫలం గురించి ఆలోచన వదిలెయ్యాలి' అనే శ్రీకృష్ణుడి సూచన ఆ భావనను పటాపంచలు చేస్తుంది. ఆయన సూచనను మనం అనుసరిస్తే... పలాయనవాదాన్ని ఆశ్రయించకుండా మనలో ప్రతి ఒక్కరికీ సన్యాసి అయ్యే అర్హత కలుగుతుంది. ఎలాంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఒక వ్యక్తి కర్మఫలాన్ని వదులుకున్నప్పుడు... ఆ క్షణంలో అతను సన్యాసికి లభించే ఆనందానికి అర్హుడవుతాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

దైవమార్గం

క్రీస్తు తొలి అద్భుతం

అది గలలియా నదీతీరంలోని ఒక చిన్న పల్లెటూరు. ఆ ఊరిలో వివాహం జరుగుతోంది. పెళ్ళివారి ఆహ్వానం మేరకు తల్లి మరియతో పాటు ఏసు క్రీస్తు కూడా వెళ్ళాడు. వేడుకలకు హాజరయ్యే అతిథులకు ద్రాక్షరసం ఇవ్వడం అక్కడ ఆనవాయితీ. అయితే తెచ్చిన ద్రాక్షరసం అయిపోయింది. పేదవారైన వధువు తల్లితండ్రులు తమ పరువు పోతుందనే ఆందోళనలో ఉన్నారు. వారి దుఃఖం తీర్చడానికి... ఏసు క్రీస్తు తన తల్లి సూచన మేరకు ఖాళీ బానల్లో నీళ్ళు పోయించాడు. ఆ నీటిని ద్రాక్షరసంగా మార్చి, అందరిలో ఆశ్చర్యాన్ని ఆనందాన్ని నింపాడు.

ఖాళీ బానల్లో నీరు పోయించే బదులు... బానలతో ద్రాక్షరసాన్ని కూడా ఆయన సృష్టించి ఉండవచ్చు కదా? నీరు పోయించి, దాన్ని ద్రాక్షరసంగా మార్చడం అవసరమా? కానీ దీనిలో ఒక అంతరార్థం ఉంది. అప్పటివరకూ ఎన్నో మూఢనమ్మకాలు, సమాజ తిరోగమనానికి ఆటంకంగా నిలుస్తున్న పాత పద్ధతులు కొనసాగుతున్నాయి. అవి పాత బానల్లో ఎప్పుడూ పోసే నీళ్ళలాంటివి అయితే... వాటిని ద్రాక్షరసంగా... అంటే కొత్తగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. 'పాతవాటిని ఇప్పటికైనా ప్రయోజనకరంగా పునరుద్ధరించుకుందాం. మానవ అభ్యుదయానికి దోహదం చేసేలా మార్చుకుందాం' అనే సందేశాన్ని ఇవ్వడం ఏసు ప్రభువు ఉద్దేశం. ఇది ఆయన చేసిన తొట్టతొలి అద్భుతం.



ఇలా ఆయన చేసిన ప్రతి అద్భుతం వెనుక, చెప్పిన ప్రతి ఉపమానం వెనుక ఒక మహత్తర సందేశం దాగి ఉంటుంది. ఆ సందేశాన్ని చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యేలా చెప్పడం ప్రభువు ప్రత్యేకత. సువార్తికులందరూ నేర్వవలసిన మహత్తరమైన కళ. ఆయన ఏ అద్భుతాన్నీ తన ఔన్నత్యాన్ని ప్రకటించుకోవడానికో, ఇంద్రజాల ప్రదర్శనకో చూపలేదు. ఆవశ్యకతను బట్టి... దీనజనోద్ధరణ కోసమే చేశాడు. ఒక్కొక్క అద్భుతంలో ఒక ఆంతర్యం... అన్నిటిలోనూ మానవాళిపట్ల ఆయనకు ఉన్న అపారమైన ప్రేమ కనిపిస్తాయి.


ఈ నేల మీద ఎందరెందరో పుట్టారు. ఈ సమాజాన్ని మార్చడానికి బోధలు చేశారు. కానీ కొందరి ప్రవర్తనలో మాత్రమే ఆ బోధలు ప్రతిఫలించాయి. ఈ విశేషం క్రీస్తులో పుష్కలం, పరిపూర్ణం. బోధకుల మాటలకు, చేతలకు సమన్వయం కుదిరినప్పుడే ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం కలుగుతుంది. దైవకార్యాన్ని నెరవేర్చడానికి మానవలోకానికి క్రీస్తు వచ్చాడు. ఆయన చేసిన అద్భుతాలన్నీ మానవజాతి తన మూఢభావాల నుంచి విముక్తం కావాలని, చీకటి నుంచి వెలుగులోకి నడవాలని సంకల్పించినవే. చైతన్యపూరితమైన ఆయన ప్రసంగాలు, నిరక్షరాస్యులైనా అతి సులువుగా గ్రహించేలా చెప్పిన కథలు... ఇప్పటికీ వాడని పూలలా వికసిస్తూనే ఉన్నాయి. సూక్తి సుగంధాలను విరజిమ్ముతూనే ఉన్నాయి. తోటి మనిషి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడాలనే సత్యాన్ని బోధించడానికి శిలువపై ఆయన చేసిన ప్రాణత్యాగం ఒక గొప్ప ఉదాహరణ.

• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/K95Kdskలో చదవండి.

సద్బోధ

గజదొంగ పశ్చాత్తాపం



21న మహావీర జయంతి

పూర్వం రాజగృహ అనే పట్టణంలో లోహకురుడనే దొంగ ఉండేవాడు. అతను చాలా క్రూరుడిగా, ప్రమాదకరమైనవాడిగా పేరు పొందాడు. లోహకురుడి కొడుకు రోహిణేయుడు. తండ్రిని మించిన తెలివితేటలు, ధైర్యం కలిగినవాడు. తండ్రి అడుగుజాడల్లోనే నడిచి... గజదొంగ అయ్యాడు. లోహకురుడు వృద్ధాప్యంతో మంచం పట్టాడు. మరణించేముందు కొడుకును పిలిచి "మహావీరుడి బోధలు ఎన్నడూ వినకు. ఎందుకంటే ఆయన బోధలు మన వృత్తికి తగినవి కావు" అని చెప్పాడు. అలాగేనని తండ్రికి రోహిణేయుడు మాట ఇచ్చాడు.

కొన్నాళ్ళ తరువాత... రోహిణేయుడు ఒక నగరంలో నుంచి వెళుతూ ఉండగా... మహావీరుడు కొందరికి దీక్ష ఇస్తున్నట్టు తెలిసింది. మహావీరుడి ప్రసంగం అతనికి వినిపిస్తోంది. వెంటనే అతను చెవులు రెండూ మూసుకొని, వేగంగా నడవడం ప్రారంభించాడు. కొద్దిదూరం వెళ్ళగానే అతని కాలికి పదునైన ముల్లు గుచ్చుకుంది. ముల్లును తొలగించడానికి... ఒక చెవి మీద నుంచి చేతిని తియ్యాల్సి వచ్చింది. "ఎవరి పాదాలు నేలను తాకవో, ఎవరు కనురెప్పలు ఆర్పరో, ఎవరి శరీరానికి చెమట పట్టదో, ఎవరి మెడలో వేసిన పూల మాల వాడిపోదో... అటువంటి వారే దివ్యులైనవారు. దేవతలు" అని మహావీరుడు చెప్పిన మాటలు అతని చెవిన పడ్డాయి. తన పాదం నుంచి ముల్లును తొలగించుకున్న రోహిణేయుడు అక్కడి నుంచి బయటపడ్డాడు.

క్రమంగా అతని దుండగాలు మితిమీరాయి. అతని దోపిడీల్లో సంపద పోగొట్టుకున్నవారు రాజును కలిసి... రోహిణేయుడి బారి నుంచి తమను కాపాడాలని విన్నవించుకున్నారు. ఆ బాధ్యతలను మంత్రి అభయకుమారుడికి రాజు అప్పగించాడు. మంచి వ్యూహకర్త అయిన మంత్రి... కీలకమైన ప్రదేశాల్లో, సంపన్నులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సైనికులతో గట్టి నిఘా పెట్టాడు. వారు వలపన్ని రోహిణేయుణ్ణి పట్టుకున్నారు. అయితే అతని దగ్గర దొంగ సొత్తు ఏదీ దొరకలేదు.

న్యాయస్థానంలో రోహిణేయుణ్ణి ప్రవేశపెట్టినప్పుడు... తను దగ్గరలో ఉన్న గ్రామంలోని రైతుననీ, తనకు ఏ పాపం తెలీదనీ వాదించాడు. రాజభటులు ఆ గ్రామంలో తన గురించి ఆరా తీస్తారని అతనికి తెలుసు. అందుకే ముందుజాగ్రత్తలు కూడా తీసుకున్నాడు. అతను తమ గ్రామం వాడేనని అక్కడివారు చెప్పడంతో.... న్యాయమూర్తులు అతణ్ణి విడిచిపెట్టారు.

కానీ అతనే గజదొంగ రోహిణేయుడనేది అభయకుమారుడి నమ్మకం. ఆ సంగతి అతని నోటి నుంచే చెప్పించడానికి ఒక పథకం వేశాడు. తన మనుషులతో రోహిణేయుణ్ణి తప్పతాగించి, స్పృహ తప్పేలా చేశాడు. రోహిణేయుడికి తెలివి వచ్చేసరికి... అతని చుట్టూ పరిసరాలన్నీ స్వర్గంలా కనిపించేలా ఏర్పాటు చేశాడు. అక్కడ కొందరు మహిళలను, పురుషులను దేవదూతల వేషంలో ఉంచాడు.

రోహిణేయుడు మేలుకున్నాడు. "నేనెక్కడ ఉన్నాను?" అని అక్కడ ఉన్నవారిని అడిగాడు.

"నువ్వు స్వర్గంలో ఉన్నావు. నీ జీవితంలో చేసిన తప్పులన్నీ అంగీకరిస్తే... స్వర్గ సుఖాలు నీకు శాశ్వతంగా లభిస్తాయి" అని వారు చెప్పారు. "తక్షణం చెప్పాలి" అని ఒత్తిడి చేశారు.

రోహిణేయుడికి సందేహం కలిగింది. ఏం చేయాలని అతను ఆలోచిస్తూ ఉండగా... మహావీరుడి నుంచి విన్న మాటలు గుర్తుకువచ్చాయి. మానవుల మాదిరిగా వారి కాళ్ళు నేలను తాకుతున్నాయి. వాళ్ళు కనురెప్పలు ఆర్పుతున్నారు. వాళ్ళ శరీరాల మీద చెమట కనిపిస్తోంది. వాళ్ళ మెడలోని పూల దండల్లో కొన్ని పూలు వాడిపోయి ఉన్నాయి. 'ఇది స్వర్గం కాదు. నా నోట నేను చేసిన దోపిడీల గురించి చెప్పించడానికి వేసిన ఎత్తుగడ' అని గ్రహించాడు.

"నాకేమీ తెలీదు" అని గట్టిగా చెప్పాడు. వారు అతణ్ణి బతిమాలి, బెదిరించి... ఫలితం లేకపోవడంతో వదిలేశారు.

'మహావీరుడి మాటలు ఎంతో అద్భుతమైనవి. ఎంతో శక్తిమంతమైనవి. నేను విన్నది కొన్ని వాక్యాలే. అవి కూడా వినకూడదని ఎంతగా అనుకున్నా నా చెవిన పడ్డాయి. అవే నా జీవితాన్ని కాపాడాయి. ఇక మీదట దొంగతనాలు చేయను. మహావీరుణ్ణి ఆశ్రయిస్తాను' అని రోహిణేయుడు నిశ్చయించుకున్నాడు. గతంలో తను చేసిన పనులన్నీ తలచుకొని పశ్చాత్తాపం చెందాడు. మహావీరుణ్ణి కలుసుకొని, ఆయన పాదాలమీద పడ్డాడు.

"స్వామీ! నేను ఎన్నో పాపాలు చేశాను. ఆ జీవితం మీద విరక్తి కలిగింది. పాప విముక్తి పొందాలనుకుంటున్నాను. నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి" అని ప్రార్థించాడు. మహావీరుడు అందుకు అంగీకరించి... రోహిణేయుడికి దీక్ష ఇచ్చాడు. మహావీరుడి బోధలు వింటూ, ఆయన నిర్దేశించిన అహింస, సత్యం, ఇతరుల ఆస్తిని ఆశించకపోవడం, దొంగతనం చేయకపోవడం, బ్రహ్మచర్యం అనే పంచవ్రతాలను పాటిస్తూ కైవల్యసాధన మార్గంలో పయనించాడు రోహిణేయుడు.

లోకగౌరవం పొందాలంటే...

దాక్షిణ్యం స్వజనే, దయా పరిజనే,
శాఠ్యం సదా దుర్జనే
ప్రీతిః సాధుజనే నయో: నృపజనే,
విద్వజ్జనే చార్జవమ్
శౌర్యం శత్రుజనే, క్షమా గురుజనే,
కాంతాజనే ధృష్టతా
యే చైవం పురుషాః కలాసు కుశలాస్తే
ష్వేవలోకస్థితిః

లోకుల నుంచి గౌరవం పొందడం కోసం వ్యక్తులకు ఉండవలసిన గుణాలను, లక్షణాలను భర్తృహరి తన 'నీతి శతకం'లోని ఈ శ్లోకంలో తెలియజేశాడు. దాన్ని...



సుభాషితం

వరకృప భృత్యులందు నిజ వర్గమునం
దనుకూల వృత్తి కా
పురుషులయందు శాఠ్యము సుబుద్ధులయం
దనురక్తి దాల్మి స
ద్గురువులయందు గౌరవము కోవిదు
లందు నయంబు రాజులం
దరిజనులందు శౌర్యము మృగాక్షులయందు
బ్రగల్భభావ మీ
వరుస కళాప్రవీణులగు వారలయందు
వసించు లోకముల్... అని చక్కటి తెలుగులో అందించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం: సేవకుల పట్ల దయ, బంధువుల పట్ల ఆప్యాయత, దుష్టుల విషయంలో కాఠిన్యం, సజ్జనులకు ప్రీతిపాత్రంగా ఉండడం, పెద్దల పట్ల ఓర్పు, గురువులపై గౌరవం, పాలకుల పట్ల వినయం, శత్రువులపై శౌర్యం, స్త్రీల పట్ల సమభావం, దృఢచిత్తం కలిగి నడుచుకొనేవారు ఉత్తములు. వారికి ఈ లోకమంతా అనుకూలంగా ఉంటుంది.

సందేశం


వారికి ఎల్లప్పుడూ దైవానుగ్రహం



'తల్లితండ్రులను సేవించడమే ఉత్తమ గతులకు మార్గం' అని ఇస్లాం ధర్మం చెబుతోంది. దివ్య గ్రంథాలు సైతం ఈ విషయాన్ని స్పష్టం చేశాయి.

ఒక సందర్భంలో దైవ ప్రవక్త మహమ్మద్ చెప్పిన కథ ఇది.

ముగ్గురు వ్యక్తులు అరణ్యంలో ప్రయాణిస్తున్నారు. హఠాత్తుగా వర్షం ముంచుకురావడంతో దగ్గరలో ఉన్న ఒక గుహలోకి వెళ్ళి తలదాచుకున్నారు. వర్షం తీవ్రతకు కొండ చరియ విరిగిపోయి... ఆ గుహకు ప్రవేశద్వారానికి అడ్డంగా పడిపోయింది. దానితో ఆ బాటసారులు ముగ్గురూ అందులో చిక్కుకుపోయారు. దాని నుంచి బయటపడే పరిస్థితి లేదని వారికి అర్థమయింది. తమ జీవితాల్లో చేసిన మంచి పనులను గుర్తు చేసుకొని... తమను ఈ గండం నుంచి ఎలాగైనా బయటపడెయ్యాలని అల్లాహ్‌ను వేడుకోసాగారు. వారిలో ఇద్దరు తాము చేసిన సత్కార్యాలను గుర్తు చేసుకొని... అల్లాహ్‌ను ప్రార్థించారు. చివరి వ్యక్తి "అల్లాహ్! నాకు వృద్ధులైన తల్లితండ్రులు, చిన్నవారైన పిల్లలు ఉన్నారు. నేను గొర్రెలు కాసి నా కుటుంబాన్ని పోషించేవాణ్ణి. రోజూ గొర్రెలను మేపి, ఇంటికి రాగానే... పాలు తీసి నా తల్లితండ్రులకు ఇచ్చేవాణ్ణి. ఆ తరువాత నా పిల్లలకు ఇచ్చేవాణ్ణి. ఒక రోజు నేను ఇంటికి వచ్చేసరికి ఆలస్యమయింది. నా తల్లితండ్రులు నిద్రపోయారు. వారికి నిద్రాభంగం కలిగించడం ఇష్టం లేకపోయింది. మరోవైపు నా పిల్లలు ఆకలితో ఉన్నారు. అయినప్పటికీ వారికి ముందుగా పాలు ఇవ్వడం నా తల్లితండ్రుల పట్ల అవిధేయతగా భావించి... ఆ పాల పాత్రతో వారు లేచే వరకూ అక్కడే నిలబడి ఉన్నాను. నా పట్ల ప్రసన్నుడవై... ఈ బండరాయిని తొలగించు" అని కోరాడు. గుహ ప్రవేశ ద్వారాన్ని మూసేసిన ఆ బండరాయి తక్షణమే తొలగిపోయింది. ఆ బాటసారులు క్షేమంగా బయటపడ్డారు. తల్లితండ్రులను సేవిస్తూ, వారిపట్ల విధేయతతో మెలగినవారికి అల్లాహ్ అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని దైవ ప్రవక్త ఈ కథ ద్వారా స్పష్టం చేశారు.



నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం.

లఖ్‌నవూ X చెన్నై

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
361 (7 మ్యాచ్‌లు)	13 (7 మ్యాచ్‌లు)




ఒలింపిక్స్‌కు శ్రీశంకర్ దూరం



న్యూఢిల్లీ: లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ ఒలింపిక్ కల చెదిరింది. శిక్షణ సందర్భంగా అతడి మోకాలికి తీవ్ర గాయమైంది. శస్త్రచికిత్స తప్పనిసరని డాక్టర్లు ధ్రువీకరించారు. దీంతో 2024 సీజన్ మొత్తానికి అతడు దూరమైనట్టే. ఆసియా, కామన్వెల్త్ క్రీడల్లో శ్రీశంకర్ రజతాలు సొంతం చేసుకొన్నాడు. గతేడాది జరిగిన ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షి‌ప్‌లో 8.37 మీ. దూకిన మురళీ విశ్వక్రీడలకు అర్హత సాధించాడు. ఈ నెల 27, మే 10న షాంఘై, దోహాలో జరగనున్న డైమండ్ లీగ్‌లకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ గాయమైంది.

కాన్వే..ఐపీఎల్ నుంచి అవుట్

చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న న్యూజిలాండ్ ఓపెనర్ డెవాన్ కాన్వే గాయంతో ఈసారి ఐపీఎల్‌కు పూర్తిగా దూరమయ్యాడు. వాస్తవంగా..గత ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ సందర్భంగా కాన్వే ఎడమచేతి చూపుడు వేలు విరగడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. ఫలితంగా ఐపీఎల్‌కు అందుబాటులో ఉండడని గతంలో భావించారు. ఇప్పుడు దానిని అధికారికంగా ప్రకటించారు. గతేడాది ఫైనల్లో అతడు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఇక..కాన్వే స్థానంలో ఇంగ్లిష్ పేసర్ రిచర్డ్ గ్లీసన్ (రూ. 50 లక్షలు) ను తీసుకున్నారు.

ఫేవరెట్లు మను, ఇషా

నేటినుంచి ఒలింపిక్ షూటింగ్ ట్రయల్స్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు భారత పిస్టల్, రైఫిల్ జట్ల ఎంపిక ప్రక్రియ శుక్రవారం ఇక్కడ ప్రారంభం కానుంది. మహిళల 25 మీ. పిస్టల్ విభాగంలో ఒలింపియన్ మనూ భాకర్, హైదరాబాద్ టీనేజ్ షూటర్ ఇషాసింగ్ తిరుగులేని ఫేవరెట్లుగా బరిలో దిగుతున్నారు. తొలిరోజు ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ కేటగిరిలో అనీష్ భన్వాలా, విజయ్ వీర్‌సింగ్ ఆధిపత్యం చెలాయించే అవకాశాలున్నాయి. మొత్తం 8 పిస్టల్, రైఫిల్ విభాగాలకు ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. ట్రయల్స్‌లో అగ్రస్థానంలో నిలిచే షూటర్లకు పారిస్ బెర్త్ ఖాయమవుతుంది.

హమ్మయ్య..ముంబై

ఆఖరి ఓవర్‌లో విజయం ● సూర్యకుమార్ అర్ధసెంచరీ
వణికించిన పంజాబ్ ● అశుతోష్ పోరాటం వృథా


సూర్యకుమార్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 78)


బుమ్రా (3/21)

ముల్లాపూర్: అశుతోష్ శర్మ (28 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 61) అసాధారణ ఇన్నింగ్స్‌తో విజయంపై ఆశలు కోల్పోయిన ముంబై ఇండియన్స్.. చివరకు ఆఖరి ఓవర్‌లో గట్టెక్కింది. 193 పరుగుల ఛేదనలో పంజాబ్ స్కోరు ఓ దశలో 14/4 మాత్రమే. కానీ ఈ స్థితి నుంచి అశుతోష్, శశాంక్ సింగ్ (25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 41) మ్యాచ్‌ను చివరి వరకు తెచ్చారు. కానీ కీలక దశలో ముంబై పేసర్లు బుమ్రా, కొట్జీ వీరి వికెట్లు తీసి జట్టును ఆదుకున్నారు. దీంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో హార్దిక్ సేన 9 పరుగుల తేడాతో నెగ్గింది. ఈ సీజన్‌లో చివరి ఓవర్‌లో పంజాబ్ ఓడడం ఇది నాలుగోసారి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 192 పరుగులు చేసింది. సూర్యకుమార్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 78), రోహిత్ (36), తిలక్ (34 నాటౌట్) రాణించారు. హర్షల్‌కు మూడు, కర్రాన్‌లకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 19.1 ఓవర్లలో 183 పరుగులు చేసి ఓడింది. బుమ్రా, కొట్జీలకు మూడేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా నిలిచాడు.

బెదరగొట్టిన అశుతోష్: పిచ్‌ను సద్వినియోగం చేసుకుంటూ ముంబై పేసర్లు కొట్జీ, బుమ్రా చెలరేగడంతో పంజాబ్ ఛేదన పేలవంగా ఆరంభమైంది. కానీ ఓవైపు వికెట్లు నేలకూలుతున్నా మధ్య ఓవర్లలో శశాంక్-అశుతోష్ జోడీ రన్‌రేట్ తగ్గకుండా ఆడడంతో ముంబైకి ఓటమి కళ్లముందు కనిపించింది. తొలి 13 బంతుల్లోనే ప్రభ్‌సిమ్రన్ (0), రొసో (1), కర్రాన్ (6), లివింగ్‌స్టోన్ (1) పెవిలియన్‌కు చేరడం దెబ్బతీసింది. అప్పటికి స్కోరు 14 పరుగులే. బుమ్రా ఒకే ఓవర్‌లో రొసో, కర్రాన్‌ల వికెట్లతో షాకిచ్చాడు. ఈ స్థితిలో శశాంక్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఏడో ఓవర్‌లో హర్‌ప్రీత్ సింగ్ (13)ను శ్రేయాస్ గోపాల్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయగా ఐదో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో ఎండ్‌లో జితేశ్ (9)ను పేసర్ ఆకాశ్ ఎల్బీ చేయడంతో 77/6 స్కోరుతో పంజాబ్ కష్టాలు రెట్టింపయ్యాయి. కానీ అశుతోష్ ముంబైపై ఎదురుదాడికి దిగాడు. శశాంక్-అశుతోష్ జోడీ పంజాబ్ విజయంపై ఆశలు రేకెత్తించిన వేళ.. బుమ్రా ఝలక్ ఇచ్చాడు. 13వ ఓవర్‌లో శశాంక్ వికెట్ తీశాడు. 16వ ఓవర్‌లో రెండు అద్భుత సిక్సర్లతో అశుతోష్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయగా, బ్రార్ మరో సిక్సర్‌తో మధ్వాల్ 24 పరుగులిచ్చుకున్నాడు. దీంతో సమీకరణం 24 బంతుల్లో 28 రన్స్‌కు మారడంతో మ్యాచ్ పంజాబ్ వైపు మొగ్గింది. ఈ దశలో బుమ్రా 3 పరుగులే ఇవ్వగా.. 18వ ఓవర్‌లో అశుతోష్‌ను కొట్జీ అవుట్ చేయడంతో ఒక్కసారిగా ముంబైలో జోష్ కనిపించింది. దీనికి తోడు తర్వాతి ఓవర్‌లోనే బ్రార్ సైతం అవుట్ కావడంతో ఇక ఆశలు లేకుండా పోయాయి. చివర్లో రబాడ (8) సిక్సర్‌తో ఆరు బంతుల్లో 12 రన్స్ అవసరమైనా, తొలి బంతికే అతను రనౌట్ కావడంతో ఎంఐ ఊపిరిపీల్చుకుంది.


అశుతోష్ శర్మ (28 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 61)

1 ముంబై ఇండియన్స్ తరఫున ఎక్కువ సిక్సర్లు (224) బాదిన బ్యాటర్‌గా రోహిత్

సూర్య అర్ధసెంచరీ: టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన ముంబై త్వరగానే ఓపెనర్ ఇషాన్ (8) వికెట్‌ను కోల్పోయినా.. సూర్యకుమార్ అదరగొట్టాడు. రోహిత్, తిలక్ సహకారమందించడంతో ఎంఐ సవాల్ విసిరే స్కోరును సాధించింది. ఐదో ఓవర్‌లో రోహిత్‌ను ఎల్బీగా అవుటిచ్చినా రివ్యూకు వెళ్లడంతో బతికిపోయాడు. ఆరో ఓవర్‌లో అతడి సిక్సర్‌తో ముంబై పవర్‌ప్లేలో 54/1 స్కోరుతో ఫర్వాలేదనిపించింది. అనంతరం సూర్య ఎక్కువగా స్ట్రయికింగ్ తనే తీసుకుంటూ అడపాదడపా బౌండరీలతో చెలరేగాడు. దీంతో 34 బంతుల్లో అతడి ఫిఫ్టీ పూర్తయ్యింది. అటు 12వ ఓవర్‌లో పేసర్ కర్రాన్‌కు రోహిత్ చిక్కడంతో రెండో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో 22 బంతులపాటు ఒక్క బౌండరీ కూడా నమోదు కాలేదు. ఇక 16వ ఓవర్‌లో రివ్యూ ద్వారా ఎల్బీ నుంచి గట్టెక్కిన సూర్య చెలరేగి 4,6,6తో 18 రన్స్ రాబట్టాడు. కానీ సెంచరీ ఖాయమనిపించిన తరుణంలో సూర్యను కర్రాన్.. కెప్టెన్ హార్దిక్ (10)ను హర్షల్ వరుస ఓవర్లలో అవుట్ చేశారు. మరోవైపు 19వ ఓవర్‌లో టిమ్ డేవిడ్ (14) 4,4,6తో 18 రన్స్ అందించగా, స్కోరు 200 దాటుతుందనిపించింది. అయితే ఆఖరి ఓవర్‌లో హర్షల్ 7 పరుగులే ఇచ్చి డేవిడ్, షెఫర్డ్ (1)ల వికెట్లు తీశాడు. నబీ (0) రనౌటయ్యాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
ఢిల్లీ	7	3	4	0	6	-0.074
ముంబై	7	3	4	0	6	-0.133
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	7	2	5	0	4	-0.251
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

ముంబై: ఇషాన్ (సి) హర్‌ప్రీత్ (బి) రబాడ 8, రోహిత్ (సి) హర్‌ప్రీత్ (బి) కర్రాన్ 36, సూర్యకుమార్ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) కర్రాన్ 78, తిలక్‌వర్మ (నాటౌట్) 34, హార్దిక్ (సి) హర్‌ప్రీత్ (బి) హర్షల్ 10, డేవిడ్ (సి) కర్రాన్ (బి) హర్షల్ 14, షెఫర్డ్ (సి) శశాంక్ (బి) హర్షల్ 1, నబీ (రనౌట్) 0 : **ఎక్స్‌ట్రాలు : 11 ; మొత్తం 20 ఓవర్లలో 192/7 ; వికెట్లపతనం** : 1-18, 2-99, 3-148, 4-167, 5-190, 6- 192, 7-192; **బౌలింగ్:** లివింగ్‌స్టోన్ 2-0-16-0, అర్ష్‌దీప్ 3-0-35-0, రబాడ 4-0-42-1, హర్షల్ 4-0-31-3, కర్రాన్ 4-0-41-2, హర్‌ప్రీత్ 3-0-21- 0

పంజాబ్: కర్రాన్ (సి) ఇషాన్ (బి) బుమ్రా 6, ప్రభ్‌సిమ్రన్ (సి) ఇషాన్ (బి) కొట్జీ 0, రొసో (బి) బుమ్రా 1, లివింగ్‌స్టోన్ (సి అండ్ బి) కొట్జీ 1, హర్‌ప్రీత్ సింగ్ (సి అండ్ బి) శ్రేయాస్ 13, శశాంక్ (సి) తిలక్ (బి) బుమ్రా 41, జితేశ్ (ఎల్బీ) మధ్వాల్ 9, అశుతోష్ (సి) నబీ (బి) కొట్జీ 61, హర్‌ప్రీత్ బ్రార్ (సి) నబీ (బి) హార్దిక్ 21, హర్షల్ (నాటౌట్) 1, రబాడ (రనౌట్) 8 : **ఎక్స్‌ట్రాలు : 21 ; మొత్తం 19.1 ఓవర్లలో 183 ఆలౌట్ ; వికెట్లపతనం** : 1-10, 2-13, 3-14, 4-14, 5-49, 6-77, 7-111, 8-168, 9-174 ; **బౌలింగ్:** కొట్జీ 4-0- 32-3, బుమ్రా 4-0-21-3, మధ్వాల్ 3.1-0-461, హార్దిక్ 4-0-33-1, శ్రేయాస్ 2-0-26-1, షెఫర్డ్ 2-0-20-0.

ఇంపాక్ట్ రూల్ నచ్చలేదు



న్యూఢిల్లీ: గతేడాది నుంచి ఐపీఎల్‌లో అమలవుతున్న ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై భారత కెప్టెన్ రోహిత్ శర్మ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఇది ఆల్‌రౌండర్ల పురోగతికి ఆటంకంగా ఉందని స్పష్టం చేశాడు. 'క్రికెట్ అనేది 11 మందితోనే ఆడాలి. 12 మందితో కాదు. నాకు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన నచ్చలేదు. ఇది ఆల్‌రౌండర్ల నైపుణ్యాలను తగ్గించేస్తుంది. ప్రేక్షకులకు మరింత మజాను అందించేందుకు దీన్ని ప్రయోగిస్తున్నారు. కానీ క్రికెట్ కోణంలో చూసుకుంటే దూబే, సుందర్‌లాంటి ఆల్‌రౌండర్లు బౌలింగ్‌కు దూరమవుతున్నారు. వారిని బ్యాటింగ్‌కు ఉపయోగించుకుని ఆ తర్వాత పెవిలియన్‌కు పరిమితం చేస్తున్నారు. ఇది భారత క్రికెట్‌కు మంచిది కాదు' అని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రోహిత్ తెలిపాడు.

వినేష్‌పైనే అందరి దృష్టి

ఆసియా రెజ్లింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ నేటి నుంచి



బిష్కెక్ (కిర్గిస్థాన్): సాధ్యమైనన్ని పారిస్ ఒలింపిక్ బెర్త్‌లు దక్కించుకోవడమే లక్ష్యంగా.. భారత రెజ్లర్లు ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ బరిలోకి దిగనున్నారు. శుక్రవారం నుంచి జరిగే టోర్నీలో ఫ్రీ స్టైల్, గ్రీకో-రోమన్ విభాగాల్లోని 18 వెయిట్ కేటగిరీల్లో 36 విశ్వక్రీడల బెర్త్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే, సుజీత్ కలాకర్ (65కి), దీపక్ పూనియా (86 కి) వినహా మిగతా 17 మంది భారత రెజ్లర్లు ఈపాటికే బిష్కెక్ చేరుకొన్నారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో దీపక్, సుజీత్‌లు దుబాయ్‌లోనే ఆగిపోయారు. దీంతో టోర్నీలో వీరు బరిలోకి దిగడంపై ఉత్కంఠ నెలకొంది. కాగా, ఇప్పటి వరకు 53 కిలోల విభాగంలో అంతిమ్ మాత్రమే ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఇటీవలి కాలంలో వివాదాలతోనే హైలైట్ అయిన వినేష్‌పై అందరి దృష్టి నెలకొంది. 50 కిలోల్లో బరిలోకి దిగుతున్న ఫొగట్.. ట్రయల్స్ సందర్భంగా చేసిన రచ్చ ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉంది.

రెండు బంతులకే రద్దు..

పాక్-కివీస్ తొలి టీ20 వర్షార్పణం

రావల్పిండి: పాకిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య గురువారం ఇక్కడ జరగాల్సిన తొలి టీ20ని వరుణుడు అడ్డుకోవడంతో రద్దయింది. భారీ వర్షం వల్ల మ్యాచ్‌ని ఐదేసి ఓవర్లకు కుదించారు. మొదటి ఓవర్ రెండో బంతి తర్వాత మళ్లీ వర్షం మొదలవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. రెండో మ్యాచ్ శనివారం జరుగుతుంది.

ప్రజ్ఞానంద ఓటమి

క్యాండిడేట్స్ చెస్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ప్రజ్ఞానందకు చుక్కెదురైంది. 11వ రౌండ్‌లో నకమురా (అమెరికా) చేతిలో ప్రజ్ఞానంద ఓటమి పాలయ్యాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 54 ఎత్తుల్లో ప్రత్యర్థికి తలవంచాడు. కాగా, కరువానా (అమెరికా)తో గుకేష్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన గుకేష్ 40 ఎత్తుల అనంతరం కరువానాతో డ్రాకు అంగీకరించాడు. రష్యన్ జీఎం ఇయాన్ నెపోమ్నియాచి చేతిలో విదిత్ గుజరాతీ కంగుతిన్నాడు. మొత్తంగా 11 రౌండ్‌ల నుంచి గుకేష్ 6.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. ప్రజ్ఞానంద (5.5), గుజరాతీ (5) ఆరు, ఏడు స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో సలీమోవా (బల్గేరియా)పై హంపి, జీఎం అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినా (రష్యా)పై ఐఎం వైశాలి గెలిచారు.

బిజినెస్

సాగర్ సెమీ.. హైవోల్టేజ్ సెమీకండక్టర్స్ ప్లాంట్

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాగర్ సెమీకండక్టర్స్ కంపెనీ హైవోల్టేజ్ సెమీకండక్టర్ల తయారీకి సిద్ధమవుతోంది. జపాన్‌కు చెందిన హిటాచీ గ్రూప్ ఇందుకు అవసరమైన పూర్తి సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుంది. దీనికి సంబంధించి సాగర్ సెమీ-హిటాచీ గ్రూప్ కంపెనీ హిటాచీ పవర్ సెమీకండక్టర్ డివైజెస్ లిమిటెడ్ (హెచ్‌పీఎస్‌డీఎల్) మధ్య ఒక అవగాహనా ఒప్పందం కుదిరింది. ఏటా 10 కోట్ల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. ఈ ప్లాంట్‌లో పని చేసే ఉద్యోగులకు అవసరమైన పూర్తి శిక్షణ హిటాచీ గ్రూప్.. భారత్, జపాన్‌లోని తన యూనిట్లలో ఇస్తుంది. అయితే ఈ ప్లాంట్‌ను ఎక్కడ? ఎంత పెట్టుబడితో ఏర్పాటు చేసేది సాగర్ సెమీ వెల్లడించలేదు. దీనికి తోడు ఇన్సులేటెడ్ గేట్ బైపోలార్ ట్రాన్సిస్టర్స్ (ఐజీబీటీ), సిలికాన్ కార్బైడ్ వంటి హైపవర్ డివైజెస్‌ను ఉమ్మడిగా మార్కెట్ చేసేందుకూ హెచ్‌పీఎస్‌డీఎల్-సాగర్ సెమీ మధ్య ఒక ఒప్పందం కుదిరింది.

నాట్కో ఫార్మా యూఎస్ఏపై ఫిర్యాదు

న్యూఢిల్లీ: అమెరికాలోని నాట్కో ఫార్మా అనుబంధ సంస్థ నాట్కో ఫార్మా యూఎస్ఏ ఎల్ఎల్‌సీపై డెలావర్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఫిర్యాదు నమోదైంది. ఈ కంపెనీ డయాజపామ్ అనే ఇంజెక్షన్ ప్రీఫిల్డ్ సిరంజీలను మార్కెట్ చేయడంపై ఫ్రెషినియస్ కబీ యూఎస్ఏ ఎల్ఎల్‌సీ, ఫ్రెషినియస్ కబీ డచ్‌ల్యాండ్ జీఎంబీహెచ్ అనే సంస్థలు ఈ ఫిర్యాదు చేశాయి. డాష్ ఫార్మాస్యూటికల్స్ ఎల్ఎల్‌సీని నాట్కో ఫార్మా కొనుగోలు చేసి దాని పేరును నాట్కో ఫార్మా యూఎస్ఏ ఎల్ఎల్‌సీగా మార్చింది. డయాజపామ్ ఇంజెక్షన్లను మానసిక వ్యాకులత, కండరాల సంకోచం, మద్యం సేవించడం వల్ల వచ్చే వికారాల తొలగింపు కోసం ఉపయోగిస్తారు. కాగా ఈ విషయాన్ని కోర్టులో ఎదుర్కొంటామని నాట్కో ఫార్మా తెలిపింది.

ధనూకా అగ్రిటెక్ మార్కెట్లోకి కీటక నాశిని 'లానెవో', బయో ఫెర్టిలైజర్ ఉత్పత్తి 'మైకోర్ సూపర్' ను విడుదల చేసింది. పంట రక్షణ, దిగుబడిని పెంచే విధంగా వీటిని రూపొందించింది. జపాన్‌కు చెందిన నిస్సాన్ కెమికల్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో లానెవోను తీసుకువచ్చింది. కాగా బయో ఎరువు మైకోర్ సూపర్.. అధిక విలువైన పంటల్లో ఉత్పత్తి, నాణ్యతను పెంచటానికి ఎంతగానో తోడ్పడుతుందని తెలిపింది.

● ఎయిర్ కంప్రెసర్స్ తయారీదారు ఎల్‌జీ ఎక్విప్‌మెంట్స్.. తన ఈజీ సిరీస్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. ఇందులో భాగంగా ఆయిల్-లూబ్రికేటెడ్ స్క్రూ ఎయిర్ కంప్రెసర్స్‌ను విడుదల చేసింది. కంప్రెస్డ్ ఎయిర్ టెక్నాలజీతో కూడిన ఈ మెషిన్స్ 15 శాతం వరకు ఇంధన సామర్థ్యాన్ని ఆదా చేస్తాయని వెల్లడించింది.

ఇన్ఫీ లాభం రూ.7,969 కోట్లు



క్యూ4లో 30 శాతం వృద్ధి నమోదు

రూ.37,923 కోట్లకు పెరిగిన ఆదాయం

2024-25 ఆదాయ వృద్ధి అంచనా 1-3%

ఒక్కో షేరుకు మొత్తం రూ.28 డివిడెండ్

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికానికి (క్యూ4) ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 30 శాతం వృద్ధితో రూ.7,969 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇదే త్రైమాసికానికి కంపెనీ లాభం రూ.6,128 కోట్లుగా ఉంది. కాగా, 2023-24 క్యూ4లో ఇన్ఫీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం పెరిగి రూ.37,923 కోట్లుగా నమోదైంది. 2022-23లో ఇదే కాలానికి రూ.37,441 కోట్ల ఆదాయం గడించింది. కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ క్యూ4లో 20.1 శాతానికి తగ్గగా.. 2023-24 మొత్తానికి 20.7 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఇన్ఫీ నికర లాభం 8.9 శాతం వృద్ధితో రూ.26,233 కోట్లకు చేరుకోగా.. ఆదాయం 4.7 శాతం పెరిగి రూ.1,53,670 కోట్లుగా నమోదైంది.

7.5 శాతం తగ్గిన ఉద్యోగులు

క్యూ3తో పోలిస్తే క్యూ4లో నికరంగా 5,423 మంది ఉద్యోగులు తగ్గారు. దాంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం (25,994 మంది) తగ్గి 3,17,240 మందికి పరిమితమైంది. ఇన్ఫోసిస్ వార్షిక ఉద్యోగుల సంఖ్య తగ్గడం గడిచిన 23 ఏళ్లలో ఇదే తొలిసారి. అంతేకాదు, వరుసగా ఐదు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కాగా, క్యూ4లో సంస్థ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.6 శాతానికి తగ్గింది.

1,770 కోట్ల డాలర్ల భారీ ఆర్డర్లు

క్యూ4లో కంపెనీకి 450 కోట్ల డాలర్ల భారీ కాంట్రాక్టులు దక్కగా.. 2023-24 మొత్తానికి ఈ విలువ ఆల్‌టైం రికార్డు స్థాయి 1,770 కోట్ల డాలర్లకు పెరిగిందని ఇన్ఫోసిస్ వెల్లడించింది. "క్లయింట్లకు తమపైన ఉన్న బలమైన నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోంద"ని ఇన్ఫీ ఎండీ, సీఈఓ సలీల్ పరేఖ్ అన్నారు.

డివిడెండ్ బొనాంజా

గత ఆర్థిక సంవత్సరానికి గాను ఇన్ఫీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.20 తుది డివిడెండ్‌తో పాటు రూ.8 ప్రత్యేక డివిడెండ్‌ను సైతం ప్రకటించింది. ఇందుకు అర్హులైన వాటాదారులను మే 1న ఎంపిక చేసి, జూలై 1న చెల్లింపులు జరుపనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతంలో ప్రకటించిన రూ.35.5 డివిడెండ్‌తో కలిపి 2023-24కు గాను కంపెనీ చెల్లించే డివిడెండ్ మొత్తం రూ.63.5కు చేరుకోనుంది.

రూ.4,000 కోట్లకు జర్మన్ కంపెనీ కొనుగోలు

జర్మనీకి చెందిన ఇన్-టెక్ కంపెనీలో 100 శాతం వాటాను 45 కోట్ల యూరోల (దాదాపు రూ.4,000 కోట్లు)కు కొనుగోలు చేయబోతున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. ఇన్-టెక్ కంపెనీ ఈ-మొబిలిటీ, కనెక్టెడ్ అండ్ అటానమస్ డ్రైవింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆఫ్ రోడ్ వెహికిల్స్, రైల్ రోడ్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తి కావచ్చని అంచనా. జర్మనీకి చెందిన దిగ్గజ వాహన కంపెనీలతో విస్తృత సంబంధాలు కలిగి ఉన్న ఇన్-టెక్ కొనుగోలు ఇన్ఫోసిస్‌కు ఆటోమోటివ్ రంగంలో భవిష్యత్ తరం టెక్నాలజీ సేవలందించేందుకు దోహదపడనుంది. ఇన్-టెక్‌లో 2,200 మంది పనిచేస్తున్నారు. జర్మనీతో పాటు ఆస్ట్రియా, చైనా, యూకే, చెక్ రిపబ్లిక్, రొమేనియా, స్పెయిన్, ఇండియాలో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఏడీఆర్‌లు 8 శాతం డౌన్

ఈ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) ప్రకటించిన ఆదాయ వృద్ధి అంచనా నిరాశాజనకంగా ఉండటంతో న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్ అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఏడీఆర్) దాదాపు 8 శాతం వరకు క్షీణించాయి. 2024-25లో స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి 1-3 శాతంగా ఉండవచ్చని కంపెనీ అంచనా వేసింది. అయితే, ఈసారి కంపెనీ ఆదాయ వృద్ధిని 2-6 శాతం స్థాయిలో అంచనా వేయవచ్చని భావించిన మార్కెట్ వర్గాలకు నిరాశే ఎదురైంది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) తొలుత అంచనా వేసిన 4-7 శాతం ఆదాయ వృద్ధితో పోలిస్తే కంపెనీ ఈసారి అంచనాలను చాలా తగ్గించింది. అయితే, 2023-24 ఆదాయ వృద్ధి అంచనాను ప్రతి త్రైమాసికంలోనూ తగ్గిస్తూ వచ్చిన కంపెనీ.. క్యూ3 ఫలితాల ప్రకటన సందర్భంగా 1.5-2 శాతానికి కుదించింది. "2023-24 ఆర్థిక సంవత్సరం ఆదాయ వృద్ధితో పోలిస్తే 2024-25 ఆదాయ వృద్ధి అంచనా అధికమే అయినప్పటికీ వ్యత్యాసం చాలా స్వల్పం. ఇండస్ట్రీల వారీగా చూస్తే, ఆర్థిక సేవల రంగం ముఖచిత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో మెరుగ్గా కన్పిస్తోంద"ని ఇన్ఫోసిస్ సీఈఓ పరేఖ్ అన్నారు.

పవర్‌మెక్‌కు యాదాద్రి థర్మల్ పవర్ ఆర్డర్

హైదరాబాద్: పవర్‌మెక్ ప్రాజెక్ట్స్‌కు రూ.232.03 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి. వాటిలో రూ.52.74 కోట్ల విలువ గల యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రాజెక్టు కూడా ఉంది. ఈ ఆర్డర్ కింద యాదాద్రి ప్రాజెక్టు కోసం సూపర్ స్ట్రక్చర్ పవర్ హౌస్, బంకర్ ప్రాంతం నిర్మించడంతో పాటు ప్లాంట్ పరిధిలోని ఇతర పనులు కూడా చేపట్టాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్ నుంచి వేర్వేరు ప్రాజెక్టులకు సంబంధించి మూడు ప్యాకేజీలుగా రూ.122.89 కోట్ల ఆర్డర్లు లభించా యి. బీహెచ్ఈఎల్ నుంచి లభించిన ప్యాకేజీల్లో ఒడిశాలోని తాల్చేర్‌లో ఎన్‌టీపీసీ కోసం ఒక్కోటి రూ.660 మెగావాట్ల విలువ గల రెండు యూనిట్ల (1,2 యూనిట్లు) నిర్మాణం ఒకటి కాగా ఎన్‌టీపీసీ తాల్చేర్ ప్రాజెక్టులో యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ స్ట్రక్చర్, టాంక్ ఫ్యాబ్రికేషన్ మరొకటి. ఇవి కాకుండా ప్యాకేజీ-సీ కింద తాల్చేర్ ప్లాంట్‌లోనే కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు అవార్డు

జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్)కు మరో పురస్కారం లభించింది. ఈ ఏడాది గాను భారత్‌తో పాటు దక్షిణాసియాలో 'అత్యుత్తమ విమానాశ్రయ సిబ్బంది' అవార్డును దక్కించుకుంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఈ నెల 17న నిర్వహించిన 'ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో 2024'లో గ్లోబల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ రేటింగ్ సంస్థ స్కైట్రాక్స్ ఈ అవార్డును ప్రకటించింది. విమానాశ్రయంలో ప్రయాణికులకు ఆయా సేవలందించే సిబ్బంది వైఖరి, స్నేహపూర్వకత, సమర్థత వంటి అంశాల పరిశీలన ఆధారంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఎంపిక చేసినట్లు స్కైట్రాక్స్ పేర్కొంది.

ఎయిర్‌పోర్ట్‌లో ఏఏఐ వాటా విక్రయం!?

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మూడో విడత విమానాశ్రయాల ప్రైవేటీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టనుందని సమాచారం. ఈసారి మరో 13 విమానాశ్రయాలను ప్రైవేటీకరించనున్నట్లు తెలిసింది. అంతేకాదు, బెంగళూరు, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో తనకున్న స్వల్ప వాటానూ విక్రయించాలని ఏఏఐ భావిస్తోందని ఇద్దరు సీనియర్ అధికారుల తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో అభివృద్ధి చేసిన హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 74 శాతం వాటా జీఎంఆర్ చేతుల్లో ఉండగా.. తెలంగాణ ప్రభుత్వం, ఏఏఐ 13 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయి.

అమెజాన్ ఫ్యాషన్.. బాలీవుడ్ నటీనటులు అనన్య పాండే, ఆదిత్య రాయ్ కపూర్‌లతో ఫ్యాషన్ ఆన్ అమెజాన్, హర్ పల్ ఫ్యాషనబుల్ పేరుతో కొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. అపారెల్స్, షూస్, వాచీలు, యాక్సెసరీస్ మొదలైన వాటికి వన్ స్టాప్ ఆన్‌లైన్ వేదికగా అమెజాన్ ఫ్యాషన్ ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,800 ▼	67,650 ▼	90,100 ▲
ముంబై	73,477 ▲	67,305 ▲	83,327 ▲

మార్కెట్లలో ఆగని పతనం

సెన్సెక్స్ 455 పాయింట్లు డౌన్

ముంబై: అమెరికాలో వడ్డీ రేట్లు సమీప భవిష్యత్తులో తగ్గుతాయన్న ఆశలు ఆవిరైపోవడంతో పాటు భౌగోళిక ఉద్రిక్తతలు తీవ్రతరం కావడంతో పెరిగిన అమ్మకాల కారణంగా ఈక్విటీ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజు కూడా భారీ నష్టాలకు గురయ్యాయి. ఇటీవల ర్యాలీని సొమ్ము చేసుకునేందుకు ఇన్వెస్టర్లు గత కొద్ది రోజులుగా భారీ విక్రయాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సెన్సెక్స్ గురువారం తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఇంట్రాడేలో గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ 1,107.38 పాయింట్ల మేరకు ఊగిసలాడింది. మిడ్‌సెషన్‌లో అయితే కేవలం మూడు నిమిషాల వ్యవధిలో 319 పాయింట్లు నష్టపోయింది. చివరికి సెన్సెక్స్ 454.69 పాయింట్ల నష్టంతో 72,488.99 వద్ద క్లోజైంది. నిఫ్టీ 152.05 పాయింట్ల నష్టంతో 21,961.70 వద్ద ముగిసింది. నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2,549.16 పాయింట్లు నష్టపోయింది. ఫలితంగా బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.9,30,304.76 పాయింట్లు దిగజారి రూ.3,92,89,048.31 కోట్లకు పడిపోయింది.

జెఎన్‌కే షేరు ధర శ్రేణి రూ.395-415: హీటింగ్ పరికరాలు తయారుచేసే జేఎన్‌కే ఇండియా లిమిటెడ్ రూ.650 కోట్ల పబ్లిక్ ఇష్యూలో షేరు ధర శ్రేణిని గురువారం ప్రకటించింది. షేరు కనిష్ఠ ధర రూ.395 కాగా గరిష్ఠ ధర రూ.415గా నిర్ణయించింది. వచ్చే మంగళవారం ఇష్యూ ప్రారంభమై గురువారం ముగుస్తుంది.

నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్‌పై డెరివేటివ్ కాంట్రాక్టులు

న్యూఢిల్లీ: ఈ నెల 24 నుంచి నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్‌పై డెరివేటివ్ కాంట్రాక్టులు ప్రవేశపెడుతున్నట్లు ఎన్ఎస్ఈ ప్రకటించింది. సెబీ నుంచి ఇందుకు అనుమతి లభించినట్లు తెలిపింది. ఈ కాంట్రాక్టుల ముగింపు ప్రతి నెలా చివరి శుక్రవారం ఉంటుంది. ఈ ఏడాది మార్చి 29 నాటికి నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.70 లక్షల కోట్లు. ఎన్ఎస్ఈలో నమోదైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్‌లో ఇది 18 శాతానికి సమానం. ఈ ఇండెక్స్ కంపెనీల్లో రోజూ సగటున రూ.9,560 కోట్ల టర్నోవర్ జరుగుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ

హైదరాబాద్	410	విజయవాడ	415
చిత్తూరు	493	విశాఖపట్నం	430
గోదావరి	415	వరంగల్	412
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	118	గోదావరి	131
వరంగల్	118	విజయవాడ	131
కరీంనగర్	118	గుంటూరు	131
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	131
కర్నూలు	118	చిత్తూరు	134
విశాఖపట్నం	118		

అశోకుడి 9వ రహస్యం



'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా లెవెల్ సక్సెస్‌ను అందుకున్నారు తేజ సజ్జా. ఆయన కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో మరో సూపర్ హీరో తరహా పాత్రలో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌ను నిర్మాత డి. సురేశ్‌బాబు లాంచ్ చేశారు. ఈ చిత్రం పేరు 'మిరాయ్: సూపర్ యోధా'. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "మిరాయ్ అనేది అశోకుని కాలంలో రహస్యమైన ఓ శాసనం. 'హనుమాన్'కు ముందే ఈ సినిమా కథను తేజకు చెప్పాను" అని అన్నారు. చిత్ర నిర్మాత టి.జి విశ్వప్రసాద్ మాట్లాడుతూ "కార్తీక్ విజన్ అద్భుతంగా ఉంటుంది. అది ఈ సినిమాలో స్పష్టంగా కనిపిస్తుంది" అని చెప్పారు. తేజ సజ్జ మాట్లాడుతూ "ఈ చిత్రం అశోక రాజు, అతని 9 రహస్యాల ఆధారంగా రూపొందుతోంది. అశోకుడి 9వ రహస్యానికి గ్రహణం రాకుండా అడ్డుకునే యోధుడి పాత్రను పోషిస్తున్నాను" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కిస్తున్న 'మిరాయ్' చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.

అయోధ్య సందర్శించిన మిస్టర్ బచ్చన్



రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'మిస్టర్ బచ్చన్' చిత్రం ఉత్తరప్రదేశ్ షెడ్యూల్ పూర్తయింది. 30 రోజుల పాటు అక్కడ కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. అక్కడి నుంచి అయోధ్య వెళ్లి రామ్ లల్లా ఆశీస్సులు తీసుకుని హైదరాబాద్ చేరుకుంది యూనిట్. ఈ సినిమాలో రవితేజ పవర్‌ఫుల్ క్యారెక్టర్ పోషిస్తున్నారు. ఆయన సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. జగపతిబాబు కీలక పాత్రధారి. మిగిలిన నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత మేకర్స్ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీజే మేయర్, సినిమాటోగ్రఫీ: అయనంక బోస్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

ఆద్యంతం వినోదభరితం



'చుట్టాలబ్బాయి' సినిమా తర్వాత నటుడు ఆది సాయికుమార్, దర్శకుడు వీరభద్రం చౌదరి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'కృష్ణ ఫ్రమ్ బృందావనం'. దిగంగనా సూర్యవంశీ హీరోయిన్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ మూవీని తూము నరసింహా, జామి శ్రీనివాసరావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత దిల్‌రాజు క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించారు. నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర డైరెక్టర్ వీరభద్రం చౌదరి మాట్లాడుతూ "ఈ సినిమా ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది" అని చెప్పారు. హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కుటుంబమంతా కలసి చూసి హాయిగా నవ్వుకునేలా ఈ చిత్రం ఉంటుంది" అని అన్నారు.

మారేడుమిల్లిలో 'షెకావత్'!

(మొదటి పేజీ తరువాయి)

గోదావరి జిల్లాల వరకూ వేలాది హెక్టార్లలో విస్తరించిన రంపచోడవరం అటవీ ప్రాంతంలో నాణ్యమైన, ఎత్తైన టేకు చెట్లు పుష్కలంగా ఉన్నాయి. వాటిని సంరక్షించేందుకు డైరెక్ట్ ఐఎఫ్ఎస్ అధికారిని అక్కడ నియమించి అటవీ శాఖ జాగ్రత్తలు తీసుకుంటుంది. అయితే ఇటీవలి కాలంలో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భారీ వృక్షాలు నేలకూలుతున్నట్లు అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం వచ్చింది. శాఖలోని విజిలెన్స్ విభాగాన్ని అక్కడికి పంపించి ఉన్నతాధికారి నివేదిక తెప్పించారు. కేవలం ఆరు నెలల్లో 450కి పైగా భారీ వృక్షాలు నరికేశారని, వాటి మొదలు చుట్టుకొలత రెండు మీటర్ల వరకూ ఉందంటూ ఫొటోలు, వీడియోలతో సహా విజిలెన్స్ నివేదిక అందించింది. కలప విలువ సుమారు 91లక్షల రూపాయలు ఉంటుందని, మారుజాతి చెట్లు కూడా భారీగా కొట్టేశారని రిపోర్ట్‌లో పేర్కొంది. ఈ విషయమై వివరణ అడిగేందుకు సంబంధిత ఐఎఫ్ఎస్ అధికారిని అరణ్య భవన్‌కు పిలవగా, ఆరోగ్య కారణాలు చూపించి సెలవుపై వెళ్లిపోయారు. కింది స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. "మాకు మేముగా ఎలాంటి తప్పూ చేయలేదు. ప్రతి నెలా మామూళ్లు ఇవ్వండి.. మీ ఏరియాలో మీరు ఏమి చేసుకుంటారో మీ ఇష్టం" అంటూ ఇబ్బందిపెట్టడంతో తప్పలేదని వాపోతున్నారు.

కలప కాంట్రాక్టర్ల ద్వారా..

దట్టమైన అడవిలో ఉన్న టేకు, మారుజాతి చెట్లు నరికించేసి కలప బయటికి తరలించడం అంత సులభం కాదు. గిరిజనులు తమ అవసరాల కోసం చెట్లు కొడితేనే అటవీ శాఖ అధికారులు కేసులు నమోదు చేస్తుంటారు. అలాంటిది బయలు ప్రాంతంలోకి కళ్లు గప్పి కలప తెచ్చే అవకాశమే ఉండదు. కలప వ్యాపారులు గిరిజన ప్రాంతాల్లోని రైతుల తోటల్లో ఉన్న చెట్లను కలప కోసం కొనుగోలు చేస్తుంటారు. వాటిని నరికేందుకు అటవీశాఖ నుంచి అనుమతి తీసుకుని ఏ సర్వే నంబర్ భూమిలో చెట్లు ఉన్నాయి.? ఏ రైతుకు అవి చెందినవి.? ఏ రకమైన చెట్లు.? అనే వివరాలు అందజేస్తారు. ఇదే అవకాశంగా కలప కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకుని రైతుల నుంచి తీసుకున్నట్లు చూపించి అటవీ ప్రాంతంలోని చెట్లను తరలించేశారు. విచారణలో ఈ విషయం వెలుగులోకి రావడంతో మరింత లోతుగా అటవీ శాఖ కూపీ లాగుతోంది.

సిబ్బంది కన్నుగప్పి...

పొరుగు రాష్ట్రంలో జన్మించిన ఈ అధికారిని మన రాష్ట్రానికి ఐఎఫ్ఎస్‌గా యూపీఎస్సీ కేటాయించింది. కొండలు ఎక్కువగా ఉండే రాష్ట్రానికి చెందిన మరో మహిళా ఐఎఫ్ఎస్‌ను వివాహం చేసుకుని ఇద్దరూ ఇక్కడే సెటిలయ్యారు. అయితే పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో పనిచేసే సమయంలో, తన దగ్గర పనిచేసే ఒక మహిళా గార్డు భర్తతో ఈయన స్మగ్లింగ్ సంబంధాలు నెరిపారు. ఆ వ్యక్తి ద్వారా ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధాలు పెట్టుకున్నారు. స్మగ్లింగ్ జరిగే వైపు ఉన్న సిబ్బందిని దారి మళ్లించి భారీగా సంపాదిస్తూ అందులో అధికార వైసీపీ నేతలకు కూడా పూర్తిగా సహకరించేవారు. వైసీపీ నేతల వాహనాలను వదిలేస్తూ.. తనకు డబ్బులిచ్చే వాటిని అడ్డుకోకుండా జాగ్రత్త పడేవారు. ఫలితంగా శేషాచలంలో ఉన్నన్ని రోజులూ ఎర్రచందనం ఆదాయంతో పండగ చేసుకున్నారు.

ఇద్దరు ఐఏఎస్‌లకు బురద...

ఎర్రచందనం విరివిగా లభించే చోటు నుంచి ఏడాది క్రితం ఈ అధికారి మన్యం ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఆర్నెళ్ల పాటు అక్కడి అడవిని, పరిస్థితులను చూసిన తర్వాత భారీ స్కెచ్ వేశారు. ఆ ప్రాంతంలో పనిచేస్తోన్న ఇద్దరు ఐఏఎస్ అధికారులకు కలప ఇస్తానని, మంచి ఫర్నీచర్ చేయించుకోండి అంటూ పంపించారు. ఆ తర్వాత తనపనికి ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించారు. విజిలెన్స్ విచారణలో ఈ విషయం బయట పడటంతో 'ఇదెక్కడి తలనొప్పి మాకు' అంటూ ఆ ఐఏఎస్‌లు తల పట్టుకున్నారు.

భానుడు భగభగ

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రమై, వెచ్చని సెగతో వడగాల్పులు వీస్తున్నాయి. దీంతో అసౌకర్య వాతావరణం నెలకుంటోంది. గురువారం ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరింది. అల్లూరి జిల్లా యెర్రంపేట, మన్యం జిల్లా కొమరాడలో 45.8, నంద్యాల జిల్లా నందవరంలో 45.6, విజయనగరం జిల్లా జామిలో 45.5, శ్రీకాకుళం జిల్లా కోవిలం, కడప జిల్లా కొంగలవీడులో 45.4, తిరుపతి జిల్లా రేణిగుంట, ప్రకాశం జిల్లా దరిమడుగులో 45.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 84 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 120 మండలాల్లో మోస్తరు వడగాల్పులు వీచాయి.

జగన్ కేసుల విచారణ 30కి వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ అక్రమాస్తులకు సంబంధించి సీబీఐ, ఈడీ దాఖలు చేసిన 20 ఛార్జిషీట్‌లపై విచారణ ఈ నెల 30కి వాయిదా పడింది. ఈ కేసులతో తమకు ఎలాంటి సంబంధం లేదని.. ఆయా ఛార్జిషీట్‌ల నుంచి తమను తప్పించాలని పేర్కొంటూ జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాఖలు చేసిన దాదాపు 129 డిశ్చార్జి పిటిషన్‌లపై తీర్పు వెలువడాల్సి ఉంది. దీనిని కూడా ఈనెల 30కి వాయిదా వేస్తున్నట్లు సీబీఐ కోర్టు గురువారం ప్రకటించింది. ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల్లో విచారణ వేగవంతం చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో తెలంగాణ హైకోర్టు సుమోటోగా ఈ అంశాన్ని స్వీకరించింది. హైదరాబాద్ సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్‌లను ఫిబ్రవరి 29లోగా పరిష్కరించాలని గతేడాది డిసెంబర్‌లో హైకోర్టు పేర్కొంది. కానీ, ఆ తర్వాత సీబీఐ కోర్టు కోరికమేరకు గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది.

బాలుడిని బలిగొన్న వైసీపీ ప్రచార రథం

- సకాలంలో రాని 108.. అదే వాహనంలో ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ బాలుడి మృతి.. రాజాంలో ఘటన



రాజాం ఆసుపత్రిలో బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

రాజాం రూరల్, ఏప్రిల్ 18: విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తలే రాజేష్ ప్రచార రథం ఓ బాలుడి ఉసురు తీసింది. రాజాంలోని చీపురుపల్లి రోడ్‌లో గురువారం రాత్రి ఏడున్నర గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. రాజాంలోని లచ్చయ్యపేటకు చెందిన కె.వెంకటేష్, సంతోషిల కుమారుడు భరద్వాజ్(10) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. టిఫిన్ కోసం గురువారం సాయంత్రం 7.30 గంటలకు మెయిన్ రోడ్డు పైకి వచ్చాడు. అంతలోనే వైసీపీ ప్రచార వాహనం వేగంగా వచ్చి బాలుడ్ని ఢీకొంది. అతడిపై నుంచి వాహనం వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో డ్రైవర్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాలుడ్ని స్థానికులు ఆసుపత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అది సకాలంలో రాకపోవడంతో మరొక డ్రైవర్ సహాయంతో బాలుడ్ని ఢీకొన్న వాహనంలోనే రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భరద్వాజ్ రాత్రి తొమ్మిది గంటల సమయంలో మృతి చెందాడు. వైసీపీ అభ్యర్థి రాజేష్ ఆసుపత్రి వద్దకు రావాలని, న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత కొనసాగుతోంది.

కోలాహలంగా లోకేశ్ నామినేషన్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18: మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేశ్ నామినేషన్ దాఖలు ఘట్టం జన జాతరను తలపించింది. నామినేషన్ కార్యక్రమానికి లోకేశ్ హాజరు కానప్పటికీ...ఆయన తరఫున కూటమి నేతలు నామినేషన్‌ను దాఖలు చేశారు. గురువారం ఉదయం పది గంటలకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాతమంగళగిరి సీతారామస్వామి కోవెలలో లోకేశ్ నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోకేశ్ తరఫున రెండు సెట్ల నామినేషన్లను మంగళగిరి రిటర్నింగ్ అధికారి రాజకుమారి గణియాకు అందజేశారు.

నేడు చంద్రబాబు నామినేషన్

కుప్పం, ఏప్రిల్ 18: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం మధ్యాహ్నం 1.27 గంటలకు కుప్పంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. గురువారం సాయంత్రమే ఆమె కుప్పం చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 10.45 గంటలకు ఆమె వరదరాజస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలను ఉంచి పూజలు చేస్తారు. అనంతరం కుప్పం చెరువుకట్ట నుంచి ర్యాలీగా వెళ్లి మధ్యాహ్నం 1.27గంటలకు నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు. కాగా, కుప్పం టీడీపీ శ్రేణులతో చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తన తరఫున భువనేశ్వరి శుక్రవారం నామినేషన్ వేయనున్న నేపథ్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిసి తన మాటగా పిలవాలని ఆయన కోరారు.

23న పవన్ నామినేషన్

పిఠాపురం శాసనసభ స్థానం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ 23న నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్‌కి పవన్ కల్యాణ్ స్వయంగా నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. అదే రోజు సాయంత్రం పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. కాగా, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున పోటీ చేస్తున్న నిమ్మక జయకృష్ణకు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గురువారం బీ-ఫాం అందించారు. జనసేన తరఫున బరిలోకి దిగుతున్న అభ్యర్థుల్లో 20 మందికి బుధవారమే బీ-ఫాంలు అందించారు. కాగా, మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ కుటుంబానికి చెందిన వట్టి పవన్ కుమార్ గురువారం జనసేన పార్టీలో చేరారు.

టీడీపీలోకి భీమిలి, జీడీ నెల్లూరు వైసీపీ నేతలు

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): భీమిలి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల వైసీపీ నేతలు గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీఎంఆర్డీఏ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకట్రావుతో పాటు విశాఖ జిల్లా చిరు (చిరంజీవి)సేవా సంఘం అధ్యక్షుడు దుక్క కృష్ణాయాదవ్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒమ్మి దేవుడు, పద్మనాభం మాజీ ఎంపీపీ గోపిరాజు, మాజీ సర్పంచ్‌లు గేదెల చంద్రరావు, నమ్మి వెంకట్రావు, భీమిలి 25వ వార్డు అధ్యక్షుడు గడిదేశ సూర్యబాబు టీడీపీలో చేరారు. జీడీ నెల్లూరు నుంచి సింగల్ విండో మాజీ ప్రెసిడెంట్ బాబునాయుడు, మాజీ సర్పంచ్ జయచంద్ర నాయుడు చేరారు.

రాష్ట్రంలో 4 చోట్ల మోదీ సభలు

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు చోట్ల ప్రధాని మోదీ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. బీజేపీ పోటీచేసే అనకాపల్లి, రాజమహేంద్రవరం, రాజంపేటల్లో ఈ సభలు జరుగుతాయి. ఆపార్టీ అభ్యర్థులకు పీఎంవో అధికారులు ఫోన్‌చేసి సభలు ఎక్కడ పెడితే బాగుంటుందో అడిగి తెలుసుకున్నారు. నాలుగో సభపై స్పష్టత రాలేదని బీజేపీ వర్గాలు తెలిపాయి.

టెక్కలిలో దువ్వాడకు ఇంటిపోరు!

- 22న ఆయన భార్య వాణి నామినేషన్

టెక్కలి, ఏప్రిల్ 18: శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటిపోరుతో సతమతమవుతున్నారు. ఆయన భార్య, టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి.. అదేస్థానంలో ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. పార్టీ తరఫున నామినేషన్ వేస్తారా.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతారా అనేది చెప్పడం లేదు. టెక్కలి టికెట్.. తన భర్తకు కాకుండా తనకే కేటాయించాలని గతంలో ఆమె సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమెను టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. కానీ దువ్వాడ శ్రీనివాస్‌నే అభ్యర్థిగా ప్రకటించారు. శుక్రవారం నామినేషన్ వేసేందుకు ఆయన సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ తరుణంలో ఆయన భార్య వాణి కూడా నామినేషన్‌కు సిద్ధమవడం చర్చనీయాంశమవుతోంది. ఈ అంశం వైసీపీ అధిష్ఠానం వద్దకు వెళ్లినట్లు తెలిసింది.

సీఎస్, డీజీపీ ఔట్!?

(మొదటి పేజీ తరువాయి)

వీరిని బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు అధికార వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనిపై నేడో, రేపో ఉత్తర్వులు వచ్చే అవకాశముంది. అదే జరిగితే... ఇటు సీఎస్‌ను, అటు పోలీస్ బాస్‌ను ఒకేసారి పక్కకు తప్పించడం ఇదే తొలిసారి అవుతుంది.

జగన్ సేవలో జవహర్..

సీఎస్ జవహర్ రెడ్డి తొలినుంచీ జగన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ వస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా ఆయన వ్యవహార శైలిలో ఏమాత్రం మార్పు రాలేదు. వైసీపీకి రాజకీయంగా లబ్ధి కలగడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలన్న ఈసీ ఆదేశాలను ఆసరాగా తీసుకుని... ఉద్దేశపూర్వకంగానే పింఛన్ల పంపిణీని ఆలస్యం చేసి, ఆ పాపాన్ని విపక్షాలపై నెట్టేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చాయి. తమ ఆదేశాలు అమలు చేయకుండా జవహర్ రెడ్డి ధిక్కార ధోరణి ప్రదర్శిస్తున్నారని ఈసీ భావిస్తోంది. గీత దాటి వైసీపీ కోసం ప్రచారం చేస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేయాలని ఈ నెల 8న ఈసీ ఆదేశాలు జారీ చేసింది. కానీ... జవహర్ రెడ్డి ఆ ఫైలును తొక్కి పెట్టారు. తప్పనిసరి పరిస్థితుల్లో గురువారం సాయంత్రానికి వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక... రాష్ట్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ కమిషనర్ చిలకల రాజేశ్వరరెడ్డి డిప్యుటేషన్‌ను రద్దు చేసి తిరిగి పంపించాలని కేంద్రం జారీ చేసిన ఆదేశాలనూ పట్టించుకోలేదు. 'ఆయన సేవలు మాకు కావాలి' అంటూ తిరుగు జవాబు పంపించారు. ఇలాంటి అనేక అంశాలను పరిశీలించిన ఈసీ... జవహర్ రెడ్డి వ్యవహార శైలి నిష్పాక్షికంగా లేదని, కోడ్‌కు అనుగుణంగా నడుచుకోవడం లేదనే నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. వీటన్నింటిపై తమ సొంత మార్గాల్లో విచారణ జరిపిన తర్వాతే... జవహర్ రెడ్డిని సీఎస్ పోస్టు నుంచి తప్పించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

రాజేంద్రనాథ్ రెడ్డిపై...

పోలీస్ బాస్ కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డిపైనా బదిలీ వేటుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. పేరుకు ఆయన డీజీపీ అయినా పోలీస్ యంత్రాంగమంతా 'తాడేపల్లి' డైరెక్షన్‌లోనే నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. చిలకలూరిపేటలో ప్రధాని మోదీ పాల్గొన్న సభలో భద్రతపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారన్న విమర్శలున్నాయి. జిల్లా ఎస్పీలపై ఆయనకు పట్టు లేదనే ప్రచారం ఉంది. వీటన్నింటి నేపథ్యంలో కీలకమైన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను రాజేంద్రనాథ్ రెడ్డి సజావుగా, సమర్థంగా నిర్వహించలేరనే నిర్ణయానికి ఈసీ వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

దేశ చరిత్రలోనే ప్రథమం...

రాష్ట్రంలోని పరిస్థితులు, అధికార పార్టీ అరాచకాలు, వాటికి యంత్రాంగం సహకారం తదితర అంశాలను ఈసీ నిశితంగా పరిశీలిస్తోంది. ఇప్పటికే ఆరుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు ఐఏఎస్‌లను తప్పించింది. ఎన్నికల సమయంలో ఇంతమంది సీనియర్ ఆఫీసర్లను బదిలీ చేయడం ఈసీ చరిత్రలో మొదటిసారని అధికార వర్గాలు చెబుతున్నాయి. త్వరలో సీఎస్, డీజీపీతో పాటు మరో ఆరుగురు ఐఏఎస్, ఐపీఎస్‌లనూ బదిలీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

జగన్ సేవా పరాయణ..

జగన్మోహన్ రెడ్డికి జవహర్ రెడ్డి బాగా ప్రీతిపాత్రుడు. ఆయనకు పోస్టింగ్‌లు ఇవ్వడంలో సరికొత్త ఒరవడి సృష్టించారు. టీటీడీ ఈవోగా పని చేస్తున్న అధికారికి అదే సమయంలో మరో పోస్టింగ్ ఇచ్చిన దాఖలాలు రాష్ట్ర చరిత్రలో లేవు. కానీ... జవహర్ రెడ్డి టీటీడీ ఈవోగా ఉండగానే వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్‌గా, ఇరిగేషన్ స్పెషల్ సీఎస్‌గా నియమించారు. ఇవి చాలదన్నట్లు జవహర్‌ను జగన్ తన పేషీ హెడ్‌గా కూడా నియమించారు. ఆపై కొన్ని నెలలకే... సీనియర్ ఐఏఎస్‌లను పక్కన పెట్టి మరీ జవహర్ రెడ్డికి సీఎస్ పోస్టు కట్టబెట్టారు. దీని వల్లే ఆయన స్వామి భక్తిని ప్రదర్శిస్తూ జగన్‌కు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని... కింది స్థాయి అధికారులను ప్రభావితం చేస్తున్నారని ఈసీకి వరుస ఫిర్యాదులు అందాయి.

సిసోడియా, ద్వారకా తిరుమలరావుకు చాన్స్?

సీఎస్, డీజీపీపై వేటు పడిన పక్షంలో... వారి స్థానంలో ఆర్పీ సిసోడియా, ద్వారకా తిరుమలరావును నియమించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఐఏఎస్ సిసోడియా ప్రస్తుతం మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా ఉన్నారు. అంతకుముందు ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఆయన్ను జగన్ సర్కారు అకారణంగా బదిలీ చేసి, రెండు నెలలపాటు పోస్టింగ్ ఇవ్వలేదు. చివరికి అప్రాధాన్య పోస్టుగా భావించే మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమించింది. ఇక సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమలరావు ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్నారు.

సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లపై ఫిర్యాదులు

- వారి నుంచి వివరణ తీసుకున్నాం
- ఈసీ ఆదేశాల కోసం చూస్తున్నాం
- సీఈవో ముఖేశ్ కుమార్ మీనా



అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ తదితర ఉన్నతాధికారులపై ఫిర్యాదులు అందాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు వారినుంచి వివరణ తీసుకుని పంపినట్టు వివరించారు. ఈ అంశంపై ఈసీ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. మంత్రులకు వర్తించినట్లుగానే సలహాదారులకు కూడా కోడ్ వర్తిస్తుందన్నారు. గురువారం ఉదయం 11గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందన్నారు. 6 అసెంబ్లీ స్థానాలు మినహా మిగిలినచోట్ల ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో రెండు కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. గురువారం సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 44,163 మంది వలంటీర్లు రాజీనామా చేశారని, 1,017 మందిని విధుల నుంచి తప్పించామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.180 కోట్ల నగదు, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. రాష్ట్రంలోని 25 లోక్‌సభ, 175 శాసనసభ స్థానాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో సీఈవో మీనా లోక్‌సభ, శాసనసభలకు విడివిడిగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. లోక్‌సభ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే వారు ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల్లో నామినేషన్ పత్రాలు సమర్పించాలన్నారు. లోక్‌సభ అభ్యర్థి రూ.25వేలు, శాసనసభ అభ్యర్థి రూ.10వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఇందులో 50 శాతం చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు.

మీనా చెప్పిన మరిన్ని అంశాలు..

+ అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు, పాలకొండ, కురుపాం, సాలూరులో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరుగుతుంది. మిగిలిన చోట్ల ఉదయం 7- 6 గంటల వరకు కొనసాగుతుంది.

+ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, వీడియోగ్రాఫర్లు, డ్రైవర్లు మే 5నుంచి 10లోపు ఫెసిలిటేషన్ సెంటర్లలోనే తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

+ రాష్ట్రంలోని 67వేల మంది సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చు. 3.3 లక్షల మంది పోలింగ్ విధుల్లో ఉంటారు. 300 కంపెనీల బలగాలు రానున్నాయి. రాష్ట్రంలో 12,459 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటితో కలిపి 30,111 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. ఆ కేంద్రాల్లో రెండు కెమేరాలతో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తారు.

+ కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి వైసీపీకి చెందిన 136, టీడీపీకి చెందిన 126 మంది సహా ఇతరులపై 76 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.



రాజమహేంద్రవరంలో బస్ లోపల నుంచే జగన్ అభివాదం

బస్సు లోపల్నుంచే షో!

- ఓటు అడగలేదు..అభ్యర్థుల ఊసూ లేదు
- ఉమ్మడి గోదావరి జిల్లాలో చప్పగా జగన్ యాత్ర
- ఆసాంతం అభివాదాలతోనే సరి
- నుదుటికి ఉన్న బ్యాండేజ్ చూపిస్తూ సానుభూతి కోసం ప్రయత్నం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాలో సీఎం జగన్ బస్సు యాత్ర ఆయన పార్టీ శ్రేణులకు సైతం నిరాశనే మిగిల్చింది. జగన్ వస్తున్నారంటూ వైసీపీ నాయకులు గురువారం మధ్యాహ్నం నుంచే పలు కూడళ్లకు మహిళలను ఆటోల్లో తరలించారు. అయితే జగన్ ఎక్కడా బస్సు దిగలేదు. బస్ లోపల నుంచి షో చేశారంతే! నోరు తెరిచి ఓటు అడగలేదు. చివరకు అభ్యర్థుల ఊసూ ఎత్తకపోవడం వైసీపీ శ్రేణులను విస్మయానికి గురిచేసింది. ఒక పక్క ఎండ మండిపోతున్నా రూ.200 ఇచ్చి ఆటోల్లో తరలించిన జనం...జగన్‌ను చూసేందుకు వేచిఉన్నారు. అయినా ఆయన బయటకు మాత్రం రాలేదు. ఏసీ బస్ లోపల నుంచే అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. కనీసం గ్లాస్ కూడా తీయకపోవడంపై వైసీపీ కార్యకర్తలు నిరాశ చెందారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం తేతలి నుంచి జగన్ బస్సు యాత్రను ప్రారంభించారు. తణుకు బైపాస్‌లో ఒక్కచోట మాత్రమే బస్సు నుంచి బయటకు వచ్చారు. మిగిలిన సెంటర్లలో బస్సు లోపలి నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆయన యాత్ర కోనసీమ జిల్లాలోకి ప్రవేశించింది. ముఖ్య కూడళ్ల వద్ద మాట్లాతారని ఎదురుచూసినా జగన్... అభివాదంతోనే సరిపెట్టారు. కాగా పోలీసుల ఆంక్షలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. చంటి పిల్లలతో మహిళలు, వృద్ధులు ఎండకు అల్లాడిపోయారు. రావులపాలెం బస్టాండు ఇన్, అవుట్ గేట్లలో వైసీపీ నాయకులు వాహనాలను పార్కింగ్ చేయడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. అనంతరం ఆయన యాత్ర తూర్పుగోదావరి జిల్లా పెరవలి మీదుగా సిద్ధాంతం చేరింది. అక్కడ సీఎం బయటకు వచ్చి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రాజమహేంద్రవరం తాడితోట జంక్షనులో ఓ చిన్నారికి వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. ముగ్గురు పేపరు మిల్లు కార్మికులతో మాట్లాడారు. పొట్టిలంక నుంచి రాజానగరం వరకు మైకు అందుకుని మాట్లాడింది లేదు.నుదుటికి ఉన్న బ్యాండేజ్‌ను చూపిస్తూ సానుభూతిని పొందే ప్రయత్నం చేశారు.

బస్సు యాత్రలో 'అతి'

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో పోలీసులు భద్రత పేరిట జగన్ బస్సు యాత్రలో అత్యుత్సాహం ప్రదర్శించారు. వైసీపీ నాయకుడు జెట్టి గురునాథరావును బస్సులోకి వెళ్లకుండా కొద్దిసేపు అడ్డుకున్నారు. మహిళలను కొందరు మహిళా పోలీసులు బయటకు నెట్టేశారు.



శింగనమలలో పీసీసీ చీఫ్ నిర్వహించిన సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న షర్మిల

బటన్ నొక్కుడంతా జగన్మాయ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్ లేరు

జగన్ పాలనలో ఇసుక, మద్యం, మైనింగ్, భూ దందాలే

- కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా, పోలవరం: షర్మిల

అనంతపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బటన్ నొక్కుడంతా జగన్మాయని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆరోపించారు. ఒక చేత్తో మట్టి చెంబు ఇచ్చి... మరో చేత్తో వెండి చెంబు దోచేస్తున్నాడని సీఎం జగన్‌పై ఆమె మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా... ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిర, శింగనమల, ఉరవకొండ నియోజకవర్గాల్లో గురువారం ఏర్పాటు చేసిన న్యాయయాత్ర బహిరంగ సభల్లో ఆమె ప్రసంగించారు. అధికారంలోకి రావడానికి అనేక హామీలిచ్చారని, ఐదేళ్ల పాలనలో ఏ ఒక్కటీ నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో డీఎస్సీ అంటూ నిరుద్యోగ యువత జీవితాలతో జగన్ చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఐదేళ్లలో 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. మద్యనిషేధం అమలు చేసిన తర్వాతే ఓట్లు అడుగుతానని హామీ ఇచ్చిన జగనన్న.. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఇసుక, మద్యం, మైనింగ్, భూ దందాలతో దోచుకోవడంతోనే సరిపెట్టారని, ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ఏ ఒక్కరూ పనిచేయలేదని ఆరోపించారు. నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వార్టర్ బాటిల్ ధర రూ.60 అయితే.. ఈ ప్రభుత్వం రూ.200కు అమ్ముతోందని ధ్వజమెత్తారు. నకిలీ మద్యం తాగి మృతిచెందిన వారి కుటుంబాలకు ఏం సమాధానం చెబుతారని సీఎం జగన్‌ను నిలదీశారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ అయినా తీసుకొచ్చారా, ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా అని ప్రశ్నించారు. మూడు రాజధానులు కడతామని అంటున్నారని, ఒక్క రాజధాని అయినా కట్టారా? అని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్ లేరని, వై అంటే వైవీ సుబ్బారెడ్డి... ఎస్ సాయిరెడ్డి... ఆర్ అంటే సజ్జల రామకృష్ణారెడ్డి అని వివరించారు. కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి సాధ్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. ప్రతి మహిళ పేరిట రూ.5లక్షలతో పక్కా గృహం, పేద మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఆర్థికసాయం, వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పింఛను అందిస్తామని షర్మిల హామీ ఇచ్చారు. 'ఓటు వజ్రాయుధం. ఓటు మీ భవిష్యత్తు, మీ పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఒకటికి రెండుసార్లు ఆలోచించి ఓటు వేయండి' అని ప్రజలను కోరారు. ఎన్నికల్లో డబ్బు పంచడానికి వైసీపీ నాయకులు సిద్ధమయ్యారన్నారు. 'ఎంత డబ్బు ఇచ్చినా తీసుకోండి. ఆ డబ్బులన్నీ మీవే' అని అన్నారు. ప్రజలకు మంచిచేసే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

30 వరకు వివేకా హత్య ఊసెత్తవద్దు

- షర్మిల, సునీత, చంద్రబాబు, లోకేశ్, పవన్, పురందేశ్వరికి కడప జిల్లా కోర్టు ఆదేశం

కడప(రూరల్), ఏప్రిల్ 18: వివేకా హత్య కేసుపై ఈ నెల 30 వరకు బహిరంగంగా ప్రస్తావించరాదని ప్రతిపక్షాల నేతలను కడప జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉండగా.. వివేకాను ఎంపీ, వైసీపీ లోక్‌సభ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డి చంపారంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సునీత, టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, మాజీ ఎమ్మెల్సీ ఎం.రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ఆరోపణలు చేస్తున్నారని.. వారి ప్రస్తావన లేకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వైసీపీ కడప జిల్లా అధ్యక్షుడు కొత్తమద్ది సురేశ్‌బాబు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కడప జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.శ్రీదేవి 16న పైఉత్తర్వులు జారీచేశారు. వివేకా హత్య కేసులో సీఎం జగన్, అవినాశ్‌రెడ్డిపై 30వరకు ఎలాంటి ఆరోపణలు చేయవద్దని.. వారేగాక వారి పార్టీల శ్రేణులు, అభ్యర్థులను కూడా నియంత్రించాలని నిర్దేశించారు. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ఉన్న వివరాలు కూడా తొలగించాలని ఆదేశించారు. తదుపరి విచారణను 30కి వాయిదా వేశారు. 'వివేకా హత్య కేసు నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణలో ఉంది. ప్రస్తుతం కోడ్ అమలులో ఉంది. మా పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌రెడ్డిని ప్రకటించారు. పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి పోటీ చేయనున్నారు. వీరిద్దరిపై పై ఏడుగురూ పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. ఈ నెల నుంచి 7వరకు జరిగిన పలు రాజకీయ సమావేశాల్లో వైఎస్ షర్మిల, డాక్టర్ సునీత, చంద్రబాబు, లోకేశ్, పురందేశ్వరి, పవన్ కల్యాణ్, ఎం.రవీంద్రనాథరెడ్డి.. పదేపదే అవినాశ్‌రెడ్డే హత్య చేయించాడంటూ ఆరోపణలు చేశారు. కోర్టులో ఉన్న అంశంపై బహిరంగంగా మాట్లాడడం నిబంధనలకు విరుద్ధం. పైగా ఇప్పుడు కోడ్ అమలులో ఉంది. ఈ నేపథ్యంలో వారు వివేకా హత్య గురించి బహిరంగంగా ప్రస్తావించకుండా ఆదేశాలివ్వండి' అని పిటిషనర్ తరఫు న్యాయవాదులు ఎం.నాగిరెడ్డి, కేఎస్ సుదర్శన్‌రెడ్డి కోర్టును కోరారు.

ఉండి నుంచే రఘురామ పోటీ

- టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా రామరాజు
- నలుగురు అసెంబ్లీ అభ్యర్థుల మార్పు
- దెందులూరుపై కొనసాగుతున్న సస్పెన్స్
- పార్టీ అభ్యర్థులకు ఎల్లుండి బీ-ఫాంలు
- రేపు నెల్లూరు జిల్లాలో బాబు ప్రజాగళం



అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రకటించిన వారిలో నలుగురు అసెంబ్లీ అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ మార్చింది. గురువారమిక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జోనల్ ఇన్‌చార్జుల సమావేశంలో పార్టీ అధినేత చంద్రబాబు ఈ విషయం తెలియజేశారు. తాజా మార్పుల ప్రకారం నరసాపురం సిటింగ్ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు అదే జిల్లా పరిధిలోని ఉండి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేయనున్నారు. ఆ ఎంపీ స్థానం పొత్తులో బీజేపీకి వెళ్లింది. రఘురామ కోసం ఆ సీటును తమకివ్వాలని చంద్రబాబు కోరినా బీజేపీ నాయకత్వం సమ్మతించలేదు. తమ అభ్యర్థి శ్రీనివాస వర్మకు గురువారం బీ-ఫాం కూడా అందజేసింది. దీంతో రఘురామను ఉండి అసెంబ్లీ స్థానంలో పోటీ చేయించాలని చంద్రబాబు నిర్ణయించారు. అక్కడ టీడీపీ తమ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజును ఇదివరకే ప్రకటించింది. ఆయనకు నచ్చజెప్పి పోటీ నుంచి విరమింపజేసే బాధ్యతను చంద్రబాబు తమ పార్టీ నేతలకు అప్పగించారు. ఈ క్రమంలో రామరాజును పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని నిర్ణయించారు.

1 అనకాపల్లి జిల్లాలోని మాడుగులలో కూడా టీడీపీ తమ అభ్యర్థిని మార్చింది. ఇక్కడ అంతకు ముందు ప్రవాసాంధ్రుడు పైలా ప్రసాదరావుకు సీటిచ్చారు. కానీ ఆయన క్షేత్రస్థాయిలో ప్రచారంలో వెనుకబడ్డారని అధినాయకత్వానికి నివేదికలు అందాయి. దీంతో ఆయన్ను మార్చి సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని అభ్యర్థిగా ఎంపిక చేశారు.

1 శ్రీసత్యసాయి జిల్లా మడకశిర(ఎస్సీ)లో ప్రస్తుత అభ్యర్థి అనిల్ కుమార్‌ను మార్చాలని నిర్ణయించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి వర్గం గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఈ సీటును పార్టీ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు ఇవ్వనున్నారు. ఈయనది అనంతపురం జిల్లాయే. ఈయన్ను తొలుత బాపట్ల (ఎస్సీ) లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించాలనుకున్నా.. కుదరలేదు.

1 అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డిని కూడా మార్చబోతున్నారు. ఆయన ప్రచార రంగంలో వెనుకబడిపోయారు. పైగా ప్రత్యర్థి శిబిరంతో ఆయనకు వ్యాపార సంబంధాలున్నాయన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. దీంతో అభ్యర్థిని మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యామ్నాయంగా మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మాలపాటి రమేశ్ సతీమణి సరళారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, చిప్ తయారీ బహుళ జాతి సంస్థలో ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న కొండా నరేంద్ర పేర్లు వినిపిస్తున్నాయి. శుక్రవారం తుది నిర్ణయం జరిగే అవకాశం ఉంది.

దెందులూరుపై ఉత్కంఠ

ఏలూరు జిల్లా దెందులూరు అసెంబ్లీ స్థానంపై ఉత్కంఠ నెలకొంది. తమకు ఇచ్చిన అనపర్తి సీటును టీడీపీకి తిరిగి ఇవ్వాలంటే తమకు దెందులూరు ఇవ్వాలని బీజేపీ నాయకత్వం షరతు విధించింది. అయితే ఇక్కడ టీడీపీ ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ ఒత్తిడితో ప్రభాకర్‌కు నచ్చజెప్పడానికి టీడీపీ నాయకత్వం పార్టీ నేతలను ఆయన వద్దకు పంపింది. కానీ ఆయన తప్పుకోవడానికి ఇష్టపడలేదు. అక్కడి పార్టీ నేతలు కూడా ఆయనకే గట్టిగా మద్దతిస్తున్నారు. ఏలూరు లోక్‌సభ అభ్యర్థి పుట్టా మహేశ్ యాదవ్ సైతం చింతమనేనిని మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

మరో 3-4 మార్పులు?

ఇంకో 3-4 స్థానాల్లో మార్పులు చేయాలని టీడీపీ నాయకత్వం యోచిస్తోంది. కడప జిల్లా కమలాపురం, తిరుపతి జిల్లా వెంకటగిరిలో పార్టీ ఇన్‌చార్జులకు బదులు వారి పిల్లలకు టికెట్లు ఇచ్చారు. ఈ రెండు చోట్లా తిరిగి వారి తండ్రులకే ఇస్తే బాగుంటుందని సూచనలు వచ్చాయి. మార్పులు ఏవైనా ఉంటే శనివారం నాటికి స్పష్టత వస్తుందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

ప్రతి ఇంటికీ 4 సార్లు వెళ్లాలి!

పోలింగ్ ముగిసేలోపు అసెంబ్లీ అభ్యర్థులు తమ పరిధిలోని ప్రతిఇంటికీ కనీసం నాలుగుసార్లు వెళ్లాలని చంద్రబాబు నిర్దేశించారు. పార్టీ ఇచ్చిన హామీలను వారికి వివరించాలని పార్టీ జోనల్ ఇన్‌చార్జులతో భేటీలో ఆదేశించారు. 'అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లేలా చూడాల్సిన బాధ్యత మీది. జనసేన, బీజేపీ పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలి. అవి మన సొంత నియోజకవర్గాలుగా భావించి ఆ అభ్యర్థులను గెలిపించి తీసుకురావాలి. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురండి. ఈనెల రోజులూ పార్టీ పర్యవేక్షక యంత్రాంగం 24 నాలుగు గంటలూ పనిచేయాలి' అని ఆయన స్పష్టం చేశారు.

21న టీడీపీ అభ్యర్థులకు బీ ఫారాలు

టీడీపీ నాయకత్వం తమ అభ్యర్థులకు బీ ఫారాలను ఈ నెల ఆదివారం (21న) పంపిణీ చేయనుంది. తమ అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థులను ఆ రోజున కేంద్ర కార్యాలయానికి పిలిపించి ఇవ్వాలని నిర్ణయించారు. అదే రోజు వారితో ప్రమాణ స్వీకార కార్యక్రమం కూడా నిర్వహిస్తారు. కాగా.. శనివారం చంద్రబాబు పుట్టినరోజు. ఆయన ఆ రోజు నెల్లూరు జిల్లాలో ప్రజా గళం సభల్లో పాల్గొననున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. సర్వేపల్లి, ఆత్మకూరు, గూడూరు నియోజకవర్గాల్లో ఆయన సభలు ఉంటాయని అంటున్నారు. ఇప్పటివరకూ రోజుకు రెండు సభలు పెడుతున్నారు. ఆ రోజు మాత్రం మూడు పెట్టే ఆలోచన నడుస్తోంది.

'ఎర్రచందనం స్మగ్లర్ అను నేను'

- అఫిడవిట్‌లో అంగీకరించిన వైసీపీ అభ్యర్థి
- చిత్తూరులో నామినేషన్ వేసిన విజయానందరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో తనపై ఉన్న ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులతోపాటు మద్యం అక్రమ రవాణా కేసులను కూడా వివరించారు. దీంతో 'ఎర్రచందనం స్మగ్లర్' అని ఆయనే స్వయంగా ఒప్పుకొన్నట్టయింది. విజయానందరెడ్డిపై ఏకంగా 12 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులున్నాయి. పేరుమోసిన ఎర్రచందనం స్మగ్లర్ అయిన ఈయన తన జీవితాన్ని డ్రైవరుగా ప్రారంభించారు. ఎర్రచందనం, మద్యం అక్రమ రవాణా కారణంగా అనతికాలంలోనే ఆర్థికంగా స్థిరపడ్డారు. రాజకీయ నాయకుడి అవతారమెత్తారు. 2014,19 ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలోని వైసీపీ అభ్యర్థులకు పెట్టుబడి పెట్టారని సమాచారం. 2014లో అప్పటి ప్రభుత్వం ఈయనపై పీడీ చట్టం ప్రయోగించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపింది. విజయానందరెడ్డికి మొదటి నుంచి జగన్‌తో మంచి సంబంధాలున్నాయి. 2014 జనవరి 23న కొత్రాలపల్లెలో ఉన్న విజయానందరెడ్డి ఇంటికి కూడా జగన్ వెళ్లారు. పూతలపట్టులో జరిగిన సిద్ధం సభలో 'విజయానందరెడ్డి మంచివాడు, సౌమ్యుడు' అని జగన్ కితాబిచ్చారు. బలిజ సామాజికవర్గానికి చెందిన ఆరణి శ్రీనివాసులును కాదని విజయానందరెడ్డికి జగన్ టికెట్ కేటాయించారు.

ఇదీ.. కేసుల చిట్టా: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు పోలీస్ స్టేషనులో 39-2014 ఎఫ్ఐఆర్ నెంబరుతో, జీడీనెల్లూరు స్టేషన్‌లో 33-2014, కేవీపల్లెలో 77-2013, 3-2014, బంగారుపాళ్యంలో 35-2014, 74-2014, చిత్తూరు వన్‌టౌన్‌లో 73-2014, 75-2014, 101-2014, పెనుమూరులో 58-2014, గుడిపాలలో 86-2015, ఎస్ఆర్‌పురంలో 78-2014 ఎఫ్ఐఆర్ నంబర్లతో ఎర్రచందనం స్మగ్లింగ్ చేశారనే కేసులు నమోదయ్యాయి. హైదరాబాదులోని సీబీడీ స్టేషన్లో 51-2014 ఎఫ్ఐఆర్ నెంబరుతో మద్యం అక్రమ రవాణా కేసు ఉంది. తాజాగా 82-2024 ఎఫ్ఐఆర్ నంబరుతో చిత్తూరు 2 టౌన్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే కేసు నమోదైంది. ఈ కేసులన్నింటి వివరాలను విజయానందరెడ్డి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

స్మగ్లర్‌కు టికెట్టా?: వరుణ్


తిరుపతి వన సంపదను కొల్లగొట్టిన విజయానందరెడ్డికి చిత్తూరు వైసీపీ టికెట్ ఇచ్చారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ విమర్శించారు. ఆయన నామినేషన్ కూడా వేశారని, ఇలాంటి వ్యక్తులకు రాజకీయ సమాధి కట్టాలి' అని వరుణ్ పిలుపునిచ్చారు.

ప్రజా అజెండా

జన కేతనం

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ◇ 19-4-2024





పల్నాడులో అరాచకం

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మాచర్లలో టీడీపీ వారిని నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతో అక్కడికి వెళ్లిన టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్నల కారుపై వైసీపీ నేత తురగా కిషోర్ ఆయన అనుచరులు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

మాచర్లలో టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిపై వైసీపీ మూకలు హత్యాయత్నానికి పాల్పడి అరాచకం సృష్టించారు. స్థానిక టీడీపీ కార్యాలయాన్ని, బ్రహ్మారెడ్డి నివాసాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టారు. టీడీపీ కార్యకర్తల ఇళ్లను లూటీ చేసి, ఐదు కార్లను తగలబెట్టారు.

రాయి తగిలితే ఎవరికైనా నొప్పి పుడుతుంది!
గాయమైతే ఎవరికైనా రక్తమే కారుతుంది!
బాధ కలిగితే ఏ కంటి నుంచైనా కన్నీరే వస్తుంది!

కానీ... ఇక్కడా జగన్‌ది 'రివర్స్' రాజకీయమే!

మీరు రాళ్లు చెప్పులు విసిరితే ఆనందరావాలు!
మీపై గులకరాయి పడితే మాత్రం ఆర్తనాదాలు!
మీరు గాయం పెడితే 'ఆహా'కారాలు...
మీకే గాయమైతే హాహాకారాలు!

● జగన్‌పై రాయీ నిరసనేనా?

'భూమి అభివృద్ధి చేయలేదని చంద్రబాబుపై ఒక రియల్టర్ చిన్న రాయి విసిరారు. మరోచోట కొందరు రైతులు నిరసనగా చెప్పులు విసిరారు. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. నిరసన వ్యక్తం చేయడం వారి వ్యక్తిగతం. వాళ్ల మాట కూడా వినండి!'

- ఇది అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్ చెప్పిన మాటలు.

? ఇప్పుడు 'గులకరాయి'తో దాడిని కూడా నిరసనలో భాగమని ఊరుకోవచ్చు కదా!? హత్యాయత్నం కేసు ఎందుకు పెట్టారు? 'అనుమానితుల'కోసం ఎందుకు జల్లెడ పడుతున్నారు?

గులకరాయితో గాయం చేయడం నేరమే! కానీ...
ఐదేళ్లలో మీరు చేసిన ఘోరాలెన్ని?
తగిలిన గాయాలెన్ని? పోయిన ప్రాణాలెన్ని?

? గులకరాయి గాయంపై వాపోతున్న జగన్ ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతారా?

కంటిపైన రాయి గాయంపై 'ఘోరం, నేరం' అని గగ్గోలు పెడుతున్న జగన్... సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి నరికి చంపించిన వారిని కాపాడటం లేదా?



మరిచిపోయారా జగన్?

నడిరోడ్డుపై నరికివేతలు, చంపేసి శవం డోర్ డెలివరీలు, విపక్షం సభలకు హాజరైనందుకే హత్యలు, దాడులు... ప్రజా ప్రతినిధులపై పట్టపగలే కర్రలతో దాడులు, ఇళ్లపై పడి చేసిన విధ్వంసాలు...

ఇవన్నీ మరిచిపోయారా?
ఈ అరాచకాలు చేసిందెవరు?
ఈ దౌర్జన్యాలపై ఒక్కసారైనా స్పందించలేదే?
విధ్వంసం కూడదని పార్టీ శ్రేణులకు నచ్చజెప్పలేదే?
వైసీపీ రక్త చరిత్రను రాస్తే పెద్ద పుస్తకం... తీస్తే మెగా సీరియల్ అవుతుంది. అందులో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే...

మీకు తగిలితే ఆర్తనాదాలు.. మీరే కొడితే ఆనందాలు

పైశాచికానందం!

ఐదేళ్లలో మీరు చేసిన గాయాలెన్ని.. తీసిన ప్రాణాలెన్ని?



చంద్రబాబుపై అనేక దాడులు

- రక్షణగా నిలిచిన కమాండోలకు గాయాలు
- డీజీపీ ఆఫీసు పక్కనే టీడీపీ కార్యాలయంపై దాడి
- దళిత డ్రైవర్‌ను చంపేసి డోర్ డెలివరీ
- అన్యాయాన్ని ప్రశ్నించిన బీసీ నేత హత్య
- జై జగన్ అనలేదని మరో నేత గొంతుకోశారు
- చివరకు సామాన్యులపైనా దాష్టీకం
- సీఎం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి

● జై జగన్ అనలేదని..


చంద్రయ్యను హత్య చేస్తున్న వైసీపీ నేతలు

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన వెనుకబడిన వర్గ (బీసీ) సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేత తోట చంద్రయ్యను వైసీపీ కార్యకర్తలు దారుణంగా చంపేశారు. టీడీపీకి మద్దతుగా ఉండటంతో పాటు జై జగన్ అని చంద్రయ్య అనకపోవడమే ఇందుకు కారణం. 2022 జనవరి 13న గుండ్లపాడులో వైసీపీ ఎంపీపీ శివరామయ్య తన ఇంటి ముందు బైకుపై వెళ్తున్న చంద్రయ్యపై తన కొడుకుతో కలిసి దాడి చేశాడు. కత్తితో చంద్రయ్య గుండెలపై పొడిచి, ఆ తర్వాత గొంతు కోసి కిరాతకంగా చంపేశాడు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి దాడికి ప్రేరేపించినట్టు ఆరోపణలు వచ్చాయి.


చంద్రయ్య పాడె మోస్తున్న చంద్రబాబు

దళిత డ్రైవర్‌ను చంపేసి..



దళిత డ్రైవర్‌ను చంపేసి, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన సంఘటన కూడా వైసీపీ పాలనలో జరిగింది. 2022 మే 18న అర్ధరాత్రి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తనవద్ద పనిచేస్తున్న కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని కాకినాడ బీచ్‌రోడ్డులో హత్య చేసినట్లు ఆరోపణలున్నాయి. ఎమ్మెల్సీ తన కారులో స్వయంగా డ్రైవర్ మృతదేహాన్ని అతడికి ఇంటికే తీసుకెళ్లారు. ఈ కేసులో అనంతబాబు జైలు నుంచి విడుదలైనపుడు వైసీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికి మరీ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతేగాక సీఎం జగన్, మంత్రులు బహిరంగ సభలో అనంతబాబును పక్కన పెట్టుకుని తిరుగుతున్నారు.

● చంద్రబాబుపై వరుస దాడులు


వైసీపీ నేతల రాళ్ల దాడిలో గాయపడ్డ ఎన్ఎస్‌జీ కమాండో

గత ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై జరిగినన్ని దాడులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు బహుశా దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఏ ప్రతిపక్ష నేతపైనా జరగలేదేమో! వైసీపీ మూకలు ఏకంగా ఆయన ఇంటిపైకే దండయాత్రకు వెళ్లాయి. డీజీపీ కార్యాలయానికి, సీఎం జగన్ నివాసానికి అత్యంత చేరువలో ఉన్న చంద్రబాబు ఇంటిపై వైసీపీ మూకలు దాడి చేశాయి. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో రౌడీలు దాడికి దిగారు. ఇందుకు కానుకగా జోగి రమేశ్‌కు జగన్ మంత్రి పదవి ఇచ్చారు. డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. పార్టీ కార్యకర్తలు, కార్యాలయ సిబ్బందిపై ఇష్టానుసారం దాడి చేసి కొట్టారు. ఫర్నీచర్‌ను, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. రాజధాని ప్రాంతంలో చంద్రబాబు బస్సు యాత్ర నిర్వహిస్తుండగా పోలీసుల సాక్షిగా వైసీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో దాడి చేశాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రోడ్ షో సందర్భంగా చంద్రబాబు కాన్వాయ్‌పై కొందరు ఆగంతకులు రాళ్లతో దాడి చేశారు. ఎన్ఎస్‌జీ కమాండోలు ఆయన చుట్టూ చేరి భద్రత కల్పించారు. ఈ దాడిలో చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధు తలకు గాయమై రక్తస్రావమైంది. ఈ ఘటనను పోలీసులు చాలా తేలిగ్గా తీసుకున్నారు. 'ఇదంతా డ్రామా. చంద్రబాబే రాళ్లు వేయించుకున్నారేమో'అని వైసీపీ నేతలు హింసానందం పొందారు.

● మంత్రి సురేశ్ చొక్కావిప్పి..

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో చంద్రబాబు రోడ్‌షో సందర్భంగా ఆయన కాన్వాయ్‌పై మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. నల్ల దుస్తులు ధరించిన మంత్రి సురేశ్ చొక్కా విప్పి అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ కార్యకర్తలను రెచ్చగొట్టారు. వాళ్లు చంద్రబాబు కాన్వాయ్‌పై చెప్పులు, రాళ్లు విసిరారు. చంద్రబాబుపై పడకుండా ఎస్ఎస్‌జీ కమాండోలు రక్షణ కవచంలా నిలిచారు. రాళ్ల దాడిలో కమాండో సంతోష్‌కుమార్ తలకు గాయం కాగా, టీడీపీ కార్యకర్త, దళితుడు చేలూరి రాజయ్య (66) మృతిచెందాడు.

● అధికారుల సాక్షిగా బీసీ నేత దారుణహత్య

సీఎం జగన్ సొంత జిల్లాలో చేనేత సామాజిక వర్గానికి చెందిన టీడీపీ అధికార ప్రతినిధి నందం సుబ్బయ్య (41) పట్టపగలే అందరూ చూస్తుండగా దారుణహత్యకు గురయ్యారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపణలు చేసిన కొన్ని రోజులకే ఈ దారుణం జరిగింది. 2020 డిసెంబరు 29న ప్రొద్దుటూరు శివారున మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇతర అధికారులు భూమి పూజ కార్యక్రమానికి వచ్చారు. పట్టాల మంజూరులో పేదలకు అన్యాయం జరుగుతోందని, అందరికీ న్యాయం చేయాలని వారిని సుబ్బయ్య కోరారు. ఆ తర్వాత కాసేపటికే కొందరు ఆయన కళ్లలో కారం చల్లి తలపై ఇనుప రాడ్లతో దాడి చేసి చంపేశారు. ఎమ్మెల్యే, ఆయన బావమరిది హత్య చేయించారని సుబ్బయ్య భార్య ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు.


ప్రొద్దుటూరులో హత్యకు గురైన నందం సుబ్బయ్య



కన్ను పొడిచేసినా..

2022 సెప్టెంబరు 3న విజయవాడలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీపై వైసీపీ నేతలు పదునైన వస్తువుతో దాడి చేయడంతో ఆయన కుడికన్ను తీవ్రంగా గాయపడింది. ఆ తర్వాత కన్ను తొలగించాల్సి వచ్చింది. పోలీసులు నిందితులపై తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. పరస్పర దూషణలు జరిగి అనుకోకుండా దాడి చేశారని సీపీ కాంతి రాణా చెప్పడం తీవ్ర వివాదాస్పదమైంది.

మూక దాడి మీది కాదా..


రాప్తాడు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి దృశ్యాలు

ప్రతిపక్ష నేతలు, సామాన్యులతో పాటు మీడియా ప్రతినిధులపైనా వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. ఫిబ్రవరి 18న అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభకు కవరేజీకి వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణా రహితంగా దాడి చేసి, హత్య చేసేందుకు ప్రయత్నించారు. కెమెరా, సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. 'వీడు ఆంధ్రజ్యోతి వాడు.. చావకొట్టండ్రా' అంటూ మూకుమ్మడిగా శ్రీకృష్ణపై విరుచుకుపడ్డారు. కర్రలు, రాళ్లతో దాడి చేస్తూ.. కాళ్లతో విచక్షణారహితంగా తన్నారు. శ్రీకృష్ణను కాపాడేందుకు ప్రయత్నించిన ఓ పోలీసు అధికారిపైనా దాడికి వెళ్లారు. పోలీసు జీపులో తరలించబోగా.. రాళ్లు రువ్వారు. అప్పట్లో దాడిని దేశవ్యాప్తంగా ఖండించారు. సీఎం జగన్ మాత్రం స్పందించలేదు. వీడియో ఆధారాలు ఉన్నా.. కేవలం ముగ్గురిపై కేసు పెట్టారు. ఒకరిని మాత్రమే అరెస్టు చేసి.. మరో ఇద్దరిని వదిలేశారు.

● అంగళ్లులో దాష్టీకం



అంగళ్లులో వైసీపీ శ్రేణుల రాళ్లదాడి సందర్భంగా చంద్రబాబుకు ఎన్ఎస్‌జీ కమాండోల రక్షణ

గత ఏడాది ఆగస్టు 4న చంద్రబాబు అన్నమయ్య జిల్లా పర్యటనకు వచ్చినపుడు తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో వైసీపీ నాయకులు రాళ్ల దాడి చేసి విధ్వంసం సృష్టించారు. ఎన్ఎస్‌జీ సిబ్బంది వెంటనే స్పందించి రక్షణగా నిలవడంతో ఆయనకు దెబ్బలు తగలలేదు. ఆ రోజు ఉదయం నుంచే వైసీపీ అల్లరి మూకలు పర్యటనను అడ్డుకునేందుకు నానా బీభత్సం చేసినా పోలీసులు అడ్డుకోలేదు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో వైసీపీ శ్రేణులు విధ్వంసానికి పాల్పడ్డారు. రాళ్ల దాడిలో పలువురు టీడీపీ కార్యకర్తలు, పోలీసులు గాయపడ్డారు.

● అక్కను వేధించారని ప్రశ్నించినందుకు



తన అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించిన పాపానికి వెనుకబడిన తరగతులకు చెందిన అమర్నాథ్ గౌడ్ అనే పదో తరగతి విద్యార్థిపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. గతేడాది జూన్ 16న బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజోలులో ఈ దారుణం జరిగింది. ఈ కేసులో ఏ1 నిందితుడు వెంకటేశ్వరరెడ్డి వైసీపీ సానుభూతిపరుడిగా ఉన్నాడు. ఈ కేసులో నిందితులంతా దర్జాగా బెయిల్‌పై బయట తిరగడమే గాక మళ్లీ బాధిత కుటుంబాన్నే భయభ్రాంతులకు గురిచేశారు.

● చేయని నేరానికి కుటుంబం బలి

ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో సలాం కుటుంబం



వైసీపీ నేతల నిర్వాకంతో చేయని నేరానికి ఓ కుటుంబం బలైంది. 2020 నవంబరు 3న నంద్యాలలో మైనారిటీ వర్గానికి చెందిన అబ్దుల్ సలాం తన కుటుంబంతో కలసి ఆత్మహత్య చేసుకున్నాడు. దొంగతనం చేసినట్టు ఒప్పుకోవాలని వైసీపీ నేతల ఒత్తిడితో పోలీసులు వేధించడమే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి. సలాం తన భార్య, పాఠశాలకు వెళ్లే కుమార్తె, కుమారుడితో కలసి గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు సలాం తన కుటుంబ సభ్యులతో కలసి తీసుకున్న సెల్ఫీ వీడియో బయట పడటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

జన కేతనం

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024

ఓటు అనేది తుపాకీ లాంటిది. దాన్ని ఎలా ఉపయోగించాలో వి నియోగించే వ్యక్తి స్వభావంపై ఆధారపడి ఉంటుంది.
- థియోడర్ రూజ్‌వెల్ట్



అబ్బ ఛా!

జగన్ వస్తుంటే ఎండలూ.. పరార్!

జగన్మోహన్ రెడ్డి ప్రచార సభలకు మండుటెండను సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది తరలివస్తున్నారు. జగన్ కోసం వస్తున్న జన ప్రభంజనాన్ని చూసి ఎండలు కూడా భయపడుతున్నాయి.

- జోగి రమేశ్, మంత్రి

మద్య నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న జగన్

ఓటెలా.. అడుగుతావన్నా?

ఐదేళ్లు గడిచినా అడ్రస్ లేని నిషేధం ఊసు

పైగా ఐదేళ్లలో లక్ష కోట్ల మద్యం అమ్మకాలు

మద్య నిషేధం కాదట.. 'నియంత్రణ'యేనట!



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'లక్ష కోట్ల మద్యం అమ్మకాలు'....ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఏ ముఖ్యమంత్రి హయాంలోనూ వినని మాట ఇది. విచిత్రంగా ఏ సీఎం అయితే సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానన్నాడో ఆయన ఐదేళ్ల పాలనలోనే ఈ లక్ష కోట్ల ఫీటును ప్రభుత్వం అందుకుంది. జీడీపీ, అభివృద్ధి సంగతెలా ఉన్నా మద్యం తాగించడంలో అరుదైన ఘనతను జగన్ ప్రభుత్వం సాధించింది. రాష్ట్ర ప్రజలకు ఏకంగా రూ.1,24,312 కోట్ల మద్యాన్ని విక్రయించారు.



ప్రభుత్వం చేతికి వ్యాపారం

మద్యం వ్యాపారం ప్రారంభమైన నాటినుంచీ మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే ఉన్నాయి. అయితే మొత్తం వ్యాపారం మన చేతిలోనే ఉంటే కావాల్సిన బ్రాండ్లు అమ్ముకోవచ్చని భావించిన జగన్... మద్యం షాపులను ప్రభుత్వం చేతిలో పెట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రభుత్వ మద్యం షాపులు ఏర్పాటుచేశారు. ఈ షాపుల్లో ఏ బ్రాండ్ అమ్మాలన్నది ప్రభుత్వ పెద్దల ఇష్టంగా మారింది. చివరకు సర్కారు తెచ్చిన కొత్త బ్రాండ్ల పేర్లు పలకలేక రూ.150 సీసా, రూ.200 సీసా అంటూ మద్యం ప్రియులు రేట్ల పేరుతో మద్యం కొనే పరిస్థితి!

'దశలవారీ'గా ఇలాగేనా?

దశలవారీగా సంపూర్ణ మద్య నిషేధం చేస్తానని జగన్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా 4,380 మద్యం షాపులను 3,500కు తగ్గించారు. ఆ తర్వాత రెండో సారి షాపుల సంఖ్యను 2,934కు కుదించారు. ఇక ఆ తర్వాత షాపుల సంఖ్య తగ్గింపు జోలికి వెళ్లలేదు. 4,380 షాపులు ఉన్నప్పుడు రోజుకు రూ.50కోట్ల మద్యం అమ్మితే, 2,934 షాపులు ఉన్నప్పుడు రోజుకు రూ.70కోట్ల మద్యం అమ్మకాలు జరగడం గమనార్హం. అంటే.. మద్య నిషేధం జగన్ పాలనలో లేనట్టేగా! తెలివిగా 'మద్య నిషేధం' స్థానంలో 'మద్య నియంత్రణ' అనే పదాన్ని జగన్ ప్రభుత్వం పెట్టింది.

ధరలపై దోబూచులాట

అధికారంలోకి వచ్చాక మద్యం ధరలు షాక్ కొట్టేలా చేస్తానని చెప్పిన జగన్, దానిపైనా పిల్లి మొగ్గలు వేశారు. ఒకసారి ధరలు భారీగా పెంచిన ప్రభుత్వం క్రమంగా ఆ ధరలను తగ్గిస్తూ వచ్చింది. అంతిమంగా మద్యంపై ఆదాయమే లక్ష్యం అన్నట్టుగా 2021 డిసెంబరు నుంచి మొత్తం ధరలు తగ్గించేసి మద్యం విక్రయాల జోరును పెంచేశారు. వాస్తవానికి, అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రభుత్వం మద్యం రేట్లు 25శాతం పెంచింది. కొవిడ్ కారణంగా 43 రోజులు మూతబడి షాపులు తిరిగి తెరుచుకున్న సమయంలో జనం మందు కోసం ఎగబడ్డారు. దీనిపై విమర్శలు రావడంతో 75శాతం ధరలు పెంచారు. దానివల్ల ఆదాయం పడిపోవడంతో.. ఆ తర్వాత రెండు నెలల్లోనే 25శాతం తగ్గించారు. అయినా 'ఊపు' లేకపోవడంతో.. ఆ తర్వాత ఆరు నెలల్లో మళ్లీ 25శాతం తగ్గించారు. అలా ఏడాదిన్నర కాలంలో పెంచిన ధరలను తిరిగి యథాతథ స్థితికి తీసుకొచ్చారు.

డిస్టిలరీలను లాక్కున్నారు

మద్యం విక్రయాలను ప్రభుత్వం చేపడితే... మద్యం తయారీని ప్రభుత్వ పెద్దలు చేజిక్కించుకున్నారు. కొన్ని డిస్టిలరీల యాజమాన్యాలను భయపెట్టి, బెదిరించి లాక్కున్నారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి డిస్టిలరీని అధికార పార్టీ పెద్దలు తీసేసుకున్నారు. అలాగే తమిళనాడుకు చెందిన ఎస్ఎన్‌జే కంపెనీకి అపరిమితంగా ఆర్డర్లు ఇచ్చి మిగిలిన డిస్టిలరీలు, బ్రాండ్లను వీలైనంత మేర తొక్కేశారు. మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డికి చెందిన అతి పెద్ద డిస్టిలరీ కూడా వైసీపీ నేతల కనుసన్నల్లో నడుస్తోంది. తమ మాట వినలేదని శ్రీకాకుళం జిల్లాలోని ఒక బ్రూవరీ (బీరు తయారీ కేంద్రం)ని మూతవేయించారు. మరోవైపు కాసులు వెనకేసుకోవడమే లక్ష్యంగా నాసిరకం మద్యాన్ని వైసీపీ ప్రభుత్వం విక్రయించింది. ఆ మద్యం తాగిన వారు కడుపులో మంట వంటి సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. కొత్త బ్రాండ్లపై వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు 2022 మార్చిలో తమిళనాడుకు చెందిన ఎస్‌జీఎస్ లేబొరేటరీస్‌తో పరీక్షలు చేయించారు. ఆ బ్రాండ్లలో స్లో పాయిజన్ లాంటి హానికర రసాయనాలు ఉన్నట్లు ఎస్‌జీఎస్ తన నివేదికలో వెల్లడించింది.

ఊరూవాడా బెల్టులు

గత ప్రభుత్వంలో 'బెల్టులపై ఉక్కుపాదం' పేరుతో డ్రైవ్ చేపట్టి బెల్టు షాపులను సమూలంగా తొలగించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చేనాటికి చాలావరకు బెల్టులు లేవు. అయినా తమ ప్రభుత్వం 43వేల బెల్టులు తొలగించిందని జగన్ చెబుతుంటారు. కానీ ఎక్కడ తొలగించారనే వివరాలను ఐదేళ్లలో ఒక్కసారి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. సింపుల్‌గా 4380 షాపులకు పది చొప్పున బెల్టులు ఉన్నట్లు లెక్కగట్టి 43వేలు తొలగించేశాం అని ప్రకటించుకుంది. ఈ ప్రభుత్వం వచ్చాక కొవిడ్ వరకూ పరిస్థితి బాగానే ఉన్నా ఆ తర్వాత ఊరూవాడా బెల్టులు గతం కంటే రెట్టింపు స్థాయిలో వెలిశాయి.

వైసీపీ హయాంలో అమ్మకాలు... కేసులు లక్షల్లో

సంవత్సరం	లిక్కర్	బీరు	విలువ(కోట్లలో)	ఆదాయం(కోట్లలో)
2019-20	308.53	212.92	20,909	17,707
2020-21	186.47	57.57	20,189	17,966
2021-22	263.74	81.54	25,023	21,549
2022-23	335.98	116.76	28,113	21,823
2023-24	346.69	117.08	30,078	23,806

ఈ బ్రాండ్ల పేర్లు విన్నారా?

ఆంధ్రాగోల్డ్, బీబీ స్ప్లెండర్స్, ధారూ హౌస్, రాయల్ ప్యాలెస్, హైదరాబాద్ బ్లూ, గోల్డెన్ స్ట్రిప్స్, సిల్వర్ స్ట్రిప్స్, మెలీసా బ్రాందీ, గ్రీన్ ఛాయిస్, 9సీ హార్సెస్, క్లాసిక్ బ్లూ, రాయల్ రైట్, గోల్డెన్ కింగ్ డీలక్స్ ఓల్డ్ ఫైన్ విస్కీ...

నోట్ దిస్ పాయింట్!



18-19 ఏళ్ల వయసున్న కొత్త ఓటర్లు **8,13,544**

80 ఏళ్లు పైబడినవారు **5,76,791**

దివ్యాంగ ఓటర్లు **4,87,594**

ది లీడర్



దటీజ్ మహాలక్ష్మి!

పైసా పంచలేదు... మందు పోయలేదు

ఆయన... ఓటర్లకు సొమ్ములు పంచలేదు. మత్తులో ముంచెత్తలేదు. పైగా... ప్రజల నుంచే రూపాయి చొప్పున వసూలు చేసి పార్టీకి జమ చేశారు. అయినా... ముమ్మార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనే... గెడ్డం మహాలక్ష్మి! దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఆయన కమ్యూనిస్టు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. జిల్లా బోర్డు సభ్యుడిగా (ఇప్పుడు జడ్పీటీసీ), రైతు కూలీ సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్‌లో చేరి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

ఎవరీ మహాలక్ష్మి...

ఒడిసా ప్రాంతానికి చెందిన మహాలక్ష్మి కుటుంబీకులు వందల ఏళ్ల క్రితమే తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం గ్రామానికి వలసవచ్చారు. 'మహాలక్ష్మి' అనే పేరు చూసి.. మహిళ అనే అనుకునే వారు. ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన తొలినాళ్లలో పత్రికలు సైతం 'ఎమ్మెల్యే శ్రీమతి గెడ్డం మహాలక్ష్మి' అని రాసేవి. చివరకు అసెంబ్లీలో తొలిసారి ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన మహాలక్ష్మి గురించి పెద్ద చర్చే జరిగింది. 'ఆమె రాలేదా.. ఆయనొస్తున్నారేంటి' అని అంతా ఆశ్చర్యపోయారు. మహాలక్ష్మి మొదటిసారి 1962లో ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో కమ్యూనిస్టుల కంచుకోట అయిన రాజోలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేశారు. ఆ ఎన్నికలు జరిగిన తీరును నేతలు, ప్రజలూ ఎంతో కాలం గొప్పగా చెప్పుకొన్నారు. 1967లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. రాజోలు స్థానాన్ని జనరల్‌కు కేటాయించగా, పక్కనే ఉన్న నగరం నియోజకవర్గాన్ని ఎస్సీలకు రిజర్వ్‌డ్ చేశారు. దాంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో మహాలక్ష్మి 1967 నుంచి వరుసగా రెండు పర్యాయాలు నగరం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రజా జీవితంలో ఉన్నన్నాళ్లు నిస్వార్థంగా సేవ చేశారు. ఎందరికో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించారు. ప్రజల మన్ననలు పొందారు.

వారసులు సైతం...

తొలి నాళ్లలో మహాలక్ష్మి జిల్లా బోర్డు మెంబర్‌గా పని చేయగా.. ఆయన కోడలు, మనవరాలు జడ్పీటీసీలుగా ఎన్నికవడం విశేషం. ఆయన కుమారుడు గెడ్డం పేర్రాజు మొన్నటి వరకు టేకిశెట్టిపాలెం సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మనవడు గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్ ప్రస్తుతం రాజోలు నియోజకవర్గ జనసేన నాయకునిగా ఉన్నారు.

- అమలాపురం రూరల్

కొంగొత్తగా..!



ఎన్నికలంటే ఓటర్లను ఆకట్టుకోవాలి. వారి దృష్టిలో పడేందుకు కొత్త కొత్త విన్యాసాలు చేయాలి. అదే చేశారు చిత్తూరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాద్ ఎన్నికల ప్రచారం కోసం సోలో వీల్స్ తీసుకొచ్చారు. పసుపు చొక్కాలు.. జెండాలు పట్టుకున్న కార్యకర్తలు వీటిపై వీధుల్లో తిరుగుతూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. సోలో వీల్స్‌తో సోమెనీ ప్రయోజనాలు. కానీ.. వీటిని ఉపయోగించాలంటే కాస్త శిక్షణ కూడా కావాలండోయ్!

వెయ్.. దరువెయ్!



ఎన్నికలంటేనే సందడి. డప్పుపై దరువేస్తేనే చప్పుడు వస్తుంది. సందడి తెస్తుంది. నామినేషన్ల పర్వం మొదలవడంతో ఎన్నికల సందడి రెట్టింపయ్యింది. డప్పులు.. డ్యాన్సులు.. మందీమార్బలంతో అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు తరలివెళుతున్నారు. విజయవాడ వెస్ట్ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి గురువారం ఇలా అట్టహాసంగా వెళ్లి నామినేషన్ వేశారు.

సిస్టర్స్ స్ట్రోక్!

సొంత జిల్లాలోనే సీఎంకు బొమ్మ పడుతోంది!!

గురిచూసి కొడుతున్న చెల్లెళ్లు.. వైఎస్ వివేకా హత్యే కీలకాంశం

అవినాశ్‌రెడ్డి పాత్రపై ఊరూవాడా వైఎస్ షర్మిల, సునీత ప్రచారం

రాజకీయంగా మైనస్‌గా మారిన తల్లి విజయలక్ష్మి అమెరికా పర్యటన

సీఎం మాటల్లో అదురూ బెదురూ!.. 'వైనాట్ 175' ఊసెత్తని వైనం



పులివెందులలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్ షర్మిల, సునీత(ఫైల్)

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


సీఎం జగన్‌కు సొంత జిల్లా కడపలోనే బొమ్మ కనిపిస్తోంది. చెల్లెళ్ల అలుపెరగకుండా చేస్తున్న పోరాటం ఆయన్ను ఇరకాటంలో పడేసింది. గత ఎన్నికల్లో విజయానికి వాడుకున్న చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య.. ఇప్పుడూ ప్రధానాంశంగా మారింది. ఈ హత్య కేసులో జగన్ సోదరుడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి ప్రమేయం ఉందని సీబీఐ అభియోగాలు మోపడం.. వారికి జగన్ అండగా నిలవడం.. అవినాశ్‌ను సీబీఐ అరెస్టు చేయకుండా కర్నూలులో భయానక వాతావరణం సృష్టించడం వంటివాటిని సీఎం చెల్లెళ్లు వైఎస్ షర్మిలారెడ్డి, వివేకా కుమార్తె సునీతారెడ్డి ఊరూవాడా ప్రచారం చేస్తున్నారు. కీలక ఎన్నికల సమయంలో తల్లి వైఎస్ విజయలక్ష్మి అమెరికా వెళ్లడం జగన్‌కు రాజకీయంగా పెద్ద దెబ్బేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఒకవైపు సొంత సర్వేల్లోనే వైసీపీ ఎమ్మెల్యేల పరిస్థితి బాగోలేదని ఆయన పలువురికి టికెట్లు నిరాకరించారు. కొందరి సీట్లు మార్చారు. అయినా మార్పు లేదని.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం ఖాయమని జాతీయ స్థాయి సర్వేలన్నీ చెబుతున్నాయి. దీంతో జగన్ ధైర్యం కోల్పోయారని వైసీపీ వర్గాల్లో ఆందోళన కనిపిస్తోంది. ఆయన మాటల్లో బెదురు కనిపిస్తోంది. నిన్నమొన్నటి వరకు 175 అసెంబ్లీ స్థానాలూ గెలుస్తామని.. 'వైనాట్ 175' అని ఒకటే ఊదరగొట్టారు. బస్సు యాత్రలో ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

ఆత్మరక్షణలో సీఎం..

గత ఎన్నికల సమయంలో వివేకాను చంద్రబాబు చంపించారంటూ 'నారాసుర రక్తచరిత్ర' అంటూ ప్రచారం చేసి జగన్ రాజకీయ లబ్ధి పొందారు. నాడు ఆయన నట విశ్వరూపాన్ని చూసి చెల్లెళ్లు నిజమని నమ్మారు. కానీ సీఎం అయ్యాక ఎప్పుడైతే సీబీఐ దర్యాప్తు పిటిషన్‌ను ఆయన ఉపసంహరించుకున్నారో.. అనుమానాలకు బీజం పడింది. సీబీఐ రంగప్రవేశంతో కీలక అంశాలు వెలుగు చూశాయి. చంపినవారిని, చంపించినవారిని చాలామటుకు దర్యాప్తు సంస్థ బయటపెట్టింది. అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిల పాత్ర తేలడం, వారిని జగన్ బాహాటంగా సమర్థించడం, తండ్రి హత్య విషయం ప్రపంచం కంటే ముందే జగన్‌కు తెలుసని వెల్లడవడంతో సునీత బిత్తరపోయారు. ఇదే తరుణంలో ఆమె భర్తే హంతకుడన్న కోణంలో సీబీఐ దర్యాప్తు చేయడం లేదంటూ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటనతో నిందితులకు అన్న అండగా ఉన్నారని తేలిపోయింది. ఇప్పుడు కడప లోక్‌సభ బరిలో వైఎస్ అవినాశ్‌రెడ్డిపై పోటీకి దిగిన షర్మిల.. అన్నలాగే బస్సుయాత్ర చేస్తున్నారు. ఆమె, ఆమె వెంట ప్రచారంలో పాల్గొంటున్న సునీత కలిసి జగన్‌ను దుయ్యబడుతున్నారు. కొంగు చాచి న్యాయం అర్థిస్తున్నామంటూ ప్రజలను షర్మిల కోరుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇది బాగా జనంలోకి వెళ్తోంది. దీంతో ఆయన ఆత్మరక్షణలో పడ్డారు. ఇంకోవైపు.. వైసీపీ పెద్దల ప్రోద్బలంతో కొందరు షర్మిల ప్రచారానికి అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే షర్మిల వారిని వేదికపైకి పిలిచి మైకిచ్చి మాట్లాడిస్తున్నారు. జగన్ రాష్ట్రానికి ఏం చేశాడో.. కడప జిల్లాకు ఏం చేశాడో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. వారు అమ్మఒడి, పెన్షన్లను వల్లెవేస్తున్నారు. వెంటనే షర్మిల మైకందుకుని.. జగన్ తెస్తానన్న ప్రత్యేక హోదా, ఇస్తానన్న జాబ్ కేలెండర్, కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం ఓడరేవు, పారిశ్రామిక కారిడార్లు, విశాఖకు రైల్వే జోన్, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల, పోలవరం ప్రాజెక్టు, రాయలసీమ ప్రాజెక్టుల నిలుపుదల వంటి అంశాలను లేవనెత్తుతున్నారు. జగన్ వైఫల్యాలకు జవాబు చెప్పలేక సదరు కార్యకర్తలు జారుకుంటున్నారు. ఈ తరుణంలో.. 2019 ఎన్నికల్లో తోడుగా ఉన్న జగన్ తల్లి విజయలక్ష్మి ఇప్పుడు అమెరికాలో ఉంటున్న షర్మిల పిల్లల వద్దకు వెళ్లిపోయారు.

ఆనాటి ముచ్చట

'కదనం'లో కలిసి మెలిసి!



ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థులు ఒకరికొకరు ఎదురు పడితే... వామ్మో, ఇంకేమైనా ఉందా, ఎన్ని గొడవలు జరుగుతాయో కదూ! కానీ... ప్రత్యర్థులంతా కలిసి ప్రచారం చేసిన రోజులూ ఉన్నాయంటే నమ్ముతారా? 1952లో విజయనగరం అసెంబ్లీ స్థానంలో అదే జరిగింది. అప్పట్లో విజయనగరం రాజవంశీయుడు పూసపాటి విజయరామ గజపతిరాజు సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. గుడివాడ అప్పలస్వామి (ఇండిపెండెంట్), చిన్న సూర్యనారాయణ (కాంగ్రెస్), శక్తి గురువాల (కిసాన్ మజ్దూర్) కూడా బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో విజయరామ గజపతిరాజు, గుడివాడ అప్పలస్వామి, చిన్న సూర్యనారాయణ ముగ్గురూ కలిసే ప్రచారం చేశారు. ఒకే వేదికను పంచుకుని... తాము గెలిస్తే ఏం చేస్తామో ప్రజలకు వివరించారు. అంతా... హుందాగానే! అదే ఎన్నికలో లోక్‌సభ అభ్యర్థులుగా ఉన్న కందాల సుబ్రహ్మణ్య తిలక్ (సోషలిస్టు), పసుమర్తి వీరభద్రస్వామి (కాంగ్రెస్) తదితరులు కూడా ఉమ్మడిగానే ప్రచారం చేయడం విశేషం! తిలక్ తన ప్రత్యర్థి అభ్యర్థిని సైకిల్‌పై కూర్చోబెట్టుకుని తిరుగుతూ ప్రచారం చేసిన సందర్భాలూ ఉన్నాయి. పరస్పర విమర్శలు చేసుకోలేదు. నిందలు లేవు. బూతులు అసలే లేవు. ఇప్పుడు ఇలాంటి దృశ్యాలు ఊహకు కూడా అందవు కదూ!

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అమ్మవారి సొమ్ము రాళ్లపాలు

● నిర్మాణాలు చేపట్టడం, మళ్లీ కూల్చివేయడం ● మొన్న పెర్గోలా కూల్చివేత, నేడు మల్లేశ్వరాలయం దిగువ గోడ కూల్చివేత
● ఇదీ దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకం ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

వన్‌టౌన్, ఏప్రిల్ 18: దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులకు సరైన ప్రణాళికలు లేకపోవడమో, లేక మరేవైనా కారణాలున్నాయేమో తెలియదుగానీ ప్రతిసారీ నిర్మాణాలు చేపట్టడం, కొద్దినెలల్లోనే కూల్చివేయడం చేస్తున్నారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈవో ఆజాద్ హయాంలో కొండపైనున్న భవనాలను అభివృద్ధి పనుల పేరుతో అడ్డగోలుగా కూల్చివేశారు. ఈవో సూర్యకుమారి హయాంలో భక్తుల రాకపోకల అవసరాలకు కనకదుర్గానగర్‌లో సుమారు రూ.9కోట్లతో నిర్మించిన పెర్గోలాను ఇటీవల అభివృద్ధి పనుల పేరుతో తొలగించారు. కాగా మల్లేశ్వరాలయం దిగువన భవన నిర్మాణాలు అవసరాలకు సుమారు రూ.70లక్షలతో శివాలయం మెట్లవద్ద గోడను నిర్మించారు. ప్రస్తుతం శివాలయం దిగువన అన్నదాన భవనం, మహామండపం దిగువన చెప్పుల స్టాండ్ ఎదురుగా ప్రసాదాల తయారీ భవన నిర్మాణాలను చేపట్టారు. వీటి పనులు వేగవంతంగా జరుగుతున్న క్రమంలో మల్లేశ్వరాలయం దిగువన ఏర్పాటు చేసిన గోడ అడ్డంగా ఉందన్న కారణంతో తొలగింపునకు నిర్ణయించారు. దీనిపై మొదట వ్యతిరేకత రావడంతో అలానే ఉంచి ఉపయోగించుకోవాలనుకున్నారు. కానీ తప్పనిసరిగా తొలగించాల్సిన అవసరం ఉండడంతో గురువారం ఆ గోడను తొలగించే పనులు ప్రారంభించారు. ఆ గోడ ఎందుకు కట్టారో తెలియదు. ఎందుకు కూలుస్తున్నారో తెలియదు. దీంతో ఉద్యోగులతో పాటు భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా సొంత భవన నిర్మాణం చేపట్టాలంటే ఎంతో ప్రణాళికబద్ధంగా పనులు చేపడతారు. కానీ దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు మాత్రం ఎలాంటి ప్రణాళికలు లేకుండా లక్షలాది రూపాయలతో నిర్మాణాలు చేపట్టడం, తరువాత అవసరం లేదని కూల్చివేయడం పదే పదే జరుగుతోంది. అమ్మసొమ్మును భక్తుల వసతులకు, అవసరాలకు ఉపయోగించకుండా అధికారులు రాళ్లపాలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సూర్యకుమారి హయాంలో రూ.9కోట్లతో ఏర్పాటు చేసిన పెర్గోలాను భక్తులకు సక్రమంగా వినియోగించకుండానే అభివృద్ధి పేరుతో తొలగించడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. భక్తులకు వసతులు కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.



పెర్గోలాను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్ (ఫైల్)


దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని శివాలయం కింద ఉన్న గోడ కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్


గ్రామస్థులు నిలిపివేసిన లారీలు

గొల్లనపల్లిలో క్వారీ లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

గన్నవరం, ఏప్రిల్ 18: మండలంలోని గొల్లనపల్లి పోలవరం వంతెన వద్ద గ్రామస్థులు క్వారీ లారీలను గురువారం అడ్డుకున్నారు. గ్రామంలో వాటరింగ్ చేయకుండా అడ్డగోలుగా ఓవర్‌లోడ్‌తో క్వారీ లారీలు తిరుగుతున్నాయని, దుమ్ముతో అల్లాడిపోతున్నామంటూ 11 లారీలను ఆపేశారు. మామిడితోటలో దుమ్ముపడి పంట నాశనమవుతుందని రైతు, ఉపసర్పంచ్ యనమదల సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. లారీలను నిలిపివేయగా గొల్లనపల్లి నుంచి గన్నవరం వైపు వస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చూసి వివరాలు తెలుసుకుని సీఐ ప్రసాద్‌కు సమస్యను పరిష్కరించాలని సూచించినట్టు తెలిపారు. వెంటనే సీఐ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. క్వారీ నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వకాలు సాగిస్తున్నారని, పర్మిట్లు లేవని గుర్తించారు. రాతపూర్వక ఫిర్యాదు చేయాలని కోరటంతో ఉపసర్పంచ్ యనమదల సుబ్బారావు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరిస్తానని సీఐ హామీ ఇవ్వడంతో పాటు లారీలను సీజ్ చేశారు. పలగాని వేణు, గుండ్ర జానకిరామయ్య, చిట్టేటి చిరంజీవి, కె.రాజు, జంపన జోజి పాల్గొన్నారు.

తొలిరోజే అట్టహాసంగా సుజనా నామినేషన్

● భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు ● విజయకేతనం ఎగురవేస్తామంటూ ఆనందోత్సాహాలు

వన్‌టౌన్, చిట్టినగర్, ఏప్రిల్ 18: పశ్చిమ నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి వై.సుజనాచౌదరి గురువారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. తొలుత చిట్టినగర్‌లోని కొత్తమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకుల ఆశీస్సులను అందుకున్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీతో ఆయన నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు తరలివెళ్లారు. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, సీనియర్ నేత ఎంఎస్ బేగ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసైనికులు అమ్మిశెట్టి వాసు, రజని ఆలయం వద్ద భారీగా స్వాగతం తెలిపారు. పూజల నంతరం ఆయన అందరికీ అభివాదం చేసి ప్రచార వాహనంపై ఎక్కి జన కోలాహలం మధ్య ఊరేగింపుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు బయలుదేరి వెళ్లారు. వంగవీటి రాధాకృష్ణ, కేశినేని శివనాథ్ (చిన్ని) వాహనంలో ఆయన వెంట అనుసరించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాజీలేని పోరాటం చేస్తానన్నారు. ఐదేళ్లలో వైసీపీ అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. నియోజకవర్గాన్ని టాప్‌లో నిలబెడతానని కూటమి అభ్యర్థిగా తన గెలుపు ఖాయమని భరోసా ఇచ్చారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీ అభివృద్ధిలో ముందుకు దుసుకువెళ్లడానికి తన వంతు సహకారం ఇస్తానన్నారు.


ప్రచార రథంపై అభివాదం చేస్తున్న సుజనా చౌదరి, చిత్రంలో వంగవీటి రాధా, బేగ్, మీరా

కోలాహలంగా జనవాహిని

సుజనా చౌదరి నామినేషన్ పర్వంగా పశ్చిమ నలుమూలల నుంచి జనవాహిని తరలివచ్చింది. బీజేపీ-టీడీపీ-జనసేనకు చెందిన పార్టీ శ్రేణులు ఆనందోత్సాహలతో సుజనాచౌదరి నామినేషన్ ఘట్టాన్ని విజయకేతనంగా మార్చారు. వంగవీటి రాధాకృష్ణ, కేశినేని చిన్ని ఆయన వెంట ఉండి అభిమానులకు, కార్యకర్తలకు కొత్త ఊపునిచ్చారు. చాలాకాలం తరువాత రాధాకృష్ణ ప్రత్యక్షంగా జనంలో కనబడడంతో కొత్త వాతావరణం నెలకొంది. అడ్డూరి శ్రీరామ్, ఫైలా సోమినాయుడు, నాగుల్‌మీరా, బుద్దా వెంకన్న, జలీల్‌ఖాన్, ఎంఎస్ బేగ్, చెన్నుపాటి శ్రీను పాల్గొని నాయకత్వ ధీమాను, భరోసాను ఓటర్లకందించారు. 3 పార్టీల జెండాలు రెపరెపలాడాయి.

గెలుపును చంద్రబాబుకు కానుక ఇస్తా: కేశినేని చిన్ని

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోను కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తానని, అభ్యర్థులందరూ గెలవడం ఖాయమని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.

నేడు కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్..

వన్‌టౌన్, ఏప్రిల్ 18: బీజేపీ-జనసేన బలపరచిన విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం ఉదయం సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ప్రకాశం బ్యారేజీ వద్ద ఉన్న దర్గాలో ప్రార్థనలు చేసి అక్కడ నుంచి కెనాల్‌రోడ్డు, లోబ్రిడ్జి, పోలీస్ కంట్రోల్ రూం, రాఘవయ్య పార్కు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. ఈ సందర్భంగా శివనాథ్‌కు మద్దతు తెలిపేందుకు పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు టీడీపీ-జనసేన-బీజేపీ నేతలు భారీగా పాల్గొననున్నారు.

దుర్గగుడిలో ముగిసిన వసంత నవరాత్రులు

వన్‌టౌన్, ఏప్రిల్ 18: దుర్గగుడిలో ఈ నెల 9న ఉగాది నుంచి ప్రారంభమైన చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ రకరకాల పుష్పాలతో అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకురావడం, అర్చన, లలితా సహస్రనామ పారాయణ, పుష్పార్చన వంటివి భక్తి ప్రపత్తులతో చేశారు. మల్లెపూలు, మరువం, గులాబీలు, కనకాంబరాలు, చామంతులు, లిల్లీలు, సంపెగలు, ఎర్రకలువలు, మందారాలు, తెల్లజిల్లేడు, మారేడు, తులసి, దవనం, జాజులు, ఎర్రగన్నేరు, వంటి పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అర్చించారు. గురువారం పూర్ణాహుతి నిర్వహించారు. తొలుత అమ్మవారిని కనకాంబరాలతో పాలు వివిధ రకాల పూలతో అర్చించారు. ఈవో కేఎస్ రామారావు, కుటుంబసభ్యులు, స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు. అనంతరం ఈవో మాట్లాడుతూ చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలు, పుష్పార్చనలు ముగిశాయని శుక్రవారం నుంచి ఆలయంలో సంప్రదాయం ప్రకారం బ్రహ్మోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



పుష్పార్చనలో పూజలు నిర్వహిస్తున్న స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, అమ్మవారికి పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

దక్షిణామూర్తికి పూజలు

మల్లేశ్వరాలయంలో ఉన్న దక్షిణామూర్తి విగ్రహానికి గురువారం సందర్భంగా ఈవో కేఎస్ రామారావు అర్చనలు నిర్వహించారు. దక్షిణామూర్తిని పూజించడం వల్ల జ్ఞానం పెరుగుతుందని, మంచి జరుగుతుందని నమ్మిక.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

శ్రీరామనవమి సందర్భంగా నవమి నాడు సీతారాముల కల్యాణం నిర్వహించిన మరునాడు శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై గురువారం శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. ఈ ప్రక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుణ్యాహవచనం, గణపతిపూజ, షోడశోపచారపూజ అనంతరం లోకకల్యాణం, సకల జనుల క్షేమం కోరుతూ సంకల్పం చెప్పి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పట్టాభిషేకం నిర్వహించారు. చత్ర, చామరాది, ప్రక్రియలను మంత్రోచ్చరణల మధ్య నిర్వహించి స్వామి వారికి కిరీటధారణ చేసి పట్టాభిషేకోత్సవాన్ని శాస్త్ర హితంగా నిర్వహించారు. ఈవో రామారావు, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సుజనా గెలుపునకు ప్రచారం చేస్తా

● మాజీ కార్పొరేటర్ డోగిపర్తి ఝాన్సీ లక్ష్మిబాయి

విద్యాధరపురం: పశ్చిమ నియోజకవర్గం ఎన్‌డీఏ అభ్యర్థి సుజనా చౌదరి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తానని మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నేత డోగిపర్తి ఝాన్సీ లక్ష్మిబాయి అన్నారు. గురువారం సుజనా చౌదరి భవానీపురం ఆర్‌వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా ఝాన్సీ లక్ష్మిబాయి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాను మొదట నుంచి బీజేపీలో ఉన్నానని రెండుసార్లు బీజేపీ తరఫున పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచినట్టు చెప్పారు. బీజేపీ అభ్యర్థి తనవద్దకు వచ్చి మద్దతుగా నామినేషన్ దాఖలు చేయాలని కోరారని, అందుకు అంగీకరించి మద్దతు ఇచ్చినట్టు చెప్పారు. ఆయన గెలుపు కోసం స్నేహితులు, బంధువులకు ఫోన్ చేసి ప్రచారం చేస్తానన్నారు. సుజనా చౌదరి తనకు ఎంతో ఆప్తుడని, తాను వీఎంసీలో కార్పొరేటర్‌గా పశ్చిమ అభివృద్ధి కోసం పనిచేసినట్టు సుజనా చౌదరి కూడా పశ్చిమలో గెలిచి కేంద్రం సహాయంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


ఆర్‌వో కార్యాలయానికి వచ్చిన ఝాన్సీ లక్ష్మిబాయి

బందరులో పేర్ని నాని బ్లేడ్ బ్యాచ్ రాజకీయాలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న

విజయవాడ, వన్‌టౌన్, ఏప్రిల్ 18: మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) బ్లేడ్ బ్యాచ్‌లతో చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెద్దసైకో జగన్‌రెడ్డి, చిన్న సైకో కిట్టు కోసం నాని మీడియా ముందుకు వచ్చి అవే ఊకదంపుడు ఉపన్యాసం చేస్తున్నాడన్నారు. బందరులో బ్లేడ్‌బ్యాచ్‌లతో రాజకీయాలు చేస్తూ యువకుల జీవితాలతో ఆడుకుంటున్నాడన్నారు. బందరుకు పూర్వవైభవం తెచ్చానని అనడం హాస్యాస్పదమన్నారు. బందరులో మత్తుకు బానిసలైన యువకులను గురించి మాట్లాడకుండా తన కుమారుడు గంజాయి అమ్ముతున్నాడని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని బీద అరుపులు అరుస్తున్నాడన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓడిపోతామని తెలిసి తాను చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను బూతులు తిట్టలేదని భుజాలు తడుముకుంటున్నాడన్నారు. అతను తిట్టాడో లేదో సభ్య సమాజానికి తెలుసన్నారు. శిరోముండనం కేసులో ప్రధాన నిందితుడు తోట త్రిమూర్తులు గురించి తెలిసీ అతడికి జగన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి ఎలా ఇచ్చారు? మండపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎందుకు నిలుచోబెట్టారంటూ ప్రశ్నలు సంధించారు. వీటికి పేర్నినాని సమాధానాలు చెప్పాలన్నారు.


నిందితుల కుటుంబాలను పరామర్శిస్తున్న గురుమూర్తి, ఈశ్వరరావు

స్వార్థ రాజకీయాలకు బలహీన వర్గాల బిడ్డలను బలిస్తున్న జగన్

● టీడీపీ బీసీ నేత గురుమూర్తి, రాష్ట్ర వడ్డెర నేత ఈశ్వరరావు

విద్యాధరపురం, ఏప్రిల్ 18: స్వార్థ రాజకీయాలు, సానుభూతి కోసం జగన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు చెందిన బిడ్డలను బలి చేస్తున్నాడని టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, రాష్ట్ర వడ్డెర నేత, టీడీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి మల్లెల ఈశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. జగన్‌రెడ్డిపై జరిగిన గులకరాయి దాడిలో అరెస్ట్ అయిన వడ్డెర యువకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నేతలు గురువారం కోర్టు వద్దకు చేరుకున్నారు. అక్కడ వేముల సతీష్, వేముల దుర్గారావు కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిని భయపడవద్దని న్యాయం జరిగేవరకు తోడుంటామని భరోసా ఇచ్చారు. గత ఎన్నికల్లో కోడికత్తి డ్రామాలో దళితుడి జీవితాన్ని బలిచ్చారని ఇప్పుడు బలహీన వర్గాల పిల్లల్ని సమిధల్ని చేస్తున్నాడని విమర్శించారు. బీసీ సెల్ నేతలు మరక శ్రీనివాస్‌యాదవ్, గుంటూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాసరావు, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల దుర్గారావు, విజయవాడ వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు వేముల దుర్గారావు, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సింగం వెంకన్న, కత్తుల మణికంఠ, వల్లూరు మధుసూదనరావు, తిరుపతి గౌడ్, పిర్యా సోమేశ్వరరావు, అమర్నాథ్‌గౌడ్, కుంచాల సావిత్రి, నంద్యాల నరసింహం పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారిణిపై లైంగిక దాడి హేయం

● కబడ్డీ జాతీయ మాజీ కోచ్ పద్మజాబాల

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 18: అవనిగడ్డలో కబడ్డీ శిక్షణకు వచ్చిన దళిత మైనర్ బాలికకు మరింత మెరుగైన శిక్షణ ఇప్పిస్తామని నమ్మబలికి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తులపై విచారణ జరిపి నిందితులను పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినంగా శిక్షించాలని జాతీయ కబడ్డీ మాజీ కోచ్ పి. పద్మజాబాల ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సంఘటనను ఆమె తీవ్రంగా ఖండించారు. నిందితుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మరింత లోతైన దర్యాప్తు జరిపినట్టయితే ఇంకొంత మంది బాధితుల వివరాలు బయట పడే అవకాశం ఉందన్నారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుపై పోలీసులు వెంటనే స్పందించాలని పద్మజాబాల కోరారు.

మాదిగలకు న్యాయం చేసేది టీడీపీనే: గద్దె

కృష్ణలంక/పటమట, ఏప్రిల్ 18: మాదిగలకు న్యాయం చేసేది ఒక్క టీడీపీయేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురువారం టీడీపీ కృష్ణలంక 21వ డివిజన్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ఎస్సీ, ఎస్టీల పట్ల మొసలి కన్నీరు కార్చిన జగన్ అధికారంలోకి రాగానే దళితుడైన డాక్టర్ సుధాకరరావును చిత్రహింసలు పాల్జేసి చంపేశారన్నారు. మరో ఎమ్మెల్సీ దళితుడైన వ్యక్తిని చంపేసి డోర్ డెలివరీ చేశారని మండిపడ్డారు. ఎమ్మార్పీఎస్ నేత పి.ఎలీషా మాట్లాడుతూ మాదిగలకు అన్ని విధాలుగా న్యాయం చేయాలనే ధృఢ సంకల్పంతో చంద్రబాబు ఉన్నారని, మంద కృష్ణమాదిగ ఆదేశానుసారం ఈసారి మాదిగలంతా చంద్రబాబును అధికారంలోకి తేవడంతో పాటు తూర్పులో గద్దె రామ్మోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నేతలు దుర్గారావు, మంద వెంకటేశ్వరరావు, మామిడి రాంబాబు, వేల్పుల సురేష్, ఎల్. నరసింహులు, టోనీ, టీడీపీ నేతలు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, వల్లూరు మధు, తవ్వా ప్రకాష్, పోడూరి పవన్ పాల్గొన్నారు.


ఎమ్మార్పీఎస్ నేతలతో మాట్లాడుతున్న గద్దె

21వ డివిజన్‌లో గద్దె తనయుడి ప్రచారం

కృష్ణలంక: గద్దె రామ్మోహన్ ఎమ్మెల్యేగా పదేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో గద్దె రామ్మోహన్‌కు, అలాగే ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె రాజేష్ కోరారు. 21వ డివిజన్ కృష్ణలంక గుర్రాల రాఘవయ్య వీధిలో గురువారం గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నేతలు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, వల్లూరు మధు, కేశనం భావన్నారాయణ, పెరుమాళ్ల గురునాథం, ఆర్.రమాదేవి, జనసేన నేతలు కొప్పూరి కిరణ్‌బాబు, పోతిరెడ్డి రమణ, పోతులూరి దుర్గాప్రసాద్, బీజేపీ నేత డొక్కు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

యువత చూపు టీడీపీ వైపు: బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 18: సైకో జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం దారుణంగా విఫలమవడంతో రాష్ట్ర యువత టీడీపీ వైపు చూస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. గురువారం పోరంకిలోని టీడీపీ కార్యాలయంలో తాడిగడప వైసీపీ నేత నర్రా చంటి నేతృత్వంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు తమ కుటుంబాలతో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బోడె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకుండా గంజాయి, మత్తు, కల్తీ మద్యంతో యువత భవితను నాశనం చేయడానికి ప్రయత్నించిన సైకో జగన్‌రెడ్డి కుటిల మనస్తత్వాన్ని యువత అర్థం చేసుకున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు అనేక వేల ఉద్యోగాలు కల్పించి, నిరుద్యోగ యువతకు భృతి కల్పించామన్నారు. త్వరలో వచ్చే కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న డీఎస్సీని వేసి వేలాది ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తామని వెల్లడించారు. టీడీపీలోకి వచ్చిన వైసీపీ నేతలను, కార్యకర్తలను కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గంధం లక్ష్మీ నర్సు, మొవ్వా నరేంద్ర, చేబ్రోలు సోమేశ్వరరావు, వేణు, అనుగోలు అనిల్, వీరబోయిన లింగయ్య, జటంగి వేణు, నందం హరి, కోడూరి వెంకటేశ్వరావు, హరిప్రసాద్, విశ్వనాథపల్లి యేసు ఉన్నారు.


టీడీపీలో చేరిన తాడిగడప నర్రా చంటి తదితరులతో బోడె ప్రసాద్

వైసీపీ వీడీ టీడీపీలోకి

ఆకునూరు: ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి 1వ వార్డుకు చెందిన 10 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వార్డుకు చెందిన టీడీపీ నేతలు పేరేపి నరేశ్, పార్టీ పట్టణాధ్యక్షుడు జంపాన గుర్నాథరావు, ఎం నాగేంద్ర, ఎన్ శ్రీనివాసరావు, గుంజా సాల్మన్ ఆధ్వర్యంలో ఆకునూరులో బుధవారం ఎన్నికల ప్రచారంలో ఉన్న బోడె ప్రసాద్‌ను కలసి పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. బోడె ప్రసాద్ వారికి పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. గుంజా శ్రీను, ఎం. నాగేశ్వరరావు, దొడ్డా రాజేశ్, గుంజా రవి, గుంజా సాల్మన్ టీడీపీలో చేరారు.

పున్నమి హోటల్ ఎదురుగా పోలీసుల ఓవరాక్షన్

● వాహనదారులు, అమరావతి రైతులను అడ్డుకున్న వైనం

విద్యాధరపురం, ఏప్రిల్ 18: ఎన్‌డీఏ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి నామినేషన్ దాఖలు సందర్భంగా భవానీపురం పున్నమిహోటల్ ఎదురుగా పోలీసులు ఓవర్‌యాక్షన్ చేశారు. ర్యాలీ రాకకు సుమారు 2గంటల ముందే పోలీసులు హోటల్ ఎదురుగా యూటర్నింగ్ తీసుకునే వాహనదారులను అడ్డుకున్నారు. గురువారం సుజనా చౌదరి నామినేషన్ దాఖలకు ఆర్‌వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. దీంతో పున్నమిహోటల్ ఎదురుగా భవానీపురం, ఇబ్రహీంపట్నం సీఐలు, ఇతర పోలీస్ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీ వచ్చే 2గంటల ముందే సీఐలు తమ ఓవర్‌యాక్షన్‌తో యూటర్న్ తీసుకునే వాహనదారులను అడ్డుకున్నారు. దీంతో పలువురు వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుజనా చౌదరికి మద్దతుగా వచ్చిన సుమారు 60మందికి పైగా అమరావతి రైతులను కనీసం పున్నమిహోటల్ ఎదురుగా కూడా నిలుచోనీయకుండా వెళ్లిపోవాలని బెదిరించారు. సుజనా చౌదరికి మద్దతుగా హైదరాబాద్ నుంచి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు పున్నమి హోటల్ వద్దకు రాగా ఆమెను ఓ కానిస్టేబుల్ వీడియో తీశారు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేసి ఆ వీడియోను డిలేట్ చేయాలని పట్టుబట్టింది. పోలీసులు నచ్చచెప్పినప్పటికీ వినకపోవడంతో ఎట్టకేలకు ఆ వీడియోను ఓ అధికారి డిలేట్ చేశారు. దీంతో ఆమె శాంతించింది.



నిర్మానుష్యమైన రోడ్లు

నామినేషన్ దాఖలు సందర్భంగా ఎన్నికల అధికారి కార్యాలయం వద్ద నుంచి సుమారు 100 మీటర్ల వరకు ఎలాంటి రాకపోకలు, జనాలు ఉండరాదని ఎలక్షన్ కోడ్ అమలులో ఉండడంతో పోలీసులు భవానీపురం లారీ స్టాండ్ వద్ద, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు మసీదు వద్ద ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతాలు మనుష్యులు లేక నిర్మానుష్యంగా మారాయి.

టీడీపీ కూటమికి వైసీపీ అసంతృప్తుల ప్రచారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: టీడీపీతోనే అభివృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగాలు సాధ్యమని నమ్మి టీడీపీ, జనసేన కూటమి తరఫున ప్రచారం చేస్తున్నట్టు గరికపాటి ఉమ, నూకల బాబూరావు, చలమలశెట్టి శివ తెలిపారు. కానుమోలులో వైసీపీకి చెందిన 22మంది అసంతృప్తులు టీడీపీ, జనసేన జెండాలు ధరించి గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. త్వరలోనే టీడీపీ, జనసేన కూటమిలో చేరుతామని వారు తెలిపారు. చలమలశెట్టి బుచ్చిబాబు, బండే రామాంజనేయులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అనుమతులు లేకుండా 'సిద్ధం' ఫ్లెక్సీలు

▸▸ పిఠాపురంలో ఎన్నికల నిబంధనలు బేఖాతర్



పిఠాపురం బైపాస్ రోడ్డులో జగన్ సిద్ధం ఫ్లెక్సీ

పిఠాపురం, ఏప్రిల్ 18: వైసీపీ నేతలు ఎన్నికల నిబంధనలను బేఖాతరు చేశారు. అనుమతులు లేకుండా ఎక్కడికక్కడ జగన్ సిద్ధం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. సీఎం జగన్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా అచ్చంపేటవద్ద శుక్రవారం జరిగే బహిరంగసభ అనంతరం బస్సులో చిత్రాడ, పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు బైపాస్ రోడ్డుల మీదుగా వెళ్లనున్నారు. జగన్ పర్యటన సాగే బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో పలుచోట్ల జగన్ సిద్ధం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇళ్లపై ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలకు ఎటువంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం. అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

కోడ్ ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలి

▸▸ సీఈవోకు టీడీపీ నేతల వినతి

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి, ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలు, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరింది. అలాగే సీఎం జగన్‌పై రాయి దాడి కేసులో టీడీపీ నేత బొండా ఉమను ఇరికించేందుకు వైసీపీ నేతలతో కలిసి, విజయవాడ సీపీ రాణా కుట్ర చేస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఈవోకు వినతిపత్రం అందజేసిన అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా టీ కప్పులపై వైసీపీ అభ్యర్థులు అంబటి రాంబాబు, అనిల్‌కుమార్ యాదవ్ బొమ్మలు వేసుకుని, ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతల బొమ్మలున్న టీ కప్పులు మాకొద్దంటున్న షాపుల యజమానులను పోలీసులు బెదిరిస్తున్నారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించని పోలీసులపై చర్యలు తీసుకోవాలి. హత్యాయత్నమే జరగని కేసులో బొండా ఉమను ఇరికించేందుకు సీపీ కుట్ర పన్నుతున్నారు. జగన్‌రెడ్డి పట్ల వినయ విధేయతలు, భయభక్తులు చూపడంలోనే విజయవాడ సీపీ రాణా మునిగిపోయారు. రాష్ట్రంలో వైసీపీ నేతల ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై రోజూ ఫిర్యాదు చేస్తున్నా.. చాలా మందిపై చర్యలు తీసుకోలేదు. మంత్రి అంబటి చెప్పిన మాట వినాల్సిందేనని సత్తెనపల్లిలో ఓ పోలీస్ అధికారి బెదిరిస్తుంటే.. ఆ అధికారి ప్రజలకు ఇంకేం రక్షణ కల్పిస్తారు? లంచాలు మించిన 74 మంది అధికారులకు జగన్‌రెడ్డి క్లీన్ చీట్ ఇచ్చారు. దేశ చరిత్రలో ఇంత మంది ఖైదీలకు కూడా క్షమాభిక్ష పెట్టిన దాఖలా లేదని ఎద్దేవా చేశారు. బృందంలో టీడీపీ నేతలు రామకృష్ణ, బుచ్చిరాంప్రసాద్, మన్నవ సుబ్బారావు, కోడూరి అఖిల్, బండారు వంశీకృష్ణ ఉన్నారు.

సానుభూతి కోసమే జగన్నాటకం: వర్ల రామయ్య

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'నాడు కోడికత్తి నాటకం, నేడు గులకరాయి డ్రామా... జగన్ అధికారం కోసం మరో జగన్నాటకానికి తెర తీశారు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్‌పై హత్యాయత్నం అనేది జగన్ ఆడిన జగన్నాటకం. అదొక పెద్ద డ్రామా. గులకరాయి లేదు, హత్యా ప్రయత్నం లేదు. జగన్ బస్సు యాత్రకు జనం నుంచి ఆదరణ కరువు కావడంతో అసహనంతో జగన్ ప్లాన్ చేసి జనాల్లో సానుభూతి పొందేందుకు గులకరాయి డ్రామాకు తెరలేపారు. పోలీసు కమిషనర్, సాక్షి పత్రిక ఒకటేనా? అన్న అనుమానం కలుగుతోంది. పోలీసుల దర్యాప్తు అంతా సాక్షి పత్రికలోనే రావడమేంటి? సాక్షి తప్పుడు కథనాలు అల్లుతుంటే దానికి పోలీసు అధికారుల జీహుజూర్ అనడం సబబేనా? మిగతా పత్రికలకు అందని సమాచారం ఒక్క సాక్షికే ఎలా చేరుతోంది? ఓ అమాయికుడిని అరెస్టు చేసే ముందు తన ప్రశ్నలకు విజయవాడ సీపీ సమాధానం చెప్పాలి. జగన్ గులకారాయి ఘటన జరిగి నేటికి ఆరు రోజులు అవుతోంది. అయినా ఇంత వరకు ఆ రాయి పోలీసులకు ఎందుకు చిక్కలేదు? టీడీపీ సానుభూతిపరుడైన దుర్గారావుపై ఎందుకు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు? అనవసరంగా అమాయకులైన బీసీ వడ్డెర కుర్రాళ్లని బలిచేసి అధికారంలోకి రావడానికి జగన్ కుట్ర పన్నుతున్నారు. అధికారం ఎవరికీ సొంతం కాదు. అధికారులు తప్పులు చేసి తిప్పలు తెచ్చుకోవద్దు' అని హితవు పలికారు.

జగన్ దగా పాలనలోనే రైతుల ఆత్మహత్యలు: మర్రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జగన్ దగా పాలనలో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులను నిట్ట నిలువునా ముంచి ప్రోగ్రెస్ కార్డుల పేరుతో మళ్లీ మోసానికి జగన్ తెరలేపారు. దేశంలో మనిషిపై సగటు అప్పు రూ.75 వేలు ఉంటే జగన్ పాలనలో మాత్రం ప్రతి రైతు కుటుంబంపై రూ.2.54 లక్షల అప్పు ఉంది. ఐదు రబీ కాలాలు, ఐదు ఖరీఫ్ కాలాల్లో రైతులను జగన్ నిలువునా ముంచడంతో పెట్టిన పెట్టుబడులు రాక, ప్రభుత్వం ఆదుకోక రైతులు అప్పుల అగాథంలో కూరుకుపోయారు. చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థితికి రైతు కుటుంబాలను జగన్ దిగజార్చారు. పెట్టిన పెట్టుబడులు రాక సుమారు 1,000 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చెప్పిన అబద్ధాలనే మళ్లీ మళ్లీ చెప్తూ జగన్ రైతులను మోసం చేస్తున్నారు. వైసీపీ నాయకులు దళారులుగా మారి మిల్లర్లను లోబరుచుకుని ప్రభుత్వ అధికారులను బెదిరించి జేట్యాక్స్ వసూలు చేశారు' అని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు.

అండమాన్‌లో కూటమిదే విజయం: మాధవనాయుడు

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అండమాన్ నికోబార్ దీవుల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న బీజేపీకి చెందిన బిష్ణుపాదరాయ్ గెలుపు కోసం నికోబార్ దీవుల యువరాజు రషీద్ మద్దతు కోరామని టీడీపీ అండమాన్ నికోబార్ దీవుల ఇన్‌చార్జ్ వీ మాధవ నాయుడు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సాంప్రదాయకంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే రాజ కుటుంబం ఇప్పుడు టీడీపీ అభ్యర్థనతో కూటమి అభ్యర్థి విజయానికి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. మద్దతు ఇస్తున్నట్లు రాజు బీజేపీకి కూడా లేఖ రాశారని తెలిపారు. యువరాజు రషీద్ మద్దతుతో అండమాన్ నికోబార్ దీవుల్లో కూటమి ఎంపీ అభ్యర్థి విజయం ఖాయమని పేర్కొన్నారు. యువరాజు రషీద్‌తో కలిసిన వారిలో మాధవనాయుడుతో పాటు శ్రీలంకకు చెందిన సుందర్, అండమాన్ టీడీపీ అధ్యక్షుడు మాణిక్యరావు ఉన్నారు. అనంతరం మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ అండమాన్ ఎన్నికల ప్రత్యేక ఇన్‌చార్జ్ సత్యపాల్‌సింగ్, ఎంపీ అభ్యర్థి బిష్ణుపాదరాయ్ మాధవనాయుడును కలసి తమకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

అమరావతి గ్యాలరీ ధ్వంసంపై కమిటీ

▸▸ ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

▸▸ తగిన చర్యలు తీసుకుంటాం: సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్

విజయవాడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నమూనా గ్యాలరీ ధ్వంసం ఘటనపై పరిశీలనకు నలుగురు అధికారులతో కమిటీని నియమించామని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్దండ్రాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన మ్యూజియంలో గుర్తు తెలియని వ్యక్తులు నమూనాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అధికారుల కమిటీ గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించిందని, నమూనాలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు గుర్తించామని వివేక్ యాదవ్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, ఘటనపై తక్షణం తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్‌కు అదనపు బాధ్యతలు

అమరావతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా డాక్టర్ వెంకటేశ్వర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఉన్న జె.నివాస్ కాకినాడ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకూ కృష్ణబాబు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. వెంకటేశ్వర్ విదేశీ పర్యటన పూర్తి చేసుకుని రావడంతో ఆరోగ్యశాఖ డైరెక్టర్, ఎన్‌హెచ్‌ఎం ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన గురువారం ఉదయం సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.



గంగవరం నుంచి విశాఖ పోర్టుకు బొగ్గు నౌకలు

అక్కడ నుంచి రోడ్డు మార్గాన స్టీల్‌ప్లాంటుకు తరలింపు

సెయిల్ నుంచి కూడా ఎనిమిది వేల టన్నుల బొగ్గు

విశాఖపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఆస్ట్రేలియా నుంచి రెండు నౌకల ద్వారా తెప్పించుకున్న కోకింగ్ కోల్‌ను అదానీ గంగవరం పోర్టు నుంచి విశాఖపట్నం పోర్టుకు తరలించారు. ఈ నౌకలు వారం క్రితం అదానీ పోర్టుకు రాగా కార్మికుల ఆందోళన కారణంగా యాజమాన్యం వాటికి బెర్తులు కేటాయించకుండా అలాగే ఉంచేసింది. దాంతో విశాఖ ఉక్కు, బొగ్గు కొరత ఎదుర్కొంటోంది. ఆ రెండు నౌకల్లో 1.5 లక్షల టన్నుల బొగ్గు ఉంది. గురువారం విశాఖపట్నం పోర్టుకు చేరిన ఆ నౌకల నుంచి బొగ్గును రోడ్డు మార్గాన స్టీల్‌ప్లాంటుకు తీసుకురానున్నట్టు ఉక్కు పోరాట కమిటీ సభ్యులు వరసాల శ్రీనివాసరావు తెలిపారు. బొగ్గుతో పాటు లైమ్ స్టోన్ కూడా 50 వేల టన్నులు ఉందన్నారు. ఇదిలావుండగా సెయిల్ నుంచి 8 వేల టన్నుల కోకింగ్ కోల్ తీసుకున్నారని, అందులో 4 వేల టన్నులు ఇప్పటికే రాగా విగిలిన 4 వేల టన్నులు శుక్రవారం వస్తుందన్నారు.

స్తంభించిన 'గంగవరం'



కొనసాగుతున్న కార్మికుల ఆందోళన.. 9 రోజులైనా పట్టించుకోని యాజమాన్యం

▸▸ ఉన్నతాధికారుల జోక్యంతోనూ ఫలితం శూన్యం

▸▸ నిర్వాసిత కార్మికులను వదిలించుకునే యత్నం

▸▸ గుజరాత్ నుంచే మంతనాలు..

▸▸ పోర్టులో నిలిచిన కార్యకలాపాలు.. స్టీల్ ప్లాంట్‌కు సమస్య

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలోని అదానీ గంగవరం పోర్టులో నిర్వాసిత కార్మికులు చేస్తున్న ఆందోళన తొమ్మిదో రోజుకు చేరింది. దీంతో పోర్టులో కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. అక్కడి నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఏ ముడి పదార్థమూ వెళ్లడం లేదు. తమకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించాలని, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలనే డిమాండ్లతో పోర్టు కార్మికులు ఆందోళన చేస్తున్నారు. పోర్టు యాజమాన్యం ఇప్పటివరకు వీరితో చర్చలు జరపలేదు. మరోవైపు స్టీల్‌ప్లాంటుకు బొగ్గు, లైమ్‌స్టోన్, ముడి ఇనుము అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. గంగవరం, దిబ్బపాలెం మత్స్యకార గ్రామాలను ఖాళీ చేయించి గంగవరం పోర్టుకు అప్పగించారు. ఆయా గ్రామాల్లో 600 మందికి మూడు దశల్లో పోర్టులో కార్మికులుగా పనిచేయడానికి అవకాశం కల్పించారు. 14 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి రూ.18 వేలు, పదేళ్ల నుంచి చేస్తున్న వారికి రూ.16 వేలు, ఏడేళ్ల నుంచి ఉన్న వారికి రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారు. పోర్టులో ఏదైనా ప్రమాదం జరిగితే ఈఎస్ఐ ఆస్పత్రికి పంపించి యాజమాన్యం చేతులు దులుపుకుంటోంది. దీనినే కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కనీస వేతనాల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 8 నెలల క్రితం 64 రోజుల పాటు ఆందోళన చేస్తే పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున చర్చలు జరిపి విరమింపజేశారు. ఎవరికైనా ప్రమాదం జరిగితే సమీప కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించాలని, కార్మికుడు చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించడానికి, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వడానికి యాజమాన్యం ఒప్పుకుంది. కానీ, దాన్ని ఇప్పటివరకూ అమలు చేయలేదు. గట్టిగా నిలదీస్తే... గుజరాత్‌లోని ముంద్రా పోర్టు యాజమాన్యానికి లేఖ రాశామని, వారు ఏది చెబితే అదే చేస్తామని అంటున్నారు. యాజమాన్య వైఖరికి విసిగిపోయిన కార్మికులు 8 రోజుల క్రితం పోర్టు గేట్లకు తాళాలు వేసి, మెరుపు ఆందోళనకు దిగారు. లోపల సుమారు 200 మంది కార్మికులు ఉండిపోయారు. వారికి బయట ఆందోళన చేస్తున్నవారే చందాలు వేసుకొని భోజనాలు పంపుతున్నారు. పోర్టు కార్మికుల ఆందోళనతో విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ముడిపదార్థాల సమస్య ఏర్పడింది. దీంతో ప్లాంటు యాజమాన్యం అభ్యర్థన మేరకు కలెక్టర్ పోర్టు కార్మికులను చర్చలకు పిలిచారు. పోర్టు అధికారులను కూడా రప్పించారు. గత సమావేశపు తీర్మానాలు ఎందుకు అమలు చేయలేదని కలెక్టర్ ప్రశ్నిస్తే... దానిపై తాము ఏమీ సంతకాలు చేయలేదని, అమలు చేయాల్సిన అవసరం లేదని వారు సమాధానమిచ్చారు. దాంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని యాజమాన్యం ఏది చెబితే అదే చేస్తున్నారు తప్పితే ఇక్కడ వీరి చేతిలో ఏమీ లేదని గ్రహించి ఆయన కూడా చేతులెత్తేశారు. ఎన్నికలు ముగిసేంత వరకు తాము ఏమీ చేయలేమని స్పష్టంచేశారు.

ఫ్యాక్టరీస్ చట్టంలోకి తేవాలని డిమాండ్

ఆందోళనతో పోర్టులో కార్యకలాపాలు స్తంభించిపోవడంతో విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్ బుధవారం కార్మికులతో చర్చలు జరిపారు. నిర్వాసిత కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, పోర్టు కార్మికులను ఫ్యాక్టరీస్ చట్టం పరిధిలోకి తీసుకువచ్చి, అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా కార్మికులు డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఆయన గుజరాత్‌లోని అదానీ యాజమాన్యానికి తెలియజేశారు. అటు నుంచి వ్యతిరేకత వచ్చింది. నిర్వాసిత మత్స్యకార గ్రామాలకు చెందినవారు కార్మికులుగా పోర్టులో ఉంటే ఆందోళనలు జరుగుతూనే ఉంటాయని, కాబట్టి వారిని శాశ్వతంగా వదిలించుకోవాలని అదానీ యాజమాన్యం నిర్ణయించింది. ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోవడానికి ఎంత కావాలో చెప్పాలని బుధవారం రాత్రి మూడు దశల్లో చర్చలు జరిపింది. ఒక్కొక్కరికి రూ.50 లక్షలు ఇస్తే ఉద్యోగాలు మానేసి వెళ్లిపోతామని కార్మికుల కమిటీ నాయకులు పోలీస్ కమిషనర్ రవిశంకర్‌కు తెలిపారు.

స్టీల్ ప్లాంటుకు విషమ పరీక్ష..!

▸▸ 'గంగవరం' నుంచి అందని బొగ్గు.. నిలిచిన ఉత్పత్తి

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు విషమ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్లాంటు నడపడానికి అత్యంత ముఖ్యమైన కోకింగ్ కోల్ సరఫరా నిలిచిపోవడంతో దాని ప్రభావం అన్ని విభాగాలపైనా పడింది. ఉత్పత్తి దాదాపు నిలిచిపోయింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో బొగ్గును సమకూర్చుకోవడానికి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ముడి పదార్థాలు సరఫరా చేయాల్సిన అదానీ గంగవరం పోర్టు పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పోర్టులో కార్మికులు చేస్తున్న ఆందోళనను విరమింపజేయడానికి ఒక్క అడుగు కూడా ముందుకువేయడం లేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోక కర్మాగారం యాజమాన్యం విశాఖ పోర్టు నుంచి బొగ్గు తెప్పించుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించింది. ఇవి ఎంతవరకు ఫలిస్తాయనేది వేచి చూడాలి. మరోవైపు బొగ్గు సరఫరా లేక థర్మల్ పవర్ ప్లాంటు, రెండు కోక్ ఓవెన్ బ్యాటరీలు, రెండు బ్లాస్ట్ ఫర్నేసులు, రెండు సింటర్ ప్లాంట్లను మూసేశారు. కోక్ ఓవెన్ బ్యాటరీల ద్వారా వచ్చే వృథా వాయువులతో చాలా యూనిట్లను నడిపిస్తున్నారు. కాగా, ఉక్కు కర్మాగారం క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటుంటే సాయం చేయాల్సింది పోయి.. విద్యుత్ బిల్లు బకాయి రూ.92 కోట్లు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది.

వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు

▸▸ రైతులు వ్యతిరేకిస్తున్నా ముందుకే..!

▸▸ సీఎం జగన్ స్టిక్కర్లు తొలగించి బిగింపు


వీరాపురంలో రైతు పొలంలో సీఎం జగన్ స్టిక్కర్‌ను తొలగించి విద్యుత్ మీటర్ అమర్చిన దృశ్యం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18: వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు బిగించే ప్రక్రియ పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం వీరాపురంలో రెండు రోజులుగా కొనసాగుతోంది. వ్యవసాయ మీటర్లకు సీఎం జగన్ స్టిక్కర్లను తొలగించి రైతుల పొలాల్లోని బోర్ల వద్ద మీటర్లను అమర్చుతున్నారు. మీటర్లు వద్దుబాబోయ్.. వాటి తో పంటల సాగు భారమవుతుందని మొత్తుకుంటున్నా వినకుండా మీటర్లు బిగిస్తామంటూ జగన్ సర్కారు ముందుకే సాగుతోంది. తెలంగాణలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం మీటర్ల విధానాన్ని వ్యతిరేకించగా, మన రాష్ట్రంలో మాత్రం జగన్ వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు పెడతామని చెప్పడమే కాకుండా ఇప్పుడు పల్నాడులో రైతుల పొలాల్లో బోర్ల వద్ద మీటర్లు అమర్చుతుండటంతో రైతులు భగ్గుమంటున్నారు. మీటర్లు వద్దన్న వారికి ఇంటి కనెక్షన్‌ను తొలగించి వేస్తామంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ఆంధ్రలో ప్రచారానికి యూపీ బైకులు

▸▸ రాష్ట్రంలో బీజేపీ ఆదిత్యనాథ్ సెంటిమెంట్


బీజేపీ తన కేడర్‌కు అందచేసిన యూపీ బైకులు

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు ఎన్నికల బరిలో వ్యూహాలతో పాటు సెంటిమెంట్‌ను కూడా పాలో అవుతుంటాయి. దేశంలో అనేక రాష్ట్రాల్లో తన హవాను కొనసాగిస్తున్న బీజేపీకి ఏపీలో మాత్రం నోటా కన్నా తక్కువగా ఉంది. అయినా టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని ఆరు పార్లమెంటు, 10 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల్ని బరిలోకి దించింది. వీటిలో వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలిచేందుకు ప్రయత్నం చేస్తోన్న ఆ పార్టీ రాష్ట్రంలో ఉత్తరప్రదేశ్ సెంటిమెంట్‌ను ప్రయోగిస్తోంది. బీజేపీలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అత్యంత పాపులారిటీ కలిగిన ముఖ్యమంత్రి. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ రాష్ట్రం నుంచే ఎక్కువ మంది ఎంపీలు బీజేపీ తరఫున విజయం సాధించారు. అక్కడి ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేసేందుకు కార్యకర్తలకు వేలాది బైకులను పార్టీ ఏర్పాటు చేసింది. వాటినుంచి 150 ద్విచక్ర వాహనాలను ఆంధ్రకు పంపించి ఎన్నికల్లో ప్రచారం కోసం పూర్తిస్థాయి కార్యకర్తలకు ఇవ్వాలని పార్టీ అధినాయకత్వం నిర్ణయించింది. నాలుగు రోజుల క్రితం ఆ బైకులు రాష్ట్రానికి చేరుకున్నాయి. వాటిని పార్టీ రాష్ట్ర కార్యాలయం కేడర్‌కు అందచేసింది. తమ అభ్యర్థులు పోటీ చేస్తోన్న ప్రాంతాలకు పంపింది.

టీడీపీ నాయకులపై పిడిగుద్దులు

▸▸ ఎన్నికల ప్రచారంలో వైసీపీ వర్గీయుల కవ్వింపులు

▸▸ వాహనం అడ్డు తీయమన్నందుకు దుర్భాషలు, దాడి

▸▸ సొమ్మసిల్లిన కళ్యాణదుర్గం మున్సిపల్ మాజీ చైర్మన్

▸▸ వాహనానికి టీడీపీ జెండా కట్టాడని చెప్పులతో దాడి


కళ్యాణదుర్గంలో వైసీపీ వర్గీయుల దాడిలో సొమ్మసిల్లిన టీడీపీ నాయకుడు వైపీ రమేశ్


కళ్యాణదుర్గంలో టీడీపీ ప్రచారాన్ని అడ్డుకుంటున్న వైసీపీ వర్గీయులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 18: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు దాడికి దిగారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఎర్రనేల వీధిలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు గురువారం ఉదయం ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. అదే సమయంలో వైసీపీ నాయకులు ఓ వాహనంలో వచ్చి ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఎంత నచ్చజెప్పినా వినకుండా దౌర్జన్యానికి దిగారు. అడ్డుగా ఉన్న వాహనాన్ని తియ్యమన్నందుకు నానా దుర్భాషలాడుతూ టీడీపీ వర్గీయులపై దాడికి దిగారు. పోలీసులు వచ్చినా వైసీపీ వర్గీయులు తగ్గలేదు. మున్సిపల్ మాజీ చైర్మన్ వైపీ రమేశ్‌పై పిడిగుద్దులు కురిపించారు. సొమ్మసిల్లి పడిపోయిన ఆయన్ను వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఓటమి భయంతోనే తమపై వైసీపీ నాయకులు దాడికి దిగారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆరోపించారు. ప్రశాంతంగా ఉన్న కళ్యాణదుర్గంలో అలజడి సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ సీఐ హరినాథ్‌కు సురేంద్రబాబు అల్లుడు అవినాశ్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తపై దాష్టీకం

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి స్థానానికి టీడీపీ అభ్యర్థిగా పల్లె సింధూరారెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వేణుగోపాలాచారి అనంతరం స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. బుచ్చయ్యగారిపల్లి సమీపానికి రాగానే అక్కడ ప్రచారం నిర్వహిస్తున్న అగ్రహారం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు లింగమయ్య, కిష్టప్ప ఆయన్ను అడ్డుకున్నారు. వేణుగోపాలాచారి తన ద్విచక్ర వాహనానికి టీడీపీ జెండా కట్టుకోవడంతో నానా దుర్భాషలాడారు. వెంటనే జెండా తీసేయాలని బెదిరించారు. ఆయన ససేమిరా అనడంతో చెప్పులతో దాడిచేసి, రొమ్ముపై తీవ్రంగా కొట్టి గాయపరిచారు. వారినుంచి తప్పించుకున్న వేణుగోపాలాచారి.. బుక్కపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఓ లక్ష్యంతో టీడీపీలోకి వచ్చా

▸▸ కర్నూలు జిల్లా ప్రజలు నాకు దేవుళ్లు

▸▸ కోడుమూరును వదలి వెళ్లలేకున్నా: కోట్ల

▸▸ సభలో కన్నీరు కార్చిన జయసూర్య ప్రకాశ్‌రెడ్డి


కంటతడి పెడుతున్న కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి

కోడుమూరు, ఏప్రిల్ 18: 'కాంగ్రెస్ పార్టీని వీడి ఒక లక్ష్యంతో టీడీపీలోకి వచ్చా. ఆర్డీఎస్, ఎల్లెల్సీ గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను సాధించేంత వరకూ నేను నిద్రపోను' అని మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి కుమారుడు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో కోట్ల కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. 'కర్నూలు పార్లమెంటు నుంచి నేను పోటీ చేయకపోవడంతో 14 లక్షల మంది ఓటర్లు చింతిస్తున్నారు. కర్నూలు జిల్లా ప్రజలు నాకు దేవుళ్లాంటి వాళ్లు. వదిలి వెళ్లాలంటే తట్టుకోలేపోతున్నా. ముఖ్యంగా కోడుమూరు నియోజకవర్గ ప్రజలను వదిలిపెట్టి వెళ్లాలంటే తట్టుకోలే పోతున్నా' అని అన్నారు. ఆ సమయంలో ఆయన గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. నేత కంటతడి పెట్టడంతో ఒక్కసారిగా అక్కడ నిశబ్ద వాతావరణం ఏర్పడింది. అక్కడ ఉన్న కోట్ల అభిమానులు సైతం కన్నీరు పెట్టారు. తేరుకున్న అనంతరం కోట్ల మాట్లాడుతూ.. పార్టీలో వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసి కట్టుగాపోతే తప్పకుండా టీడీపీ గెలుస్తుందని అన్నారు. టీడీపీ గెలవాలి కాబట్టి అభిమానులంతా కలిసి కట్టుగా పని చేసి కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని గెలిపించాలని కార్యకర్తలను కోరారు. తప్పకుండగా టీడీపీ అధికారంలోకి వస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక రైతు బిడ్డగా రైతులకు ఇచ్చిన హామీలను తప్పకుండగా నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

'ఓటుకు నోటు'పై సుప్రీం విచారణ

▸▸ జూలై 24కు వాయిదా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడింది. ఈ కేసులో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును నిందితుడిగా చేర్చి.. దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్ గురువారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ కేసులో చట్ట సంబంధ అంశాలు అనేకం ముడిపడి ఉన్నాయని, ఆ వివరాలను అందించేందుకు సమయం కావాల ని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరారు. ఎంత సమయం కావాలని ధర్మాసనం ప్రశ్నించగా.. 2 వారాల్లో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని న్యాయవాది తెలిపారు. ఇది 2015లో జరిగిన వ్యవహారమని, అప్పుడు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై విచారణ పెండింగ్‌లో ఉందని ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది బసంత్ అన్నారు. వాదనలు వినిపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోర్టుకు తెలిపారు. 'అయితే సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాదనలు మధ్యలోనే ఆగిపోయే అవకాశం ఉంది. అందుకే వేసవి సెలవుల తర్వాత వాదనలకు అవకాశం ఇవ్వండి' అని కోరారు. ప్రతిసారీ ఏదో ఒక సాకుతో కేసు విచారణ వాయిదా పడుతోందని.. త్వరితగతిన చేపట్టాలని బసంత్ కోరారు. దీంతో జూలై 24కు వాయిదా వేశారు.

తప్పులు ఎత్తిచూపినందుకే అక్రమ కేసులు

▸▸ ఉద్యోగుల డబ్బులు దొంగతనం చేసినందుకే గవర్నర్‌కు ఫిర్యాదు

▸▸ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 18: ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపినందుకే తనపై అక్రమ కేసులు బనాయించారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆరోపించారు. ఒంగోలులోని రంగా భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించిన డబ్బును ప్రభుత్వం దొంగతనంగా లాక్కుందని, ఈ విషయాన్ని అనేకసార్లు ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోవడంతో గవర్నర్‌కు ఫిర్యాదు చేశానని వివరించారు. దీన్ని జీర్ణించుకోలేని ప్రభుత్వం తనపై అక్రమంగా కేసు నమోదు చేయడమే కాకుండా తన కుటుంబసభ్యులను కూడా వేధింపులకు గురిచేసిందన్నారు. ఇలాంటి వాటిని పట్టించుకోనని, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులకు రూ.25వేల కోట్ల ఆర్థిక బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఎవరు ఇస్తారని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు వైసీపీ నేతలు సీపీఎస్ రద్దుతో పాటు అనేక హామీలు ఇచ్చారని, వాటి అమలు విషయంలో ఈ ఐదేళ్లు పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్‌కార్డులు కూడా పనిచేయడం లేదని, దీంతో ఐఏఎస్‌లు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని హెల్త్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటున్నారంటే రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. సమస్యలపై పోరుకు ఉద్యోగులందరినీ సమాయత్తం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు, ఆర్థిక బకాయిలు చెల్లించడానికి చట్టబద్ధత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

సీఎస్, డీజీపీని తొలగించాలి

▸▸ నిఘా సంస్థల అధినేతను కూడా...

▸▸ అప్పుడే రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికలు

▸▸ గులకరాయి కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వకూడదు?: లంకా దినకర్



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18: 'రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికలు జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)తోపాటు డీజీపీ, నిఘా సంస్థల అధినేతలను విధుల నుంచి తప్పించాలి' అని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'విధులు సక్రమంగా నిర్వర్తించని, జగన్‌కు తొత్తులుగా మారిన అధికారులను తొలగిస్తేనే రాష్ట్రంలో ఎన్నికలు సక్రమంగా జరుగుతాయి. అక్రమాల కోసం వైసీపీ దాచిన మద్యం డంపులు, డబ్బుల మూటలు బయటకు వస్తాయి. గులకరాయి కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వకూడదు? 33 మంది వృద్ధ పింఛనుదారుల మరణాలు ప్రభుత్వ హత్యలే. ఇందుకు సీఎస్ లోపభూయిష్టమైన నిర్ణయాలే కారణం. ఎన్నికల కమిషన్ తొలగించిన అధికారుల స్థానంలో మరలా జగన్మోహన్‌రెడ్డి చెప్పిన అధికారులను సీఎస్ నియమిస్తూ కేంద్రానికి జాబితాలు పంపడంపై ఈసీ దృష్టి సారించాలి. జగన్ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారు' అని దినకర్ ప్రశ్నించారు.

నీట్ పీజీ నోటిఫికేషన్

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 19 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com



నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) - నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా, పోస్ట్ ఎంబీబీఎస్ డీఎన్‌బీ, ఎన్‌బీఈఎంఎస్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 15 నాటికి ఏడాది వ్యవధిగల ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లేదా స్టేట్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి.

నీట్ పీజీ 2024 వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 శాతం మార్కులు రావాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3,500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 6
- **ఎడిట్ విండో ఓపెన్:** మే 10 నుంచి మే 16 వరకు
- **ప్రీ ఫైనల్ ఎడిట్ విండో ఓపెన్:** మే 28 నుంచి జూన్ 3
- **ఫైనల్ ఎడిట్ విండో ఓపెన్:** జూన్ 7 నుంచి 10 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 18 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, కోదాడ, అనంతపురం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గూడూరు, గుంటూరు, కావలి, కర్నూలు, ఎమ్మిగనూరు, మచిలీపట్నం, మదనపల్లి, నంద్యాల, నర్సరావుపేట, నెల్లూరు, నర్సాపురం, ఒంగోలు, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, తాడిపత్రి, తెనాలి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.
- **నీట్ పీజీ 2024 తేదీ:** జూన్ 23
- **ఫలితాలు విడుదల:** జూలై 15
- **వెబ్‌సైట్:** nbe.edu.in, https://natboard.edu.in

నైసర్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కు చెందిన స్కూల్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్(ఎస్ఎంఎస్)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి రెండు నెలలు. మే 13 నుంచి ప్రోగ్రామ్ ప్రారంభమౌతుంది. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. మేథమెటికల్ సైన్సెస్ విభాగాల్లో ఆసక్తిగల డిగ్రీ/పీజీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

మేథ్స్ విభాగాలు: డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, ఇన్సిడెన్స్ జామెట్రీ, నెంబర్ థియరీ, క్రిప్టోగ్రఫీ - డిస్క్రీట్ మేథమెటిక్స్, ఫంక్షనల్ అనాలిసిస్, ఆల్జీబ్రిక్ గ్రాఫ్ థియరీ-డిస్క్రీట్ మేథమెటిక్స్, డిస్క్రీట్ మేథమెటిక్స్, ఆల్జీబ్రిక్ జామెట్రీ, ప్రాబబిలిటీ థియరీ, ఫంక్షనల్ అనాలిసిస్, హార్మోనిక్ అనాలిసిస్, డిఫరెన్షియల్ జామెట్రీ, ఆల్జీబ్రా.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **వెబ్‌సైట్:** www.niser.ac.in

బిట్ మెస్రాలో ఎమ్మెస్సీ యానిమేషన్

మెస్రా(రాంచీ)లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)- ఎమ్మెస్సీ(యానిమేషన్ డిజైన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. జైపూర్ క్యాంపస్‌లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. మొత్తం పది సీట్లు ఉన్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.



అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో బీఎస్సీ(యానిమేషన్ అండ్ మల్టీమీడియా)/బీఎఫ్ఏ/బీ డిజైన్/బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్/బ్యాచిలర్ ఇన్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్రియేటివ్ ఆర్ట్ రంగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసే వారూ అప్లయ్ చేసుకోవచ్చు. వీరు అడ్మిషన్ నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇది 90 మార్కులకు ఉంటుంది. ఇందులో ఐడియా క్రియేషన్, క్రియేటివ్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, కంటెంట్ డెవలప్‌మెంట్-విజువలైజేషన్‌కు 10 మార్కులు; స్టోరీ బోర్డింగ్, క్యారెక్టర్ డిజైనింగ్, యానిమేషన్ ఆప్టిట్యూడ్(బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ సీక్వెన్షియల్ ఆర్ట్), బేసిక్స్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్ ప్రిన్సిపల్స్-బేసిక్స్ ఆఫ్ కంపోజిషన్ అండ్ జనరల్ అవేర్‌నెస్ ఆఫ్ కంప్యూటర్ అండ్ గ్రాఫిక్స్ అంశాల్లో ఒక్కోదానికి 20 మార్కులు ప్రత్యేకించారు. ఇంటర్వ్యూకి 10 మార్కులు నిర్దేశించారు. ఇందులో అభ్యర్థులు పోర్ట్‌ఫోలియో, రీల్స్, స్కెచ్‌లు, డ్రాయింగ్స్ చూపించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 14
- **క్రియేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 19 నుంచి 20 వరకు
- **వెబ్‌సైట్:** www.bitmesra.ac.in

ఎంఏఎన్ఐటీలో పీజీ ప్రోగ్రామ్‌లు

భోపాల్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఏఎన్ఐటీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.



ఎంబీఏ

ఇది రెండేళ్ల వ్యవధి గల డ్యూయెల్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్. ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో రెగ్యులర్, స్పాన్సర్డ్, పార్ట్ టైమ్ కేటగిరీలు ఉన్నాయి. రెగ్యులర్ అభ్యర్థులకు 66 సీట్లు, పార్ట్ టైమ్ అభ్యర్థులకు 66 సీట్లు, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్

ఇది రెండేళ్ల వ్యవధి గల ప్రోగ్రామ్. ఇందులో రెగ్యులర్, పార్ట్ టైమ్ కేటగిరీలు ఉన్నాయి. ఒక్కో కేటగిరీలో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగేళ్ల వ్యవధిగల బీఏ/బీఎస్సీ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి.

ఎంసీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇది పార్ట్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో 115 సీట్లు ఉన్నాయి.

అర్హత: మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ

ఇది పార్ట్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో ఫిజిక్స్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి ఫిజిక్స్/కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుగా మూడేళ్ల డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.

ముఖ్య సమాచారం

- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో చేరే అభ్యర్థులకు సంబంధిత విభాగాల్లో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. వీరికి గేట్/నెట్/క్యాట్/సీమ్యాట్/నిమ్‌సెట్/జామ్ అర్హత తప్పనిసరి కాదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 6
- **ఇంటర్వ్యూలు:** జూన్ 18 నుంచి 25 వరకు
- **ఫలితాలు విడుదల:** జూన్ 28
- **అడ్మిషన్ తేదీలు:** జూలై 11, 12
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్(అకడమిక్స్), ఎంఏఎన్ఐటీ, లింక్ రోడ్ నెం. 3 వద్ద, భోపాల్-462003
- **వెబ్‌సైట్:** www.manit.ac.in

జాబ్ కార్నర్

వ్యాప్‌కోస్‌లో ఇంజనీర్లు

ఖాళీలు 275

న్యూఢిల్లీలోని వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన వ్యాప్‌కోస్ ప్రాజెక్టు పనుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు

1. టీమ్ లీడర్: **1 పోస్టు**
2. డిప్యూటీ టీమ్ లీడర్/రెసిడెంట్ ఇంజనీర్: **2 పోస్టులు**
3. సీనియర్ సివిల్ ఇంజనీర్: **2 పోస్టులు**
4. సీనియర్ మెకానికల్ ఇంజనీర్: **2 పోస్టులు**
5. సీనియర్ ఎలక్ట్రికల్ ఇంజనీర్: **2 పోస్టులు**
6. సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్: **2 పోస్టులు**
7. సివిల్ ఇంజనీర్: **16 పోస్టులు**
8. మెకానికల్ ఇంజనీర్: **8 పోస్టులు**
9. ఎలక్ట్రికల్ ఇంజనీర్: **4 పోస్టులు**
10. అకౌంటెంట్: **2 పోస్టులు**
11. టీమ్ లీడర్: **1 పోస్టు**
12. సీనియర్ సివిల్ ఇంజనీర్: **6 పోస్టులు**
13. క్యూసీ ఇంజనీర్: **8 పోస్టులు**
14. ఇంటర్మీడియెట్ లెవల్ సివిల్ ఇంజనీర్: **182 పోస్టులు**
15. జూనియర్ లెవెల్ సివిల్ ఇంజనీర్: **182 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీకాం ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 55 సంవత్సరాలు మించకూడదు
దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: wapcos1maf@yahoo.com
దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 26
వెబ్‌సైట్: www.wapcos.co.in/careers.aspx

సెంట్రల్ మెడికల్ సర్వీసెస్‌లో మేనేజర్లు

ఖాళీలు 15

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): **1 పోస్టు**
3. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **1 పోస్టు**
5. మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): **2 పోస్టులు**
6. మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్): **2 పోస్టులు**
7. మేనేజర్(ఫైనాన్స్): **2 పోస్టులు**
8. మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్): **2 పోస్టులు**
9. ఆఫీస్ అసిస్టెంట్: **1 పోస్టు**
10. వేర్ హౌస్ మేనేజర్(ఫార్మాసిస్ట్): **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఐసీడబ్ల్యూఏఐ, సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: మేనేజర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,00,000; మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు రూ.50,000; ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20
వెబ్‌సైట్: https://cmss.gov.in



ఆర్‌సీబీలో కన్సల్టెంట్స్

ఖాళీలు 6

ఫరిదాబాద్(హరియాణా)లోని రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: కన్సల్టెంట్(టెక్నికల్ ఎక్స్‌పర్ట్ సర్వీస్ ప్రొవైడర్)
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో పీజీ, పీహెచ్‌డీ(లైఫ్ సైన్సెస్/కెమిస్ట్రీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 40 సంవత్సరాలు మించకూడదు
వేతనం: నెలకు రూ.60,000 - రూ.80,000
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
వెబ్‌సైట్: www.rcb.res.in

సీఐబీఏలో యంగ్ ప్రొఫెషనల్స్

ఖాళీలు 2

ఐకార్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ అక్వాకల్చర్, చెన్నై... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ(ఎంఎఫ్ఎస్సీ/ఎవీఎస్సీ)తోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించరాదు.
ఫెలోషిప్: నెలకు రూ.42,000
దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: riteshicarciba@gmail.com
దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 22
వెబ్‌సైట్: https://ciba.icar.gov.in

ఐఐటీ న్యూఢిల్లీలో కన్సల్టెంట్స్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, న్యూఢిల్లీ - తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. కన్సల్టెంట్(అడ్మినిస్ట్రేటివ్): **2 పోస్టులు**
2. కన్సల్టెంట్(టెక్నికల్ అడ్మినిస్ట్రేటివ్): **1 పోస్టు**

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్/ఎంబీఏ/ఎమ్మెస్సీతోపాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.1,25,000 - రూ.1,50,000
వయోపరిమితి: 45 సంవత్సరాల లోపు ఉండాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 25
వెబ్‌సైట్: https://home.iitd.ac.in/

లిటిల్స్



మీకు తెలుసా?

- పాంగోలియన్ మీద పొలుసులుంటాయి. వీటిని బట్టి సులువుగా పాంగోలియన్లను గుర్తు పట్టొచ్చు.
- సహారా ఎడారిలో ఎక్కువ ఉంటాయివి. 30 సెం.మీ. నుంచి 100 సెం.మీ పొడవు ఉంటాయి. ఆడ పాంగోలియన్ల కంటే మగ పాంగోలియన్లు 40 శాతం పెద్దవిగా ఉంటాయి.
- దీనిమీద ఉండే పొలుసుల నిర్మాణం కెరోటిన్‌తో తయారవుతుంది. మన గోర్లు కూడా కెరోటిన్ నిర్మాణమే. పాంగోలియన్ల పొలుసులు గట్టిగా ఉంటాయి.
- దీని తోక పొడవుగా ఉంటుంది. యాక్టివ్‌గా ఉంటుందిది. చెట్టుమీద వేగంగా తిరుగుతుంది. ఇవి స్వతహాగానే నీళ్లలో అద్భుతంగా ఈదుతాయి.
- ఇవి రాత్రిపూట తిరుగుతాయి. పగలంతా నిద్రపోతాయి. అప్పుడే ఉండ చుట్టుకుని నిద్రపోతాయి.
- వీటి నోరు జిడ్డుగా ఉంటుంది. చీమలు, పురుగుల్ని తన పొడవైన



నాలుకతో తింటుంది. వాసన చూసే గుణం బావుంటుంది. అయితే వీటిని చూపు చాలా తక్కువగా ఉంటుంది.
- దీన్ని కొందరు తినటంతో పాటు ట్రెడిషనల్ మెడిసిన్‌లో ఉపయోగిస్తారు. అందుకే వీటిని దొంగతీసుకెళ్లటం, అమ్మటం చేస్తుంటారు.
- ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో మాత్రమే ఇవి ఉంటాయి. వీటి సంఖ్య గణనీయంగా పెరుగటం విశేషం. శత్రువులు వస్తే ఉండలా చుట్టుకుని తనకు తాను రక్షించుకోగల సామర్థ్యం వీటికి ఉంది.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



12 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 285

	1	3			4	2		5
					2	4		
4					7			
	8			5				6
		5	7		3	9		
9				1			2	
			3					8
		4	8					
8		1	2			6	3	

సుడోకు - 284 సమాధానం

3	7	2	8	9	1	5	6	4
4	8	1	5	3	6	7	9	2
5	6	9	7	2	4	3	8	1
2	4	8	1	6	5	9	7	3
6	9	3	2	4	7	1	5	8
7	1	5	3	8	9	4	2	6
9	5	4	6	1	8	2	3	7
8	2	7	4	5	3	6	1	9
1	3	6	9	7	2	8	4	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.